تفہیم القرآن

النُّور

مولانا سیّد ابوالاعلیٰ مودُودیؒ

ఖుర్ఆన్ అవగాహనం

(తఫ్హీముల్ ఖుర్ఆన్)

అన్ నూర్

ఉర్దూ మూలం :

మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది (రహ్మతుల్లాహ్ అలైహ్)

తెలుగు రూపం :

ఎస్.ఎమ్. మలిక్

మనవి

ఓ రోజు అకస్మాత్తుగా కొత్త నెంబరుతో ఫోను మోగింది. సలాములు, యోగక్షేమాలు అయిన తరువాత తాను 'ఖుర్ఆన్ అవగాహనం' అధ్యయనం చేస్తున్నానని, ప్రస్తుతం నూర్ సూరా అధ్యయనంలో ఉందని తెలిపారు, పాత మిత్రులు, పండితులు అబ్దుల్ కాదిర్ 'ఉమరి' కువైత్ నుండి. సంతోషం వెలిబుచ్చాను, అంతకన్నా చేయగలిగింది ఏమీ లేదు గనక. ఆపైన ఆయన, ఆ నూర్ సూరా వ్యాఖ్యానాన్ని అవగాహనం నుంచి వేరుగా పుస్తకరూపంలో ప్రచురిస్తే బావుంటుంది అని సలహా ఇచ్చారు. అందులోని సామాజిక నియమాలు, కుటుంబ వ్యవహారాలు, సంస్కరణాత్మక బోధనలు, షరీఅత్ నిబంధనలు నేడు మనకు ఎంతో అవసరమని, దానికి ఈ సూరా, దాని ఈ వ్యాఖ్యానం ఎంతగానో ప్రయోజనకరమవుతుందని చాలా వివరంగా మరీ మరీ ఉద్వేగంగా, ఉత్సాహంగా చెప్పసాగారు. ఒక ఆలిమ్ ఆ విధంగా చెబుతూ ఉంటే నేనెవరిని కాదనడానికి? అవుననే అన్నాను. వేరుగా ప్రచురిస్తే బాగా ఉంటుంది, లోగడ గత శతాబ్ది 6వ దశకంలో దాన్ని ఉర్దూలో వేరుగా ప్రింట్ చేశారు కూడా అని, బహుశా అప్పట్లో దాన్ని 'తజల్లీ బుక్ డిపో' వారు ప్రచురించారని తెలిపాను. అలా 'అవగాహనం' నుండి 'నూర్' సూరాను వేరుగా ప్రచురిస్తే ఆ సత్కార్యంలో తానూ పాలుపంచుకోగలనని హామీ ఇచ్చారాయన. ఆ విధంగా ఈ పుస్తకం పాఠకుల చేతుల్లోకి రావడానికి కారణభూతులయ్యారాయన.

నేను ఇస్లామీయ ఉద్యమంతో పరిచయం పొందడానికి మూలమయినది తఫ్హీముల్ కుర్ఆన్, నూర్ సూరా ప్రత్యేకంగా ప్రచురించిన పుస్తకమే! అప్పట్లో నేను ఈ సూరాను అధ్యయనం చేసిన వైనం 'ఖుర్ఆన్ అవగాహనం' సం. 10లో 'తఫ్హీమ్‌తో నా అనుభవం' శీర్షికన వ్రాశాను. ఆ విషయాన్ని, ఆ సందర్భాన్ని

నేను ఇప్పటికీ, ఎప్పటికీ మరచిపోలేను. అదే సూరాను ప్రత్యేకంగా ప్రచురించా లని డిమాండు రావడం యాదృచ్ఛికమే అయినా నాకు మాత్రం అది నా అదృష్టంగానే అనిపించింది.

దివ్య కుర్ఆన్ నిఖిల జగతి ప్రభువు మానవాళి కొరకు పంపిన మార్గ బోధనా గ్రంథం. అది దేశ కాలాలకు అతీతమయినది. అన్ని కాలాలకు, అన్ని సమాజా లకు సమంగా ఉపకరించేది. దాని బోధనలు వెయ్యిన్నర సంవత్సరా లకు పూర్వం లానే నేటికీ ఆధునిక వైజ్ఞానిక, సాంకేతిక ప్రగతీ వికాసాలు పొందిన మానవునికి, సంస్కృతీ నాగరికతల అంధకారంలో మార్గవిహీను డయిన మానవునికి సన్మార్గ కరదీపికల వంటివి. సమాజం సవ్యంగా సాగాలంటే దైవమార్గ దర్శకత్వం తప్ప గత్యంతరం లేదు.

ఈ 'నూర్' (కాంతి) సూరా మానవ జీవితంలో నేడు కరవయిన వెలుగును నింపి, ముస్లిమ్ సమాజం కోల్పోయిన నైతిక స్థాయి, స్థానాన్ని పునరుద్ధరించుకు నేందుకు తోడ్పడగలదని ఆశిద్దాము.

సెప్టెంబరు 6, 2016 — ఎస్.ఎమ్. మలిక్

ప్రవేశిక

24. అన్ నూర్

పేరు : అయిదవ రుకూలోని తొలి ఆయత్ (35) اَللّٰهُ نُوْرُ السَّمٰوٰتِ وَالْاَرْضِ **అల్లాహు నూరుస్సమా వాతి వల్ అర్జ్** నుండి దీన్ని గ్రహించడం జరిగింది.

అవతరణ కాలం : ఈ సూరా బనీ ముస్తలిక్ యుద్ధం తరువాత అవతరించిందన్న విషయంలో ఏకాభిప్రాయముంది. స్వయంగా ఖుర్‌ఆన్‌లోని ప్రస్తావనను బట్టి దీని అవతరణ 'ఇఫ్క్' సంఘటన నేపథ్యంలో జరిగిందని తెలుస్తోంది. ఈ ప్రస్తావన సవివరంగా రెండు, మూడవ రుకూల (11-26 ఆయత్‌ల)లో వచ్చింది. ప్రామాణిక ఉల్లేఖనాలన్నింటి రీత్యా ఆ సంఘటన 'బనీ ముస్తలిక్' యుద్ధానికి సంబంధించిన ప్రయాణంలోనే జరిగింది. అయితే ఈ యుద్ధం హిజ్రీ 5వ సంవత్సరం 'అహ్జాబ్' యుద్ధానికి పూర్వం జరిగిందా లేదా 'అహ్జాబ్' తరువాత హిజ్రీ 6వ సంవత్సరం జరిగిందా అన్న విషయంలోనే భేదాభిప్రాయముంది. నిజం ఏమిటీ అన్న విషయం పరిశోధించి తెలుసుకోవడం అవసరం. ఎందుకంటే 'పరదా' ఆదేశాలు దివ్య ఖుర్‌ఆన్‌లో రెండు సూరాలలోనే వచ్చాయి. ఒకటి ఈ సూరా, రెండవది అహ్జాబ్ సూరా. 'అహ్జాబ్' సూరా అవతరణ ఏకగ్రీవంగా 'అహ్జాబ్' యుద్ధ సంద ర్భంలోనే జరిగింది. ఇక అహ్జాబ్ యుద్ధమే ముందు జరిగి ఉంటే అహ్జాబ్ సూరాలో వచ్చిన బోధనల ద్వారానే తొలుత పరదా ఆదేశాలు అందాయని, వాటి పరిపూర్ణతమటుకు ఈ సూరాలో వచ్చిన ఆదేశాలతో జరిగిందని అర్థం. అలాకాక బనీ ముస్తలిక్ యుద్ధం మొదట జరిగినట్లయితే ఆదేశాల క్రమం తారుమారవుతుంది. పరదా ఆదేశాల ప్రారంభం నూర్ సూరాలోనూ పరిపూర్ణత అహ్జాబ్ సూరాలోని ఆదేశాలలోనూ జరిగినట్లు అంగీకరించవలసి ఉంటుంది. ఈ విధంగానయితే పరదా ఆదేశాలలోగల షరీఅత్ ఔచితీ విజ్ఞతను అర్థం చేసుకోవడం కష్టమయిపోతుంది. ఈ ఉద్దేశంతోనే మేము ముందుకు సాగడానికి పూర్వం అవతరణ కాలనిర్ధారణ జరగడం భావ్యమని తలిచాము.

ఇబ్ను సఅద్ ప్రకారం బనీ ముస్తలిక్ యుద్ధం హిజ్రీ 5, షాబాన్ నెలలో జరిగింది. తరువాత అహ్జాబ్ (లేదా కందకం) యుద్ధం జీకఅద నెల హి.5లో జరిగింది. దీన్ని సమర్థిస్తూ వచ్చిన అన్నింటికన్నా గట్టి నిరూపణ 'ఇఫ్క్' సంఘటన సందర్భంలో హజ్రత్ ఆయిషా (ర) ఉటంకించిన ఉల్లేఖనాలు. ఆ ఉల్లేఖనాలు కొన్నింటిలో హజ్రత్ సఅద్ బిన్ ఉబాద, హజ్రత్ సఅద్ బిన్ ముఆజ్ (ర)ల మధ్య జరిగిన వాదులాట ప్రస్తావన ఉంది. విశ్వసనీయ ఉల్లేఖనాలన్నింటిరీత్యా హజ్రత్ సఅద్ బిన్ ముఆజ్ బనీ ఖురైజా యుద్ధంలో మరణించారు. అది అహ్జాబ్ యుద్ధం తరువాత వెంటనే జరిగింది. అందువల్ల హి. 6వ సంవత్సరం ఆయన జీవించి ఉండే అవకాశమే లేదు.

మరోవైపున ఇబ్ను ఇస్‌హాక్ ప్రకారం, అహ్జాబ్ యుద్ధం హి. 5, షవ్వాల్ నెలలో జరిగింది. బనీ ముస్తలిక్ యుద్ధం షాబాన్ నెల హి. 6లో జరిగింది. దీన్ని అత్యధిక సంఖ్యలోగల విశ్వసనీయ ఉల్లేఖనాలు బలపరుస్తున్నాయి. వీటిని హజ్రత్ ఆయిషా (ర) తదితరులు ఉల్లేఖించారు. వాటిని బట్టి చూస్తే ఇఫ్క్ సంఘటనకు పూర్వమే పరదా ఆదేశాలు అవతరించాయని, అవి అహ్జాబ్ సూరాలో ఉన్నాయని తెలుస్తోంది. వీటిద్వారా తెలిసే మరో విషయం, అప్పటికే హజ్రత్ జైనబ్ (ర)తో ప్రవక్త మహనీయుల (స) నికాహ్ జరిగి ఉందన్నది. అది అహ్జాబ్ యుద్ధం తరువాత జీకఅద నెల హి. 5లో జరిగింది. అహ్జాబ్ సూరాలో దాని ప్రస్తావన కూడా ఉంది. అంతేకాక, హజ్రత్ జైనబ్ (ర) సోదరి హమ్నా బిన్తు జహష్, హజ్రత్ ఆయిషా (ర) పైన అపనింద మోపడంలో పాల్గొనడానికి కారణం, కేవలం హజ్రత్ ఆయిషా (ర) ఆమె సోదరికి సవతి అవడమే అన్న విషయం కూడా ఈ ఉల్లేఖనాల ద్వారా తెలుస్తోంది. సోదరి సవతి పట్ల ఇలాంటి భావనలు ఏర్పడాలంటే, సవతి సంబంధాలు ఏర్పడి కొంతకాలమయినా గడవడం అవసరం. ఈ సాక్ష్యాధారాలన్నీ ఇబ్ను ఇస్‌హాక్ ఉల్లేఖనాలను పటిష్టపరుస్తున్నాయి.

అయితే ఈ ఉల్లేఖనాన్ని అంగీకరించడానికి అవాంతరమయిన విషయం ఒకటుంది. ఈ ఉల్లేఖనంలో ఇఫ్క్ సంఘటన జరిగిన కాలంలో హజ్రత్ సఅద్ బిన్ ముఆజ్ సజీవంగా ఉన్నట్లు ప్రస్తావన ఉంది. ఈ సంక్లిష్టతను దూరం చేసే విషయమూ ఒకటుంది. ఈ సంఘటన సందర్భంలో హజ్రత్ ఆయిషా(ర) ఉటంకించిన ఉల్లేఖనాలు కొన్నింటిలో మహనీయ సఅద్ బిన్ ముఆజ్ ప్రస్తావన ఉండగా, మరి కొన్నింటిలో ఆయనకు బదులు మహనీయ ఉసైద్ బిన్ హుజైర్ ప్రస్తావన ఉంది. ఈ రెండవ ఉల్లేఖనం, ఈ సందర్భంలో స్వయంగా మహనీయ ఆయిషా (ర) ద్వారా ఉల్లేఖించబడిన ఇతర సంఘటనలకు పూర్తిగా అనుకూలంగానూ ఉంది. లేకపోతే కేవలం హజ్రత్ సఅద్ బిన్ ముఆజ్(ర) జీవిత కాలంతో అనుగుణ్యం చేయడానికి బనీ ముస్తలిక్ యుద్ధాన్నీ, ఇఫ్క్ గాధను అహ్జాబ్, బనీ కురైజా యుద్ధాలకు పూర్వపు సంఘటనలుగా ఒప్పుకోవటం సరయినది కాదు. అలా ఒప్పుకుంటే పరదా ఆదేశం అవతరణ, హజ్రత్ జైనబ్ నికాహ్ సంఘటన అంతకన్నా ముందే జరిగి ఉంటాయన్న చిక్కుముడికి పరిష్కారమే దొరకదు. నిజానికి ఒక ప్రక్కన ఖుర్ఆన్, మరో ప్రక్కన సరయిన ఉల్లేఖనాలు అనేకం, జైనబ్ (ర) వివాహం, పరదా ఆదేశం రెండున్నూ, అహ్జాబ్, కురైజా యుద్ధాల తరువాతనే సంభవించిన సంఘటనలని సాక్ష్యమిస్తున్నాయి. ఈ కారణంగానే ఇబ్ను హజ్మ్, ఇబ్ను కయ్యిమ్ తదితర పరిశోధకులు ముహమ్మద్ బిన్ ఇస్‌హాక్ ఉల్లేఖనాన్నే సరయినదని నిర్ణయించారు. మేము కూడా దాన్నే సరయినదని భావిస్తున్నాము.

చారిత్రక పూర్వరంగం : ఈ విధంగా, అన్ నూర్ సూరా హి. 6వ సంవత్సరం ఉత్తరార్థంలో అవతరించిందనీ, అదీ అహ్జాబ్ సూరా అవతరణ తరువాత ఎన్నో నెలలకు జరిగిందనీ క్షుణ్ణంగా నిర్ధారితమవుతుంది. ఇక అది అవతరించినప్పటి పరిస్థితులెలా ఉండేవో సింహావలోకనం చేసుకోవడం అవసరం.

బద్ర్ యుద్ధం విజయానంతరం అరేబియా భూభాగంలో ఇస్లామీయ ఉద్యమం ఉత్థాన దశ ప్రారంభమయింది. అది కందకం పోరాటం జరిగే కాలానికి చేరే వరకు ఎంతో ఉధృతమయింది. బహుదైవారాధకులు, యూదులు, కపటులు, సందిగ్ధావస్థలో ఉన్నవారు అందరూ సరికొత్త శక్తిని కేవలం ఆయుధ బలంతో, సైన్యం ఆధారంగా అణచడం అసాధ్యమని భావించసాగారు. కందకం పోరులో వీరు ఒక్కటయి 10 వేల మంది సైనికుల్ని కూడగట్టుకుని మదీనా మీద దాడి జరిపారు. ఒక్క నెల కాలం తలబాదుకున్నా కడకు పరాజయంపాలయి వెనుదిరిగి పోయారు. వారు అటు వెళ్ళగానే ప్రవక్త మహనీయులు (స) బహిరంగ ప్రకటన చేయించారు, "ఈ సంవత్సరం తరువాత ఇక ఖురైష్ మీపైకి దాడి చెయ్యరు, మీరే వారిపైకి దండెత్తుతారు" అని (ఇబ్ను హిషామ్, 3వ సంపుటి, పుట. 266).

అంటే ఇస్లామ్ వ్యతిరేక శక్తుల పురోగమన శక్తి ఇక క్షీణించిందన్న మాట. ఇక ఇస్లామ్ రక్షణాత్మకం (Reactive)గా కాదు, క్రియాశీలకం (Proactive)గా పోరాడుతుంది. తిరస్కారం మటుకు ఆక్రమణాత్మకంగా కాక రక్షణాత్మకమయిన పోరు చేయవలసి ఉంటుంది. ఇదీ పరిస్థితుల సరయిన సంపూర్ణ విశ్లేషణ. ప్రత్యర్థి వర్గం కూడా దీన్ని బాగా అర్థం చేసుకుంది.

ఇస్లామ్ అనుదినం ప్రవర్ధమానమవడానికి అసలు కారణం ముస్లిముల సంఖ్యాబలం కాదు. బద్ర్ మొదలుకుని కందకం వరకు ప్రతి పోరులోనూ తిరస్కారులు ముస్లిములకన్నా ఎన్నోరెట్ల అధిక బలగం తీసుకువచ్చారు. జనాభా లెక్కల ప్రకారం కూడా ముస్లిములు ఆనాటి వరకు అరేబియాలో అతి కష్టం మీద 0.1% మాత్రమే ఉన్నారు. ఈ వృద్ధికి కారణం ఆయుధబలం రీత్యా ముస్లిముల ఆధిక్యత కూడా కాదు. అన్ని రకాల సాధనా సంపత్తుల రీత్యా తిరస్కారుల పక్షమే బలమయినది. ఆర్థిక శక్తి, పరపతి రీత్యా కూడా ముస్లిములకు వారితో పోలికే లేదు. వారివద్ద అరేబియా అంతటికీ చెందిన ఆర్థిక వనరులున్నాయి, ముస్లిములేమో ఆకలిదప్పులతో అలమటిస్తున్నారు. వారికి వెన్ను దన్నుగా అరేబియా అంతటా ఉన్న బహుదైవారాధకులు, గ్రంథవహుల తెగలున్నాయి, ముస్లిములేమో ఒక కొత్త ధర్మ సందేశం ఇచ్చి ప్రాచీన వ్యవస్థ సమర్థకులందరి సానుభూతినీ కోల్పోయారు. ఈ పరిస్థితుల్లో ముస్లిములందరినీ ముందుకు తోసుకుపోతున్న విషయం, నిజానికి ముస్లిముల నైతిక ఆధిక్యత మాత్రమే. దీన్ని స్వయంగా

ఇస్లామ్ విరోధులు కూడా గ్రహించేవారు. ఒక వైపున వారు ప్రవక్త మహనీయులు (స) ఆయన సహచరుల (ర) మచ్చలేని శీల స్వభావాలను చూసేవారు, ఇంకా వారి పరిశుద్ధత, పవిత్రత, పటిష్ఠతలు హృదయాలను వశపరచుకుపోతూ ఉండేవి. మరో వైపున, ముస్లిము లలోని వ్యక్తిగత, సామూహిక, నైతిక పరిశుద్ధతలు వారిలో అత్యున్నత స్థాయి సమైక్యత, క్రమబద్ధత, సంఘటిత భావనల్ని సయితం సృష్టించిన విషయాన్ని వారు గమనించేవారు. వీటి సమక్షంలో బహుదైవారాధకుల, యూదుల అసంఘటిత వ్యవస్థ, శాంతి, యుద్ధం ఇరు పరిస్థితుల్లోనూ ఓటమినే చవిచూస్తూ పోతోంది.

నీచ ప్రవృత్తి గలవారి ప్రత్యేకత ఏమిటంటే, వారు ఇతరులలోని సుగుణాలను, తమలోని దుర్గుణాలను స్పష్టంగా చూసుకుంటారు; ఇంకా వారిని వారి సుగుణాలు పురోగమింప జేస్తున్నాయని తమను తమ దుర్గుణాలు పతనంపాలు చేస్తున్నాయని కూడా తెలుసుకుంటారు. అప్పుడు వారికి తమ దుర్గుణాలను దూరం చేసుకోవాలని, ఎదుటివారి సుగుణాలను గ్రహించాలని ఆలోచన కలగదు; ఏ విధంగానయినా సరే ఎదుటివారిలోనూ తమలాంటి దుర్గుణాలను సృష్టించాలన్న తపనలో వారు పడిపోతారు. ఇది సాధ్యపడకపోతే కనీసం ఎదుటి వారిపైన బాగా మురికి చల్లాలని యత్నిస్తారు. ఆ విధంగానయినా వారి సుగుణాలలో ప్రపంచానికి మచ్చ కనిపించాలని కోరుకుంటారు. ఈ బుద్ధి కారణంగానే ఈ దశలో ఇస్లామ్ విరోధుల కార్యకలాపాల దిశ మరలింది. వారు తమ కుతంత్రాలను యుద్ధ సన్నాహాల నుంచి మళ్ళించారు, నీచపు దాడులకు, అంతర్గత ఉపద్రవాల సృష్టికి పాల్పడ్డారు. ఈ 'సేవలు' బయటి విరోధులకన్నా స్వయానా ముస్లిములలో ఉన్న కపటులు చాలా బాగా నెరవేర్చగలుగు తారు గనక సంకల్పితంగానో అసంకల్పితంగానో ఒక కార్యాచరణ విధానం నిర్ణయమయింది. దాని ప్రకారం, మదీనాలోని కపటులు అంతర్గతంగా ఉపద్రవాలు సృష్టించాలి, యూదులు, బహుదైవారాధకులు బయటి నుండి వాటి ద్వారా ఇతోధికంగా ప్రయోజనం పొందేందుకు ప్రయత్నించాలన్నది.

ఈ కొత్త పథకం ప్రకారం తొలి ప్రయత్నం హి. 5వ సంవత్సరం జీకఅద నెలలో జరిగింది. అప్పుడు దైవప్రవక్త (స) అరేబియాలోని అజ్ఞాన పూర్వకమయిన దత్తత ★ ఆచారాన్ని రూపుమాపడానికి స్వయంగా తన పెంపుడు కొడుకు (జైద్ బిన్ హారిసా -ర) భార్య (జైనబ్-ర-బిన్తు జహష్)కు విడాకులివ్వగా ఆమెను నికాహ్ చేసుకున్నారు. ఆ సందర్భంలో మదీనాలోని కపటులు

★ *ఇతరుల కొడుకును తన కొడుకుగా చేసుకోవటం అంటే తనకు పుట్టిన కొడుకు స్థానం కుటుం బంలో పూర్తి స్థాయిలో అతనికి ఇచ్చివెయ్యడం.*

దుష్ప్రచారపు పెను తుఫానును ప్రారంభించారు. బయటి నుండి యూదులు, ముష్రికులు వారితోపాటు గళం కలుపుతూ బూటకపు ప్రచారం ప్రారంభించారు. వారు వింతయిన కథలు అల్లి వ్యాపింపజేయసాగారు. ముహమ్మద్ (స) తన పెంపుడు కొడుకు భార్యను చూసి ఆమెను మోహించారని, కొడుకుకు ఆ ప్రేమ తెలిసి అతను విడాకులిచ్చి భార్యను వదలుకున్నాడని, తరువాత ఆయన స్వయంగా తన కోడలిని పెళ్ళాడారని కట్టుకథలు చాటారు. ఈ గాథలు ఎంత విస్తృతంగా వ్యాపింపజేశారంటే స్వయాన ముస్లిములు సయితం వాటి ప్రభావం నుంచి తప్పించుకోలేకపోయారు. కాగా హదీసువేత్తలు, వ్యాఖ్యాతల ఒక వర్గం హజ్రత్ జైనబ్, జైద్‌లను గురించి ఉల్లేఖించిన కథనాల్లో నేటి వరకు కూడా ఆ కాల్పనిక గాథల అంశాలు కనిపిస్తున్నాయి. మరి ప్రాచ్య శాస్త్రజ్ఞులయిన పాశ్చాత్యులు వాటిపైన ఉప్పుకారం చల్లి తమ పుస్తకాలలో ఉటంకిస్తుంటారు. నిజానికి హజ్రత్ జైనబ్ (ర) ప్రవక్త మహనీయుల స్వంత అత్త ఉమైమా బిన్తు అబ్దుల్ ముత్తలిబ్ కూతురు. బాల్యం నుంచి యవ్వనం వరకు ఆమె వయసంతా ప్రవక్త మహనీయుని సమక్షంలోనే గడిచింది. అలాంటప్పుడు ఆమెను యాదృచ్ఛికంగా ఒకనాడు చూసుకోవ డమూ, దైవం మన్నించుగాక, ఆమెను ప్రేమించడం అన్న ప్రశ్నే తలెత్తదు. పైగా ఆ సంఘటన జరిగిన ఒక సంవత్సరం మునుపే స్వయంగా ప్రవక్త మహనీయులే(స) ఆమెను బలవంతపెట్టి హజ్రత్ జైద్‌తో ఆమె పెళ్ళి జరిపించారు. ఆమె సోదరుడు అబ్దుల్లా బిన్ జహష్‌కి ఈ పెళ్ళి ఇష్టం లేకపోయింది. స్వయాన హజ్రత్ జైనబ్ ఈ పెళ్ళికి ఒప్పుకోలేదు. ఎందుకంటే ఖురైష్ శ్రేష్ఠతమ వంశం లోని ఆడపడుచు ఒక విడుదలయిన బానిసకు భార్య అవడం సహజంగా అంగీకరించజాలదు. కాని కేవలం దైవప్రవక్త (స) ముస్లిములలో సామాజిక సమత్వాన్ని స్థాపించ డానికి స్వయంగా తన వంశంలోనే పునాది వేయాలని కోరుకోవడం వల్ల ఆమెను ఆదేశపూర్వకంగా ఈ పెళ్ళికి ఒప్పించారు. ఈ మాటలన్నీ మిత్రులకూ శత్రువులకూ అందరికీ తెలిసినవే. ఇంకా హజ్రత్ జైనబ్ (ర)లోని వంశావళి గర్వభావన కారణంగానే ఆమెకూ హజ్రత్ జైద్‌కు మధ్య పొసగలేకపోయిందన్న విషయమూ, అలా చివరికి విడాకుల వరకు పరిస్థితులు వెళ్ళాయన్న విషయమూ అందరికీ తెలిసినదే. ఇదంతా తెలిసి నప్పటికీ సిగ్గులేకుండా దుష్ప్రచారకులు కథలల్లి ప్రవక్త మహనీయుల్ని అత్యంత హేయమయిన నిందలపాలు చేశారు. వాటిని ఎంత విరివిగా, పకడ్బందీగా ప్రచారం చేశారంటే వారి ఆ ప్రాపగండా నేటికీ ప్రభావాన్ని చూపుతూనే ఉంది.

ఆ తరువాత ఇటువంటి రెండవ దాడి బనీ ముస్తలిక్ యుద్ధం సందర్భంలో జరిగింది. ఇది మునుపటి దానికన్నా తీవ్రమయింది.

బనీ ముస్తలిక్, బనీ ఖుజాఅ తెగలోని ఒక శాఖ. అది ఎర్ర సముద్ర తీరాన జిద్దా, రాబిగ్ అనే


బనీ ముస్తలిక్ యుద్ధం
బనీ సులైమ్
మదీనా
వాదీ అకీక్
బనీ ముజైనా
బి'ర్ మఊన
హమ్రా ఉల్ అసద్
బనీ ఆమిర్
బద్ర్
అల్ అబ్వా
బనీ హవాజిన్
రాబిగ్
ఎర్ర సముద్రం
అల్ జుహ్ఫా
బనీ లిహ్యాన్
కుదైద్
బనీ ముస్తలిక్
ఆఫ్రికా
ఉస్ఫాన్
మర్ అల్ జహ్రాన్
జిద్ద
మక్కా
బనీ ఖుజాఅ
తాయిఫ్

ప్రాంతాల మధ్యన కుద్దైద్ ప్రాంతంలో నివసిస్తూ ఉండేది. దాని చెలమ పేరు 'ముర్రైసీ'. దాని చుట్టుపట్లనే ఆ తెగవారు నివసించేవారు. ఈ సంబంధం కారణంగా హదీసుల్లో ఆ పోరాటం పేరు ముర్రైసీ పోరాటంగా కూడా ప్రస్తావించబడింది. చిత్రపటం ద్వారా దాని సరయిన స్థలం తెలుసుకోవచ్చు.

హి.6 షాబాన్ నెలలో దైవప్రవక్త (స)కు ఒక సమాచారం అందింది. ఆ తెగవారు ముస్లిములకు ప్రతిగా యుద్ధ సన్నాహాలు చేస్తున్నారని, ఇతర తెగల వారిని సయితం తమతోపాటు కూడగట్టు కోవాలని యత్నిస్తున్నారనీ తెలిసింది. ఈ సమాచారం అందగానే ఆయన (స) సైనిక బృందం ఒకదాన్ని తీసుకుని అటు వైపునకు బయలుదేరారు. ఆ ఉపద్రవం ముంచుకు వచ్చే మునుపే దాన్ని అణచివేయాలని అనుకున్నారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్లా బిన్ ఉబై కూడా ఓ పెద్ద సంఖ్యలో కపటుల్ని తీసుకుని ఆయన వెంట బయలు దేరాడు. ఇబ్ను సఅద్ ప్రకారం, అంతకు ముందు ఏ పోరుకూ కపటులు అంతపెద్ద సంఖ్యలో కలసి వెళ్ళలేదు. ముర్రైసీ ప్రాంతంలో అకస్మాత్తుగా శత్రువును ముట్టడించారు ప్రవక్త మహనీయులు (స), చిన్నపాటి సంఘర్షణ తరువాతనే తెగనంతటినీ ధనసామగ్రితో పాటు నిర్బంధంలోకి తీసుకున్నారు. దీన్ని ముగించి ఇంకా ముర్రైసీలోనే ఇస్లామీయ సైన్యం మకాం చేసిఉన్న స్థితిలోనే ఒక రోజు హజ్రత్ ఉమర్ (ర) నౌకరు (జహ్ జాహ్ బిన్ మస్ఊద్ గిఫారి) మధ్యను ఖజ్రజ్ తెగ ఒడంబడికదారు ఒకడు (సినాన్ బిన్ దబర్ జుహని) మధ్యన నీటి విషయంలో వాదులాట జరిగింది. ఒకడు అన్సారులకు పిలుపునిచ్చాడు. మరొకడు ముహాజిర్లను పిలిచాడు. ఉభయ పక్షాల జనం గుమికూడారు. ఇరువురికీ నచ్చజెప్పి, వ్యవహారాన్ని పరిష్కరించి సర్దిచెప్పారు. కాని అబ్దుల్లా బిన్ ఉబై, అన్సారుల తెగ ఖజ్రజ్‌కు చెందిన వాడవడం చేత గోరంతను కొండంత చేశాడు. అతను అన్సార్‌ను రెచ్చగొట్టసాగాడు, "ఈ ముహాజిర్లు మనపైన విరుచుకుపడుతున్నారు, మనకు ప్రత్యర్థులుగా రూపొందారు, మనకూ ఈ కురైషీ దరిద్రులకూ పోలిక, కుక్కను పెంచుకుంటే, అదే మనల్ని చీల్చుకుతిన్నట్లుగా ఉంది. ఇదంతా మీరు చేసిన దానికి శాస్తి. మీరు స్వయంగానే వీరిని పిలిపించి మన ఇంట కూర్చోబెట్టుకున్నారు. వీరిని మన ధన సంపత్తిలో భాగస్వాములుగా చేశారు. మీరు కాస్త చెయ్యి ముడుచుకున్నారంటే ఈ పెద్ద మనుషులు ఇక్కడి నుండి చెక్కేస్తారు" అని చిచ్చు పెట్టాడు. ఇంకా ఒట్టుపెట్టుకుని ఇలా ప్రతినబూనాడు, "మదీనా వెళ్ళిన తరువాత మనలో గౌరవం గలవాడు, నీచులయిన వారిని ఏరివేసి సాగనంపాలి."★ అతని ఈ మాటల సమాచారం ప్రవక్త మహనీయులకు అందినప్పుడు హజ్రత్ ఉమర్ (ర) అతన్ని అంత మొందించాలని సలహా ఇచ్చారు. అయితే ప్రవక్తశ్రీ (స) ఇలా సెలవిచ్చారు, "కాని ఉమర్, ప్రపంచం ఏమంటుంది, ముహమ్మద్ స్వయంగా తన

★ *'మునాఫికూన్' సూరాలో స్వయంగా అల్లాహ్ అతను పలికిన ఈ మాటను ఉటంకించాడు.*

సహచరుల్ని సంహరిస్తున్నాడని అనదా?" ఆ తరువాత ఆయన అక్కడి నుండి వెంటనే బయలుదేరాలని ఆదేశించారు. మరుసటి రోజు మధ్యాహ్నం వరకు ఎక్కడా మజిలీ చేయలేదు; జనం బాగా అలసిపోవాలని, ఎవ్వరికీ కూచొని ముచ్చట్లు, గుసగుసలు మంతనాలు చేసుకునే వ్యవధి దొరకరాదని అలా చేశారు. దారిలో ఉసైద్ బిన్ హుజైర్, "దైవ ప్రవక్తా, నేడు మీరు మీ మామూలుకు విరుద్ధంగా అపకాలంలో బయల్దేరదీశారేమిటీ?" అని అడిగారు; ఆయన (స) సమాధానంగా, "నీవు వినలేదా, మీ అయ్యగారు ఎటువంటి మాటలు పలికాడో?" అని అడిగారు. "ఎవరా పెద్ద మనిషీ?" అని ఆయన తిరిగి ప్రశ్నించారు. "అబ్దుల్లా బిన్ ఉబై" అని ప్రవక్త సెలవిచ్చారు. ఆయన ఇలా విన్నవించుకున్నారు, "దైవప్రవక్తా, ఆ వ్యక్తికి ఈ విషయంలో కాస్త రాయితీ ఇవ్వండి, మీరు మదీనా విచ్చేసిన సందర్భంలో, మేము అతన్ని అప్పటికే మా రాజుగా చేసుకోవాలని నిర్ణయించుకున్నాము; అతని కోసం కిరీటం కూడా సిద్ధపరచుకుంటూ ఉన్నాము. మీ రాకవల్ల అతడు కట్టుకున్న ఆశల మేడలన్నీ కూలిపోయాయి. ఆ మంటనే అతడు వెళ్ళగ్రక్కుతుంటాడు."

ఈ రభస ఇంకా సద్దుమణగకముందే, అదే ప్రయాణంలో అతడు మరో ఉపద్రవాన్ని సృష్టించాడు. ఆ ఉపద్రవం కూడా సాధారణమయింది కాదు, ప్రవక్త మహనీయులు (స), ఆయన ప్రాణ సహచరులు అసమాన సంయమనాన్నీ, సహనాన్నీ, విజ్ఞతను, వివేచనను ప్రదర్శించి ఉండకపోతే శైశవ దశలో ఉన్న మదీనా ముస్లిమ్ సమాజంలో తీవ్రమయిన అంతర్యుద్ధం ప్రారంభమయ్యేది. అది హజ్రత్ ఆయిషా (ర) మీద అపవాదు మోపిన ఉపద్రవం. ఆ సంఘటనా వివరాలు స్వయంగా ఆవిడగారి నోటనే వినండి, దానివల్ల పరిస్థితుల స్వరూపం పూర్తిగా కళ్ళ ముందు నిలుస్తుంది. మధ్య మధ్యన వివరణ అవసరమయిన విషయాలను మేము ఇతర ఉల్లేఖనాల ఆధారంగా బ్రాకెట్లలో అదనంగా ఉటంకించాము, తద్వారా మహనీయ ఆయిషా సిద్దీకా(ర) చేసిన వివరణాక్రమంలో ఎటువంటి అంతరాయం కలగదు. ఆవిడ గారు ఇలా సెలవిచ్చారు:

"దైవ సందేశహరులు తమ నియమానుసారం తాను ప్రయాణానికి వెళ్ళేటప్పుడు చీటీవేసి నిర్ణయించే వారు, తన సతీమణులలో ఎవరు తన వెంట వెళ్ళాలో అనేది.★ బనీ ముస్తలిక్ యుద్ధం సందర్భంలో చీటి నా పేరిట వచ్చింది. నేను ఆయన వెంట వెళ్ళాను. తిరుగు ప్రయాణంలో మేము మదీనాకు చేరువయినప్పుడు, ఒక మజిలీలో రాత్రివేళ దైవ సందేశ

★ *ఈ చీటీ వేయడం లాటరీ వంటిది కాదు. నిజానికి భార్యలందరి హక్కులు సమానమయినవి. వీరిలో ఒకరికి మరొకరి మీద ప్రాధాన్యం ఇవ్వడానికి ఎలాంటి సమంజసమయిన కారణం లేదు. ఇక ప్రవక్త మహనీయులు (స) స్వయంగా ఎవరినయినా ఎన్నుకుంటే ఇతర సతీమణులకు బాధ కలుగుతుంది, వారిలో పరస్పరం ఈర్ష్యాద్వేషాలు*

హరులు (స) మకాం వేశారు. ఇంకా చీకటి ఉండగానే బయలుదేరే సన్నాహాలు జరగసాగాయి. నేను లేచి కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్ళాను. తిరిగి వచ్చేటప్పుడు బస దగ్గరికి చేరేసరికి నా కంఠంలోని హారం ఎక్కడో తెగిపడిపోయిందన్న విషయం గ్రహించాను. నేను దాన్ని వెదక నారంభించాను, అంతలోనే బిడారు బయలుదేరింది. సాధారణంగా బయలుదేరే సమయంలో నేను 'హౌదా' (స్త్రీల కొరకు ఉపయోగించే పల్లకి లాంటిది) నెక్కి కూర్చునేదాన్ని. నలుగురు దాన్ని ఎత్తి ఒంటెపైన పెట్టేసేవారు. మహిళలు ఆ కాలంలో ఆహార లోపం వల్ల చాలా బక్కపలచగా ఉండేవారము. నా "హౌదా" నెత్తేటప్పుడు ఎత్తిన వారికి నేను అందులో ఉన్నానో లేదో గ్రహింపు కలగలేదు. వారు తెలియక ఖాళీ 'హౌదా' నెత్తి ఒంటెపైన పెట్టి బయలుదేరారు. నేను నా కంఠహారం తీసుకుని అక్కడికి చేరినప్పుడు అక్కడ ఎవ్వరూ లేరు. చివరికి నేను దుప్పటికప్పుకుని అక్కడే నడుం వాల్చాను. ముందుకు వెళ్ళిన తరువాత వారు నేను లేనని గమనిస్తారు, అప్పుడు వెదుక్కుంటూ ఎలాగూ వచ్చేస్తారని అనుకున్నాను. అదే స్థితిలో నాకు నిద్రపట్టింది. తెల్లవారు ఝామున సఫ్వాన్ బిన్ ముఅత్తల్ సులమీ, నేను పడుకున్న చోటున వెళ్ళడం తటస్థించింది. నన్ను చూడగానే గుర్తుపట్టారు. ఎందుకంటే పరదా ఆదేశాలు రాకపూర్వం వారు నన్ను అనేక పర్యాయాలు చూసి ఉన్నారు. (ఈయన గారు బద్ర్ యుద్ధంలో పాల్గొన్న బద్రీ సహచరులు) వీరికి తెల్లవారు ప్రొద్దెక్కే వరకు పడుకునే అలవాటు ఉండేది.★ అందువల్ల సైన్యపు మజిలీలో ఆయన కూడా ఎక్కడో నిద్రపోతూ ఉండిపోయారు, ఇప్పుడు లేచి మదీనాకు బయలుదేరారు. నన్ను చూసి ఆయన ఒంటెను ఆపుకున్నారు. ఆయన అప్పుడు అప్రయత్నంగా "ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్, దైవప్రవక్త(స) సతీమణి ఇక్కడే ఉండిపోయారా?" అని బిగ్గరగా పలికారు. ఈ ధ్వని వల్ల నాకు మెలుకువ వచ్చేసింది. నేను లేచి వెంటనే

ఉత్పన్నమయ్యేందుకు కూడా అది ప్రేరణ కావచ్చు. అందువల్ల ఆయన చీటీ ద్వారా ఆ నిర్ణయం తీసుకునేవారు. షరీఅత్ ప్రకారం కొందరు వ్యక్తుల మధ్య, ధర్మసమ్మతమయిన హక్కు అందరికీ సమానమయినప్పుడు, ఒకరిపైన మరొకరికి ప్రాధాన్యతనిచ్చే సమంజసమయిన కారణం ఏదీ లేకపోగా హక్కు మాత్రం ఒకరికే ఇవ్వడం సాధ్యమయిన సందర్భంలో చీటీవేయడం ఒక్కటే సరయిన పద్ధతి.

★ *అబూదావూద్ తదితర హదీసు గ్రంథాలలో ఈయన ప్రస్తావన ఉంది. ఈయన భార్య, ప్రవక్త మహనీయుల (స) తో ఈయన విషయమయి ఫిర్యాదు చేశారు, ఈయన ఎప్పుడూ ఫజ్ర్ నమాజ్ సరయిన సమయానికి చెయ్యరు అని. ఆయన కారణం విన్నవించుకున్నారు, "దైవప్రవక్తా, ఇది మా వంశానుగతమయిన లోపం. బాగా పొద్దెక్కే వరకు పడుకునే*

ముఖంపైన ముసుగు వేసుకున్నాను. ఆయన నాతో ఏమీ మాటలాడలేదు. తన ఒంటె తెచ్చి నాకు సమీపాన కూర్చోబెట్టారు. తాను దూరంగా తొలిగి నిలబడ్డారు. నేను ఒంటెపైకి ఎక్కాను. ఆయన దాని ముక్కుతాడు పట్టుకుని బయలుదేరారు. మధ్యాహ్నాం వేళకు మేము సైన్యాన్ని అందుకున్నాము. అప్పుడే అది ఒక మజిలీలో ఆగింది. సైన్యంలోని వారికి నేను వెనక ఉండిపొయ్యా నన్న విషయం ఇంకా తెలియదు. దీని మీద అపవాదు మోపేవారు అపవాదులు రేపారు; వీరి అందరిలో అగ్రగణ్యుడుగా ఉన్నవాడు అబ్దుల్లా బిన్ ఉబై. అయితే నాకు అదంతా ఏమీ తెలియదు, నాపైన ఏ కథలల్లుతున్నారో నేనెరుగను.

(ఇతర ఉల్లేఖనాల ప్రకారం, సఫ్వాన్ ఒంటెపైన హజ్రత్ ఆయిషా (ర) సైనిక బిడారులో ప్రవేశించి నప్పుడు, ఆమె అలా వెనుక ఉండిపోయారని తెలుసుకున్న వెంటనే అబ్దుల్లా బిన్ ఉబై ఎలుగెత్తి పలికాడు, "దైవం మీద ఒట్టు, ఈవిడ భద్రంగా రాలేదు. చూడండయ్యా, మీ ప్రవక్త గారి సతీమణి మరో వ్యక్తితో రేయి గడిపింది, ఇప్పుడు అతను ఆమెను బహిరంగంగా తీసుకువస్తున్నాడు?")

"మదీనా చేరగానే నేను అనారోగ్యానికి గురయ్యాను. దాదాపు ఒక నెల రోజులు మంచంపై నుంచి లేవలేదు. నగరంలో ఈ అపవాదు రెక్కలు కట్టుకుని వ్యాపిస్తోంది. దైవ సందేశహరుల (సల్లల్లాహు అలైహి వ సల్లమ్) చెవులకు కూడా అది సోకింది. కాని నాకు ఎలాంటి సమాచారం లేదు. అయితే నాకు బాధ కలిగించిన విషయం దైవప్రవక్త వైఖరి. సాధారణంగా నేను అస్వస్థతకు గురయితే ఎలా శ్రద్ధ చూపేవారో అలాంటి శ్రద్ధ కానరాలేదు. ఆయన ఇంటికి వస్తే కేవలం ఇంటిలోని వారిని మాత్రమే అడిగి పరామర్శించేవారు, 'ఎలా ఉంది ఈవిడ?' అని. స్వయంగా నన్ను పలకరించేవారు కూడా కారు. దీనివల్ల నాకు అనుమానం కలిగేది, ఏదో విషయం తప్పక ఉందని. చివరికి ఆయన అనుమతితో మా పుట్టింటికి వెళ్ళిపోయాను, వారు నా శుశ్రూష సరిగ్గా చేయగలుగుతారని.

"ఒకరోజు రాత్రివేళ కాలకృత్యాల కొరకు నేను మదీనా వెలుపలికి వెళ్ళాను. ఆనాటి

బలహీనతను నేను అధిగ మించలేను." దానికి ఆయన (స), సరే నిద్ర మేల్కొన్నప్పుడు వెంటనే నమాజ్ చేసుకో అని పురమాయించారు. కొందరు హదీసువేత్తలు ఆయన బిడారులో వెనుక ఉండిపోవడానికి కారణం ఇదే అని చెప్పారు. మరికొందరు హదీసువేత్తల ప్రకారం, ప్రవక్త మహనీయులు (స) రాత్రి చీకటిలో బయలుదేరడం వల్ల ఎవరిదయినా వస్తువు ఏదయినా తప్పిపోతే ప్రొద్దున వెదికి తీసుకు రావడం కోసం ఈయన్ని నియమించారు అని కారణం చెప్పారు.

వరకు మా ఇండ్లల్లో మరుగు దొడ్లు ఉండేవి కావు, మేము బయలు ప్రదేశానికే వెళ్ళే వాళ్ళము. నాతోపాటు మిస్తహ్ బిన్ ఉసాస తల్లి కూడా ఉండింది. ఆవిడ మా నాన్నగారికి పిన్నమ్మ కూతురు. (ఇతర ఉల్లేఖనాల ప్రకారం ఆ కుటుంబం మొత్తం పాలనాభారం హజ్రత్ అబూబక్ర్ సిద్దీక్ (ర) బాధ్యతలో ఉండేది. ఈ ఉపకారాన్ని కూడా లెక్కచెయ్యక మిస్తహ్ కూడా, హజ్రత్ ఆయిషా (ర) కు వ్యతిరేకంగా అపవాదులు వ్యాపింపజేసిన వారిలో ఉండేవారు). దారిలో ఆవిడకు ఎదురుదెబ్బ తగిలింది. అప్రయత్నంగా ఆమె నోట 'మిస్తహ్ నాశనంగాను' అన్న మాటలు వెలువడ్డాయి. నేను, "మంచి తల్లివే. కొడుకును శపిస్తా వేమిటి? పైగా కొడుకు కూడా బద్ర్ యుద్ధంలో పాల్గొన్నవాడు" అని అన్నాను. దానికి ఆవిడ, "అమ్మా, నీకు అసలు విషయం తెలియదా ఏమిటి?" అంటూ ఆమె పెద్ద గాథ వినిపించింది. అబద్ధాలకోరు జనం నా గురించి ఎటువంటి మాటలల్లుతున్నారో పూసగ్రుచ్చినట్లు చెప్పింది. (కపటులు కాక స్వయంగా ముస్లిముల్లో ఈ ఉపద్రవానికి గురయినవారిలో మిస్తహ్, ప్రసిద్ధ ఇస్లామ్ కవి హస్సాన్ బిన్ సాబిత్, హజ్రత్ జైనబ్ సోదరి హమ్‌నా బిన్తె జహష్ చాలా ప్రముఖ పాత్ర వహించారు). ఈ గాథ విని నేను బిత్తరపోయాను, కత్తి వాటుకు నెత్తుటి చుక్కయినా లేదు, నేను వెళ్ళిన అవసరం కూడా మరచిపోయాను, నేరుగా ఇంటికి తిరిగి వెళ్ళాను. రాత్రంతా ఏడుస్తూనే గడిపాను."

ఇంకా ముందుకు సాగి హజ్రత్ ఆయిషా (ర) ఇలా సెలవిచ్చారు, "నేను లేనప్పుడు దైవ సందేశ హరులు (స), అలీ (ర), ఉసామా బిన్ జైద్ (ర)ని పిలిపించి వారి సలహా నడిగారు. ఉసామా నా విషయంలో మంచిమాట పలికారు, ఇంకా ఇలా అన్నారు, 'దైవప్రవక్తా! మీ సతీమణిలో మేము మంచిని తప్ప మరేమీ చూడలేదు. ఇదంతా అసత్యం, అబద్ధ ప్రచారం చేస్తున్నారు.' పోతే అలీ (ర) ఇలా అన్నారు, 'దైవప్రవక్తా, మహిళల కొరత లేదు, మీరు ఆవిడకు బదులు మరో పెళ్ళి చేసుకోగలరు. విచారణే జరపాలని అనుకుంటే సేవకురాలయిన బానిసను పిలిపించి పరిస్థితిని విచారించవచ్చు.' తదనుగుణంగా సేవకురాలిని పిలిపించడం జరిగింది. ఆమెను అడగ్గా ఇలా చెప్పింది, 'మిమ్మల్ని సత్యబద్ధంగా పంపిన దైవం సాక్షి, నేను ఆమెలో ఎలాంటి చెప్పుకోదగ్గ చెడును చూడలేదు, ఒకటే లోపం, నేను పిండి కలిపి ఏదయినా పనికి వెడుతూ, అమ్మా కాస్త పిండిని గమనించు అని చెప్పిపోతాను, కాని ఆవిడ నిద్రపోతారు, మేక వచ్చి పిండిని కాస్తా కాజేస్తుంది.' అదే రోజున దైవప్రవక్త (స) ప్రసంగంలో ఇలా సెలవిచ్చారు, 'ముస్లిములారా, నా ఇంటివారిపైన అపవాదులు మోపి నన్ను అమితంగా బాధిస్తున్న వ్యక్తి దాడుల నుండి నా గౌరవాన్ని రక్షించే వారు ఎవరయినా ఉన్నారా? దైవం సాక్షి, నేను నా భార్యలోనూ ఎటువంటి చెడుగును చూడలేదు, నిందమోపబడుతున్న ఆ వ్యక్తిలోనూ నేను

చెడును కానలేదు. అతడు నేను లేనప్పుడు నా ఇంటికి కూడా ఎన్నడూ రాలేదు.' దాని మీదట, ఉసైద్ బిన్ హుజైర్ (కొన్ని ఉల్లేఖనాల ప్రకారం సఅద్ బిన్ ముఆజ్)★ లేచి ఇలా పలికారు, 'దైవప్రవక్తా, అతడు మా తెగకు చెందిన వ్యక్తి అయితే మేము అతని తల నరికి వేస్తాము లేదా మా సోదరులు ఖజ్రజ్‌లలోని వాడయితే మీరు ఆదేశించండి, మేము దాన్ని శిరసావహిస్తాము.' ఇది వినగానే ఖజ్రజ్‌ల నాయకుడు సఅద్ బిన్ ఉబాద లేచి నిలబడ్డారు. ఆయన ఇలా సవాలు విసిరారు, 'నీవు అబద్ధం చెబుతున్నావు, నీవు ఎన్నటికీ అతన్ని చంపలేవు. నీవు అతని తల నరకాలని అంటున్నది కేవలం అతడు ఖజ్రజ్‌లలోని వాడవడం చేతనే. అతడు మీ తెగలోనివాడయినట్లయితే, మేము అతని తల నరికి వేస్తామని నీవు ఎన్నటికీ అనేవాడివి కావు.'★★ ఉసైద్ బిన్ హుజైర్ దానికి బదులుగా ఇలా అన్నారు, 'నీవు, కపటివి, అందుకే కపటులను వెనుక వేసుకు వస్తున్నావు.' దానిమీదట ప్రవక్త మస్జిద్‌లో కల్లోలం చెలరేగింది. దైవ సందేశహరులు ఇంకా మింబర్ పైనే ఉన్నారు. ఔస్, ఖజ్రజ్‌లు మస్జిద్‌లో కలబడటమే తరువాయిగా మారాయి పరిస్థితులు. కాని దైవ సందేశహరులు (స) వారిని శాంతపరిచారు, తరువాత మింబర్‌పై నుంచి దిగివచ్చారు."

★ *ఈ విభేదానికి కారణం, హజ్రత్ ఆయిషా అతని పేరును పలకడానికి బదులు "ఔస్ నాయ కుడు" అని పలికి ఉంటారు. ఉల్లేఖకుడెవరయినా దాని ఉద్దేశ్యం హజ్రత్ సఅద్ బిన్ ముఆజ్ అని అనుకుని ఉంటాడు. ఎందుకంటే తన జీవితకాలంలో ఆయనే ఔస్ తెగ నాయకులుగా ఉండేవారు. చరిత్రలో ఈ విధంగానే ఆయన ప్రసిద్ధులు. నిజానికి ఈ సంఘటన జరిగే నాటికి ఆయన బాబాయి కుమారుడు ఉసైద్ బిన్ హుజైర్ ఔస్ నాయకుడయ్యారు.*

★★ *హజ్రత్ సఅద్ బిన్ ఉబాద చాలా సద్వర్తనులు, ఉత్తమమయిన ముస్లిములు, ప్రవక్త (స) అంటే గాఢమయిన ప్రేమ, విశ్వాసం గలవారు. మదీనాలో ఇస్లామ్ వ్యాప్తికి కారకులయిన వారిలో అగ్రగణ్యులు. ఈ ఉత్తమ గుణాలున్నప్పటికీ ఆయనలో జాతీయ అభిమానం (ఆ కాలంలో అరేబియాలో జాతి అంటే తెగ అని అర్థం) మెండుగా ఉండేది. ఈ కారణంగానే, ఆయన అబ్దుల్లా బిన్ ఉబైని వెనుకవేసుకు వచ్చారు, అతడు ఆయన తెగలోని వ్యక్తి. ఈ కారణంగానే మక్కా విజయం సందర్భంలో ఆయన నోట ఈ వాక్యం వెలువడింది, "ఇది రక్తపాతపు దినం, నేడు ఇక్కడ పవిత్రతను భంగపరచడం ధర్మసమ్మతం" అని అన్నారు. దానిపట్ల ఆగ్రహించి ప్రవక్త(శ్రీ (స) ఆయన చేతి నుండి సైన్యపు ధ్వజాన్ని తిరిగి తీసుకున్నారు. చివరికి ఈ కారణంగానే ఆయన, ప్రవక్త(శ్రీ దివంగతులయిన తరువాత సకీఫా బనీ సాయిదాలో, ఖిలాఫత్ అన్సారుల హక్కు అని చాటారు. తన మాట చెల్లకపోగా,*

హజ్రత్ ఆయిషా (ర) గాథలోని మిగతా వివరాలను మేము వ్యాఖ్యానంలో, అల్లాహ్ తరఫున ఆవిడ నిర్దోషిత్వాన్ని ప్రకటించబడినచోట ఉటంకిస్తాము. ఇక్కడ చెప్పదలచుకున్న దేమిటంటే అబ్దుల్లా బిన్ ఉబై ఈ రభస సృష్టించి ఒకేసారి ఎన్నో విషయాలను సాధించాలని అభిలషించాడు. ఒక వైపున అతడు దైవసందేశహరులు, హజ్రత్ అబూబక్ర్ సిద్దీఖ్‌ల గౌరవ ప్రపత్తులను దెబ్బతీయాలని చూశాడు. రెండవ వైపున ఇస్లామీయ ఉద్యమం సాధించిన ఉన్నత నైతిక ప్రమాణాలను, ఆదరణను పడగొట్టాలని యత్నించాడు. మూడవ వైపున అతడు ఒక నిప్పు కణికను వదిలాడు, ఇస్లామ్ తన అనుయాయు లను పూర్తిగా పరివర్తింపజేసి ఉండకపోయి నట్లయితే ముహాజిర్లు, అన్సారులు, స్వయాన అన్సారుల ఇరు తెగలు పరస్పరం ఘర్షించుకు చచ్చేవారు.

ప్రధాన విషయం, చర్చనీయాంశం : ఇవీ ఆనాటి పరిస్థితులు. తొలిదాడి జరిగినప్పుడు అహ్జాబ్ సూరాలోని చివరి 6 రుకూలు అవతరించాయి. రెండవ దాడి జరిగినప్పుడు ఈ నూర్ సూరా అవత రించింది. ఈ పూర్వరంగాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ రెండు సూరాలను ఒక క్రమంలో అధ్యయనం చేస్తే వీటిలోని ఆదేశాలలో దాగివున్న మర్మహేతువు, ఔచితీ విజ్ఞతలు బాగా బోధపడతాయి.

ముస్లిములను వారి ఔన్నత్యానికి మూలమయిన రంగంలో ఓడించాలని కపటులు కోరుతు న్నారు. ఈ సందర్భంలో పరమ ప్రభువు అల్లాహ్ వారి నైతికదాడులపైన ఆగ్రహోదగ్రమయిన ఒక ప్రసంగం చేయడానికి బదులు, లేదా ముస్లిములను తిరుగుదాడి చేసేందుకు రెచ్చగొట్టడానికి బదులు ముస్లిములకు సుశిక్షణ గరపడానికే అత్యధిక శ్రద్ధచూపాడు. 'మీ నైతిక జీవితంలో ఎక్కడెక్కడయితే లొసుగులున్నాయో వాటిని తొలగించండి, ఈ రంగాన్ని మరింత పటిష్ఠ పరచుకోండి.' జైనబ్ వివాహ సందర్భంలో కపటులు, తిరస్కారులు ఎలా విజృంభించారో గమనించాము. ఇక అహ్జాబ్ సూరా తీసి చదివితే అక్కడ, ఆ విజృంభణ కాలంలోనే సామాజిక సంస్కరణ కోసం దిగువన పేర్కొన్న నిర్దేశాలు ఇవ్వబడ్డాయని ద్యోతకమవుతుంది:

1. ప్రవక్త సతీమణులకు తమ ఇండ్లల్లో గౌరవప్రదంగా కూర్చోవాలని, అలంకరణలు చేసుకుని బయటికి వెళ్ళకూడదని, పరాయి పురుషులతో మాట్లాడవలసి వస్తే మృదువుగా

అన్సారులు, ముహాజిర్లు అందరూ హజ్రత్ అబూ బక్ర్ చేతి మీదుగా బయ్అత్ చేసినప్పుడు బయ్అత్‌ని తిరస్కరించినవారు కేవలం ఆయన ఒక్కరే. ఆయన అంతిమ శ్వాస వరకు ఖురైషీని ఖలీఫాగా స్వీకరించలేదు (చూడండి, ఇబ్ను హజర్ 'అల్ ఇసాబ'; అబ్దుల్ బర్ర్ 'అల్ ఇస్తిఆబ్'లో సఅద్ బిన్ ఉబాదా ప్రస్తావన - పుట 10, 11).

మాట్లాడరాదని, ఎవరయినా అనవసరపు ఆశలు పెంచుకునే అవకాశం ఇవ్వరాదని ఆదేశించడం జరిగింది. *(అహ్జాబ్ 32, 33)*

2. ప్రవక్తశ్రీ (స) ఇంటిలో అనుమతి లేకుండా పరపురుషులు ప్రవేశించడాన్ని నిషేధించడం జరిగింది; పవిత్ర సతీమణులను ఏదయినా అడగదలిస్తే పరదా చాటుగా అడగాలని నిర్దేశించడం జరిగింది. (అహ్జాబ్ : 53)

3. పెళ్ళికి నిషిద్ధంగాని పురుషులు (గైర్ మహరమ్), నిషిద్ధమయిన బంధువుల (మహరమ్) మధ్య వ్యత్యాసాన్ని నిర్ణయించడం జరిగింది. పవిత్ర సతీమణుల నిషిద్ధ బంధువులే స్వేచ్ఛగా ఇండ్లల్లోకి రాకపోకలు సాగించగలరని ఆదేశించడం జరిగింది. (అహ్జాబ్ : 55)

4. ప్రవక్త సతీమణులు ముస్లిములకు మాతృమూర్తులని, సరిగ్గా స్వంత తల్లిలానే వారు ముస్లిము లకు శాశ్వతంగా నిషిద్ధమయిన వారని తెలుపడం జరిగింది. అందువల్ల ప్రతి ముస్లిమ్ వారి ఎడల తన మనోభావాలను పరిశుద్ధంగా ఉంచుకోవాలని బోధించడమూ జరిగింది. (అహ్జాబ్ :53, 54)

5. ముస్లిములను హెచ్చరించడం జరిగింది, ప్రవక్తను బాధపెట్టడం, ప్రపంచంలోనూ పరలోకం లోనూ దేవుని అభిశాపానికీ, పరాభవకరమయిన శిక్షకూ కారణభూతమవుతుందని తెలుపడం జరిగింది. అలాగే ఒక ముస్లిమ్ మానాభిమానాలపైన దాడి చెయ్యడం, అతనిపైన అధర్మంగా నిందమోపడం కూడా మహాపాపమని హెచ్చరించడం జరిగింది. (అహ్జాబ్ : 57, 58).

6. ముస్లిమ్ మహిళలందరికీ ఆదేశించడం జరిగింది, వారు బయటికి వెళ్ళవలసి వచ్చినప్పుడు దుప్పట్లతో తమను తాము బాగా కప్పుకుని కొంగు ముఖాన వ్రేలాడదీసుకుని మరీ వెళ్ళాలని. (అహ్జాబ్ : 59)

ఆ తరువాత (హజ్రత్ ఆయిషా-ర-కు సంబంధించిన) ఇఫ్క్ సంఘటన కారణంగా మదీనా సమాజంలో కల్లోలం చెలరేగినప్పుడు ఈ నూర్ సూరా అవతరించింది. ఇందులో నైతిక, సామాజిక, శాసనపరమయిన ఆదేశాలు, నిర్దేశాలు అవతరించాయి. వాటి ఉద్దేశం ముస్లిమ్ సమాజంలో అసలు చెడులు అన్నవే పుట్టకుండా, వ్యాప్తిచెందకుండా భద్రంగా కాపాడా లన్నది, ఒకవేళ పుట్టినా వాటిని పూర్తిగా నివారించగలగాలన్నది. ఈ ఆదేశాలు, నిర్దేశాలను ఈ సూరాలో అవి అవతరించిన క్రమంలోనే మేము క్లుప్తంగా ఇక్కడ పొందుపరుస్తున్నాము. దీని ద్వారా మానవ జీవిత సంస్కరణకు, నిర్మాణానికి తగిన మానసికావస్థలో సందర్భానుసారం,

ఖుర్ఆన్ ఏ విధంగా ఒకేసారి, చట్టపరంగా, నైతికంగా, సామాజికంగా అవసరమయిన పద్ధతులను ప్రతిపాదిస్తుందో గమనించవచ్చు.

1. వ్యభిచారం ముందుగానే (నిసా సూరా : 15, 16లో) సామాజిక నేరంగా పరిగణించబడింది. ఇప్పుడు దాన్ని శిక్షార్హమయిన నేరంగా నిర్ణయించి 100 కొరడాదెబ్బలు శిక్షగా విధించడం జరిగింది.

2. దుర్వర్తనులయిన పురుషులను, స్త్రీలను సామాజికంగా వెలివేయాలని ఆదేశించడంతోపాటు, వారితో వైవాహిక సంబంధాలు పెట్టుకోరాదని విశ్వసించిన వారిని వారించటం జరిగింది.

3. ఎవరయినా ఇతరులపై వ్యభిచార నిందమోపి, నలుగురు సాక్షులను ప్రవేశపెట్టలేకపోతే వారికి 80 కొరడా దెబ్బల శిక్ష విధించడం జరిగింది.

4. భర్త, భార్యపైన నిందమోపినట్లయితే అతని కొరకు 'లిఆన్' విధానాన్ని నిర్ణయించడం జరిగింది.

5. హజ్రత్ ఆయిషాపై కపటులు మోపిన అబద్ధపు నిందను ఖండించడం జరిగింది. దానితోపాటు కళ్ళు మూసుకుని ప్రతి సౌజన్య వ్యక్తికి వ్యతిరేకంగా ఎటువంటి ఆరోపణ నయినా స్వీకరించరాదని, దాన్ని వ్యాపింపజేయడమూ కూడదని ఆదేశించడం జరిగింది. ఇలాంటి పుకార్లు వచ్చినప్పుడు వాటిని అణిచివేయాలి, నిరోధించాలి తప్ప వాటిని ఆ నోట ఈ నోట వ్యాపింప జేయరాదు. ఈ సందర్భంలో ఒక విషయం సూత్రప్రాయంగా బోధపరచడం జరిగింది; పరిశుద్ధుడయిన మనిషి సహచరి పరిశుద్ధురాలయిన మహిళే కాగలదని, దుర్వర్తనురాలయిన స్త్రీ పోకడలతో అతని నైజం కొన్ని రోజులు కూడా పొసగ జాలదని, యదార్థాన్ని బోధపరచడం జరిగింది. అదే పరిస్థితి పరిశుద్ధురాలయిన మహిళదని, ఆవిడ ఆత్మ, పరిశుద్ధుడయిన పురుషునితోనే అనుకూల పడగలదని, దుర్వర్తనుడయిన పురుషునితో అనుకూలించదని చెప్పబడింది. మీరు ప్రవక్తను ఎరిగిన వారే, ఆయన ఒక పరిశుద్ధుడయిన వ్యక్తి మాత్రమే కాదు, పరమపరిశుద్ధుడయిన వ్యక్తి. అలాంటప్పుడు ఒక దుర్వర్తనురాలయిన స్త్రీ ఆయన ప్రియాతి ప్రియమయిన సతీమణి కాగలదని మీ బుద్ధి ఎలా అంగీకరించింది? ఆచరణాత్మకంగా వ్యభిచారా నికి కూడా పాల్పడగలిగే స్త్రీ తన సాధారణ ప్రవర్తన రీత్యా ప్రవక్త లాంటి పరిశుద్ధ మానవునితో జీవితం గడపగలగటానికి యోగ్యమయినది కావడం సాధ్యమేనా? ఒక నీచుడయిన మనిషి హేయమయిన నింద ఒకరిపై మోపగా దాన్ని స్వీకరించడం అలా ఉంచి, అది సంభవం

కావచ్చు అని అనుకోవడానికి కూడా తగినది కాదు. కాస్త కళ్లు తెరచి చూడండి- నిందమోపే వాడెవడో, ఎవరిపైన నిందమోపుతున్నాడో.

6. ఎవరయితే హేయమయిన వదంతులు, నీచమయిన సమాచారాలు వ్యాపింపజేస్తారో, ముస్లిమ్ సమాజంలో నీతి బాహ్యతను, అశ్లీలాన్ని ప్రచారంలోకి తేవాలని యత్నిస్తారో వారిని గురించి హెచ్చరిస్తూ అలాంటి వారు ప్రోత్సాహానికి కాదు, శిక్షకు అర్హులని చెప్పడం జరిగింది.

7. ముస్లిమ్ సమాజంలో పరస్పర సామూహిక సంబంధాల పునాది సద్భావనే కావాలన్న సూత్ర ప్రాయమయిన నియమం నిర్ధారించబడింది. దాని ప్రకారం ఏ వ్యక్తినయినా, అతడు అపరాధిగా సాక్ష్యాధారంతో రుజువు కానంతవరకు, నిరపరాధిగానే భావించాలి. ప్రతి వ్యక్తిని, అతడు నిరపరాధిగా రుజువు కానంత వరకు, అపరాధిగా భావించడం తప్పు, అది ఎంతమాత్రం సరయినది కాదు.

8. జనులు పరస్పరం పరుల ఇళ్ళల్లోకి నిర్మొహమాటంగా చొరబడరాదు, అనుమతి తీసుకుని మరీ ప్రవేశించాలని నిర్దేశించబడింది.

9. స్త్రీలు, పురుషులు చూపును క్రిందికి వ్రాల్చి మసలుకోవాలని ఆదేశించడం జరిగింది. ఇంకా ఒకరినొకరు చూపు నిలిపి చూసుకోవటంగాని, పొంచి పరికించి చూసుకోవటంగానీ నిషేధించబడింది.

10. స్త్రీలు తమ ఇండ్లల్లోనూ తలను, రొమ్మును కప్పిపెట్టుకోవాలని ఆదేశించబడింది.

11. స్త్రీలు తమ నిషిద్ధ (మహరమ్) బంధువులు, ఇంటి నౌకర్లు తప్ప ఇతరుల సమక్షంలోకి అలంకరించుకుని రాకూడదని నిర్బంధించడం జరిగింది.

12. స్త్రీలు బయటికి వెళ్ళినా తమ అలంకరణల్ని కప్పిపుచ్చుకునే వెళ్ళాలి. అంతేకాక ధ్వని చేసే ఆభరణాలు ధరించి కూడా బయటికి వెళ్ళకూడదని ఆదేశించడం జరిగింది.

13. సమాజంలో స్త్రీలయినా పురుషులయినా అవివాహితులుగా ఉండే విధానాన్ని అప్రియ మయినదిగా నిర్ణయించడం జరిగింది. అవివాహితులకు త్వరగా పెళ్ళి చేసివేయాలని, కడకు, బానిస స్త్రీలు, బానిస పురుషుల్ని సయితం అవివాహితులుగా ఉండనివ్వకూడదని ఆదేశించడం జరిగింది. ఒంటరి జీవితం నీతి బాహ్యతకు జన్మనిస్తుంది, నీతి బాహ్యతను పెంచుతుంది. ఒంటరి వారు మరేమీ చేయకపోయినా చెడు వార్తల్ని వ్యాపింప జేయడంలో శ్రద్ధ చూపడమయినా చేస్తారు.

14. బానిస స్త్రీ పురుషుల స్వేచ్ఛ స్వతంత్రతల కోసం 'ముకాతబత్' విధానాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. ఈ సందర్భంలో వారి యజమానులనే కాక ఇతరులను కూడా, 'ముకాతబ్' బానిస స్త్రీ పురుషులకు ధన సహాయం చేయాలని ఆదేశించడం జరిగింది.

15. బానిస స్త్రీల చేత వేశ్యావృత్తి చేయించడం నిషేధించబడింది. అరేబియాలో ఈ వృత్తి బానిసల చేతనే చేయించే సంప్రదాయముండేది. అందువల్ల దాన్ని నిషేధించడమంటే, వాస్తవానికి వేశ్యావృత్తిని సమూలంగా చట్టపరంగా నిషేధించడమన్నమాట.

16. గృహస్థ వాతావరణానికి సంబంధించిన నియమం ఏర్పరచడం జరిగింది. ఇంటి నౌకర్లు, ప్రాజ్ఞతరాని బాలబాలికలు ఏకాంత సమయాల్లో (అంటే తెల్లవారు ఝామున, మధ్యాహ్నం వేళ, రాత్రిళ్ళల్లో) ఇంటిలోని స్త్రీ పురుషుల గదుల్లోకి అకస్మాత్తుగా ప్రవేశించరాదని కట్టడి చేయడం జరిగింది. ఇంటి సంతానానికి కూడా అనుమతి తీసుకుని ప్రవేశించే అలవాటు చేయించాలని ఆదేశించటం జరిగింది.

17. వృద్ధ స్త్రీలకు, తమ ఇండ్లల్లో తలపైని పైట తీసి పెట్టడం తప్పు కాదని రాయితీ ప్రకటించబడింది. అయితే (బాగా సింగారించుకుని కనబడే) తబర్రుజ్‌కు దూరంగా మెలగమని ఆదేశించడం జరిగింది. వృద్ధాప్యంలోనూ ఓణీలు/పైటలు వేసుకుని ఉంటేనే మంచిదని వారికి ఉపదేశించడమూ జరిగింది.

18. గ్రుడ్డివాడు, కుంటివాడు, అవిటివాడు, వ్యాధిగ్రస్తుడు - వీరికి ఒక రాయితీ ఇవ్వబడింది. వారు ఎవరి ఇంట నయినా ఏదయినా తినే పదార్థం అనుమతి లేకుండా తిన్నా అది దొంగతనంగా, విశ్వాసఘాతుకంగా పరిగణించరాదు. అలాంటి వారిని పట్టుకోరాదు.

19. దగ్గరి బంధువులు, మొగమాటంలేని స్నేహితులకు ప్రత్యేకమయిన హక్కునివ్వడం జరిగింది. వారు ఒండొకరి ఇంట అనుమతి లేకుండా కూడా భోజనం చేయవచ్చు, అది వారు తమ ఇండ్లల్లో భోజనం చేసినట్లే పరిగణింపబడుతుంది. ఈ విధంగా సమాజంలో వ్యక్తుల్ని పరస్పరం దగ్గర చేర్చడం, తద్వారా వారి మధ్య మొహమాటపు దూరాలను తొలగించడం జరిగింది. అలా వారి మధ్య ప్రేమానురాగాలు పెంపొందుతాయని, పరస్పరం సాన్నిహిత్యం, అభిమానం, దగ్గరి సంబంధాలు ఏర్పడతాయని ఆశించడం జరిగింది; వారి మధ్య ఏవయినా విభేదాలుంటే అవి దూరం కావాలని, ఇంకా కల్లోల జనకుడు ఎవడూ వారిలో వేర్పాటు ఉపద్రవం సృష్టించరాదని కోరుకోవడం జరిగింది.

ఈ నిర్దేశాలతోపాటు కపటులు, విశ్వాసులకు చెందిన ప్రస్ఫుటమయిన సంకేతాలేమిటో తెలుపడం జరిగింది. వాటివల్ల సమాజంలో విశుద్ధ విశ్వాసులెవరో, కపటులెవరో తెలుసు

కోవడం ప్రతి ముస్లిమ్‌కు సుసాధ్యమయింది. మరో వైపున ముస్లిముల సంఘటిత వ్యవస్థను క్రమశిక్షణ రీత్యా మరింత కట్టుదిట్టం చేయడం జరిగింది. దానిగ్గాను మరిన్ని నియమాలు కొన్ని చేయబడ్డాయి. అలా దాని శక్తి మరింత పటిష్టం అయ్యేలా చేయడం జరిగింది. దానివల్లనే తిరస్కారులు, కపటులు ఆగ్రహం చెంది కల్లోలాలు సృష్టిస్తున్నారు.

ఈ మొత్తం చర్చలో గమనార్హమయిన విషయం ఏమిటంటే లజ్జాకరమయిన, అసభ్యకర మయిన దాడులకు ప్రతిగా జనించవలసిన వెగటు వచనాలు ఈ పూర్తి సూరాలో ఎక్కడా కానరావు. ఒకవైపున ఈ సూరా అవతరించిన ఆనాటి పరిస్థితిని చూడండి, మరోవైపున సూరాలోని చర్చనీయాంశాలను, మాట తీరును గమనించండి. ఇంతగా రెచ్చగొట్టే పరిస్థితులలో ఎంత శాంతంగా చట్టనిర్మాణం జరుగుతోందో చూడండి. సంస్కరణాత్మక ఆదేశాల్విబడుతున్నాయి; విజ్ఞతాపూర్వకమయిన ఉపదేశాలు చేయబడుతున్నాయి, శిక్షణ, బోధన, హితవు గరిపే బాధ్యత పూర్తిగా నిర్వర్తించబడుతోంది. దీనివల్ల మనకు లభించే గుణపాఠం ఏమిటంటే, ఉపద్రవాలు, విపత్తులకు ప్రతిగా, అత్యంత కఠోరమయిన రెచ్చగొట్టే సందర్భాలలోనూ ప్రశాంతంగా, వివేచనతో, విశాలహృదయంతో, విజ్ఞతలతో మెలగాలి. అంత మాత్రమే కాదు, ఈ వచనాలు (దివ్యఖుర్ఆన్ గ్రంథం) మహనీయ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లమ్) స్వయంగా రచించినవి అసలే కాదు, ఇవి ఎంతో మహోన్నత వ్యక్తిత్వం అవతరింపజేసినవని తెలుస్తోంది. ఇంకా ఆయన ఎంతో ఉన్నత స్థాయినుంచి మానవ పరిస్థితుల్ని, వ్యవహారాలను గమనిస్తున్నాడని, ఈ పరిస్థితు లకు, వ్యవహారాలకు తన వ్యక్తిత్వాన్ని అప్రభావితంగా, అతీతంగా ఉంచుతూ స్వచ్ఛమయిన మార్గబోధన, మార్గనిర్దేశనా బాధ్యతల్ని నిర్వహిస్తున్నాడని కూడా తెలుస్తోంది. ఇవి ప్రవక్త (స) రచించిన వచనాలయితే, ఆయన అత్యుత్తమ, అత్యున్నత, అత్యంత సువిశాల దృష్టి కలవారయినప్పటికీ, స్వయంగా తన మానాభిమానాలపైన నీచమయిన దాడుల మాట విని ఒక సౌజన్య శీలుడయిన వ్యక్తి భావనల్లో అనివార్యంగా జనించే సహజమయిన వెగటు ప్రభావం కొంతయినా ఈ వచనాల్లో తప్పక కానవచ్చేది.

رکوعاتہا ۹ (۱۰۲) سُوْرَةُ النُّوْرِ مَدَنِيَّةٌ (۲۴) اٰیاتہا ۶۴

بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ

سُوۡرَةٌ اَنۡزَلۡنٰهَا وَفَرَضۡنٰهَا وَاَنۡزَلۡنَا فِيۡهَاۤ اٰيٰتٍۢ بَيِّنٰتٍ لَّعَلَّكُمۡ تَذَكَّرُوۡنَ ①

64 ఆయత్‌లు	24. అన్ నూర్	మదీనా అవతరణ	9 రుకూలు

అపార కృపాశీలుడు, పరమ కరుణామయుడు, అల్లాహ్ పేరుతో

1 ఇదొక సూరా, దీన్ని మేము అవతరింపజేశాము; దీన్ని మేము విధిగా నిర్ణయించాము; ఇందులో మేము అతిస్పష్టమయిన బోధనలు అవతరింపజేశాము,[1] మీరు పాఠం గ్రహిస్తారేమోనని.

1. ఈ వాక్యాలన్నింటిలో "మేము" అన్న దాన్ని నొక్కి చెప్పడం జరిగింది. అంటే దీన్ని అవతరింపజేసింది ఇంకెవరో కాదు, "మేమే." అందువల్ల దాన్ని ఏదో అశక్తుడయిన ఉపదేశకుని వచనాలని, ఏదో ఆషామాషీ విషయంగా భావించకండి. మీకు తెలుసా, దీన్ని అవతరింపజేసేవాడు ఎవడో - ఆయన అధీనంలోనే మీ ప్రాణాలు, మీ భాగ్యరేఖలూ ఉన్నాయి. ఆయన పట్టు నుండి మీరు చచ్చినా తప్పించుకోలేరు.

రెండవ వాక్యంలో తెలుపడం జరిగింది, ఈ సూరాలో సెలవిచ్చిన విషయాలు కేవలం 'సిఫారసులు' కావు, మీకు ఇష్టమయితే అంగీకరించడానికీ కాకపోతే మానుకుని, ఇచ్చవచ్చినట్లు నడుచుకోడానికి. ఇవి ఖచ్చితమయిన ఆదేశాలు, వీటిని అనుసరించడం తప్పనిసరి. మీరు విశ్వాసులు, ముస్లిములే అయితే వీటికనుగుణంగా ఆచరించడం మీ విధి.

మూడవ వాక్యంలో చెప్పిన విషయాలు: ఈ సూరాలో ఇస్తున్న నిర్దేశాలలో ఎలాంటి అస్పష్టత లేదు. అతి స్పష్టంగా అతి వివరంగా ఇచ్చే నిర్దేశాలు. వీటిలో దేన్ని గురించి కూడా, ఫలానా విషయం మాకు అసలు బోధపడలేదు మేమెలా ఆచరించేది? అని మీరు సాకులు చెప్పలేరు.

ఇది ఈ శుభకరమయిన ఫర్మానాకు ఉపోద్ఘాతం (Preamble) లాంటిది. దీని తరువాత ఆదేశాలు ప్రారంభమవుతాయి. ఈ ఉపోద్ఘాతం భావప్రకటనా శైలి వల్లనే ఒక విషయం తెలిసిపోతుంది, నూర్ సూరాలోని ఆదేశాలకు పరమప్రభువు అల్లాహ్ ఎంతో ప్రాముఖ్యాన్నిచ్చి అందజేస్తున్నాడని. ఆదేశాలనిచ్చే మరే సూరా ఉపోద్ఘాతం కూడా ఇంత బలోపేతంగా లేదు.

اَلزَّانِيَةُ وَالزَّانِيْ فَاجْلِدُوْا كُلَّ وَاحِدٍ مِّنْهُمَا مِائَةَ جَلْدَةٍ ۪ وَّلَا تَاْخُذْكُمْ بِهِمَا رَاْفَةٌ فِيْ دِيْنِ اللّٰهِ اِنْ كُنْتُمْ تُؤْمِنُوْنَ بِاللّٰهِ وَالْيَوْمِ الْاٰخِرِ ۚ وَلْيَشْهَدْ عَذَابَهُمَا طَآئِفَةٌ مِّنَ الْمُؤْمِنِيْنَ ﴿۲﴾

2 వ్యభిచరించిన స్త్రీ, వ్యభిచరించిన పురుషుడు, ఇద్దరిలో చెరొకరికి వంద కొరడా దెబ్బలు వేయండి.[2] వారిని కనికరించే భావం అల్లాహ్ ధర్మం వ్యవహారంలో మిమ్మల్ని అడ్డుకోరాదు – మీరు పరమ ప్రభువు అల్లాహ్‌ను, అంతిమ దినాన్నీ విశ్వసించే వారే అయితే.[3] మరి వారిని శిక్షించే సందర్భాన విశ్వసించిన వారి ఒక వర్గం హాజరయి ఉండాలి.[4]

2. ఈ విషయానికి సంబంధించిన అనేక చట్టపరమయిన, నైతికమయిన, చారిత్రకమయిన కోణాల విశదీకరణ అవసరం. వాటిని సవివరంగా పరిశీలించకపోతే నేటి కాలంలో ఎవరికయినా ఈ దైవాదేశాలను అర్థం చేసుకోవడం చాలా కష్టం. అందువల్ల దిగువన మేము దాని భిన్న కోణాలను ఒక క్రమంలో తేటతెల్లపరిచే ప్రయత్నం చేస్తున్నాము.

(1) వ్యభిచారం అన్న దానికి సర్వసాధారణ నిర్వచనం ప్రతి వ్యక్తికీ తెలుసు. అది, "ఒక పురుషుడు, ఒక స్త్రీ, తమ మధ్య ధర్మబద్ధమయిన భార్యాభర్తల సంబంధం ఏర్పడకుండానే పరస్పరం రతిక్రీడలో పాల్గొనడం." ఈ చేష్ట నైతికంగా చెడు, ధార్మికంగా పాపం, సామాజికంగా అసహ్యకరం, అభ్యంతరకరం కావడం పట్ల అత్యంత ప్రాచీన కాలం నుండి నేటి వరకు సకల మానవసమాజాలు ఏకాభిప్రాయం కలిగి ఉన్నాయి. తమ బుద్ధిని మనోకాంక్షల అధీనం చేసివేసిన వారు, లేదా మతిభ్రమించి కల్పించుకున్న దాన్ని, తత్వంగా ఫిలాసఫీగా భావించినవారు తప్ప మరెవరూ ఇంత వరకు దీని విషయంలో విభేదించలేదు. ఈ విశ్వజనీన ఏకీభావానికి కారణం, స్వయాన మానవ నైజం వ్యభిచారం నిషిద్ధమవ్వాలని అభిలషిస్తుంది. మానవాళి మనుగడ, మానవ నాగరికత స్థాపన, ఈ రెండూ ఒక విషయంపైనే ఆధారభూతమయి ఉన్నాయి. స్త్రీ పురుషులు కేవలం ఆనందం, రసాస్వాదనల కొరకు సంయోగం చెంది వేరుపడి పోవడానికి స్వేచ్ఛ కలిగి ఉండరాదు. ప్రతి జత మధ్య ఏర్పడే సంబంధం శాశ్వతమయిన, పటిష్ఠమయిన విశ్వసనీయతతో చేసుకున్న ప్రమాణానికి కట్టుబడి నెలకొనాలి. అది సమాజంలో సర్వసామాన్యంగా తెలిసినదీ, ప్రసిద్ధమయినదీ ఇంకా సమాజం పక్షాన హామీ పొందినదయి ఉండాలి. ఇది లేనిది మానవ సంతతి ఒక్కనాటికీ కొనసాగజాలదు.

కారణం ఏమిటంటే, మానవ శిశువు తన మనుగడకూ మానవునిగా తన పెరుగుదలకూ ఎన్నో ఏళ్ళ ఆర్ద్రమయిన సంరక్షణ, సుశిక్షణల అవసరం కలిగి ఉంటుంది. ఆ పిల్లవాని ఉనికికి మూలమయిన పురుషుడు స్త్రీకి తోడ్పాటు అందజేయకపోతే కేవలం స్త్రీ ఒంటరిగా ఈ భారాన్ని మోయడానికి ఎన్నడూ సిద్ధపడజాలదు. అలాగే ఆ ఒప్పందం లేనిదే మానవ నాగరికత కూడా మనజాలదు. అసలు నాగరికత, ఒక పురుషుడు, ఒక స్త్రీ కలిసి జీవించడంతోటే మొదలవుతుంది. అప్పుడే ఒక ఇల్లు, కుటుంబం ఉనికిలోకి వస్తాయి, తరువాత కుటుంబాల మధ్య బంధుత్వాలు, సంబంధాలు ఏర్పడటంతో సమాజం పుడుతుంది. స్త్రీ పురుషులు ఒక ఇంటినీ కుటుంబాన్నీ రూపొందించుకోవడాన్ని మానుకుని కేవలం ఆనందం, సుఖాస్వాదనల కోసం స్వేచ్ఛావిహారం చేస్తూ ఉంటే మానవులంతా చెల్లాచెదరయిపోతారు. సామూహిక జీవితపు మూలాలు తెగిపోతాయి. సంస్కృతీ నాగరికతల నిర్మాణానికి కావలసిన పునాదులే మిగులవు. ఈ కారణాల వల్ల స్త్రీ పురుషుల స్వేచ్ఛాయుత సంబంధం మానవ నైజానికి విరుద్ధమయినది - అది సర్వసాధారణంగా అందరికీ తెలిసినది, ప్రసిద్ధమయిన, గుర్తింపు పొందిన విశ్వసనీయతతో చేసుకున్న ఒప్పందం కాకపోతే మరీ హానికర మయినది. ఈ కారణాల వల్లనే ఇలాంటి సంబంధాన్ని మానవుడు అన్ని కాలాల్లోనూ, ఒక తీవ్రమయిన దోషంగా, మహానీతివిహీనమయినదిగా, మత పరిభాషలో ఒక ఘోరపాపంగా భావిస్తూ వచ్చాడు. ఇంకా ఈ కారణాల వల్లనే అన్ని కాలాల్లోనూ మానవ సమాజాలు వివాహ వ్యవస్థ అమలును సర్వసామాన్యం చేయడంతోపాటు, వ్యభిచారం దారి మూయడానికి కూడా ఏదో ఒక విధంగా తప్పనిసరిగా ప్రయత్నిస్తూనే వచ్చాయి. అయితే ఈ ప్రయత్నాలు ఆయా చట్టాలతో, ఆయా నైతిక, నాగరిక, ధార్మిక వ్యవస్థలలో విభిన్న విధాలుగా జరిగాయి. ఆ వ్యత్యా సానికి అసలు మూలం, వాస్తవంగా భిన్న సముదాయాలలో వ్యభిచారం పట్ల గల భావపర మయిన తేడాయే; వ్యభిచారం వల్ల మానవాళికి, నాగరికతకు కలిగే హానికి సంబంధించిన చైతన్యం వాటికి ఉన్న మేరకే ఆ తేడా ఏర్పడింది. ఆ చైతన్యం ఒక్కో చోట పల్చగా ఉంటే మరో చోట దట్టంగా ఉంది, ఇంకోచోట స్పష్టంగా ఉండగా మరోచోట ఇతర సమస్యలతో చిక్కుబడిపోయింది.

(2) వ్యభిచారం నిషిద్ధమన్న విషయంలో ఏకాభిప్రాయం ఏర్పడిన తరువాత భేదాభిప్రాయం పొడసూపిన అంశం అది నేరమేనా అన్న విషయం; అంటే అది చట్టం రీత్యా శిక్షార్హమయినదిగా పరిగణించాలా అనే విషయం. ఈ అంశం నుంచి ఇస్లామ్‌కు ఇతర మతాలు, శాసనాంగాలు చట్టాల మధ్య విభేదాలు తలెత్తుతాయి. మానవ ప్రకృతికి నైజానికి చేరువయిన సమాజాలు వ్యభిచారాన్ని అంటే స్త్రీ పురుషుల అక్రమ సంబంధాన్ని నిత్యం సూత్రప్రాయంగా ఒక నేరమని

నిర్ణయించాయి. దానికి కఠిన శిక్షల్ని ప్రతిపాదించాయి. అయితే మానవ సమాజాలను నాగరికత భ్రష్టుపట్టిస్తూ పోయినకొద్దీ ఈ వైఖరి ఉదారంగా మారడం మొదలయింది.

ఈ వ్యవహారంలో మొదట జరిగిన సాధారణమయిన పొరపాటు ఏమిటంటే 'కేవలం వ్యభిచారం' (Fornication)లోనూ "పరపత్నితో వ్యభిచారం" (Adultory) లోనూ వ్యత్యాసాన్ని పాటించి మొదటి దాన్ని అతి సాధారణ దోషంగాను, రెండవదాన్ని శిక్షార్హమయిన నేరంగానూ పరిగణించడం జరిగింది.

కేవలం వ్యభిచారం అన్న దానికి భావం విభిన్న చట్టాలు నిర్వచించిన దాని ప్రకారం, "ఒక పురుషుడు, వివాహితుడయినా అవివాహితుడయినా, ఏ పురుషునికీ భార్య కాని ఏ స్త్రీతోనయినా సంయోగం చెందడం." ఈ నిర్వచనంలో అసలు ఆధారం పురుషుని స్థితికాదు, స్త్రీ స్థితి. స్త్రీ భర్తృవిహీన అయినట్లయితే ఆమెతో సంయోగం కేవలం వ్యభిచారం మాత్రమే, వ్యభిచరించిన పురుషునికి భార్య ఉందా లేదా అన్నది అప్రస్తుతం. ప్రాచీన ఈజిప్ట్, బాబిలోనియా, అషూరు (అసీరియా), భారత దేశం చట్టాలలో ఈ తప్పునకు దండన చాలా తేలికయినది. ఇదే నియ మాన్ని గ్రీకు, రోమా దేశాలు అవలంబించాయి. చివరికి యూదులు కూడా దానికే ప్రభావితు లయ్యారు. బైబిల్ ప్రకారం ఇది చాలా చిన్నపాటి దోషం, దీనికి పురుషుడు కేవలం పరిహారంగా ధనం చెల్లించవలసి ఉంటుంది. నిర్గమకాండంలో దీనికి సంబంధించిన ఆదేశం ఈ పదాలలో ఉంది:

ఒకడు ప్రధానము చేయబడని ఒక కన్యకను మరులుకొల్పి ఆమెతో శయనించిన యెడల ఆమె నిమిత్తము ఓలి ఇచ్చి ఆమెను పెండ్లి చేసికొనవలెను. ఆమె తండ్రి ఆమెను వానికి ఇయ్యనొల్లని యెడల వాడు కన్యకల ఓలి చొప్పున సొమ్ము చెల్లింపవలెను. (22 :16,17)

ద్వితీయోపదేశకాండంలో ఇదే ఆదేశం వేరు పదాలలో వివరించబడింది. దానికి విశదీకరణగా అమ్మాయి తండ్రికి పురుషుని చేత "యేబది వెండి రూకలు" దండనగా చెల్లింపజెయ్యడం జరిగింది (22: 28, 29). అయితే ఎవరయినా పురోహితుని (Priest) కూతురుతో వ్యభిచరిస్తే అతనికి యూదు చట్టం ప్రకారం ఉరిశిక్ష పడుతుంది, ఆ అమ్మాయికి సజీవ దహన శిక్షపడు తుంది. (Everyman's Talmud, P 319, 320).

ఈ భావన హైందవ భావనకు ఎంతగా పోలి ఉందో గమనించడానికి మనుధర్మశాస్త్రాన్ని పోల్చి చూస్తే తెలుస్తుంది. దాని ప్రకారం:

ఎవరయినా తన కులంలోని కన్యతో ఆమె ఇష్టపూర్వకంగా వ్యభిచరిస్తే అతడు ఎలాంటి శిక్షకూ అర్హుడుకాడు. అమ్మాయి తండ్రి సమ్మతిస్తే అతనికి పరిహారం చెల్లించి పెళ్ళి

చేసుకోవాలి. కాని అమ్మాయి కులీనురాలయి పురుషుడు అల్పకులస్థుడయినట్లయితే అమ్మాయిని ఇంటినుండి గెంటి వేయాలి. పురుషునికి మర్మాంగాల విచ్ఛేదన శిక్ష వెయ్యాలి.

(అధ్యాయం 8 : శ్లోకాలు 365, 366). అమ్మాయి బ్రాహ్మణి అయినట్లయితే ఈ శిక్షను సజీవ దహన శిక్షగా మార్చి వేయవచ్చు. (శ్లో:377)

వాస్తవంగా ఈ చట్టాలన్నింటిలోనూ పరపత్నితో జరిగే వ్యభిచారమే నిజమయిన పెద్ద నేరం, అంటే ఒక వ్యక్తి (వివాహితుడయినా అవివాహితుడయినా) మరో పురుషుని భార్య అయిన స్త్రీతో కలవడం అన్నమాట. ఈ చేష్ట నేరం అవడానికి ప్రాతిపదిక, స్త్రీ పురుషులు వ్యభిచారానికి పాల్పడ్డారన్నది కాదు, వారిద్దరూ కలిసి మరో వ్యక్తిని తనకు చెందని పిల్లవాణ్ణి పోషించవలసి వచ్చే ప్రమాదానికి గురి చేశారన్నది. అంటే అపరాధానికి మూలం వ్యభిచారం కాదు, వంశావళి సమ్మిశ్రమమయి కలుషితమయ్యే ప్రమాదం, ఒకరి సంతానం మరొకరి ఖర్చుతో పెరగడం, ఇంకా అతని వారసత్వం పొందడం అసలు నేరానికి ఆధారం అన్న మాట. దీని కారణంగానే ఆ స్త్రీ పురుషులిరువురూ నేరస్థులుగా నిర్ధారించబడతారు. ఈజిప్ట్‌లో దీనికి శిక్ష పురుషుణ్ణి కర్రలతో బాగా బాదడం, స్త్రీ ముక్కు కోసివేయడం. దాదాపు ఇలాంటి శిక్షలపైనే బాబిలోనియా, అసీరియా, ప్రాచీన ఈరాన్‌లోనూ అమలు జరిగేది. హైందవులలో దీనికి శిక్ష, స్త్రీని కుక్కల చేత చీల్పింపజేయడం, పురుషుణ్ణి మండే ఇనుప మంచం మీద పరుండబెట్టి నలువైపులా మంటలు పెట్టడం. గ్రీకులోను, రోములోను తొలుత, పురుషుడు తన భార్యతో ఎవరయినా వ్యభిచరిస్తూ ఉండగా చూస్తే అతన్ని చంపివేసే లేదా కావాలంటే ధనపరిహారం పుచ్చుకుని వదలిపెట్టే హక్కు అతనికి ఉండేది. ఆ తరువాత క్రీ.పూ. మొదటి శతాబ్దిలో ఆగస్టస్ చక్రవర్తి చేసిన చట్టం ప్రకారం వ్యభిచారి ఆస్తిలో సగం జప్తు చేసుకుని అతన్ని దేశ బహిష్కరణకు గురిచేయాలి. స్త్రీకి, స్త్రీధనం సగం రద్దుపరచి, ఆమె ఆస్తిలో 1/3వ వంతు జప్తు చేసుకుని ఆమెను కూడా దేశంలోని సుదూర ప్రాంతానికి పంపించివేయాలి. కాన్‌స్టంటైన్ ఈ చట్టాన్ని మార్చి స్త్రీ పురుషులిరువురికీ మరణదండన విధించాడు. లియో (Leo), మార్సియన్ (Marcian)ల కాలంలో ఈ శిక్షను యావజ్జీవ కారాగార శిక్షగా మార్చివేయడం జరిగింది. ఆ తరువాత జస్టీనియన్ చక్రవర్తి అందులో మరింత రాయితీ కల్పించి ఒక నియమం చేశాడు, స్త్రీని కొరడాతో బాది ఏదయినా సన్యాసి ఆశ్రమంలో పడవేయాలి, ఆమె భర్త ఇష్టపడితే రెండేళ్ళ లోపున ఆమెను అక్కడి నుండి విడుదల చేయించుకునేందుకు లేదా యావజ్జీవితం అక్కడే పడి ఉండనిచ్చేందుకు అతనికి అధికారం ఇవ్వాలి.

యూదు చట్టంలో పరపత్నితో వ్యభిచరించిన దానికి సంబంధించిన ఆదేశాలు ఇలా ఉన్నాయి: ఒకనికి ప్రధానము చేయబడిన దాసి, వెలయిచ్చి విమోచింపబడకుండగానేమి ఊరక

విడిపింప బడకుండగానేమి ఒకడు దానితో శయనించి వీర్య స్ఖలనము చేసిన యెడల వారిని శిక్షింపవలెను. అది విడిపింపబడలేదు గనుక వారికి మరణ శిక్ష విధింపకూడదు. (లేవీయకాండము:19 : 20)

పరుని భార్యతో వ్యభిచరించినవానికి, అనగా తన పొరుగువాని భార్యతో వ్యభిచరించిన వానికిని ఆ వ్యభిచారిణికిని మరణశిక్ష విధింపవలెను. (లేవీయ : 20 : 10)

ఒకడు మగనాలితో శయనించుచుండగా కనబడిన యెడల వారిద్దరు, అనగా ఆ స్త్రీతో శయనించిన పురుషుడును ఆ స్త్రీయును చంపబడవలెను. (ద్వితీయోపదేశ : 22 : 22)

కన్యకయైన చిన్నది ప్రధానము చేయబడిన తరువాత ఒకడు ఊరిలో ఆమెను కలిసికొని ఆమెతో శయనించిన యెడల ఆ ఊరి గవిని యొద్దకు వారిద్దరిని తీసుకొని వచ్చి, ఆ చిన్నది ఊరిలో కేకలు వేయక యున్నందున ఆమెను, తన పొరుగువాని భార్యను అవమానపరచినందున ఆ మనుష్యుని, రాళ్ళతో చావగొట్టవలెను... ఒకడు ప్రధానము చేయబడిన చిన్న దానిని పొలములో కలిసికొనినప్పుడు ఆ మనుష్యుడు ఆమెను బలిమిని పట్టి ఆమెతో శయనించిన యెడల ఆమెతో శయినించిన మనుష్యుడు మాత్రమే చావవలెను. ఆ చిన్నదానినేమియు చేయకూడదు. (ద్వితియోపదేశ : 22 : 23-26)

కాని హజ్రత్ ఈసా (అ) కాలానికి చాలా ముందే యూదు పండితులు, ధర్మవేత్తలు, నాయకులు, సామాన్యులు అందరూ ఈ చట్టాన్ని ఆచరణ్మాతకంగా రద్దుచేసి వేశారు. బైబిల్లో ఇదే వ్రాసి ఉంది, దీన్నే దైవాదేశంగా భావించే వారు, కాని ఆచరణాత్మకంగా దీన్ని అమలు జరిపేందుకు ఎవ్వరూ సిద్ధంగా లేరు. కడకు యూదుల చరిత్రలో ఈ ఆదేశాన్ని ఎప్పుడయినా అమలుపరచినట్లు ఒక్క దృష్టాంతమూ కానరాదు. మహనీయ ఈసా (అ) సత్యసందేశాన్ని అందజేస్తూ ఉద్యమించినప్పుడు యూదు పండితులు ఈ వెల్లువను ఆపే మరే ఉపాయమూ ఫలవంతం కాకపోవడం గమనించి ఒక ఎత్తుగడగా, ఒక వ్యభిచారిణిని ఆయన వద్దకు పట్టుకువచ్చారు. ఈమెకు తీర్పునివ్వండని అడిగారు (యోహాను : 8:1-11). దీనిద్వారా హజ్రత్ ఈసా(అ)కు నుయ్యిలోనో గొయ్యిలోనో రెంటిలో ఏదో ఒక దానిలో దుముకడం తప్ప గత్యంతరంలేని పరిస్థితి కల్పించాలన్నది వారి ఉద్దేశ్యం. ఆయన రాళ్ళు కొట్టే శిక్ష తప్ప మరే శిక్షనయినా ప్రతిపాదిస్తే, ఈయన ఓ విచిత్రమయిన దైవ ప్రవక్త విచ్చేశారండి, ఈ మహనీయుడు ప్రపంచ ప్రయోజనాల కారణంగానే దైవశాసనాన్ని మార్చివేస్తున్నాడు అంటూ ఈయన్ని అప్రతిష్టపాలు చేద్దామనుకున్నారు. అలాకాక ఆయన రాళ్ళు కొట్టే శిక్ష విధిస్తే ఆయన్ని ఒక వైపున రోమను శాసనంతో ఘర్షణపడేలా చేయాలి, మరో వైపున జాతి ప్రజలను సయితం "ఇంకా నమ్మండి ఈ ప్రవక్తగారిని, ఇక చూసుకోండి. తౌరాత్లోని

షరీఅత్ యావత్తు మీ వీపుల మీద, మీ ప్రాణాల మీద కొరడా అయి వర్షిస్తుంది" అని పురికొలపాలి అనుకున్నారు. కాని హజ్రత్ ఈసా ఒక్క మాటతో వారి పన్నాగాన్ని వమ్ముచేసి వారి మీదికే తోసి వేశారు. మీలో స్వయంగా పరిశుద్ధులయిన వారు ముందుకు వచ్చి ఈమెని రాళ్ళతో కొట్టండి అని ఆయన సెలవిచ్చారు. ఇది వినగానే ధర్మవేత్తల (పరిసయ్యుల) మంద చెల్లా చెదరయిపోయింది. ఒక్కడొక్కడే ముఖం చాటేసుకుని జారుకున్నాడు. ధర్మశాస్త్రవేత్తల నైతిక స్థితి పూర్తిగా బట్టబయలయిపోయింది. తరువాత ఆ స్త్రీ ఒంటరిగానే మిగిలిపోగా ఆయన ఆమెకు సద్బోధ చేశారు, పశ్చాత్తాపం చెందేలా చేసి పంపివేశారు. ఎందుకంటే ఆ కేసు తీర్పు చేయడానికి ఆయన న్యాయమూర్తి కాదు, ఆ నేరానికి ఎటువంటి సాక్ష్యాధారమూ ఏర్పడలేదు, దైవశాసనాంగాన్ని అమలు జరిపేందుకు ఇస్లామీయ ప్రభుత్వమూ అక్కడ లేదు.

హజ్రత్ ఈసాకు సంభవించిన ఈ సంఘటన ద్వారాను, విభిన్న సందర్భాలలో ఆయన సెలవిచ్చిన విభిన్న సూక్తుల ద్వారాను క్రైస్తవులు తప్పుడు అన్వయాన్ని గ్రహించి వ్యభిచార నేరానికి సంబంధించిన మరో భావనను ఏర్పరచుకున్నారు. వీరి దృష్టిలో, అవివాహితుడయిన పురుషుడు, అవివాహితురాలయిన స్త్రీతో వ్యభిచరిస్తే ఇది పాపమే కాని అది శిక్షార్హమయిన నేరం కాదు. కాని ఈ చర్యలో ఏ ఒక్కరయినా, స్త్రీ అయినా పురుషుడయినా వివాహితులయి ఉంటే లేదా ఇద్దరూ వివాహితులయితే ఇది నేరమవుతుంది. అయితే దీన్ని నేరంగా చేసిన అంశం కేవలం వ్యభిచారం కాదు, "ప్రమాణభంగం". వీరి దృష్టిలో ఎవరయినా సరే వివాహితులయి వ్యభిచారానికి పాల్పడితే, వారు వివాహ సందర్భంలో బలిపీఠం సమక్షంలో, పాదిరీ మధ్యవర్తిత్వంతో, తన భార్య లేదా భర్తతో చేసిన విశ్వసనీయతా ప్రమాణాన్ని భంగపరచినందుకు నేరస్థులు. కాని ఈ నేరానికి శిక్ష, వ్యభిచారి అయిన తన భర్తకు వ్యతిరేకంగా అతని భార్య విశ్వాసఘాతుకపు దావా వేసి వేర్పాటు డిక్రీ (Decree) సంపాదించుకోవాలి. అలాగే వ్యభిచారిణి అయిన స్త్రీ భర్త ఒక వైపున తన భార్యకు వ్యతిరేకంగా దావా వేసి వేర్పాటు డిక్రీ సంపాదించాలి, మరోవైపున తన భార్యను చెరచిన పురుషుని నుండి పరిహారం వసూలు చేసే హక్కునూ పొందాలి. క్రైస్తవ చట్టం వివాహిత వ్యభిచారులూ వ్యభిచారిణులకు విధించే శిక్ష ఇదే తప్ప మరొకటిలేదు. ఘోరం ఏమిటంటే, ఈ శిక్ష కూడా రెండు వైపులా పదునున్న కత్తి. ఒకవేళ ఒక స్త్రీ తన భర్తకు ప్రతిగా 'విశ్వాస ఘాతుకం' దావా వేసి వేర్పాటు డిక్రీ సంపాదించినట్లయితే ఆ విశ్వాస ఘాతుకుడయిన భర్త నుండి విముక్తి అయితే లభిస్తుంది కాని క్రైస్తవ శాసనాంగం రీత్యా ఆమె తిరిగి జీవితాంతం రెండవ పెళ్ళి చేసుకోజాలదు. ఇదే గతి, తన భార్య మీద 'విశ్వాస ఘాతుకపు' దావా వేసి వేర్పాటు డిక్రీ సంపాదించిన పురుషుడికీ పడుతుంది, ఎందుకంటే క్రైస్తవ శాసనం అతనికీ

పునర్వివాహం చేసుకునే అధికారమివ్వదు. అంటే దంపతుల్లో ఎవరయినా సరే జీవితాంతం సన్యాసుల్లా జీవించదలిచిన వారు మాత్రమే తమ జీవిత భాగస్వామి పట్ల క్రైస్తవ న్యాయస్థానంలో విశ్వాసఘాతుకపు దావా వేయగలరన్న మాట.

ఆధునిక కాలపు పాశ్చాత్య చట్టాలను నేడు ముస్లిమ్ దేశాలు కూడా అనేకం అనుసరిస్తున్నాయి. ఆ చట్టాలు పైన పేర్కొన్న విభిన్న భావనల ఆధారంగా ఏర్పడినవే. వీరి దృష్టిలో వ్యభిచారం, ఒక మచ్చ, అనైతిక విధానం లేదా పాపం- ఏదయినా అది నేరం మటుకు కాదు. దాని ఏ విషయమయినా నేరంగా రూపొందించగలుగుతుందంటే అది బలాత్కారం ఒక్కటే, ఎదుటి వ్యక్తి అభీష్టానికి విరుద్ధంగా బలవంతాన ఆ వ్యక్తితో రతి జరిపితే అది నేరమవుతుంది. పోతే ఒక వివాహిత పురుషుడు వ్యభిచారానికి పాల్పడడం, ఒకవేళ అతని భార్యకు ఆక్షేపణీయం, నిందా కారణమయితే ఆవిడ కోరితే దాని సాక్ష్యాధారాన్ని చూపి విడాకులు పొందవచ్చు. అలాగే వ్యభిచరించినది వివాహిత స్త్రీ అయినట్లయితే ఆమె భర్తకు కేవలం ఆమెకు విరుద్ధంగానే కాక వ్యభిచరించిన పురుషునికి విరుద్ధంగా కూడా నిందను మోపే కారణం ఏర్పడుతుంది, అతడు ఇద్దరిపైనా దావా వేసి భార్య నుండి విడాకులు, వ్యభిచరించిన పురుషుని నుండి పరిహారం వసూలు చేయగలడు.

(3) ఇస్లామీయ శాసనం ఈ భావనలన్నింటికీ భిన్నంగా స్వయాన వ్యభిచారాన్నే శిక్షార్హమయిన నేరంగా పరిగణిస్తుంది. వివాహితులయి వ్యభిచరించడం దాని దృష్టిలో నేరంలోని తీవ్రతను మరింత పెంచుతుంది. అయితే అది, అపరాధి చేసిన ఒప్పందాన్ని ఉల్లంఘించినందుకు కాదు, లేదా ఇతరుని పడక మీద దాడిచేసినందుకూ కాదు, కాని తన కోర్కెల్ని నెరవేర్చుకునే ధర్మసమ్మతమయిన ఒక మార్గముండగా కూడా అక్రమ మార్గాన్ని అవలంబించినందుకు. ఇస్లామీయ శాసనం దాన్ని చూసే దృష్టికోణం ఏమిటంటే, ఈ చేష్టకు ఒకవేళ స్వేచ్ఛ లభించినట్లయితే ఒక వైపున మానవాళి మరోవైపున మానవ నాగరికత రెండూ సమసిపోతాయి. మానవ రాశి మనుగడకు, నాగరికత నిలుపుదలకు, రెంటికీ స్త్రీ పురుషుల కలయిక కేవలం చట్టబద్ధంగా, విశ్వసనీయ సంబంధాల వరకు పరిమితమయి ఉండటం అనివార్యమని అది భావిస్తుంది. అయితే దాన్ని పరిమితం చేయడం స్వేచ్ఛాయుత సంబంధాలకు కూడా అవకాశమున్నట్లయితే సాధ్యపడే విషయం కాదు. ఇల్లు, కుటుంబం వంటి బాధ్యతల భారం స్వీకరించకుండా జనానికి మనోకాంక్షల పరిపూర్తి చేసుకునే అవకాశాలున్నట్లయితే, ఈ కోర్కెల పరిపూర్తికి వారు తిరిగి ఆ మహాభారాన్ని మోసేందుకు సన్నద్ధులవుతారని ఆశించలేము. రైలులో టికెట్టు లేకుండా ప్రయాణించే స్వేచ్ఛ జనులకు ఉండగా రైలులో కూర్చునేందుకు టికెట్టుకొనాలన్న నిబంధన పెట్టడం ఎంత అర్థరహితమో ఇదీ అంతే. టికెట్టు నిబంధన అవసరమయినదయితే దాన్ని ప్రభావవంతం చేయడానికి టికెట్టు లేకుండా

ప్రయాణించడం నేరంగా పరిగణించవలసి ఉంటుంది. ఇంకా ఎవరయినా డబ్బులేని కారణంగా టిక్కెట్టు లేకుండా ప్రయాణిస్తే అతను తక్కువ స్థాయి అపరాధి, డబ్బుగలవాడయినప్పటికీ ఇలాంటి చేష్టకు పాల్పడితే నేరం మరింత తీవ్రతరమవుతుంది.

(4) మానవ సమాజాన్ని వ్యభిచార ప్రమాదం నుండి రక్షించడానికి ఇస్లాం కేవలం చట్టపరమయిన శిక్షాస్మృతి అస్త్రం మీదనే ఆధారపడదు, దానిగ్గాను విస్తృత స్థాయిలో, భారీ ఎత్తున సంస్కర ణాత్మకమయిన నివారణా ప్రధానమయిన చర్యలను కూడా తీసుకుంటుంది. ఈ చట్టపరమయిన శిక్షాస్మృతిని కేవలం చివరి సాధనంగానే ప్రతిపాదించింది. జనులు ఈ అపరాధాన్ని చేస్తూ ఉండాలని, రేయింబవళ్ళు వారిని కొరడా దెబ్బలతో శిక్షించడానికి మాటు కాచి చూస్తూ ఉండా లన్నది దాని ఉద్దేశ్యం కాదు. దాని ఉద్దేశ్యం, జనం ఈ పాపానికి పాల్పడకూడదన్నదే, దీని కారణంగా ఎవరికీ శిక్ష విధించే అవసరమే కలగకూడదన్నదే. ఇస్లామ్ మొదట మానవ ఆంతర్యాన్ని సంస్కరిస్తుంది, అగోచరజ్ఞానం గలవాడు, సర్వతోముఖ శక్తిశాలి అయిన దైవం పట్ల అతని హృదయంలో భీతిని పాదుకొలుపుతుంది, అతనికి పరలోక విచారణను గురించి స్పృహ కలగజేస్తుంది. మనిషి మరణించినప్పటికీ దాన్ని తప్పించుకోలేడన్న భావం జనింపజేస్తుంది. అతనిలో దైవశాసనాంగం పట్ల విధేయతా భావాన్ని సృజిస్తుంది, అది విశ్వాసం వల్ల జనించ వలసిన తప్పనిసరి ఆవశ్యకత అని బోధిస్తుంది. ఆపైన అతన్ని మాటిమాటికీ హెచ్చరిస్తూ ఉంటుంది, వ్యభిచారం, దుశ్శీలం అన్నవి పరమప్రభువు అల్లాహ్ అత్యంత కఠినంగా విచారణ జరిపే మహాపాతకాలని చెబుతూ ఉంటుంది. ఈ విషయం ఖుర్ఆన్ మొత్తాన అనేకచోట్ల మీ ముందుకు వస్తూ ఉంటుంది. ఇంతేకాక, అది మనిషికి నికాహ్ చేసుకునే సాధ్యమయినన్ని సౌలభ్యాలు సృష్టిస్తుంది. ఒక భార్య వల్ల తృప్తి చెందకపోతే నలుగురేసి భార్యలతో సక్రమమయిన రీతిలో సంబంధాలు కలిగిఉండే అవకాశాలనిస్తుంది. మనసులు కలవకపోతే పురుషునికి తలాక్ (విడాకులు), స్త్రీకి ఖులా సౌకర్యాలను కల్పిస్తుంది. పొత్తు కుదరకపోయిన పక్షంలో కుటుంబ పంచాయితీ మొదలుకుని ప్రభుత్వ న్యాయస్థానాల వరకు వెళ్ళే మార్గం తెరచిపెడుతుంది. తద్వారా సయోధ్య కుదరడమో లేదా దంపతులు ఒండొకరి నుండి స్వేచ్ఛపొంది తమ హృదయాలు కలిసే చోట పెళ్ళి చేసుకోవడమో జరుగుతుంది. ఇదంతా మీకు బకర, నిసా, తలాక్ సూరాలలో కానవస్తుంది. ఇదే నూర్ సూరాలో మీరు దీని తరువాతనే గమనిస్తారు, పురుషులయినా స్త్రీలయినా అవివాహితులుగా ఉండిపోవడాన్ని ఇష్టపడడం జరగలేదు. ఇలాంటి వారి పెళ్ళిళ్ళు చేసివెయ్యాలని స్పష్టంగా ఆదేశాలివ్వడం జరిగింది. కడకు బానిస స్త్రీ పురుషుల్ని సయితం ఒంటరిగా వదలిపెట్టరాదని ఆజ్ఞాపించడం జరిగింది. దాని మీదట ఇస్లాం, సమాజం నుండి వ్యభిచారానికి పురికొలిపే, దాన్ని ప్రేరేపించే, దానికి అవకాశాలు కల్పించగలిగే కారణాలన్నింటినీ అంతమొందిస్తుంది. వ్యభిచారానికి శిక్ష ప్రకటించడానికి ఒక సంవత్సరం పూర్వం అహ్జాబ్ సూరాలో స్త్రీలకు,

ఇంటి నుండి బయటికి బయలు దేరినట్లయితే దుప్పట్లు కప్పుకుని, కొంగు ముఖానికి అడ్డుగా వేసుకుని మరీ వెళ్ళాలని ఆదేశం ఇవ్వడం జరిగింది. ముస్లిమ్ మహిళలకు ప్రవక్త ఇల్లు ఆదర్శ గృహం. ఆ ఇంటి మహిళలను, ఇళ్ళల్లో హుందాగా, ప్రశాంతంగా కూర్చోవాలని, తమ అందచందాలను, అలంకరణలను ప్రదర్శించరాదని, బయటి పురుషులు వారి నుండి ఏదయినా తీసుకోవలసి వచ్చినా తెరచాటుగా తీసుకోవాలని నిర్దేశించడం జరిగింది. ఈ ఆదర్శం చూస్తూ చూస్తూ ఉండగానే విశ్వసించిన స్త్రీలందరిలో వ్యాపించింది. ఆ స్త్రీల దృష్టిలో అనుకరణీయులయినవారు, అజ్ఞానకాలపు, లజ్జా విహీనులయిన స్త్రీలు కాదు ప్రవక్త సతీమణులు, ఆయన కుమార్తెలు. ఈ విధంగా శిక్షాస్మృతి ప్రకారం శిక్షను నిర్ణయించే ముందు స్త్రీ పురుషుల స్వేచ్ఛ మిశ్రమ సామాజిక వ్యవస్థపై అంకుశం వేయడం జరిగింది; మహిళలు సింగారించుకుని బయటికి వెళ్ళటాన్ని కట్టడి చేయడం జరిగింది. వ్యభిచారానికి అవకాశాలు కల్పించే, దాన్ని సులభతరం చేసే కారణాలు, మార్గాల ద్వారాలు మూయ బడ్డాయి. ఇదంతా చేసి వ్యభిచారానికి శిక్ష్మాస్మృతి ప్రకారం శిక్ష విధించినప్పుడు దీనితోపాటు, ఇదే నూర్ సూరాలో అశ్లీల విషయాల ప్రాచుర్యాన్నీ నిరోధించడాన్ని మీరు గమనించగలరు. వేశ్యా వృత్తి (Prostitution)ని చట్టం రీత్యా నిషేధించడమూ జరిగింది; అలాగే స్త్రీ పురుషులపైన దుశ్చేష్టకు పాల్పడినట్లు నిరాధారమయిన నిందమోపడాన్ని, వాటి ప్రచారం చేయడాన్ని కూడా తీవ్రంగా పరిగణించి కఠిన శిక్ష ప్రతిపాదించడం జరిగింది. చూపు క్రిందికి వాల్చి ఉండాలన్న కట్టడి చేసి చూపులపైన కావలిపెట్టడమూ జరిగింది, ఆ విధంగా చూపుల కలయిక, సౌందర్య ఆరాధన, ఆ ఆరాధన ద్వారా ప్రణయకలాపాల వరకు పరిస్థితులు చేజారకుండా చూడటం జరిగింది; ఇటు స్త్రీలను కూడా ఆదేశించడం జరిగింది - వారు తమ ఇళ్ళల్లో నిషిద్ధ అనిషిద్ధ బంధువుల విచక్షణను పాటించాలని, అనిషిద్ధ వ్యక్తుల మధ్య సింగారించుకుని రాకూడదని చెప్పడం జరిగింది. దీనివల్ల ఇస్లామీయ వ్యవస్థలోని సంస్కరణా పథకాన్ని బాగా అర్థంచేసుకోవచ్చు. ఇందులో భాగంగానే వ్యభిచారానికి చట్టం రీత్యా శిక్ష విధించడం జరిగింది. ఈ శిక్ష నిర్ణయానికి కారణం ఏమిటంటే, సమస్త అంతర్గత, బహిర్గత సంస్కరణా చర్యల తరువాత కూడా ఎవరయినా దుష్ట మనస్కులు తమకు అందుబాటులో ఉన్న సక్రమమయిన అవకాశాలను వదలి అక్రమమయిన రీతిలోనే తమ మనోకాంక్షను నెరవేర్చుకోవాలని పట్టుబడితే వారి తోలు ఒలిచే ఏర్పాటు జరగాలి; ఒక్క దుష్టుడికి శిక్ష విధించి సమాజంలో ఇలాంటి దురాలోచనలు గల అనేక మందికి మానసికమయిన శస్త్ర చికిత్స చేసివెయ్యాలన్నది ఉద్దేశం. ఈ శిక్ష ఒక అపరాధికి జరగవలసిన శాస్తి మాత్రమే కాదు, ముస్లిమ్ సమాజం దుశ్శీలురికి వ్యాహ్యాళి స్థానం కాదు, అందులో రసికులు, రసికురాళ్ళు, నైతిక నియమాలన్నింటినీ ప్రక్కకు తోసిపెట్టి రుచులు జుర్రుకుంటూ తిరగడానికి ఎంతమాత్రం వీలులేదన్న క్రియాత్మక ప్రకటన కూడా ఉంది. ఈ దృక్కోణంతో

ఏ వ్యక్తి అయినా ఇస్లామ్ ప్రతిపాదించే సంస్కరణా పథకాన్ని అర్థం చేసుకుంటే, ఈ స్కీము మొత్తంలో ఏ ఒక్క అంశాన్ని కూడా దాని స్థానం నుంచి తొలగించ డానికి వీలులేదని, అందులో హెచ్చుతగ్గులు చేయడం సయితం సాధ్యం కావని సునాయాసంగా గ్రహించగలుగుతాడు. దీన్ని అర్థం చేసుకునే సామర్థ్యం లేకుండానే తానయి సంస్కర్తగా రూపొందినటువంటి ఏ అవివేకికో లేదా ఈ పథకాన్ని పరమ వివేచనాపరుడయిన ప్రభువు ఏ ఉద్దేశ్యంతో రూపొందించాడో దాన్నే మార్చి వెయ్యాలన్న సంకల్పమున్న దుష్టునికో తప్ప ఇందులో మార్పులు చేర్పులు చెయ్యాలన్న ఆలోచనరాదు.

(5) వ్యభిచారాన్ని శిక్షార్హమయిన చేష్టగానయితే హి.3వ సంవత్సరమే నిర్ణయించడం జరిగింది. కాని అప్పుడు ఇది "చట్టం రీత్యా నేరం" కాదు, దానికి రాజ్యమో లేదా పోలిసో, న్యాయస్థానమో చర్యతీసుకునే అవకాశం లేకపోయింది. అయితే అది ఒక "సామాజిక"మయిన లేదా "కుటుంబ" పరమయిన నేరంగా పరిగణించబడేది. దానికి కుటుంబ సభ్యులకే తమంతట తాము శిక్షించే అధికారముండేది. ఆదేశమేమిటంటే, ఒక పురుషుడు, ఒక స్త్రీతో వ్యభిచరిస్తూ ఉండగా చూసినట్లు నలుగురు సాక్షులు సాక్ష్యం ఇచ్చినట్లయితే, ఇద్దరినీ బాగా కొట్టాలి, స్త్రీని బందీగా పెట్టాలి. ఆ ఆదేశంతోపాటు 'మరో ఆదేశం' వచ్చేవరకు మాత్రమే ఇది చెల్లుతుందన్న విషయమూ, అసలు చట్టం తరువాత రానున్నదన్న విషయమూ సూచనప్రాయంగా తెలుపడం జరిగింది (చూడండి, ఖుర్ఆన్ అవగాహనం సం.2 : నిసా :15, 16; పాద సూచితో సహా). ఆ తరువాత రెండున్నర, మూడు సంవత్సరాలకు ఈ ఆదేశం ప్రస్తుత ఆయత్‌లో అవతరించింది, ఇది గత ఆదేశాన్ని రద్దుచేసి వ్యభిచారాన్ని చట్టపరంగా శిక్షార్హమయిన నేరం (Cognizable Offence)గా పరిగణించింది.

(6) ఈ ఆయత్‌లో వ్యభిచారానికి నిర్ణయించిన శిక్ష వాస్తవానికి "కేవలం వ్యభిచారానికి" శిక్ష మాత్రమే, వివాహితులయిన తరువాత వ్యభిచరించే వారి శిక్ష కాదు, అది ఇస్లామీయ శాసనం రీత్యా చాలా తీవ్రమయిన నేరం. ఈ విషయం స్వయాన ఖుర్ఆన్‌లో వచ్చిన ఓ సంకేతాన్ని బట్టి తెలుస్తోంది- అది ఇక్కడ అవివాహితులయినవారు పాల్గొన్న వ్యభిచారానికి శిక్షను ప్రస్తావిస్తోందని.

నిసా సూరాలో లోగడ ఇలా తెలుపడం జరిగింది:

మీ స్త్రీలలో దుశ్చేష్టకు పాల్పడే వారికి వ్యతిరేకంగా మీలోని నలుగురి సాక్ష్యం తీసుకోండి, నలుగురు సాక్ష్యమిచ్చినట్లయితే వారిని ఇండ్లల్లో నిర్బంధించండి; ఆ తరువాత వారికి చావన్నా రావాలి లేదా దైవం వారి కొరకు మరే మార్గమన్నా ఏర్పరచాలి. (నిసా:15)	وَالّٰتِیْ یَاْتِیْنَ الْفَاحِشَةَ مِنْ نِّسَآىِٕكُمْ فَاسْتَشْهِدُوْا عَلَیْهِنَّ اَرْبَعَةً مِّنْكُمْ ۚ فَاِنْ شَهِدُوْا فَاَمْسِكُوْهُنَّ فِی الْبُیُوْتِ حَتّٰی یَتَوَفّٰهُنَّ الْمَوْتُ اَوْ یَجْعَلَ اللّٰهُ لَهُنَّ سَبِیْلًا ۝

పిదప కొన్ని ఆయత్‌ల తర్వాత ఇలా సెలవీయడం జరిగింది:

وَمَنْ لَّمْ يَسْتَطِعْ مِنْكُمْ طَوْلًا اَنْ يَّنْكِحَ الْمُحْصَنٰتِ الْمُؤْمِنٰتِ فَمِنْ مَّا مَلَكَتْ اَيْمَانُكُمْ مِّنْ فَتَيٰتِكُمُ الْمُؤْمِنٰتِ ....
فَاِذَآ اُحْصِنَّ فَاِنْ اَتَيْنَ بِفَاحِشَةٍ فَعَلَيْهِنَّ نِصْفُ مَا عَلَى الْمُحْصَنٰتِ مِنَ الْعَذَابِ

మీలో ఎవరయితే ముస్లిమ్ కుటుంబ స్త్రీల (ముహ్‌సనాత్) ను నికాహ్ చేసుకునే స్తోమత లేనివాడో అతను మీ హస్తగతమయి ఉన్న విశ్వసించిన బానిస మహిళల్లో ఎవరినయినా నికాహ్ చేసుకోవడం అవసరం.... ఇక వారు నికాహ్ వలయంలో భద్రత పొందినప్పుడు, ఆ తరువాత కూడా ఏదయినా నీతిబాహ్యతకు పాల్పడితే వారికి (భద్రత పొందిన) కుటుంబ స్త్రీలకు విధించే శిక్షలో సగం పడుతుంది. (నిసా : 25)

ఈ ఆయత్‌లలో మొదటిదానిలో, వ్యభిచారిణులయిన స్త్రీలకు ప్రస్తుతానికి నిర్బంధించే ఆదేశమివ్వడం జరుగుతోంది, వారి కొరకు అల్లాహ్ తరువాత ఏదయినా మార్గాన్ని నిర్ణయిస్తాడు అనే ఆశ కల్పించబడింది. నిసా సూరాలోని పైన ప్రస్తావిత ఆయత్‌లో దేని వాగ్దానం చేయ బడిందో నూర్ సూరాలో వచ్చిన ఈ రెండవ ఆదేశం అదే అని దీనివల్ల తెలుస్తోంది. రెండవ ఆయత్‌లో వివాహిత బానిస స్త్రీ వ్యభిచారానికి పాల్పడిన పక్షంలో విధించవలసిన శిక్షను ప్రస్తావించడం జరిగింది. ఇక్కడ ఒకే ఆయత్‌లో ఒకే సందర్భంలో రెండు చోట్ల "ముహ్‌సనాత్" (రక్షిత స్త్రీలు) అనే పదప్రయోగం జరిగింది. అందువల్ల రెండు చోట్లనూ దానికి ఒకే అర్థం అన్న విషయం తప్పనిసరిగా అంగీకరించవలసి ఉంటుంది. ఆయత్ ప్రారంభంలో చూస్తే అక్కడ "రక్షిత స్త్రీలతో వివాహం చేసుకునే స్థోమతలేనివారు" అని చెప్పడం జరిగింది. దీని ఉద్దేశ్యం వివాహిత స్త్రీ అన్నది మాత్రం కాదన్న విషయం సుస్పష్టం. ఆమె ఒక స్వేచ్ఛాయుత కుటుంబానికి చెందిన అవివాహిత స్త్రీయే కాగలదు. ఆ తరువాత చివరి భాగంలో, బానిస స్త్రీ వివాహిత అయిన తరువాత వ్యభిచారానికి పాల్పడితే ఆమెకు రక్షిత స్త్రీకు ఈ నేరానికి విధించవలసిన శిక్షలో సగం విధించాలి అని వచ్చింది. వచనంలో పూర్వ సందర్భాన్ని గమనిస్తే, ఈ వాక్యంలోనూ ముహ్‌సనాత్ అన్న దానికి తొలి వాక్యంలోని అర్థమే వర్తిస్తుందని స్పష్టంగా తెలుస్తోంది. అంటే వివాహిత స్త్రీకాదు, స్వేచ్ఛాయుత కుటుంబానికి చెందిన రక్షిత అవివాహిత స్త్రీ అన్నమాట. ఈ విధంగా నిసా సూరాలోని ఈ రెండు ఆయత్‌లు కలసి ఒక సూచననిస్తు న్నాయి. అక్కడ వాగ్దానం చేయబడిన నూర్ సూరాలోని ఈ ఆదేశం, అవివాహిత వ్యక్తులు వ్యభిచారానికి పాల్పడినప్పుడు విధించే శిక్షను తెలుపుతోంది. (మరిన్ని వివరాలకు చూదండి ఖుర్ఆన్ అవగాహనం సం.2 : అన్‌నిసా:పాద సూచి 46)

(7) వివాహానంతర వ్యభిచారానికి శిక్ష ఏమిటో ఖుర్ఆన్ తెలుపదు. ఇది మనకు హదీసుల ద్వారా తెలుస్తోంది. అసంఖ్యాకమయిన ప్రామాణిక ఉల్లేఖనాల ద్వారా నిర్ధారిత మయిన విషయం ప్రకారం ప్రవక్త మహనీయులు (స) దీనికి శిక్ష రాళ్ళు రువ్వి చంపడం (రజ్మ్) అని నోటితో చెప్పడమే కాక ఆచరణాత్మకంగా ఆయన అనేక కేసుల్లో ఈ శిక్షనే అమలు జరిపారు కూడా. ఆయన తరువాత నలుగురు సన్మార్గగాములయిన ఖలీఫాలు కూడా తమతమ కాలాల్లో ఇదే శిక్షను విధించారు, ఇదే చట్టపరమయిన శిక్షగా మాటిమాటికీ ప్రకటించారు కూడా. సహచర మహనీయులు (సహాబా) అనుచరు (తాబియీన్)ల మధ్యన ఈ విషయంలో ఏకాభిప్రాయ ముండింది. తొలి రోజుల్లో ఇదొక నిరూపితమయిన షరీఅత్ ఆదేశమన్న విషయంలో ఎవరికయినా అనుమానమున్నట్లు అనుకోవడానికి ఏ ఒక్క వ్యక్తి చెప్పిన ఒక్క మాట కూడా ఎక్కడా కానరాదు. ఆ తరువాతి కాలాలన్నింటిలోనూ, దేశాలలోనూ ఇస్లామ్ ధర్మశాస్త్రవేత్తలు ఏకగ్రీవంగా ఇది నిర్ధారితమయిన సున్నత్ (ప్రవక్త సంప్రదాయం) అని అంగీకరించారు. ఇది సరయినదనడానికి ఎన్నో నిరంతరమయిన, బలమయిన సాక్ష్యాధారాలున్నాయి. వాటి సమక్షంలో ధర్మజ్ఞానం ఉన్న ఏ వ్యక్తీ దీనిని తిరస్కరించలేదు. ముస్లిమ్ సముదాయం చరిత్ర మొత్తంలో, ఖవారిజ్, మొ'తజిలా తప్ప ఎవ్వరూ దీనిని నిరాకరించలేదు. నిరాకరించినవారి వాదనలో కూడా, ప్రవక్త మహనీయుల (స) ద్వారానే ఆ ఆదేశం అందినట్లున్న నిరూపణల పట్ల ఏదయినా కొరతను, లోపాన్నీ వారు సూచించలేదు. వారు దాన్ని "ఖుర్ఆన్‌కు విరుద్ధం" అని భావించారు. ఇది వాస్తవానికి వారి ఖుర్ఆన్ అవగాహనాలోపం. వారు వాదించినది ఏమిటంటే ఖుర్ఆన్ కేవలం الزَّانِي وَالزَّانِيَةُ **"జానీ, వ జానియహ్"** (వ్యభిచారి, వ్యభిచారిణి) అన్న పదాలు మటుకే ప్రయోగించి దానికి శిక్షగా వంద కొరడా దెబ్బలు ప్రతిపాదిస్తుంది; అందువల్ల ఖుర్ఆన్ ప్రకారం, ఏ రకానికి చెందిన వ్యభిచారి అయినా, వ్యభిచారిణి అయినా ఇదే శిక్ష వర్తిస్తుంది; ఇందులో రక్షిత (వివాహబంధంలో రక్షిత) వ్యభిచారులను వేరు చేసి వారికి మరో శిక్షను ప్రతిపాదించడం దైవశాసనాన్ని ఉల్లంఘించ డమవుతుంది. కాని వారు యోచించని విషయం మరొకటి ఉంది. ఖుర్ఆన్‌లోని పదాలకున్న చట్టపరమయిన విలువే ప్రవక్త మహనీయులు (స) చేసిన వాటి విశదీకరణకు కూడా ఉందన్నది; అయితే అది ఆయన చేసినట్లు నిరూపితం కావాలి. ఖుర్ఆన్ ఇలాగే السَّارِقُ وَالسَّارِقَةُ **"అస్సారికు వస్సారిక"** (దొంగ పురుషుడు, దొంగ స్త్రీ) అన్న పదాలు మటుకే ప్రయోగించి చేతులు నరికే శిక్షను విధించింది. ఈ ఆదేశాన్ని ప్రవక్త మహనీయులు (స) చేసిన నిర్ధారితమయిన వివరణలతో బంధించకపోతే ఈ పదాల సర్వ సాధారణతలోని ఆవశ్యకత మరోలా పరిణమిస్తుంది. ఒక సూదిని, ఒక రేగిపండుని దొంగలించిన వాణ్ణి కూడా మీరు దొంగగా పరిగణించగలరు, అతడిని పట్టుకుని అతని చెయ్యి భుజం వరకు నరికివెయ్యనూ గలరు. మరో వైపున లక్షలాది రూపాయలను దొంగలించిన

వాడు పట్టుబడగానే 'నేను నా అంతర్యాన్ని సంస్కరించుకున్నాను, నేనిక దొంగతనం పట్ల పశ్చాత్తాపం చెంది దాన్ని మానివేస్తానని సంకల్పం చేసుకుంటున్నాను' అని అనగానే మీరు అతన్ని వదలి వెయ్యవలసిందే. ఎందుకంటే ఖుర్‌ఆన్, "అయితే దౌర్జన్యం జరిపిన తరువాత ఎవరు పశ్చాత్తాపం చెంది తనను సంస్కరిం చుకుంటారో అతని వైపునకు మళ్ళీ అల్లాహ్ కటాక్ష వీక్షణం మరలుతుంది" (అల్ మాఇద:39) అని అంటుంది. అలాగే ఖుర్‌ఆన్ కేవలం పాలిచ్చిన తల్లి, పాలుత్రాగిన చెల్లెలి నిషిద్ధత మాత్రమే ప్రస్తావిస్తుంది, పై వాదన రీత్యా పాలుత్రాగిన కూతురి నిషిద్ధత ఖుర్‌ఆన్‌కు వ్యతిరేకం అవుతుంది. ఇంకా ఖుర్‌ఆన్ కేవలం ఇద్దరు సోదరీలు ఒకే వ్యక్తి నికాహ్‌లో చేరడాన్ని నిషేధిస్తుంది, అలాంటప్పుడు పిన్నమ్మను, ఆమె సోదరి కూతురిని, మేనత్తను, ఆమె సోదరుని కూతురిని ఒకే భర్త వివాహంలో ఇవ్వడం నిషిద్ధ మనే వ్యక్తి ఖుర్‌ఆన్‌కు వ్యతిరేకంగా ఆదేశమిస్తున్న ఆరోపణ ఎదుర్కోవలసి ఉంటుంది. సవతి కూతురు పోషణ, సవతి తండ్రి ఇంట జరిగిన పరిస్థితిలోనే ఆమె నిషిద్ధమని అంటుంది ఖుర్‌ఆన్, ఎట్టి పరిస్థితిలోనయినా ఆమె నిషిద్ధమనడం ఖుర్‌ఆన్ ఆదేశానికి విరుద్ధమని చెప్పవలసి ఉంటుంది. మనిషి ప్రయాణంలో ఉండి దస్తావీజు వ్రాసే లేఖకుడు దొరకని పక్షంలోనే కుదువపెట్టడాన్ని ఖుర్‌ఆన్ అనుమతిస్తుంది. అందువల్ల మకామ్ చేసి ఉండగా, లేఖకుడు ప్రాప్తమవడం సాధ్యమయ్యే పక్షంలో కుదువపెట్టే అనుమతి ఖుర్‌ఆన్‌కు వ్యతిరేకమవుతుంది. ఖుర్‌ఆన్ అతిసాధారణ పదాలలో ఆదేశమిస్తుంది - మీరు పరస్పరం క్రయవిక్రయాలు జరుపుకునేటప్పుడు సాక్షులను ఏర్పరచుకోండి - అని. దీనివల్ల రేయింబవళ్ళు మనం షాపుల్లో సాక్ష్యాలు లేకుండా జరుపుకునే క్రయవిక్రయాలు అధర్మమయినవని అనుకోవలసి వస్తుంది. ఈ ఉదాహరణల్ని కొన్నింటిని ఒకసారి పరిశీలిస్తే తెలిసిపోతుంది, రాళ్ళు రువ్వి చంపే శిక్ష ఖుర్‌ఆన్‌కు వ్యతిరేకమని చెప్పే వారి వాదన లోపభూయిష్టమయిందని. షరీఅత్ వ్యవస్థలో ప్రవక్త బాధ్యతాయుత స్థాయి కాదనలేనిది. ఆయన దైవాదేశాన్ని అందజేసిన తరువాత దాని ఉద్దేశం ఏమిటో, దాన్ని అమలు జరిపే విధానమేదో, ఏ వ్యవహారాలలో అది వర్తిస్తుందో, ఏ ఏ వ్యవహారాలకు మరో ఆదేశం వర్తిస్తుందో తెలిపే బాధ్యత ఆయనదే. ప్రవక్తకు ఈ బాధ్యతా స్థానాన్ని కాదనడం కేవలం ధర్మసూత్రాలకే వ్యతిరేకం కాదు, దీనివల్ల ఇంకా అనేక ఆచరణాత్మకమయిన దోషాలు అనివార్యంగా ముందుకు వస్తాయి. వాటిని లెక్కించడమే సాధ్యం కాదు.

(8) 'వ్యభిచారం' అని దేన్నంటారో, చట్టపరమయిన నిర్వచనంలో ధర్మశాస్త్రవేత్తల మధ్య భేదాభిప్రాయముంది. హనఫీ పండితులు దాన్ని ఇలా నిర్వచిస్తారు, "ఒక పురుషుడు తనతో నికాహ్ జరగని లేదా తన హస్తగతం (బానిస) కాని స్త్రీతో పూర్వజఘనం (యోని)లో రతి జరపడం - ఈ సందర్భంలో అతను తాను రతి జరిపింది తన వివాహిత స్త్రీ లేదా తన

హస్తగతమయిన స్త్రీ అన్న అపోహతో అని ఊహించడానికి సమంజసమయిన ఏ కారణమూ లేని పరిస్థితి–వ్యభిచారం అనబడుతుంది." ఈ నిర్వచనం రీత్యా శ్రోణి మైధునం, స్వలింగ సంపర్కం, పశువులతో రతి మొదలయినవి వ్యభిచారం జాబితా నుండి వేరయిపోతాయి. కేవలం స్త్రీతో యోనిలో రతి జరపడం ఒక్క దానికే ఇది వర్తిస్తుంది. అదీ షరీఅత్ ఇచ్చిన హక్కులేనిదే లేదా అటువంటి అపోహ కలగనిదే ఈ చేష్ట చేసిన పక్షంలో అది వర్తిస్తుంది. దీనికి భిన్నంగా షాఫియీ పండితులు దీన్ని ఇలా నిర్వచిస్తారు, "షరీఅత్ ప్రకారం నిషిద్ధమయిన, అయితే ప్రకృతి సిద్ధంగా దాని పట్లనూ ఇచ్ఛకలగటం సహజమయిన మర్మాంగంలో మరో మర్మాంగాన్ని జొనిపించడం". మాలికీ పండితుల ప్రకారం దాని నిర్వచనం ఇది, "షరీఅత్ ఇచ్చిన హక్కుతో కాక లేదా అటువంటి హక్కుగలదన్న అనుమానంతో కాక యోనిలో లేదా శ్రోణిలో పురుషుడు లేదా స్త్రీతో మైధునం జరపడం." ఈ రెండు నిర్వచనాల రీత్యా స్వలింగ సంపర్కం కూడా వ్యభిచారంగానే పరిగణించబడుతుంది. కాని నిజానికి ఈ రెండు నిర్వచనాలు 'వ్యభిచారం' అనే పదానికి గల ప్రసిద్ధ అర్థానికి భిన్నమయినవి. దివ్యఖుర్ఆన్ సర్వసాధారణంగా పదాలను వాటి ప్రసిద్ధ భావంలోనో, అందరికీ అవగతమయ్యే అర్థంలోనో ప్రయోగిస్తుంది. అయితే ఏదయినా పదాన్ని ప్రత్యేకంగా తన పారిభాషికపదంగా మార్చుతున్నట్లయితే అది వేరే విషయం. అలా ప్రత్యేక పరిభాషను సృష్టించిన పక్షంలో అది స్వయంగా దాన్ని ఏ భావంలో ప్రయోగిస్తున్నదీ వ్యక్తం చేస్తుంది. ఇక్కడ వ్యభిచారం (జినా) అనే పదం ఏదయినా ప్రత్యేక అర్థంలో వాడుతున్నట్లు ఏ విధమయిన పూర్వోత్తర సందర్భం లేదు. అందువల్ల దాన్ని దాని ప్రసిద్ధ అర్థంలోనే గ్రహించవలసి ఉంటుంది. అది స్త్రీతో సహజ మయినదే అయినప్పటికీ అక్రమమయిన సంబంధం వరకే పరిమితం. కామక్రీడల ఇతర రూపాల వరకు అది విస్తృతం కాదు. పైగా స్వలింగ సంపర్కానికి శిక్ష విషయంలో సహచరుల మధ్యన భేదాభిప్రాయమున్న విషయం అందరికీ విదితమే. ఒకవేళ ఈ చేష్టను సయితం ఇస్లామీయ పరిభాష ప్రకారం వ్యభిచారంగా పరిగణించినట్లయితే, భేదాభిప్రాయానికి కారణమే ఉండదన్నది సుస్పష్టం.

(9) చట్టం రీత్యా ఒక వ్యభిచార చేష్టను శిక్షార్హమయినదిగా పరిగణించడానికి కేవలం యోనిలోకి శిశ్నాగ్రం ప్రవేశమే చాలు. దీనికి శిశ్నం పూర్తిగా ప్రవేశించడమో లేదా రతిచేష్ట పూర్తికావడమో అవసరంలేదు. దీనికి భిన్నంగా శిశ్నాగ్ర ప్రవేశమూ కాకుండా కేవలం ఒకే పడక మీద దగ్గరగా కలసి పడుకుని కనిపించడం, లేదా ఉపరతి చేష్టలలో కనిపించడం, లేదా నగ్నంగా కనిపించడం ఎవరినయినా వ్యభిచారిగా పరిగణించడానికి సరిపోదు. ఈ విషయంలో ఇస్లామీయ షరీఅత్ చొరవ తీసుకుని మరీ ముందుకు వెళ్ళి, ఏ స్త్రీ పురుషులయినా ఇలాంటి స్థితిలో కానవస్తే వారికి వైద్యపరీక్షలు జరిపి, వ్యభిచార నేరానికి సాక్ష్యాలు సమకూర్చి, ఏ విధంగానయినా వ్యభిచార శిక్ష విధించాలన్నంత దూరమూ వెళ్ళదు. ఇలాంటి లజ్జా విహీన

స్థితిలో కనిపించే వారి విషయంలో కేవలం రాజ్యం నిర్మించిన శిక్షాస్మృతి సరిపోతుంది. ఆ శిక్ష నిర్ణయం పరిస్థితుల రీత్యా న్యాయాధికారి స్వయంగానే చేస్తాడు, లేదా ఇస్లామీయ రాజ్యంలోని సలహా మండలి దానికి ఏదయినా శిక్షను ప్రతిపాదించగలదు. ఈ శిక్ష కొరడా దెబ్బల రూపంలో ఉన్నట్లయితే పది కొరడా దెబ్బల కన్నా అధికం కాకూడదు. ఎందుకంటే హదీసులో ఇలా ఉంది, "అల్లాహ్ నిర్ణయించిన 'హద్దులు' తప్ప మరే ఇతర నేరంలోనూ పది కొరడా దెబ్బలకన్నా అధిక శిక్ష విధించరాదు" (బుఖారి, ముస్లిమ్, అబూ దావూద్). ఎవరయినా పట్టుబడకుండా స్వయంగా తానే సిగ్గుపడి వచ్చి ఇలాంటి తప్పును ఒప్పుకున్నట్లయితే అతనికి కేవలం 'తౌబా' చేసుకునే హితవు గరిపి వదలివేయడం చాలు. అబ్దుల్లా బిన్ మస్‌ఊద్ (ర) ఉల్లేఖనం ప్రకారం ఒక వ్యక్తి ప్రవక్తశ్రీ (స) వద్దకు హాజరయి విన్నవించుకున్నాడు, "నగరానికి వెలుపల నేనొక స్త్రీకి అన్నీ చేశాను ఒక రతి తప్ప; ఇక తమరు నాకు ఏ శిక్ష విధించినా సరే" అని. దానికి హజ్రత్ ఉమర్(ర) "దైవం దాన్ని మరుగుపరచినప్పుడు నీవు కూడా దానికి తెరవేసి ఉన్నట్లయితే బావుండేది" అని అన్నారు. దైవప్రవక్త (స) మౌనంగా ఉండిపోయారు. ఆ వ్యక్తి వెళ్ళిపోయాడు. తరువాత ఆయన అతన్ని వెనక్కి రప్పించారు; ఈ ఆయత్‌ని పఠించారు, "నమాజ్‌ని స్థాపించు, పగటి అంచులు రెంటిపైనా, కొంత రేయి గడిచిన తరువాత. మంచి పనులు చెడులను నిర్మూలిస్తాయి." (హూద్ : 114) అప్పుడు ఒక వ్యక్తి అడిగాడు, "ఇది ఇతనికే ప్రత్యేకమా?" అని. ప్రవక్తశ్రీ (స), "కాదు, అందరికీ కూడా" అని సెలవిచ్చారు. (ముస్లిమ్, తిర్మిజీ, అబూదావూద్, నసాయి). ఇంతేకాదు, ఒక వ్యక్తి తన అపరాధాన్ని వివరించకుండా తాను అపరాధి అని అంగీకరిస్తే విచారణ జరిపి అతను చేసిన అపరాధమేమిటో తెలుసుకోవడాన్ని కూడా ధర్మంగా భావించదు షరీఅత్. ప్రవక్త మహనీయుల సన్నిధిలో ఒక వ్యక్తి హాజరయి ఇలా విన్నవించుకున్నాడు, "దైవప్రవక్తా, నేను (దైవం నిర్ణయించిన శిక్ష) 'హద్ద్'కు పాత్రుణ్ణయిపోయాను. నాకు 'హద్ద్' విధించండి." కాని ఆయన (స) అతన్ని నీవు ఏ హద్దుకు పాత్రుడయ్యావని అడగలేదు. తరువాత నమాజ్ ముగించుకుని ఆ వ్యక్తి మళ్ళీ లేచి నేను అపరాధిని, నన్ను శిక్షించండి అని అన్నాడు. ఆయన, "నీవు ఇప్పుడు మాతోపాటు నమాజ్ చేయలేదా?" అని అడిగారు. అతను, "అవును చేశాను" అని బదులిచ్చాడు. అప్పుడు ఆయన సెలవిచ్చారు, "చాలు, ఇక నీ తప్పును అల్లాహ్ క్షమించాడు" అని. (బుఖారీ, ముస్లిమ్, అహ్మద్)

(10) ఒక వ్యక్తిని (పురుషుడయినా స్త్రీ అయినా) అపరాధిగా నిర్ణయించడానికి అతని చేత వ్యభిచార క్రియ సంభవించడం మాత్రమే సరిపోదు, దానికి అపరాధికి సంబంధించిన కొన్ని నిబంధనలు తప్పనిసరిగా పూర్తికావాలి. ఈ నిబంధనలు 'కేవలం వ్యభిచార'మయితే వేరుగాను, (వివాహ) 'రక్షణ పొందిన తరువాత జరిగే వ్యభిచారా'నికి వేరుగానూ ఉంటాయి.

'కేవలం వ్యభిచారం' విషయంలో నిబంధన అపరాధి మతి స్థిమితమున్న వాడయి, ప్రాజ్ఞతకు చేరినవాడయి ఉండాలి. మతి చలించినవాడు లేదా బాలుడి చేత ఈ చేష్ట జరిగితే అతను వ్యభిచార నేరానికి శిక్షార్హుడు కాడు.

వివాహితుల వ్యభిచారం విషయంలో మతిస్థిమితం, ప్రాజ్ఞతలతోపాటు మరికొన్ని నిబంధన లున్నాయి. అవి క్రింద పొందుపరుస్తున్నాము:

మొదటి నిబంధన, అపరాధి స్వేచ్ఛగలవాడయి ఉండాలి (బానిసకాదన్న మాట) ఈ నిబంధన పట్ల అందరికీ ఏకాభి ప్రాయముంది. ఎందుకంటే స్వయంగా ఖుర్‌ఆన్ ప్రకారం బానిసకు రాళ్ళతో కొట్టే శిక్ష విధించరాదు. ఇంతకుముందే పరిశీలించినట్లు, బానిస స్త్రీ వివాహమయిన తరువాత వ్యభిచారానికి పాల్పడితే అవివాహిత స్వేచ్ఛాయుత స్త్రీకి విధించే శిక్షలో సగం విధించాలి. ధర్మశాస్త్రవేత్తలు, బానిస పురుషుల విషయంలోనూ ఖుర్‌ఆన్ విధించిన ఈ చట్టమే వర్తిస్తుందని అంగీకరించారు.

రెండవ నిబంధన ప్రకారం అపరాధి నియమబద్ధంగా వివాహితుడయి ఉండాలి. ఈ నిబంధన కూడా ఏకగ్రీవమయింది. ఈ నిబంధన రీత్యా, హస్తగతమయిన బానిస స్త్రీ ద్వారా ప్రయోజనం పొందినవాడయితే, లేదా అధర్మమయిన రీతిలో నికాహ్ జరిగినవాడయితే వివాహితుడుగా పరిగణించబడదు, అంటే అతనిచేత వ్యభిచారం జరిగితే అతనికి రాళ్ళతో కొట్టే శిక్ష విధించక కొరడా దెబ్బల శిక్ష విధించబడుతుంది.

మూడవ నిబంధన, అతనికి కేవలం పెళ్ళి జరగడమే కాదు, నికాహ్ తరువాత నియమానుసారం ఏకాంత సంయోగం కూడా జరిగి ఉండాలి. కేవలం నికాహ్ బంధం ఒక పురుషుడిని రక్షితునిగా, ఒక స్త్రీని రక్షిత స్త్రీగా రూపొందించదు- వ్యభిచారానికి పాల్పడినందుకు వారికి రాళ్ళతో కొట్టే శిక్ష విధించడానికి. ఈ నిబంధన పట్ల కూడా ధర్మ శాస్త్రవేత్తలు అత్యధికంగా ఏకాభిప్రాయం కలిగి ఉన్నారు. కాని ఇమామ్ అబూ హనీఫా, ఇమామ్ ముహమ్మద్ ఇందులో అదనంగా మరో అంశం పెంచారు. ఒక పురుషుడినయినా స్త్రీనయినా రక్షితులనడానికి, వారి నికాహ్ నియమానుసారం జరిగినప్పుడు, ఏకాంత సంయోగ సమయంలో దంపతులు స్వేచ్ఛాయుతులు, ప్రాజ్ఞత పొందినవారు, మతిస్థిమితమున్నవారు కావడం కూడా అవసరం. ఈ అదనపు ఉపనిబంధనవల్ల కలిగే వ్యత్యాసం రీత్యా పురుషుని నికాహ్ బానిస స్త్రీతో జరిగినా లేదా ఆమె ప్రాజ్ఞురాలు కాకపోయినా, లేదా మతిస్థిమితం లేనిదయినా ఆ స్థితిలో అతను తన భార్య ద్వారా సంభోగ సుఖాన్ని అనుభవించినా అతడు వ్యభిచారానికి పాల్పడినట్లయిన పక్షంలో రాళ్ళతో కొట్టే శిక్షకు అర్హుడు కాడు. ఇదే వ్యవహారం స్త్రీకి కూడా వర్తిస్తుంది. ఆమెకు తన ప్రాజ్ఞుడు కాని లేదా మతిస్థిమితంలేని, లేదా బానిస అయిన భర్త

ద్వారా రతి సుఖాన్ని అనుభవించే అవకాశం దొరకినా, అటువంటి పరిస్థితిలోనూ ఆమె వ్యభిచారానికి పాల్పడిన పక్షంలో రాళ్ళతో కొట్టే శిక్షకు పాత్రురాలు కాదు. కాస్త పరిశీలిస్తే వివేచనావంతులు, ప్రౌఢ బుద్ధులయిన ఈ ఇద్దరు మహనీయులు అదనంగా పెంచిన ఈ ఉపనిబంధన ఎంతో సమంజసమయిదని అనిపిస్తుంది.

నాల్గవ నిబంధన, అపరాధి ముస్లిమ్ అయి ఉండాలి. ఈ విషయంలో ధర్మశాస్త్రవేత్తల మధ్య భేదాభిప్రాయముంది. ఇమామ్ షాఫియీ, ఇమామ్ అబూ యూసుఫ్, ఇమామ్ అహ్మద్ దీన్ని అంగీకరించరు. వారి ప్రకారం ఇస్లామీయ రాజ్యంలోని ముస్లిమేతరుడయినా వివాహ రక్షణ పొందినవాడయి వ్యభిచారానికి ఒడిగడితే రాళ్ళతో కొట్టే శిక్ష విధించబడుతుంది. కాని ఇమామ్ అబూ హనీఫా, ఇమామ్ మాలిక్ ఏకగ్రీవంగా వివాహానంతర వ్యభిచారానికి రాళ్ళతో కొట్టే శిక్ష కేవలం ముస్లిములకే వర్తిస్తుందని అభిప్రాయపడతారు. దీని తర్కవాదనలో అన్నింటికంటే సమంజసమయిన బలమయిన వాదన ఒక వ్యక్తికి రాళ్ళతో కొట్టడం వంటి భయానక శిక్ష విధించడానికి అతడు సంపూర్ణ "రక్షణ" కలిగినవాడయి ఉండటం అవసరం, అప్పటికీ అతను వ్యభిచారానికి పాల్పడకుండా ఉండకపోతే అలా శిక్షించాలి. రక్షణ లేదా احصان **"ఇహ్సాన్"** అన్న దానికి భావం "నైతిక రక్షణ కోట". దీన్ని మూడు కోటగోడల వలయాల ద్వారా పరిపుష్టం చేయడం జరుగుతుంది. ప్రప్రథమ వలయం మనిషి దైవాన్ని విశ్వసించేవాడయి ఉండాలి. పరలోకంలో జవాబుదారీతనాన్ని నమ్మేవాడయి ఉండాలి. దైవశాసనాంగమయిన షరీఅత్‌ని ఆమోదించే వాడయి ఉండాలి. రెండవ వలయం, అతడు సమాజంలో స్వేచ్ఛాయుతుడయి ఉండాలి; ఎందుకంటే ఇతరుల దాస్యబంధనాలు అతనికి తన కాంక్షల పరిపూర్తికి ధర్మ సమ్మతమయిన విధానాలు అవలంబించడంలో ప్రతిబంధ కాలవుతాయి. గత్యంతరంలేని వివశ పరిస్థితులు అతని చేత పాపం చేయించగలుగుతాయి, అతనికి తన నైతికతను, తన శీలాన్నీ రక్షించుకోవడంలో సహాయపడే కుటుంబ వ్యవస్థ ఉండదు. మూడవ వలయం, అతని పెళ్ళి జరిగి ఉండాలి, అతనికి తన వాంఛాతృప్తికి ధర్మసమ్మతమయిన మార్గం ప్రాప్తమయి ఉండాలి. ఈ మూడు వలయాలు ప్రాప్తమయినప్పుడే "నైతిక రక్షణ కోట" పూర్తవుతుంది, అప్పుడే తన అధర్మమయిన కామవాంఛల పరిపూర్తికి మూడేసి వలయాలను ఛేదించిన ఆ వ్యక్తి తప్పనిసరిగా రాళ్ళతోకొట్టే శిక్షకు పాత్రుడవుతాడు. కాని మొట్టమొదటి, చాలా పెద్ద వలయం, అంటే దైవం, పరలోకం, దైవశాసనం పట్ల విశ్వాసమే లేనిచోట నిశ్చయంగా రక్షణకోట పూర్తి కాలేదు, అందువల్ల అతిక్రమణాపరాధం కూడా అంతిమ శిక్షకు పాత్రుణ్ణిగా చేసేంత తీవ్రమయింది కాదు. ఈ వాదనను సమర్థిస్తూనే ఇబ్ను ఉమర్ ఉటంకించిన ఉల్లేఖనం ముందుకువస్తుంది. దాన్ని ఇస్హాక్ బిన్ రాహవయ తన "ముస్నద్"లోను, 'దార్‌కుత్నీ' తన "సునన్"లోనూ ఉటంకించారు: "ఎవరయితే దైవానికి

సహవర్తులు కల్పించారో (షిర్క్ చేశారో) వారు 'రక్షితులు' కారు." ఇంతకు ఇబ్ను ఉమర్(ర) ఈ ఉల్లేఖనంలో ప్రవక్త మహనీయుని సూక్తిని ఉటంకించారా లేదా తన స్వంత నిర్ణయాన్ని తెలిపారా అన్న భేదాభిప్రాయముంది; ఈ బలహీనత ఉన్నప్పటికీ ఇందులోని విషయం దాని భావం రీత్యా చాలా బలమయినది. దీనికి సమాధానంగా ఎవరయినా ప్రవక్త మహనీయులు (స) యూదుల ఒక కేసులో రాళ్ళతో కొట్టే శిక్షను విధించిన సంఘటనను దృష్టాంతంగా చూపితే అది సరయినది కాదు. ఎందుకంటే ఆ కేసుకు సంబంధించిన విశ్వసనీయమయిన ఉల్లేఖనాలన్నింటినీ ప్రోగుచేసి చూసినట్లయితే, అందులో ప్రవక్త మహనీయులు (స) దేశంలోని ఇస్లామీయ రాజ్య శాసనం (Law of the Land) ప్రకారం తీర్పునివ్వలేదు, యూదుల స్వంత మతపరమయిన శాసనాంగం (Personal Law) ప్రకారం తీర్పు చేశారు. బుఖారీ, ముస్లిమ్‌లలో ఏకగ్రీవంగా వచ్చిన ఉల్లేఖనం ప్రకారం, ఆయన వద్దకు ఈ కేసు వచ్చినప్పుడు ఆయన యూదుల్ని, "మీ గ్రంథం, తౌరాత్‌లో దీని విషయంలో ఉన్న ఆజ్ఞ ఏమిటి?" అని ప్రశ్నించారు. తరువాత వారి వద్ద తౌరాత్‌లో రాళ్ళతో కొట్టే ఆదేశమున్న విషయం నిర్ధారితమయినప్పుడు ప్రవక్తశ్రీ, "నేను తౌరాత్‌లో ఉన్న తీర్పునే విధిస్తాను" అని అన్నారు. మరో ఉల్లేఖనం ప్రకారం ఆ కేసులో తీర్పునిస్తూ ఆయన ఇలా పలికారు, "దేవా, నీ ఆదేశాన్ని పునరుజ్జీవింపజేసినవాణ్ణి ప్రథముణ్ణి నేనే. వారు దాన్ని పూర్తిగా నిర్జీవం చేసిపెట్టారు" (ముస్లిమ్, అబూ దావూద్, అహ్మద్).

(11)వ్యభిచార చేష్టకు పాల్పడిన వ్యక్తిని అపరాధిగా నిర్ణయించడానికి ఆ వ్యక్తి తన ఇష్టపూర్వకంగా చేష్ట చేసి ఉండటం అవసరం. బలవంతాన, ఒత్తిడికి గురిచేసి ఎవరినయినా ఈ చర్యకు వివశునిగా చేసినట్లయితే ఆ వ్యక్తి అపరాధీకాదు, శిక్షాపడదు. ఈ వ్యవహారంలో షరీఅత్‌లోని సర్వసాధారణ నియమం, "బలవంతాన చేయించిన చర్యల బాధ్యత మనిషిపై లేదు" అనేది వర్తించక పోవడమే కాదు, పైగా ముమ్ముందు ఇదే సూరాలో స్వయంగా ఖుర్ఆన్ కూడా వ్యభిచారానికి బలాత్కరింపబడిన స్త్రీలకు క్షమాపణను ప్రకటిస్తుంది. ఇంకా అనేక హదీసుల్లోని వివరణ ప్రకారం, బలాత్కారపు వ్యభిచారం జరిగిన పక్షంలో బలాత్కారం చేసిన వ్యభిచారికి మాత్రమే శిక్ష విధించబడింది, బలాత్కారానికి గురయిన వారిని వదలివేయడం జరిగింది. తిర్మిజీలోనూ, అబూదావూద్‌లోనూ ఒక ఉల్లేఖనముంది. ఒక స్త్రీ చీకటిలో నమాజ్‌కై బయలు దేరింది, త్రోవలో ఒక వ్యక్తి ఆమెను పడవేసి బలాత్కారంగా మానభంగం చేశాడు. ఆమె కేకలు పెట్టగా జనం వచ్చారు, వ్యభిచారి పట్టుబడ్డాడు. ప్రవక్త మహనీయులు అతణ్ణి రాళ్ళతో కొట్టించారు, స్త్రీని వదలిపెట్టారు. బుఖారి ఉల్లేఖనం ప్రకారం, హజ్రత్ ఉమర్ (ర) ఖిలాఫత్ కాలంలో ఒక వ్యక్తి ఒక అమ్మాయిని బలాత్కారంతో చెరిచాడు; ఆయన (ర) అతడిని కొరడా దెబ్బలు వేయించారు, అమ్మాయిని వదలిపెట్టారు. ఈ వాదనల ఆధారాల

ప్రకారం స్త్రీ విషయంలోనయితే చట్టం ఏకాభిప్రాయం కలిగి ఉంది. కాని పురుషుని విషయంలోనూ బలవంతం, ఒత్తిడిలు జరగడం నమ్మదగినవేనా కాదా అన్న అంశంలో భేదాభిప్రాయముంది. ఇమామ్ అబూ యూసుఫ్, ఇమామ్ ముహమ్మద్, ఇమామ్ షాఫియీ, ఇమామ్ హసన్ బిన్ సాలిహ్ చెప్పే దాని ప్రకారం పురుషునికి కూడా వ్యభిచరించేందుకు బలవంతపెట్టినట్లయితే అతణ్ణి క్షమించవలసి ఉంటుంది. ఇమామ్ జుఫర్ ప్రకారం, అతన్ని క్షమించడం జరగదు; ఎందుకంటే అంగస్థంభన లేకుండా అతను ఈ చేష్టకు పాల్పడలేడు. మరి అంగ స్థంభన జరగడం, అతని కాంక్ష దాన్ని ప్రేరేపించిందనడానికి నిదర్శనం. ఇమామ్ అబూ హనీఫా ప్రకారం, ప్రభుత్వం, లేదా దాని అధికారి మనిషిని వ్యభిచరించడానికి బలవంతపెడితే అతనికి శిక్షపడదు, ఎందుకంటే స్వయంగా ప్రభుత్వమే అపరాధానికి బలవంతపెడితే, దానికి శిక్షించే హక్కు ఉండదు. కాని ప్రభుత్వం తప్ప ఇతరులెవరయినా బలవంతం చేస్తే వ్యభిచారిని శిక్షించడం జరుగుతుంది. ఎందుకంటే వ్యభిచార చేష్ట ఎట్టి పరిస్థితిలోనూ అతను తన కాంక్షలేకుండా చేయలేడు. కాంక్ష అనేది బలవంతాన ప్రేరేపించడం సాధ్యపడదు. ఈ మూడు అభిప్రాయాల్లోనూ మొదటి అభిప్రాయమే ఇతోధికంగా సరయినది. ఎందుకంటే, అంగస్థంభన కాంక్షకు నిదర్శనమే అయినప్పటికీ అది అతని ఇష్టానికీ, మొగ్గుదలకూ తప్పనిసరి నిదర్శనం మాత్రం కాదు. ఉదాహరణకు ఒక దుర్మార్గుడు ఒక సౌజన్యశీలుడయిన వ్యక్తిని బలవంతాన పట్టి నిర్బం ధిస్తాడు, అతనితోపాటు ఒక అందమయిన యువతిని సయితం దిగంబరంగా ఒకే గదిలో బంధిస్తాడు. అతడు వ్యభిచారానికి పాల్పడనంత వరకు అతన్ని వదలిపెట్టడు. ఈ స్థితిలో వారిరువురూ వ్యభిచారానికి పాల్పడితే, ఆ దుర్మార్గుడు దానికి నల్గురు సాక్షుల్ని సమకూర్చి కోర్టులో కేసుపెడితే ఈ పరిస్థితుల్ని ఉపేక్షించి వారిని రాళ్ళతో కొట్టి వేయడమో, లేదా వారిపైన కొరడా దెబ్బలు వర్షింపజేయడమో న్యాయమవుతుందా? మనిషి ఇష్టమూ, మొగ్గుదలల ప్రమేయం లేకుండా వాంఛాప్రేరణ సంభవించడం బౌద్ధికంగానూ, నైజపరంగానూ సాధ్యమే. ఒక మనిషిని నిర్బంధించి సారాయి తప్ప, త్రాగడానికి మరేమీ ఇవ్వకపోతే, ఈ స్థితిలో అతను సారాయి తాగితే, నిజంగా గత్యంతరంలేని పరిస్థితులే ఎదురయినప్పటికీ అతడు తన ఇష్టం లేనిదే సారాయిని తన గొంతు ద్వారా దిగమింగలేడు కదా అన్న వాదనతో అతన్ని శిక్షించడం సరయినదా? నేరం నిర్ధారితమవడానికి కేవలం సంకల్పం ఒక్కటే సరిపోదు, దానికి ఆ సంకల్పం స్వేచ్ఛాయుతమయినదయి ఉండాలి. ఏ వ్యక్తినయినా నేరం చేయడం తప్ప గత్యంతరంలేని పరిస్థితుల్లో పడవేస్తే కొన్ని సందర్భాలలోనయితే అతను అసలు అపరాధియే కాడు, మరి కొన్నింటిలో అతని అపరాధం తేలికపాటిదయిపోతుంది.

(12) ఇస్లామీయ శాసనాంగం, ప్రభుత్వానికి తప్ప మరొకరెవరికీ, వ్యభిచారి, వ్యభిచారిణులకు

ప్రతిగా చర్య తీసుకునే అధికార మివ్వదు, న్యాయస్థానానికి తప్ప మరెవ్వరికీ ఆ నేరానికి శిక్ష విధించే హక్కునివ్వదు. చర్చనీయమయిన ప్రస్తుత ఆయత్‌లో "వారికి కొరడా దెబ్బలు వెయ్యండి" అనే ఆదేశానికి సంబోధితులు సామాన్య ప్రజలు కాదు, ఇస్లామీయ రాజ్యంలోని అధికారులు, న్యాయమూర్తులు అన్న విషయంలో మొత్తం ముస్లిమ్ సముదాయంలోని ధర్మశాస్త్రవేత్తలందరికీ ఏకాభిప్రాయముంది. అయితే బానిస విషయంలో భేదాభిప్రాయముంది. అతని యజమానికి 'హద్ద్'★ను అమలుపరిచే అధికారం ఉందా లేదా అన్న విషయంలోనే భేదాభిప్రాయం. హనఫీ పంథాలోని అగ్ర పండితులందరికీ, అతనికి ఆ అధికారం లేదన్న విషయంలో ఏకాభిప్రాయముంది. షాఫియీ పండితులు, అతనికి ఆ అధికారముందని అంటారు. మాలికీ పంథావారు, దొంగతనం చేస్తే యజమానికి చెయ్యినరికే హక్కయితే లేదు కాని వ్యభిచారం, కజ్ఫ్★★ మద్యపానం వంటి నేరాలకు హద్దును అమలుపరిచే వీలుంది.

(13)ఇస్లామీయ శాసనాంగం, వ్యభిచారానికి శిక్షను రాజ్య శాసనాంగంలోని భాగంగా పరిగణిస్తుంది. అందువల్ల రాజ్యంలోని ప్రజలందరిపైనా ఈ చట్టం అమలు జరపబడుతుంది, వారు ముస్లిములయినా, ముస్లిమేతరులయినా సరే. దీనిపట్ల ఇమామ్ మాలిక్ తప్ప బహుశా ధర్మశాస్త్ర వేత్తల్లో ఎవ్వరూ విభేదించలేదు. రాళ్ళతో కొట్టే శిక్షను ముస్లిమేతరులకు వర్తింపజేసే విషయంలో ఇమామ్ అబూ హనీఫా వెలిబుచ్చిన విభేదానికి కారణం, అది రాజ్య శాసనాంగంలోని భాగం కాకపోవడం కాదు, ఆయన దృష్టిలో దాని కారణం, ఆ శిక్షకు గల నిబంధనల్లో ఒక నిబంధన వ్యభిచారి పూర్తిగా రక్షితుడయి ఉండాలన్నది. ఇస్లామ్ లేనిదే రక్షణ పరిపూర్ణమవదు. ఈ కారణంగా ఆయన ముస్లిమేతర వ్యభిచారికి రాళ్ళతో కొట్టే శిక్ష నుండి మినహాయింపునిస్తారు. దీనికి భిన్నంగా ఇమామ్ మాలిక్ దృష్టిలో ఈ ఆదేశానికి సంబోధితులు ముస్లిములు, తిరస్కారులు కారు; అందువల్ల ఆయన వ్యభిచారానికి శిక్షను ముస్లిముల వ్యక్తిగత చట్టం (పర్సనల్ లా)లో భాగంగా పరిగణిస్తారు. పోతే 'ముస్తా'మన్' (ఇస్లామీయ రాజ్యం 'దారుస్సలామ్'లోకి అనుమతి పొంది వచ్చిన ఇతర దేశవాసుదు) విషయానికి వస్తే ఇమామ్ షాఫియీ, ఇమామ్ అబూ యూసుఫ్‌ల అభిప్రాయంలో అతను 'దారుస్సలామ్'లో వ్యభిచరిస్తే అతనికి 'హద్ద్' వర్తింప జేయబడుతుంది. కాని ఇమామ్ అబూ హనీఫా, ఇమామ్ ముహమ్మద్ ప్రకారం హద్ద్ వర్తింపజేయకూడదు.

(14) ఇస్లామీయ శాసనం ప్రకారం ఏ వ్యకి అయినా తన నేరాన్ని స్వయంగా అంగీకరించడం తప్పనిసరి కాదు; లేదా ఎవరయినా వ్యభిచార నేరం జరిగినట్లు తెలుసుకుంటే వారు తప్పకుండా

★ హద్ద్ = దైవం నిర్ణయించిన శిక్ష

★★ కజ్ఫ్ = నిరూపితం కాని వ్యభిచార నిందారోపణ

దాన్ని అధికారులకు తెలియజెయ్యాలన్నదీ తప్పనిసరి కాదు. కాని అధికారులకు దాన్ని గురించి తెలిస్తే ఆ నేరాన్ని మాఫీ చేయడం అంటూ జరగదు. హదీసు ప్రకారం ప్రవక్త మహనీయులు (స) ఇలా సెలవిచ్చారు: "మీలో ఏ వ్యక్తి అయినా ఈ మురికి చేష్టల్లో దేనికయినా పాల్పడితే అతను దైవం వేసిన మరుగు తెరలో గోప్యంగా ఉండిపోవాలి. కాని అతను మా సమక్షంలో ఆ తెరను తెరచివేస్తే మేము అతని విషయంలో దైవగ్రంథంలోని శాసనాన్ని అమలు జరపడం తథ్యం." ('అహ్కాముల్ ఖుర్ఆన్' – జస్సాస్). అబూదావూద్ ప్రకారం, మాఇజ్ బిన్ మాలిక్ అస్లమీ చేత వ్యభిచారం జరిగినప్పుడు హజ్జాల్ బిన్ నుఅయిమ్ ఆయనకు, "పోయి ప్రవక్త మహనీయుని(స) సమక్షంలో నీ అపరాధాన్ని అంగీకరించు" అని చెప్పారు. తదనుగుణంగా ఆయన వెళ్ళి ప్రవక్తశ్రీ (స)తో తన నేరాన్ని వివరించారు. దానికి ప్రవక్తశ్రీ ఒక వైపున ఆయనకు రాళ్ళతోకొట్టే శిక్ష విధించారు. మరోవైపున హజ్జాల్‌తో, "నీవు అతని ఆచ్ఛాదనను కప్పి ఉంచినట్లయితే నీకు అదే ఎంతో ఉత్తమంగా ఉండేది" అని అన్నారు. అబూ దావూద్, నసాయిలలో మరో హదీసు ఉంది. అందులో ఆయన ఇలా సెలవిచ్చారు, "హద్దుల విషయాన్ని మీలో మీరే పరస్పరం మన్నించుకోండి, కాని హద్ద్ వ్యవహారం నా వరకు చేరినట్లయితే ఇక అది విధించబడటం తథ్యం."

(15) ఇస్లామీయ శాసనం ప్రకారం ఈ నేరం రాజీ కుదుర్చుకునే వీలున్న నేరం కాదు. దాదాపు హదీసు గ్రంథాలన్నింటిలోనూ ఈ సంఘటన ఉంది: ఒక యువకుడు ఒక వ్యక్తి ఇంటిలో పాలేరుగా పని చేసేవాడు. అతను తన యజమాని భార్యతో వ్యభిచరించాడు. యువకుని తండ్రి వంద మేకలు, ఒక దాసిని ఇచ్చి ఆ వ్యక్తితో రాజీ కుదుర్చుకున్నాడు. కాని ఈ కేసు ప్రవక్త మహనీయుల సమక్షంలోకి వచ్చినప్పుడు ఆయన, "నీ మేకలు, నీ దాసి నీకే" అంటూ ఆయన వ్యభిచారికీ, వ్యభిచారిణికీ ఇద్దరికీ హద్దును విధించారు. దీనివల్ల, ఈ నేరంలో రాజీ కుదిరే అవకాశమే లేదన్న విషయమూ తెలుస్తోంది, దానితోపాటు, ఇస్లామీయ శాసనం ప్రకారం మానం, శీలాల భంగానికి మారుగా ధనపరిహారం చెల్లుబాటుకాదని, మాన ధనానికి విలువ కట్టే జుగుప్సాకరమయిన భావన పాశ్చాత్య శాసనాలకే శోభిస్తుంది అని కూడా తెలుస్తోంది.

(16) ఇస్లామీయ ప్రభుత్వం వ్యభిచార నేరానికి ఒక వ్యక్తిపైన చర్య తీసుకోవాలంటే ఆ అపరాధం జరిగినట్లు సాక్ష్యాధారాలు దొరకాలి. నేర నిరూపణ లేకుండా ఒకరి చెడు నడతకు సంబంధించిన సమాచారం ఎన్ని విధాలుగా అధికారుల ఎరుకలోకి వచ్చినప్పటికీ వారు దాని ఆధారంగా హద్ద్ శిక్షను విధించలేరు. మదీనాలో ఒక స్త్రీని గురించి, ఆమె రంకుటాలన్న విషయం ప్రచారంలో ఉండేది. బుఖారిలోని ఒక ఉల్లేఖనం ప్రకారం: "ఆ స్త్రీ ఇస్లామ్‌లో (ఇస్లామీయ సమాజంలో) విచ్చలవిడిగా దుష్టకార్యాన్ని ప్రదర్శించేది." మరో ఉల్లేఖనంలో

"ఆ స్త్రీ అయితే విచ్చల విడిగా దుశ్చేష్ట చేసేది" అని ఉంది. ఇబ్ను మాజా ఉల్లేఖనం ప్రకారం: "ఆమె మాటల ద్వారా, నడవడి ద్వారా, ఆమె వద్దకు వచ్చిపోయే వారి ద్వారా ఆమె దుశ్శీలురాలని తెలుస్తూనే ఉంది" అని ఉంది. అయితే ఆమె వ్యభిచరించినట్లు చట్టపరమయిన నిరూపణ లేకపోవడం చేత ఆమెకు ఎటువంటి శిక్ష కూడా విధించటం జరగలేదు. ఆమెను గురించి ప్రవక్త మహనీయులు (స) పవిత్రమయిన నోటి నుండి ఇటువంటి మాటలు కూడా దొరిలాయి: "నేను నిరూపణ లేకుండా రాళ్ళతో కొట్టే శిక్ష విధించేవాడినయితే ఈ స్త్రీని తప్పకుండా రాళ్ళతో కొట్టించేవాడిని."

(17) వ్యభిచార నేరానికి సాధ్యమయ్యే మొదటి నిరూపణ, దానికి సాక్ష్యం నెలకొనడం. దానికి సంబంధించిన శాసనంలోని ముఖ్యాంశాలు ఇవి:

(అ) వ్యభిచారానికి కనీసం నలుగురు ప్రత్యక్ష సాక్షులు కావాలని ఖుర్‌ఆన్ విశదీకరిస్తుంది. దీన్ని విశదంగా నిసా సూరా 15వ ఆయత్‌లోనూ ప్రస్తావించడం జరిగింది. నూర్ సూరాలోనూ మున్ముందు రెండు చోట్ల రాబోతున్నది. న్యాయమూర్తి తన కళ్ళతో నేరం జరుగుతూ ఉండగా చూసినప్పటికీ సాక్ష్యం లేకుండా కేవలం తనకు తెలిసిన సమాచారం ఆధారంగా నిర్ణయం గైకొనలేడు.

(ఆ) సాక్షులు ఇస్లామీయ సాక్ష్యచట్టం (Law of Evidence) రీత్యా విశ్వసనీయులయిన వారే కావాలి. ఉదాహరణకు వారు లోగడ ఏదయినా కేసులో అబద్ధపు సాక్షులుగా నిరూపితమయినవారు కాకూడదు, నమ్మక ద్రోహులు కారాదు, మునుపు శిక్షననుభవించినవారు కారాదు; ముద్దాయితో వారి శత్రుత్వం నిరూపితమయి ఉండరాదు మొదలయినవి. ఇంతకూ విశ్వసనీయం కాని సాక్ష్యం కారణంగా ఎవరినీ రాళ్ళతో కొట్టడమూ జరగదు, మరెవరి వీపుపైన కొరడా దెబ్బలు కురిపించనూలేము.

(ఇ) సాక్షులు, ముద్దాయిలను సరిగ్గా సంభోగ స్థితిలో చూసినట్లు సాక్ష్యం ఇవ్వాలి. (అంటే "సుర్మా బుడ్డిలో పుల్లలాగా, బావిలో చేదలాగా అన్నమాట.")

(ఈ) సాక్షులు ఎప్పుడు, ఎక్కడ, ఎవరిని, ఎవరితో వ్యభిచరిస్తూ ఉండగా చూశారో ఏకగ్రీవంగా చెప్పగలగాలి. ఈ ప్రాథమిక విషయాల్లో విభేదం వస్తే అది వారి సాక్ష్యాన్ని రద్దు చేసి వేస్తుంది.

సాక్ష్యం విషయంలో ఈ నిబంధనలే చెబుతున్నాయి, ఇస్లామీయ శాసనాంగం ఉద్దేశం మాటుకాచి పట్టుకొని రోజూ అదే పనిగా కొరడా దెబ్బలతో ప్రజల వీపులు మార్మోగిస్తూ ఉండాలన్నది కాదు, దానికి బదులుగా సమస్త సంస్కరణాత్మక, నివారణాత్మక ప్రయత్నాల తరువాత కూడా ఇస్లామీయ సమాజంలో ఏ స్త్రీ పురుషులయినా మరీ సిగ్గు విడిచి, బరి

తెగించి అపరాధం చేస్తూ ఉండగా నలుగురేసి వ్యక్తులు చూడగలిగేలా వ్యవహరిస్తే అటువంటి నికృష్టపు పరిస్థితుల్లోనే అది ఇటువంటి కఠినమయిన శిక్ష విధిస్తుంది.

(18) ఒక స్త్రీకి గర్భధారణ జరిగితే ఆమెకు భర్త లేకపోవడం, బానిస స్త్రీ అయితే యజమాని లేకపోవడం, అందరికీ తెలిసిన ప్రసిద్ధ విషయమే అయినప్పుడు కేవలం అది వ్యభిచార నిరూపణకు తగిన సాక్ష్యమా కాదా అన్న విషయంలో భేదాభిప్రాయముంది. హజ్రత్ ఉమర్ (ర) అభిప్రాయంలో ఇది చాలినంత సాక్ష్యం కాగలదు. దీనినే మాలికీ పండితులు అవలంబించారు. కాని మిగతా ధర్మశాస్త్రవేత్తలు సర్వసామాన్యంగా అనుసరించిన పంథా ప్రకారం కేవలం గర్భధారణ ఆధారంగా మాత్రమే ఎవరినయినా రాళ్ళతో కొట్టివేయడమో లేదా వంద కొరడా దెబ్బలు కొట్టడమో జరగడానికి ఇది బలమయిన 'పరిస్థితుల దృష్ట్యా సాక్ష్యం' కాజాలదు. ఇంత కఠిన శిక్ష విధించడానికి ఉంటే ప్రత్యక్ష సాక్ష్యం ఉండాలి, లేదా నేరం అంగీకరించబడాలి. ఇస్లామీయ శాసనాంగంలోని ప్రాథమిక సూత్రాలలో ఒకటి, అనుమానం శిక్షించడానికి కాకుండా క్షమించడానికి ప్రేరకం కావాలి. ప్రవక్త మహనీయులు(స) సెలవిచ్చిన దాని ప్రకారం, "నివారించగలిగినంత మేరకు శిక్షల్ని నివారించండి" (ఇబ్ను మాజా). మరో హదీసులో ఇలా ఉంది: 'సాధ్యమయినంత వరకు శిక్షల్ని ముస్లిములకు దూరంగా ఉంచండి. ఏ దోషికయినా శిక్ష నుండి తప్పించుకునే మార్గం ఏదయినా కానవస్తే అతన్ని అలా వదలి వేయండి, ఎందుకంటే క్షమించడంలో తప్పు జరగడం, శిక్షించడంలో అధికారి చేత తప్పు జరగడం కన్నా ఎంతో మేలు' (తిర్మిజీ). ఈ నియమాను సారం గర్భ ధారణ అనేది అనుమానానికి చాలా బలమయిన ఆధారమనిపించినప్పటికీ వ్యభిచారానికి విశ్వసనీయమయిన నిరూపణ మటుకు ఎంతసేపటికీ కాదు, ఎందుకంటే లక్షల్లో ఒకటయినాసరే, సంయోగం జరగకుండానే, ఒక స్త్రీ గర్భంలోకి ఒక పురుషుడి ఇంద్రియ బిందువులో ఒక అంశం చేరిపోయే అవకాశం ఉంది, తద్వారా ఆమె గర్భం ధరించడం సాధ్యమే. ఈ అనుమానం ఎంత బలహీన మయినదయినా సరే ముద్దాయిని వ్యభిచారానికి విధించే భయానక శిక్ష నుండి తప్పించి క్షమించివేయడానికి ఇది సరిపోతుంది.

(19)వ్యభిచార సాక్షుల్లో భేదాభిప్రాయం కలిగినా, లేదా మరే కారణం వల్లనయినా వారి సాక్ష్యాధారంగా నేరం రుజువు కాకపోయినా, సాక్షులు అబద్ధపు సాక్ష్యానికి శిక్షననుభవించవలసి ఉంటుందా అన్న విషయంలోనూ భేదాభిప్రాయముంది. ధర్మశాస్త్రవేత్తల్లో ఒక వర్గం ప్రకారం ఇలాంటి సందర్భంలో వారు 'కజ్ఫ్' చేసిన వారుగా పరిగణించబడతారు, వారికి 80 కొరడా దెబ్బల శిక్ష విధించబడుతుంది. మరో వర్గం ప్రకారం, వారిని శిక్షించడం జరగదు, ఎందుకంటే వారు సాక్షులుగా వచ్చారు, దావాదారుగా కాదు. ఇలా సాక్షులను శిక్షిస్తూ ఉంటే, ఇక వ్యభిచారానికి సాక్ష్యం దొరికే దారియే మూసుకుపోతుంది. శిక్ష ప్రమాదం కొని తెచ్చుకుని

సాక్ష్యమిచ్చేందుకు ఎవరయినా బుద్ధి మందగించి ఎందుకు ముందుకు వస్తారు? వాస్తవానికి నలుగురు సాక్షుల్లో ఎవరయినా జారిపోరన్న నమ్మకం ఎవ్వరికీ ఉండదు, మా దృష్టిలో ఈ రెండవ అభిప్రాయమే సమంజసమయినది. ఎందుకంటే అనుమానం వల్ల ముద్దాయికి ప్రయోజనం కలిగినట్లే సాక్షులకూ ఆ అవకాశం దొరకాలి. వీరి సాక్ష్యంలోని బలహీనత, ముద్దాయికి భయంకరమయిన వ్యభిచార శిక్ష విధించేందుకు సరిపోకపోతే, అది సాక్షులకు విధించే భయంకరమయిన కజ్ఫ్ శిక్షను వర్తింపజేయడానికీ సరిపోరాదు. అయితే వారు అబద్ధం పలుకుతున్నారన్న విషయం ప్రస్ఫుటంగా రుజువయిపోతే అది వేరే విషయం. మొదటి అభిప్రాయాన్ని సమర్థిస్తూ రెండు భారీ వాదనలు చూపుతారు. ఒకటి, ఖుర్ఆన్ వ్యభిచారానికి అబద్ధపు సాక్ష్యం పలకడాన్ని శిక్షార్హమయిన నేరంగా పరిగణిస్తుంది. కాని ఈ వాదన తప్పయినది. ఖుర్ఆన్ స్వయంగా కాజిఫ్ (అబద్ధపు నిందారోపణ చేసేవాడి)కీ షాహిద్ (ప్రత్యక్ష సాక్షి) కీ మధ్యన వ్యత్యాసాన్ని పాటిస్తోంది. ప్రత్యక్ష సాక్షి సాక్ష్యాన్ని న్యాయస్థానం, నేర నిరూపణకు సరిపోదని భావించినంత మాత్రాన అబద్ధపు నేరారోపిగా నిర్ణయించలేము. రెండు, ముగీరా బిన్ షు'బా కేసులో హజ్రత్ ఉమర్(ర), అబూ బక్రహ్, అతని ఇద్దరు మిత్రులయిన ప్రత్యక్ష సాక్షులకు అబద్ధపు నేరారోపణ శిక్ష విధించారు. అయితే ఈ కేసు మొత్తాన్ని సవివరంగా పరిశీలిస్తే తెలిసేదేమిటంటే, ఈ దృష్టాంతం, నేర నిరూపణకు సాక్ష్యాలు సరిపోనివిగా తేలిన ప్రతి కేసులోనూ వర్తించవు. కేసు వివరాల ప్రకారం, బస్రా గవర్నరు ముగీరా బిన్ షు'బాతో అబూ బక్రహ్ సంబంధాలు అంతకు ముందు నుంచే బాగా లేవు. ఇద్దరి ఇళ్ళూ ఒకే రోడ్డుపైన ఎదురు బొదురుగా ఉండేవి. ఒక రోజున అకస్మాత్తుగా గాలి జోరుగా వీచింది, ఇద్దరి ఇళ్ళ కిటికీలూ తెరచుకున్నాయి. అబూ బక్రహ్ తన కిటికీ తలుపులు మూయడానికి నిలబడితే ఆయన చూపు ఎదురింటి రూములో పడింది. ఆయన హజ్రత్ ముగీరాని రతిలో పాల్గొంటూ ఉండగా చూశారు. అప్పుడు అబూ బక్రహ్ ఇంటిలో ఆయన స్నేహితులు ముగ్గురు (నాఫె బిన్ కలద, జియార్, షిబల్ బిన్ మ'అబద్) కూర్చుని ఉన్నారు. ఆయన వారిని పిలిచి, "రండి, చూద్దురు గాని, ముగీరా చేస్తున్నదానికి మీరే సాక్షులు" అని అన్నారు. ఆ స్త్రీ ఎవరని మిత్రులు అడగ్గా అబూ బక్రహ్ ఉమ్మె జమీల్ అని సమాధానమిచ్చారు. మరుసటి రోజు ఈ విషయం ఫిర్యాదు రూపంలో హజ్రత్ ఉమర్ (ర) వద్దకు పంపడం జరిగింది. ఆయన తెలియగానే వెంటనే హజ్రత్ ముగీరాను తాత్కాలికంగా తొలగించి హజ్రత్ అబూ మూసా అష్అరీని బస్రా గవర్నర్‌గా నియమించారు. దోషిని సాక్షులు సమేతంగా మదీనాకు పిలిపించుకున్నారు. విచారణలో అబూ బక్రహ్, ఇద్దరు సాక్షులు కలసి, మేము ముగీరాని ఉమ్మె జమీల్‌తో సంభోగిస్తూ ఉండగా కళ్ళారా చూశాము అని పలికారు. కాని జియాద్ మాత్రం, స్త్రీ స్పష్టంగా కనిపించలేదు, ఆమె ఉమ్మె జమీల్ అని నేను నమ్మకంగా

చెప్పలేను అని అన్నారు. ముగీరా బిన్ షు'బా క్రాస్ ఎగ్జామినేషన్‌లో, వారు తమను చూసిన కోణంలో ఎవరయినా స్త్రీని స్పష్టంగా చూడలేదని రుజువు చేశారు. ఆయన, తన భార్యకు ఉమ్మె జమీల్ పోలికలున్నాయని కూడా నిరూపించారు. పరిస్థితులను బట్టి కూడా హ[జత్ ఉమర్ (ర) పాలనలో, ఒక రాష్ట్ర గవర్నరు, స్వయంగా తన అధికార గృహంలో, తన భార్య తనతోనే నివసిస్తూ ఉండగా, ఒక పరస్త్రీని పిలిపించి వ్యభిచారానికి ఒడిగట్టడం అసాధ్యం. అందువల్ల అబూ బక్రహ్, ఆయన మిత్రులు, ముగీరా తన ఇంట్లో తన భార్యకు బదులు ఉమ్మె జమీల్‌తో సంభోగిస్తున్నారని భావించడం అత్యంత అసంబద్ధమయిన దుశ్శంక తప్ప మరేమీ కాదని తేలింది. ఈ కారణంగానే హజ్రత్ ఉమర్ కేవలం దోషిని విముక్తుణ్ణి చేయడమేకాక అబూ బక్రహ్, నాఫె, షిబల్‌కు కజ్ఫ్ (అబద్ధపు నేరారోపణ) శిక్ష కూడా విధించారు. ఈ తీర్పు ఈ కేసుకు సంబంధించిన ప్రత్యేక పరిస్థితుల ఆధారంగా ఇవ్వబడిందే తప్ప సర్వసాధారణ నియమంగా సాక్షుల వల్ల వ్యభిచార నేరం రుజువు కాకపోయినపుడల్లా సాక్షులకు తప్పకుండా కొరడా దెబ్బలు వేయాలని కాదు. (కేసు వివరాలకు చూడండి, 'అహ్కాముల్ ఖుర్ఆన్' ఇబ్నుల్ అరబి, సంపుటి 2; పుట 88, 89)

(20) వ్యభిచార నేరం రుజువుకాగల అంశాల్లో సాక్ష్యం కాక ఇతర అంశం, అపరాధి అంగీకారం. ఈ అంగీకారం స్పష్టంగా, సరయిన పదాల్లో వ్యభిచార చేష్ట జరిగినట్లు రూఢీ కావాలి. అంటే, తనకు నిషిద్ధమయిన ఒక స్త్రీతో "సుర్మా బుడ్డిలో పుల్లలాగా" తాను ఆ చర్యకు పాల్పడ్డాడని అతను అంగీకరించాలి. దోషి ఎలాంటి బాహ్యాపరమయిన ఒత్తిడి లేకుండా, స్వయంగా తానయి, చేతనావస్థలో ఈ అంగీకారం చేస్తున్నాడని న్యాయస్థానం పూర్తిగా తృప్తి చెందాలి. కొందరు ధర్మశాస్త్రవేత్తలు, ఒక్కసారి అంగీకరించడం చాలదని, దోషి నాలుగుసార్లు, వేర్వేరుగా అంగీక రించాలని అంటారు. (ఇది ఇమామ్ అబూ హనీఫా, ఇమామ్ అహ్మద్, ఇబ్ను అబీలైలా, ఇస్‌హాక్ బిన్ రాహవయ, హసన్ బిన్ సాలిహ్ అనుసరించే పంథా). మరికొందరి ప్రకారం ఒకే అంగీకారం సరిపోతుంది. (ఇమామ్ మాలిక్, ఇమామ్ షాఫియీ, ఉస్మాన్ అల్ బత్తి, హసన్ బస్రీ ప్రభృతులు దీన్ని సమ్మతిస్తారు). పోతే, దీన్ని సమర్థించే మరే ఇతర సాక్ష్యాధారం లేకుండా, కేవలం దోషి చేసిన ఒప్పుకోలు ఆధారంగానే తీర్పు జరిగిన పక్షంలో సరిగ్గా శిక్షను అమలు జరిపే స్థితిలో కూడా మధ్యలోనే అపరాధి తన అంగీకారాన్ని కాదంటే శిక్షను ఆపివెయ్యాలి. అతను దెబ్బల బాధకు తట్టుకోక వాటిని తప్పించుకోవడానికే తన ఒప్పుకోలును కాదంటున్నాడన్న విషయం అతి స్పష్టంగా వ్యక్తమవుతూ ఉన్నప్పటికీ శిక్షను ఆపివెయ్యాలి. ఈ చట్టం మొత్తానికి మూలాధారాలు వ్యభిచారం కేసులకు సంబంధించిన హదీసుల్లో ఉన్న దృష్టాంతాలు, అన్నింటి కంటే పెద్ద కేసు 'మాఇజ్ బిన్ మాలిక్ అస్లమీ'

కేసు. దీన్ని అనేకమంది సహచరుల ద్వారా అనేక మంది ఉల్లేఖనకర్తలు ఉటంకించారు. దాదాపు అన్ని హదీసు గ్రంథాల్లోనూ దీని ఉల్లేఖనాలు ఉన్నాయి. ఈ వ్యక్తి అస్లమ్ తెగకు చెందిన ఒక అనాథ బాలుడు. హజ్రత్ హజ్జాల్ బిన్ నుఅయిమ్ ఇంట ఇతని పెంపకం జరిగింది. అక్కడ అతను బానిసత్వ బంధనాల నుండి విడుదలయిన ఒక బానిస అమ్మాయితో వ్యభిచరించాడు. హజ్రత్ హజ్జాల్ అతనికి, వెళ్ళి ప్రవక్త మహనీయుల (స)కు తన ఈ పాపాన్ని గురించి చెప్పి వెయ్యాలని, బహుశా అతని క్షమాభిక్ష కోసం ప్రార్థిస్తారేమో అన్న ఆశతో చెప్పారు. అతను వెళ్ళి ప్రవక్త మస్జిద్ లోపల ప్రవక్త (స)ని కలుసుకుని, దైవప్రవక్తా నన్ను పరిశుద్ధపరచండి, నేను వ్యభిచరించాను అని వేడుకున్నాడు. ఆయన ముఖం త్రిప్పుకుని, “అరె, వెళ్ళవయ్యా, వెళ్ళి అల్లాహ్‌ని క్షమాభిక్ష కోసం వేడుకో, తౌబా చెయ్యి” అని సెలవిచ్చారు. అతను మళ్ళీ ఎదుటికి వచ్చి అదే మాట పలికాడు. ఆయన మళ్ళీ ముఖం త్రిప్పుకున్నారు. అతను మూడవసారి కూడా అదే మాట పలికాడు, ఆయన మళ్ళీ ముఖం త్రిప్పుకున్నారు. హజ్రత్ అబూ బక్ర్ (ర) అతన్ని హెచ్చరించారు, ఇక నీవు నాల్గవ సారి మళ్ళీ అంగీకరించావంటే దైవప్రవక్త నిన్ను రాళ్ళతో కొట్టిస్తారు అని. అయినా అతను వినలేదు మళ్ళీ తన మాట రెట్టించాడు. ఇక ప్రవక్తశ్రీ (స) అతని వైపునకు మరిలారు, అతనితో అన్నారు, “బహుశా నీవు ముద్దాడి ఉంటావు, చిలిపి చేష్టలు చేసి ఉంటావు, దుష్ట సంకల్పంతో చూసి ఉంటావు (ఆపైన ఇది వ్యభిచారానికి సమానమని అనుకుని ఉంటావు)”. అతడు అది కాదన్నాడు. ఆయన అడిగారు, “నీవు ఆమెతో పడుకున్నావా?” అతను అవునని చెప్పాడు; మళ్ళీ అడిగారు, “ఆమెతో సంభోగించావా?” అతను అవునన్నాడు. మళ్లీ అడిగారు, “నీవు ఆమెతో రతిలో పాల్గొన్నావా?” అతను అవునన్నాడు. తరువాత ఆయన అరబీ భాషలో సంభోగ క్రియకు మాత్రమే వాడే ప్రత్యేక పదం ప్రయోగించారు. ఈ బూతు మాట ప్రవక్తశ్రీ (స) నోట అంతకు ముందూ ఎవ్వరూ వినలేదు, ఆ తరువాత కూడా ఎప్పుడూ వినలేదు. ఒక వ్యక్తి ప్రాణానికి సంబంధించిన విషయం కాకపోతే ఆయన పవిత్రమయిన నోటి నుండి ఎన్నడూ అలాంటి మాట వెలువడేది కాదు. కాని ఆ అబ్బాయి దీనికి సమాధానంగానూ అవునన్నాడు. ఆయన అతన్ని అడిగారు, “నీది ఆమె దానిలో దూరి మాయమయిపోయే మేరకా?” అవునన్నాడు. మళ్ళీ అడిగారు, “సుర్మాబుడ్డీలో సుర్మాపుల్లలాగా, బావిలో త్రాడులాగా మాయమయిపోయిందా?” అతను అవునన్నాడు. అడిగారు, “నీకు తెలుసా వ్యభిచారమంటే ఏమిటో?” అతను, “అవును ఒక భర్త తన భార్యతో ధర్మసమ్మతంగా చేసే చేష్టను నేను ఆమెతో అధర్మంగా చేశాను” అన్నాడు. ఆయన అడిగారు, “నీకు పెళ్ళి అయిందా?” అతను అవునన్నాడు. ఆయన అడిగారు, “నీవు సారాయి త్రాగలేదు కదా?” అతను లేదన్నాడు. ఒక వ్యక్తి లేచి అతని నోటి వాసన చూసి నిజమేనన్నాడు. తరువాత ఆయన అతని వీధి వాళ్ళ

నడిగారు, ఇతను పిచ్చివాడయితే కాదుగదా అని. వారు అతని మతి చలించినట్లు తాము చూడలేదని చెప్పారు. అప్పుడు ఆయన హజ్జాల్‌కు చెప్పారు, “నీవు అతని విషయాన్ని మరుగు పరిస్తే ఎంత బావుండేది, నీకూ అది మేలు కలిగించేది,” ఆ తరువాత ఆయన మాఇజ్‌ని రాళ్ళతో కొట్టే తీర్పు ఇచ్చారు. అతన్ని నగరానికి వెలుపల తీసుకువెళ్ళి రాళ్ళతో కొట్టివేశారు. రాళ్ళు కురియసాగగానే మాఇజ్ పరుగెత్తాడు. అతను అరవసాగాడు, “అయ్యా, నన్ను ప్రవక్త దగ్గరికి తీసుకువెళ్ళండి, నన్ను నా తెగవారు చంపేశారు, నన్ను మోసగించారు, దైవప్రవక్త నన్ను చంపించరు.” కాని కొట్టేవారు పట్టుపట్టి అతన్ని చంపివేశారు. తరువాత ప్రవక్తశ్రీ (స)కు ఈ సమాచారం తెలిసి, “మీరు అతన్ని వదలిపెట్ట లేదెందుకు? నా దగ్గరికి తీసుకువస్తే బహుశా అతను తౌబా చేసుకునేవాడేమో, అల్లాహ్ అతని పశ్చాత్తాపం స్వీకరించే వాడేమో” అన్నారు.

రెండవ సంఘటన 'గామిదియ్యా'కు సంబంధించింది. ఆవిడ గామిద్ తెగ (జుహైనా తెగలో ఒక శాఖ)కు చెందిన స్త్రీ. ఆమె కూడా వచ్చి నాలుగు సార్లు అపరాధాన్ని అంగీకరించింది, తాను వ్యభిచారానికి పాల్పడినట్లు తాను అధర్మమయిన గర్భం ధరించిందని ఒప్పుకుంది. దైవప్రవక్త (స) ఆమె విషయంలోనూ తొలి ఒప్పుకోలుకు “పోమ్మా, వెళ్ళి అల్లాహ్‌ను క్షమాభిక్షకై అర్థించు, తౌబా చేసుకో” అని చెప్పారు. కాని ఆవిడ, “దైవప్రవక్తా మీరు మాఇజ్‌లానే నన్నూ దాటవెయ్యాలని చూస్తున్నారా? నేను వ్యభిచారం వల్ల కలిగిన కడుపుతో ఉన్నాను” అని అంది. ఇక్కడ, ఒప్పుకోలుతోపాటు గర్భం కూడా దాల్చడం వల్ల మాఇజ్‌లా సవివరమయిన క్రాసు పరీక్ష చేయ లేదాయన. ఆయన దానికి, “వినవా, సరె, వెళ్ళి ప్రసవం తరువాత రా” అన్నారు. ప్రసవం తరువాత ఆమె శిశువును తీసుకువచ్చింది, “ఇక నన్ను పరిశుద్ధపరచండి” అని అర్థించింది. ఆయన, “వెళ్ళి దీనికి పాలుపట్టి, పాలు విడిచిన తరువాత రా” అన్నారు. తరువాత ఆమె పాప పాలు విడిచిన తరువాత వచ్చింది. వెంట ఒక రొట్టె ముక్క కూడా పట్టుకు వచ్చి శిశువుకు రొట్టెముక్క తినిపించి ప్రవక్తశ్రీ (స)కి చూపించింది. అప్పుడు, ఇలా విన్నవించుకుంది, “దైవప్రవక్తా, ఇప్పుడు ఇది పాలు వదలింది, చూడండి రొట్టె తింటోంది” అని. ఆ తరువాత ఆయన (స) పిల్లవాని పెంపకం ఒక వ్యక్తికి అప్పజెప్పి ఆమెను రాళ్ళతో కొట్టే శిక్ష విధించారు.

ఈ రెండు సంఘటనల్లోనూ స్పష్టంగా నాలుగు సార్లు అంగీకారాల ప్రస్తావన ఉంది. అబూ దావూద్‌లో హజ్రత్ బురైదా ఉల్లేఖనం ప్రకారం, సర్వసాధారణంగా సహచరుల అభిప్రాయంలో మాఇజ్, గామిదియ్యా నాలుగుసార్లు అంగీకరించి ఉండకపోతే వారిని రాళ్ళ శిక్ష విధించేవారు కారు. అయితే మూడవ సంఘటన (దాన్ని మేము పైన 15వ అంశంలో ప్రస్తావించాము) లో కేవలం ఈ పదాలే కనిపిస్తాయి, “పోయి అతని భార్య నడుగు, ఆమె

అంగీకరిస్తే రాళ్ళతో కొట్టించు." ఇందులో నాలుగుసార్లు అంగీకరించినట్లు లేదు. దీన్నిబట్టే ధర్మ శాస్త్రవేత్తల ఒక వర్గం, ఒక్క అంగీకారమే సరిపోతుందని వాదించారు.

(21) పైన మేము దృష్టాంతాలుగా పేర్కొన్న మూడు కేసులను బట్టి రుజువయ్యేదేమిటంటే నేరాన్ని అంగీకరించే అపరాధిని అతను ఎవరితో వ్యభిచరించాడనే విషయాన్ని అడగటం జరగదు, దీనివల్ల ఒక్కరికి బదులు ఇద్దరికి శిక్ష విధించవలసి వస్తుంది, షరీఅత్ జనుల్ని శిక్షించడానికి ఆత్రంగా ఏమీ లేదు. అయితే స్వయంగా అపరాధి ఒకవేళ తన ఈ చేష్టకు మరో సహయోగి ఫలానా వ్యక్తి అని తెలిపిన పక్షంలో ఆ రెండవ వ్యక్తినీ అడగటం జరుగుతుంది. ఆ వ్యక్తి కూడా అంగీకరించినట్లయితే ఆ వ్యక్తినీ శిక్షించడం జరుగుతుంది. కాని ఒకవేళ ఆ వ్యక్తి నిరాకరిస్తే కేవలం నేరం ఒప్పుకున్న అపరాధి మాత్రమే శిక్షకు పాత్రుడవుతాడు. ఇందులో ధర్మ శాస్త్రవేత్తల మధ్య ఒక భేదాభిప్రాయముంది. ఇలా రెండవ రూపం ముందుకు వస్తే (అంటే రెండవ సహయోగి మొదటి వ్యక్తితో వ్యభిచారానికి పాల్పడినట్లు అంగీకరించని పక్షంలో) మొదటి వ్యక్తికి వ్యభిచార శిక్ష పడుతుందా లేదా కజ్ఫ్ (అబద్ధపు నేరారోపణ) శిక్ష పడుతుందా? అన్నదే ప్రశ్న. ఇమామ్ మాలిక్, ఇమామ్ షాఫియి దృష్టిలో ఆ వ్యక్తి వ్యభిచార శిక్షకు అర్హుడు, అతడు అంగీకరించిన నేరం అదే గనక. ఇమామ్ అబూ హనీఫా, ఇమామ్ ఔజాయి అభిప్రాయంలో అతనికి కజ్ఫ్ శిక్ష పడుతుంది. రెండవ సహయోగి నిరాకరణ ఇతని అపరాధాన్ని అనుమానాస్పదం చేసివేసింది. కాని అతని అబద్ధపు నేరారోపణ అపరాధం మటుకు రుజువయినట్లే. ఇమామ్ ముహమ్మద్ తీర్పు ప్రకారం, (ఇమామ్ షాఫియి తెలిపిన ఒక అభిప్రాయం కూడా దీన్ని సమర్థిస్తుంది) అతనికి వ్యభిచార శిక్షతోపాటు అబద్ధపు నేరారోపణ శిక్ష కూడా పడాలి. తాను వ్యభిచారం చేసినట్లు అతనే అంగీకరించాడు, సహయోగిపై నేరారో పణను రుజువు చేయలేకపోయాడు. ప్రవక్త మహనీయుని సమక్షంలో ఒక కేసు ఇలాంటిదే వచ్చింది. దీనికి సంబంధించిన ఒక ఉల్లేఖనం ముస్నద్ అహ్మద్, అబూ దావూద్ లలో ఉంది. సహల్ బిన్ సఅద్ చెప్పినట్లు ఉన్న ఆ ఉల్లేఖనంలో ఇలా ఉంది: "ఒక వ్యక్తి వచ్చి ప్రవక్త మహనీయుని (స) సమక్షంలో తాను ఫలానా స్త్రీతో వ్యభిచరించినట్లు అంగీకరించాడు. ఆయన (స) స్త్రీని పిలిపించి అడిగారు. ఆమె నిరాకరించింది. ఆయన అతనికి శిక్ష విధించి ఆమెను వదిలేశారు." ఈ ఉల్లేఖనంలో ఏ శిక్ష విధించారో వివరాలు లేవు. మరో ఉల్లేఖనం అబూ దావూద్, నసాయిలో ఇబ్ను అబ్బాస్ ద్వారా ఉటంకించబడింది. దాని ప్రకారం ముందు అతని అంగీకారానికి వ్యభిచార శిక్ష విధించారు, తరువాత స్త్రీని అడిగారు, ఆమె నిరాకరించింది, అప్పుడు ఆ వ్యక్తికి కజ్ఫ్ శిక్షగా కొరడా దెబ్బలు తగిలించారు. అయితే ఈ ఉల్లేఖనం ప్రామాణికంగా బలహీనమయింది. దీని ఉల్లేఖనకర్తల క్రమంలోని కాసిమ్ బిన్ ఫయ్యాజ్‌ని చాలామంది హదీసువేత్తలు విశ్వసనీయుడు కాదన్నారు. పైగా ఈ సంఘటనను అలా ఊహిం చడం కూడా కష్టమే. ఎందుకంటే ప్రవక్త

మహనీయులు (స) ఆ మనిషికి కొరడా దెబ్బలు కొట్టించిన తరువాత స్త్రీని అడిగి ఉంటారనడం నమ్మశక్యం కాని విషయం. బుద్ధిపరంగానూ న్యాయపరంగానూ జరగవలసిన దాన్ని దైవప్రవక్త (స) కూడా ఉపేక్షించి ఉండరు, అతను ఆ స్త్రీ పేరు చెప్పగానే స్త్రీని అడగకుండా ఈ కేసులో తీర్పు చెప్పేవారు కారు. ఈ వాదననే సహల్ బిన్ సఅద్ ఉల్లేఖనం కూడా సమర్థిస్తోంది. అందువల్ల రెండవ ఉల్లేఖనం నమ్మతగింది కాదు.

(22)నేర నిరూపణ అయిన తరువాత వ్యభిచారికి, వ్యభిచారిణికి ఏ శిక్ష విధించాలి అన్న విషయంలో ధర్మశాస్త్రవేత్తల మధ్య భేదాభిప్రాయముంది. విభిన్న ధర్మశాస్త్రవేత్తల పంథాలు ఈ విషయంలో దిగువనిస్తున్నాము :

వివాహిత స్త్రీ పురుషులకు వ్యభిచార శిక్ష

ఇమామ్ అహ్మద్, దావూద్ జాహిరీ, ఇస్‌హాక్ బిన్ రాహవయ్యా దృష్టిలో వంద కొరడా దెబ్బలు, తరువాత రాళ్ళతో కొట్టడం.

మిగతా ఫిక్‌హ్‌వేత్తలు (ధర్మశాస్త్రవేత్తలు) అందరూ, వీరి శిక్ష కేవలం రాళ్ళతో కొట్టడం మాత్రమే అన్న విషయంలో ఏకాభిప్రాయం కలిగి ఉన్నారు. వీరు, రాళ్ళ శిక్షను కొరడా శిక్షతో జత చెయ్యడాన్ని అంగీకరించలేదు.

అవివాహితుల శిక్ష

★ ఇమామ్ షాఫియీ, ఇమామ్ అహ్మద్, ఇస్‌హాక్, దావూద్ జాహిరీ, సుఫ్యాన్ సౌరి, ఇబ్ను అబీ లైలా, హసన్ బిన్ సాలిహ్ దృష్టిలో వంద కొరడా దెబ్బలు, ఒక సంవత్సర కాలంపాటు నగర బహిష్కరణ, స్త్రీ పురుషులిద్దరికీ.

ఇమామ్ మాలిక్, ఇమామ్ ఔజాయి ప్రకారం పురుషునికి 100 కొరడా దెబ్బలు, ఒక సంవత్సరం నగర బహిష్కరణ, స్త్రీకి కేవలం 100 కొరడా దెబ్బలు. (నగర బహిష్కరణ అంటే వీరందరి దృష్టిలో అపరాధిని నగరం నుంచి వెలివేసి కనీసం నమాజ్ కస్ర్ చెయ్యడం తప్పనిసరి (వాజిబ్) అయ్యేంత దూరానికయినా పంపించాలి. కాని జైద్ బిన్ అలి, ఇమామ్ జాఫర్ సాదిక్ దృష్టిలో ఖైదు చేయడం వల్ల కూడా నగర బహిష్కరణ ఉద్దేశం నెరవేరుతుంది).

★ ఇమామ్ అబూ హనీఫా ఆయన శిష్యుడు ఇమామ్ అబూ యూసుఫ్, ఇమామ్ జుఫర్, ఇమామ్ ముహమ్మద్ ప్రకారం, ఈ సందర్భంలో వ్యభిచార శిక్ష (హద్ద్) స్త్రీ పురుషులిరువురికీ కేవలం 100 కొరడా దెబ్బలు. దీనిపైన అదనంగా మరే శిక్ష, ఉదాహరణకు ఖైదు, నగర బహిష్కరణ వంటివి పెంచడం, 'హద్ద్' (దైవం నిర్ణయించిన శిక్ష) క్రిందికి రాదు. అది 'తాజీర్'

(ప్రభుత్వం నిర్ణయించే శిక్ష) అవుతుంది. న్యాయమూర్తి పరిశీలించి, అపరాధి దుష్టస్వభావి అని లేదా నేరస్థుడు, నేరస్థురాలి సంబంధాలు చాలా గాఢమయినవని భావిస్తే ఆయన అవసరం రీత్యా నగర బహిష్కరణ కూడా చేయగలడు, ఖైదు కూడా విధించగలడు.

(హద్ద్, తాజీర్‌లలో గల వ్యత్యాసం ఏమిటంటే హద్ద్ నిర్ణీతమయిన శిక్ష. అది నేర నిరూపణ నిబంధనలన్నీ పూర్తి అయిన పిదప తప్పనిసరిగా విధించబడుతుంది. తాజీర్ అన్నది, చట్టం రీత్యా పరిమాణమూ, రూపమూ పూర్తిగా నిర్ణీతమయినవి కావు. కేసు పరిస్థితుల దృష్ట్యా న్యాయ స్థానం అందులో హెచ్చుతగ్గులు చేయగలదు).

ఈ విభిన్న పంథాల వారు ప్రతి ఒక్కరూ విభిన్న హదీసులను ఆధారంగా తీసుకున్నారు. వాటిని మేము ఇక్కడ పొందుపరుస్తున్నాము:

హ్రజత్ ఉబాదా బిన్ సామిత్ ఉల్లేఖనాన్ని ముస్లిమ్, అబూ దావూద్, ఇబ్నుమాజా, తిర్మిజీ, ఇమామ్ అహ్మద్ ఉటంకించారు. అందులోని పదాలు ఇలా ఉన్నాయి, "నేనిచ్చేది పుచ్చుకోండి, ఇచ్చేది పుచ్చుకోండి, అల్లాహ్ వ్యభిచారిణులయిన స్త్రీల విషయంలో విధాన నిర్ణయం చేశాడు. అవివాహిత పురుషుడు, అవివాహిత స్త్రీతో వ్యభచరిస్తే వంద కొరడా దెబ్బలు, ఒక సంవత్సర కాలం నగర బహిష్కరణ. వివాహిత పురుషుడు, వివాహిత స్త్రీతో వ్యభిచరిస్తే వంద కొరడా దెబ్బలు, రాళ్ళతో కొట్టడం." (ఈ హదీసు ప్రమాణాల రీత్యా సరయినదే అయినా సరయిన ఉల్లేఖనాల మహారాశిని గమనిస్తే మనకు తెలిసేదాన్నిబట్టి దీని మీద ప్రవక్త కాలంలో ఎప్పుడూ అమలు జరగలేదు, సన్మార్గ గాములయిన ఖలీఫాల కాలంలోనూ జరగలేదు, ఇంకా ఫిక్హ్ వేత్తల్లోనూ ఎవ్వరూ సరిగ్గా ఈ ఆదేశానికనుగుణంగా ఫత్వా ఇచ్చిన దాఖలాలూ లేవు. ఇస్లామీయ ఫిక్హ్ (ధర్మశాస్త్రం) లో ఏకగ్రీవమయిన మాట ఏమిటంటే, వ్యభిచారి, వ్యభిచారిణి రక్షితులా రక్షణలేనివారా (వివాహితులా కారా) అన్న ఒక్క విషయాన్నే వేర్వేరుగా పాటించడం జరుగుతుంది. అవివాహితుడయిన పురుషుడు, వివాహిత స్త్రీతో వ్యభిచరించినా అవివాహిత స్త్రీతో వ్యభిచరించినా ఉభయ పరిస్థితుల్లోనూ అతనికి లభించే శిక్ష ఒక్కటే. వివాహిత పురుషుడు వివాహిత స్త్రీతో వ్యభిచరించినా లేదా అవివాహిత స్త్రీతో వ్యభిచరించినా ఉభయ పరిస్థితుల్లోనూ అతనికి ఒకే శిక్ష విధించబడుతుంది. ఇదే వ్యవహారం స్త్రీకీ వర్తిస్తుంది. ఆమె వివాహిత అయితే ఎటువంటి పరిస్థితిలోనూ ఒకే శిక్షను పొందుతుంది– ఆమెతో వ్యభిచరించిన పురుషుడు వివాహితుడయినా అవివాహితుడయినా. అలాగే అవివాహిత లేదా 'కన్య' అయిన పక్షంలోనూ ఆమెకు ఒకే శిక్షపడుతుంది, ఆమెతో వ్యభిచరించినవాడు రక్షితుడా అరక్షితుడా అన్న ప్రమేయం లేకుండా).

హ్రజత్ అబూ హురైరా, హ్రజత్ జైద్ బిన్ ఖాలిద్ జుహ్‌న ఉల్లేఖనాన్ని బుఖారి, ముస్లిమ్, అబూ దావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్ను మాజా, ఇమామ్ అహ్మద్ ఉటంకించారు. దాని

ప్రకారం ఇద్దరు అరబ్బు పల్లెవాసులు ప్రవక్త మహనీయుని సన్నిధిలోకి ఒక కేసు తెచ్చారు. ఒకడు ఇలా అన్నాడు, నా కొడుకు ఇతని ఇంట కూలీకి పని చేసేవాడు. అతడు ఇతని భార్యతో అక్రమ సంబంధం ఏర్పరచుకున్నాడు. నేను ఇతనికి వంద మేకలు, ఒక దాసిని ఇచ్చి రాజీ కుదుర్చుకున్నాను. కాని తెలిసినవారు, ఇది దైవగ్రంథానికి వ్యతిరేకమని చెప్పారు. మీరు మా మధ్యన దైవ గ్రంథం రీత్యా తీర్పు చేయండి. రెండవ వ్యక్తి కూడా అన్నాడు, మీరు దైవగ్రంథం రీత్యా తీర్పు చేసి వేయండి అని. ప్రవక్తశ్రీ ఇలా అన్నారు, "నేను దైవగ్రంథం ప్రకారమే తీర్పు చేస్తాను. నీ మేకలు, దాసి నీకే తిరిగి ఇచ్చివెయ్యాలి. నీ కుమారునికి వంద కొరడా దెబ్బలు, ఒక సంవత్సరం నగర బహిష్కరణ." తరువాత ఆయన (స) అస్లమ్ తెగకు చెందిన ఒక వ్యక్తిని పిలిపించి, "ఉనైస్, నీవు వెళ్ళి ఇతని భార్యనడుగు, ఆమె అంగీకరిస్తే ఆమెను రాళ్ళతో కొట్టించు" అని పురమాయించారు. తదనుగుణంగా ఆమె అంగీకరించింది, రాళ్ళతో కొట్టించడమూ జరిగింది. (ఇందులో రాళ్ళతో కొట్టించడానికి ముందు కొరడా దెబ్బల ప్రస్తావన లేనే లేదు. పెళ్ళికాని పురుషునికి పెళ్ళి అయిన స్త్రీతో వ్యభిచరించినందుకు కొరడా దెబ్బలతోపాటు నగర బహిష్కరణ శిక్షను సయితం విధించడం జరిగింది).

మాఇజ్, గామిదియ్యాల కేసులకు సంబంధించిన వివరాలు విభిన్న హదీసు గ్రంథాల్లో వచ్చాయి. వాటిలో దేనిలోనూ, ప్రవక్తశ్రీ(స) రాళ్ళతో కొట్టించేముందు వారికి వంద కొరడా దెబ్బలు కూడా కొట్టించారని కానరాదు.

దైవప్రవక్త (స) ఏ కేసులోనయినా రాళ్ళతో కొట్టడంతోపాటు కొరడా దెబ్బల శిక్షనిచ్చే తీర్పు ఇచ్చినట్లు ఏ హదీసులోనూ ఏ ఉల్లేఖనమూ కానరాదు. 'రక్షితు'లయిన (వివాహితులయిన) వారిచేత జరిగిన వ్యభిచారం కేసులన్నింటిలోనూ ఆయన కేవలం రాళ్ళతో కొట్టే శిక్షనే విధించారు.

హజ్రత్ ఉమర్ (ర) చేసిన ఒక ప్రసిద్ధ ప్రసంగంలో రక్షణానంతర వ్యభిచారానికి ఆయన రాళ్ళతో కొట్టే శిక్షను బలవత్తరంగా ప్రతిపాదించారు. దాన్ని బుఖారీ, ముస్లిమ్, తిర్మిజీ, నసాయీ ప్రభృతులు విభిన్న ప్రమాణాల ఆధారంగా ఉటంకించారు. ఇమామ్ అహ్మద్ కూడా దీనికి సంబంధించిన అనేక ఉల్లేఖనాలను ఉటంకించారు. కాని ఈ ఉల్లేఖనాల్లో దేనిలోనూ రాళ్ళతో కొట్టడంతోపాటు కొరడా దెబ్బల ప్రస్తావన లేదు.

సన్మార్గగాములయిన ఖలీఫాలలో కేవలం హజ్రత్ అలి (ర) మాత్రమే కొరడా దెబ్బలతోపాటు రాళ్ళతో కొట్టడాన్నీ శిక్షలో చేర్చారు. ఇమామ్ అహ్మద్, ఇమామ్ బుఖారీ ఒక సంఘటనను ఆమిర్ షబీ ఉల్లేఖించినది ఉటంకించారు. అందులో షురాహ పేరు గల ఒక స్త్రీ తనకు

అక్రమమయిన గర్భం ఉందని అంగీకరించింది. హజ్రత్ అలీ (ర) ఆమెకు గురువారంనాడు కొరడా దెబ్బలు కొట్టించి శుక్రవారంనాడు రాళ్ళతో కొట్టించారు. ఇంకా ఇలా అన్నారు, మేము దైవగ్రంథం ప్రకారం ఆవిడకు కొరడా దెబ్బలు కొట్టించాము, ప్రవక్త సంప్రదాయాన్నను సరించి రాళ్ళతో కొట్టించాము. ఈ ఒక్క సంఘటన తప్ప సన్మార్గగాములయిన ఖలీఫాల కాలానికి చెందిన మరో సంఘటన రాళ్ళతో కొట్టే శిక్షతోపాటు కొరడా దెబ్బల శిక్ష విధింపును బలపరిచేది కానరాదు.

జాబిర్ బిన్ అబ్దుల్లా ఉల్లేఖనాన్ని అబూ దావూద్, నసాయి ఉటంకించారు. దాని ప్రకారం, ఒక వ్యక్తి వ్యభిచారానికి పాల్పడ్డాడు. ప్రవక్త మహనీయులు (స) అతనికి కేవలం కొరడా దెబ్బల శిక్షను విధించారు; తరువాత అతను వివాహితుడని తెలిసింది. అప్పుడు ఆయన అతన్ని రాళ్ళతో కొట్టించారు. ఇదికాక అనేక ఉల్లేఖనాలను మేము ముందు ఉటంకించాము. వాటి ద్వారా, అవివాహితులయిన వ్యభిచారులకు ఆయన కేవలం కొరడా దెబ్బలే విధించారని తెలుస్తోంది. ఉదాహరణకు, నమాజ్‌కు వెడుతున్న స్త్రీని బలాత్కారంతో మానభంగం చేసిన వ్యక్తికీ ఇంకా, వ్యభిచారంలో పాల్గొన్నట్లు స్త్రీ నిరాకరించగా తాను అంగీకరించిన పురుషునికీ.

హజ్రత్ ఉమర్, రబీఅ బిన్ ఉమయ్యా బిన్ ఖలఫ్‌ని మద్యసేవనం నేరానికి నగర బహిష్కరణ చేశారు, అతను పారిపోయి రోమనులతో కుమ్మక్కయిపోయాడు. దానికి హజ్రత్ ఉమర్, ఇక మీదట నేను నగర బహిష్కరణ శిక్షను విధించను అని అన్నారు. అలాగే హజ్రత్ అలి అవివాహిత స్త్రీ పురుషులకు వ్యభిచార నేరానికి నగర బహిష్కరణ చేయడానికి నిరాకరించారు, ఇంకా ఇందులో ఉపద్రవ ప్రమాదముంది అని అన్నారు. (అహ్కాముల్ ఖుర్ఆన్, జస్సాస్, సం.3; పుట 315)

ఈ ఉల్లేఖనాలన్నింటినీ గమనిస్తే స్పష్టంగా తేలేదేమిటంటే ఇమామ్ అబూ హనీఫా, ఆయన సహచరుల పంథాయే సరయినది. అంటే వివాహానంతర వ్యభిచారానికి శిక్ష కేవలం రాళ్ళతో కొట్టించడం, కేవలం వ్యభిచారానికి నూరు కొరడా దెబ్బలు. కొరడా దెబ్బలతోపాటు రాళ్ళతో కొట్టడాన్నీ చేర్చడం ప్రవక్త కాలం నుండి హజ్రత్ ఉస్మాన్ కాలం వరకు ఎన్నడూ జరగలేదు. పోతే కొరడా దెబ్బలతోపాటు నగర బహిష్కరణను చేర్చడం పట్ల ఒకప్పుడు అమలు జరగగా మరొకప్పుడు జరగలేదు, దీన్నిబట్టి హనఫీ పంథాలోని సవ్యత రుజువవుతుంది.

(23) కొరడా దెబ్బలు ఎలా ఉండాలి అన్న విషయానికి వస్తే మొదటి సూచన స్వయంగా ఖుర్ఆన్‌లోని పదం فَاجْلِدُوْا **"ఫజ్‌లిదూ"**లో ఉంది. 'జల్ద్' అన్న పదం 'జిల్ద్' (అంటే చర్మం) నుండి గ్రహిం చినది. దీన్నిబట్టి నిఘంటుకారులు, వ్యాఖ్యాన పండితులు అందరూ ఒకే అర్థాన్ని గ్రహించారు. దెబ్బకొడితే దాని ప్రభావం చర్మం వరకే ఉండాలి, కండరాల వరకు

చేరరాదు. కండరాలు ముక్కలయి ఎగిరేటటువంటి కొరడా దెబ్బలు, లేదా చర్మం చీరి లోపల గాయం అయ్యే దెబ్బలు కొట్టడం ఖుర్ఆన్‌కు వ్యతిరేకం.

కొట్టడానికి కొరడా ఉపయోగించినా లేదా బెత్తం ఉపయోగించినా రెంటి విషయంలోనూ అది మధ్యస్థమయినదయి ఉండాలి. మరీ లావుపాటిదీ, గట్టిదీ కారాదు, మరీ పల్చనిదీ, మెత్తనిదీ కారాదు. ముఅత్తాలో ఇమామ్ మాలిక్ ఉటంకించిన ఉల్లేఖనం ప్రకారం, ప్రవక్త మహనీయులు (స) కొట్టడానికి కొరడా తెప్పించారు. అది అధిక ఉపయోగం వల్ల బాగా బలహీనమయి పోయింది. ఆయన "దీనికన్నా గట్టిది" తెమ్మన్నారు. తరువాత కొత్త కొరడా తెచ్చారు, అది ఇంక ఉపయోగం వల్ల మెత్తబడలేదు. ఆయన రెంటికీ మధ్యస్థమయింది అని అన్నారు. తరువాత స్వారీలో ప్రయోగించిన కొరడా తీసుకువచ్చారు. ఆయన దానితో దెబ్బలు కొట్టించారు. దాదాపు ఇదే విషయాన్ని తెలిపే ఉల్లేఖనం, అబూ ఉస్మాన్ అన్నహదీ, హజ్రత్ ఉమర్‌కు సంబంధించిందీ ఉటంకించారు; ఆయన మధ్యస్థమయిన కొరడాను ఉపయో గించేవారు. (అహ్కాముల్ ఖుర్ఆన్, జస్సాస్; సం. 3; పు. 322) చివరన ముడివేసి ఉన్న కొరడా అయినా, పాయలు రెండుగా మూడుగా చీల్చిన కొరడా అయినా ఉపయోగించడం కూడా నిషిద్ధమే.

దెబ్బ కూడా మధ్యస్థంగా పడాలి. హజ్రత్ ఉమర్ (ర) కొట్టేవారిని నిర్దేశించేవారు, "నీ చంకలు బయటపడకుండా కొట్టు" అనేవారు. అంటే బాగా బలాన్ని ఉపయోగించి చెయ్యి బాగా చాచికొట్టరాదు అన్నమాట. ('అహ్కాముల్ ఖుర్ఆన్'-ఇబ్ను అరబీ; సం. 2; పు. 84. 'అహ్కాముల్ ఖుర్ఆన్'-జస్సాస్; సం. 3; పు 322). ఫిక్‌హ్‌వేత్తలందరూ ఏకగ్రీవంగా దెబ్బ గాయపరిచేదిగా ఉండకూడదని అంటారు; ఒకేచోట కొట్టరాదు, శరీరం మొత్తాన దెబ్బలను విస్తరింపజేసి కొట్టాలి. ముఖాన్నీ, మర్మస్థానాన్నీ (హనఫీ ధర్మ శాస్త్రవేత్తల దృష్టిలో తలను కూడా) తప్పించి కొట్టాలి. మిగతా ప్రతి అవయవం మీద ఎంతో కొంతదెబ్బ తగలాలి. హజ్రత్ అలీ (ర) ఒక వ్యక్తికి కొరడా దెబ్బలు వేయిస్తూ, "ప్రతి అవయవానికి దాని హక్కునివ్వు కేవలం ముఖాన్ని, మర్మ స్థలాన్నీ తప్పించు" అని పురమాయించారు. మరో ఉల్లేఖనం ప్రకారం, "కేవలం తలను, మర్మస్థలాన్నీ తప్పించు" అని అన్నారు. (అహ్కాముల్ ఖుర్ఆన్-జస్సాస్; సం. 3; పు. 321). ప్రవక్త మహనీయులు (స) సెలవిచ్చిన దాని ప్రకారం, "మీలో ఎవరయినా కొట్టే మాటయితే ముఖానికి కొట్టరాదు." (అబూ దావూద్)

పురుషుని నిలబెట్టికొట్టాలి, స్త్రీని కూర్చోబెట్టి. ఇమామ్ అబూ హనీఫా కాలంలో కూఫా న్యాయమూర్తి (కాజీ) ఇబ్ను అబీ లైలా ఒక స్త్రీని నిలబెట్టి కొరడా దెబ్బలు వేయించాడు. దానికి ఇమామ్ అబూ హనీఫా చాలా తీవ్రంగా ఆక్షేపించారు, ఆయన ఈ తీర్పును బహిరంగంగా

తప్పని ఖండించారు. (దీన్నిబట్టి కోర్టు ధిక్కారం (Contempt of Court) చట్టం విషయంలోనూ ఇమామ్ గారి అభిమతం వెల్లడవుతుంది). కొరడా దెబ్బల సమయంలో స్త్రీ తన దుస్తులన్నీ తొడిగి ఉంటుంది, ఇంకా ఆమె బట్టలు సరిగ్గా కట్టిపెట్టాలి, ఆమె శరీరం బహిర్గతం కాకుండా. కేవలం లావుపాటి బట్టలు తీసివేయబడతాయి. పురుషుని విషయంలో భేదాభిప్రాయముంది. కొందరు ఫిక్హ్‌వేత్తలు అతను కేవలం పైజామా తొడిగి ఉండాలి అని అంటారు, కొందరేమో చొక్కా కూడా తీయించరాదు అని అంటారు. హజ్రత్ అబూ ఉబైదా బిన్ జర్రాహ్, ఒక వ్యభిచారికి కొరడా దెబ్బల శిక్ష విధించారు. అతను, "ఈ పాపిష్టి శరీరం బాగా దెబ్బలు తినాలి" అంటూ చొక్కా తీసివెయ్యసాగాడు. హజ్రత్ అబూ ఉబైదా, అతన్ని చొక్కా తీయనివ్వకండి అని అన్నారు. ('అహ్కాముల్ ఖుర్ఆన్'- జస్సాస్; సం. 3; పు. 322). హజ్రత్ అలీ కాలంలో ఒక వ్యక్తికి కొరడా దెబ్బలు తగిలించారు, అతను అప్పుడు దుప్పటి కప్పుకుని ఉన్నాడు. తీవ్రమయిన చలిలోగాని, మరీ తీవ్రమయిన ఉష్ణోగ్రతలో గాని కొట్టరాదు. చలికాలంలో వెచ్చగా ఉన్నప్పుడు, వేసవిలో చల్లగా ఉన్నప్పుడు కొట్టాలి.

కట్టివేసి కొట్టడానికి కూడా అనుమతి లేదు, అపరాధి పరిగెత్తడానికి ప్రయత్నిస్తే తప్ప. హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్ఊద్(ర) ఇలా సెలవిచ్చారు, "ఈ సముదాయంలో దిగంబరంగా, కంబానికి కట్టి కొట్టడం ధర్మసమ్మతం కాదు."

ధర్మశాస్త్రవేత్తలు, ప్రతిరోజూ కనీసం ఇరువయ్యేసి కొరడా దెబ్బలు వేయించడాన్ని సమ్మతించారు. కాని ఒకేసారి మొత్తం శిక్షను అమలుపరచడం ఉత్తమమయింది.

కొట్టే బాధ్యత మూఢ కటిక వారికి ఇవ్వరాదు. జ్ఞానసంపన్నులు, విద్వాంసులు ఈ సేవలొన ర్చాలి, వీరు షరీఅత్ కోరేదేమిటో దాన్ని నెరవేర్చడానికి ఎలా కొట్టాలో బాగా తెలిసిన వారయి ఉండాలి. 'జాదుల్ మఆద్'లో ఇబ్ను కయ్యిమ్ ఇలా వ్రాశారు, ప్రవక్త మహనీయుని (స) కాలంలో హజ్రత్ అలీ, హజ్రత్ జుబైర్, మిక్దాద్ బిన్ అమ్ర్, ముహమ్మద్ బిన్ మస్లమ, ఆసిమ్ బిన్ సాబిత్, జహ్హాక్ బిన్ సుఫ్యాన్ వంటి సజ్జనులు, ప్రముఖులు 'కొట్టే' సేవలకు నియుక్తులయ్యేవారు. (సం. 1, పు. 44, 45)

అపరాధి వ్యాధిగ్రస్తుడయితే, అతడు ఆరోగ్యవంతుడయ్యే ఆశలేకపోతే, లేదా అతను పండు ముసలి అయినట్లయితే వంద రెమ్మలున్న ఒక కొమ్మతో లేదా వందపుల్లలున్న ఒక చీపురుతో కేవలం ఒకసారి కొడితే చాలు, అలా చట్టం ఆవశ్యకతను నెరవేర్చడమవుతుంది. ప్రవక్త మహనీయుని కాలంలో ఒక ముసలి వ్యాధిగ్రస్తుడు వ్యభిచార నేరంలో పట్టుబడ్డాడు. ఆయన (స) అతనికి ఇదే శిక్షను విధించారు. (అహ్మద్, అబూదావూద్, నసాయి, ఇబ్ను మాజా).

గర్భం ధరించిన స్త్రీకి కొరడా దెబ్బల శిక్ష అమలు జరిపేదుంటే, ప్రసవం తరువాత ప్రసవ స్రావం ఆగిన తరువాతి వరకు నిరీక్షించవలసి ఉంటుంది. రాళ్ళతో కొట్టే శిక్ష అయినట్లయితే పిల్లవాడు పాలు వదిలే వరకు శిక్ష అమలుజరపరాదు.

వ్యభిచారం సాక్ష్యాల ఆధారంగా నిరూపితమయితే సాక్షులు కొట్టడం మొదలెట్టాలి. మరి అంగీకారం ఆధారంగా శిక్షించబడే మాటయితే న్యాయమూర్తి (కాజి) స్వయంగా ప్రారం భించాలి. అలా సాక్షులు తమ సాక్ష్యాన్ని, న్యాయమూర్తి తన తీర్పును ఆటగా భావించకుండా ఉంటారు. షురాహ కేసులో హజ్రత్ అలి (ర) రాళ్ళతో కొట్టే శిక్ష విధించినప్పుడు, "ఇతని అపరాధానికి ఎవరయినా సాక్షులు ఉండి ఉంటే అతనే దెబ్బలను ప్రారంభించవలసి ఉండేది, కాని ఇతనికి అంగీకారం మూలంగా శిక్ష విధించబడుతోంది, అందువల్ల స్వయంగా నేనే ప్రారంభిస్తాను" అని సెలవిచ్చారు. హనఫీ ధర్మశాస్త్రవేత్తల దృష్టిలో ఇలా చెయ్యడం తప్పనిసరి. షాఫియా దీన్ని విధిగా భావించరు. అయితే అందరి అభిప్రాయంలో ఇదే సముచితమయిన పద్ధతి.

కొరడా దెబ్బల శిక్షకు సంబంధించిన పై వివరాలను చూడండి, దీనితోపాటు దీనిని క్రూరమయిన శిక్షలుగా అభివర్ణించే వారి సాహసాన్నీ కొనియాడండి. వీరు దీన్ని కిరాతకమయినదని అంటారు కాని నేడు జైళ్ళల్లో ఇచ్చే కొరడా దెబ్బల శిక్ష వీరి దృష్టిలో చాలా సంస్కారవంత మయింది. నేటి చట్టం రీత్యా కేవలం న్యాయస్థానానికి మాత్రమే కాదు, ఒక సాధారణ జైలు సూపరింటెండెంటుకు కూడా ఒక ఖైదీ ఆజ్ఞోల్లంఘన చేసినందుకు లేదా అమర్యాదగా ప్రవర్తించిన తప్పుకు 30 బెత్తం దెబ్బల శిక్ష విధించే అధికారం కలదు. ఈ బెత్తం దెబ్బలకుగాను ఒక మనిషికి ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వబడుతుంది. అతను నిత్యం దీని అభ్యాసం చేస్తూనే ఉంటాడు. ఈ ఉద్దేశంతో బెత్తాలను కూడా ప్రత్యేకంగా తడిపి ఉంచి సిద్ధపరుస్తారు, అది పడగానే శరీరాన్ని కత్తిలా కోసి వెయ్యగలిగేలా ఉంటుంది. నేరస్థుణ్ణి వివస్త్రుణ్ణి చేసి, దాని కోసమే తయారు చేసిన కొయ్యకు కట్టివేయడమూ జరుగుతుంది, అతడు విలవిల్లాడటానికి కూడా తావుండదు. అతని మర్మస్థానాన్ని మరుగు పరచడానికి పల్చటి బట్ట ఒకటి మాత్రం ఉండనిస్తారు. దాన్నీ టింక్చర్ అయోడిన్‌తో తడిపి పెడతారు. కటికవాడు దూరం నుంచి పరిగెత్తుకు వస్తాడు, పూర్తి బలాన్నుపయోగించి కొడతాడు. దెబ్బ ఒకే ప్రత్యేక శరీర భాగాన (అంటే పిరుదుల మీద) ఎడతెగకుండా వేయడం జరుగుతుంది, కడకు అక్కడి కండరాలు ఖీమాగా మారి ఎగురుతూ ఉంటాయి. కొన్నిసార్లయితే ఎముకలు కనిపిస్తుంటాయి. తరచుగా, ఎంతో బలవంతుడయిన మనిషి కూడా 30 దెబ్బలు పూర్తిగా పడక ముందే స్పృహ కోల్పోతాడు, అతని గాయం మానడానికి సుదీర్ఘకాలం పడుతుంది. ఈ "నాగరికమయిన" శిక్షను నేడు జైళ్ళల్లో స్వయంగా అమలు పరిచే పెద్దలకు, ఇస్లామ్ విధించిన కొరడా దెబ్బల శిక్షను "క్రూరమయిన" శిక్షగా అభివర్ణించగలగడానికి ఏ విధంగా

ముఖం చెల్లుతుంది? పైగా, నిరూపిత అపరాధులకు కాదు కేవలం అనుమానితులకు విచారణ కోసమని (ముఖ్యంగా రాజకీయ అపరాధాల అనుమానంతో) వీరి పోలీసు ఇచ్చే యాతనలు ఎటువంటివో నేడు ఎవరికీ తెలియనివికావు.

(24) రాళ్ళు కొట్టే శిక్ష వల్ల అపరాధి మరణిస్తే అతని పట్ల పూర్తిగా ముస్లిముల మాదిరిగానే వ్యవహరించాలి. అతని శవ వస్త్రధారణ ఇత్యాదివి (తజ్హీజ్ వ తక్ఫీన్) నియమానుసారం చేయాలి. అతని జనాజా నమాజ్ చేయాలి. అతన్ని గౌరవంగా ముస్లిముల కబరస్తాన్ (ఖనన వాటిక)లో ఖననం చేయాలి. అతని కోసం క్షమాపణకై దుఆ చేయాలి, ఎవరూ అతని పట్ల చెడుగా ప్రస్తావించకూడదు. బుఖారీలో జాబిర్ బిన్ అబ్దుల్లా అన్సారి ఉల్లేఖనం ప్రకారం, రాళ్ళతో కొట్టే శిక్ష వల్ల మాఇజ్ బిన్ మాలిక్ మృతి చెందినప్పుడు ప్రవక్త మహనీయులు అతన్ని గురించి మంచిగా ప్రస్తావించారు, అతని జనాజా నమాజ్ స్వయంగా చేయించారు. 'ముస్లిమ్'లో హజ్రత్ బురైదా ఉల్లేఖనం ఉంది. దాని ప్రకారం, ప్రవక్తశ్రీ ఇలా పలికారు, "మాఇజ్ బిన్ మాలిక్ కోసం క్షమాపణకై దుఆ చెయ్యండి, అతను చేసిన తౌబా, (పశ్చాత్తాప ప్రక్రియ) ఒక సముదాయం మొత్తానికి పంచి పెడితే అది అందరికీ సరిపోతుంది." అదే ఉల్లేఖనంలో ఇంకా ఇలా ఉంది, 'గామిదియ్యా' రాళ్ళతో కొట్టడం వల్ల మరణించినప్పుడు ప్రవక్తశ్రీ స్వయంగా ఆమె జనాజా నమాజ్ చేయించారు. అప్పుడు ఖాలిద్ బిన్ వలీద్ ఆమె విషయాన్ని చెడుగా ప్రస్తావించగా, "ఖాలిద్ ఆపు! నా ప్రాణం గుప్పెట్లో పెట్టుకున్న స్వామి సాక్ష్యంగా చెబుతున్నాను, ఆమె చేసిన తౌబా ఎంత గొప్పదంటే, అన్యాయపరంగా పన్నులు వసూలు చేసేవాడు సయితం అలాంటి తౌబా చేస్తే అతను మన్నించివేయబడతాడు." అబూదావూద్‌లో హజ్రత్ అబూ హురైరా (ర) ఉల్లేఖనం ఒకటుంది, దాని ప్రకారం మాఇజ్ సంఘటన తరువాత ఒక రోజున ప్రవక్తశ్రీ (స) దారిగుండా వెడుతుండగా ఇద్దరు వ్యక్తులు మాఇజ్ ప్రస్తావన చెడుగా చేస్తూ ఉండటాన్ని విన్నారు. కొన్ని అడుగులు ముందుకు వెళ్ళిన తరువాత ఒక గాడిద కళేబరం కనిపించింది. ప్రవక్తశ్రీ(స) నిలిచిపోయారు. వారిద్దరితో అన్నారు, "తమరు ఇందులో నుంచి కొంత సేవిస్తే బావుంటుంది." వారు, "దైవప్రవక్తా! దీన్ని ఎవరు తింటారు?" అని జంకారు. అపుడు ఆయన ఇలా సెలవి చ్చారు, "ఇందాక మీరు మీ సోదరుని గౌరవాభిమానాల నుండి తిన్నది దీనికన్నా నికృష్ఠమయినది." ముస్లిమ్‌లో ఇమ్రాన్ బిన్ హుసైన్ ఉల్లేఖనం ప్రకారం హజ్రత్ ఉమర్ (ర) గామిదియ్య జనాజా నమాజ్ సందర్భంలో, "ప్రవక్తా, ఇక ఈ వ్యభిచారిణి జనాజా నమాజ్ చేయడమా?" అని అడగ్గా దైవప్రవక్త (స), "ఈమె చేసిన తౌబా మదీనా వాసులందరికీ పంచి ఇచ్చినా అందరికీ సరిపడుతుంది" అని చెప్పారు. బుఖారీలో హజ్రత్ అబూ హురైరా (ర) ఉల్లేఖనం: ఒక వ్యక్తికి మద్యపాన నేరానికి శిక్ష విధించబడుతూ ఉండింది, అక్కడున్న వారి నోటి నుండి, "దైవం నిన్ను

పరాభవం పాలుజెయ్యుగాక" అన్న మాటలు వెలువడ్డాయి. దానికి ప్రవక్త మహనీయులు, "అలా అనకు, అతనికి వ్యతిరేకంగా షైతాన్‌ని బలపరచకు" అని అన్నారు. అబూ దావూద్‌లో అదనంగా ఇంకా ఇలా అన్నట్టు ఉంది, "అలాకాక **అల్లాహుమ్మగ్ ఫిర్‌లహూ, అల్లాహుమ్మర్ హమ్‌హు** (అల్లాహ్ అతన్ని క్షమించు, అల్లాహ్ అతన్ని కరుణించు) అని పలుకు." ఇది ఇస్లామ్‌లో శిక్షలోని సారం. ఇస్లామ్ ఎంత పెద్ద నేరస్థుడినయినా శత్రుత్వ భావనతో శిక్షించదు, శ్రేయోభిలాషతో శిక్షిస్తుంది, ఇక శిక్షించిన తరువాత అతని పట్ల కారుణ్యం, వాత్సల్యాలతో వీక్షిస్తుంది. నేడు కానవచ్చే ఏహ్యాభావం, ఆధునిక సంస్కృతి సృష్టించిన సంకుచిత మనస్సు. ప్రభుత్వ సేన లేదా పోలీసులు ఎవరినయినా చంపివేస్తే ఏదయినా న్యాయస్థానం విచారణ జరిపి ఎవరికయినా మరణదండన విధిస్తే అటువంటి వ్యక్తి జనాజా నెత్తడానికి కూడా ఎవరూ ఇష్టపడరు, అతని పట్ల ఒక మంచి మాట పలకడానికయినా వినడానికయినా ఎవరూ ఇష్టపడరు. పరిస్థితి ఇలా ఉండగా 'నైతిక సాహసం' (ఇది ఆధునిక సంస్కృతిలో సిగ్గులేని మొండితనానికి నాగరిక నామం!) ఎంతగా తలకెక్కిందంటే వీరు ప్రపంచానికి సహిష్ణుతా బోధనలు చేయడానికి బయలుదేరారు.

(25)నిషిద్ధ స్త్రీలతో వ్యభిచారానికి సంబంధించిన షరీఅత్ చట్టం ఖుర్ఆన్ అవగాహనం అన్‌నిసా – సం. 2: పాదసూచిక 33లోనూ, స్వలింగ సంపర్కానికి సంబంధించిన షరీఅత్ నిర్ణయాలు ఖుర్ఆన్ అవగాహనం–సం. 2: ఆరాఫ్: పాదసూచికలు 64–68లోనూ వివరించబడ్డాయి. పోతే జంతువులతో దుశ్చేష్ట విషయంలో కొందరు ఫిక్‌హ్‌వేత్తలు దీన్ని కూడా వ్యభిచారం ఆదేశంలోనే పరిగణిస్తారు. దీనికి పాల్పడిన వారిని వ్యభిచారానికి సంబంధించిన హద్ద్ (శిక్ష)కు అర్హులని భావిస్తారు. అయితే ఇమామ్ అబూ హనీఫా, ఇమామ్ అబూ యూసుఫ్, ఇమామ్ ముహమ్మద్, ఇమామ్ జుఫర్, ఇమామ్ మాలిక్, ఇమామ్ షాఫియి అభిప్రాయంలో ఇది వ్యభిచారం కాదు. అందువల్ల దీని కర్త వ్యభిచార శిక్షకాక ప్రభుత్వ శిక్ష (తాజీర్)కు పాత్రుడవుతాడని అంటారు. తాజీర్‌ను గురించి మేము లోగడ చెప్పాము, దాని నిర్ణయం న్యాయమూర్తి అభిప్రాయానికి వదలివేయడం జరిగింది, లేదా దేశ సలహామండలి అవసరమనుకుంటే దానికి తగిన విధానం ఏదయినా నిర్ణయించవచ్చు.

3. ప్రప్రథమమయిన విషయం ఈ ఆయత్‌లో గమనార్హమయింది ఏమిటంటే, ఇక్కడ శిక్షాస్మృతి (Criminal Law)ని 'దీనుల్లాహ్' (దైవధర్మం)గా ప్రస్తావించడం జరిగింది. దీన్నిబట్టి తెలిసేదేమిటంటే, కేవలం నమాజ్, రోజా, హజ్జ్, జకాత్ మాత్రమే ధర్మం కావు, దేశ శాసనాలు సయితం ధర్మమే. ధర్మాన్ని నెలకొల్పడం అంటే కేవలం నమాజ్‌ని స్థాపించడం మాత్రమే కాదు, దైవశాసనాంగాన్ని, షరీఅత్ వ్యవస్థను సయితం నెలకొల్పడం అన్నమాట. ఇదంతా సుస్థాపితం కాని చోట

నమాజ్ స్థాపించబడినా అక్కడ అసంపూర్ణ ధర్మసంస్థాపన జరిగిందన్నమాట. దైవధర్మశాస్త్రాన్ని తిరస్కరించి మరేదయినా శాసనాంగాన్ని అవలంబించే చోట అక్కడ మరేమో కాదు, స్వయంగా దైవధర్మాన్నే తిరస్కరించడం జరిగిందన్నమాట.

రెండవ విషయం ఇందులో గమనార్హమయింది, అల్లాహ్ చేసిన హెచ్చరిక. వ్యభిచారి, వ్యభిచారిణికి నేను ప్రతిపాదించిన శిక్ష అమలు జరపడంలో అపరాధి పట్ల దయాదాక్షిణ్యాల భావం మీకు అవరోధం కారాదు. ఈ విషయాన్నే ప్రవక్త మహనీయులు (స) ఒక హదీసులో మరింత విడమర్చి తెలిపారు. "ప్రళయదినాన ఒక అధికారి హాజరుపరచబడతాడు, అతడు హద్ద్ (శిక్ష)లో ఒక కొరడా దెబ్బ తగ్గించి ఉంటాడు. ఇలా ఎందుకు చేశావని అడగటం జరుగుతుంది. అతను, మీ దాసులపైన దయతలచి అని బదులిస్తాడు. ఓహో, వారి విషయంలో నీవు నాకన్నా అధికంగా దయగలవాడివా! అని సెలవీయడం జరుగుతుంది. అప్పుడు ఆదేశమవుతుంది, ఇతన్ని తీసుకువెళ్ళి నరకంలో పడవేయండి అని. మరో అధికారి హాజరుపరచబడతాడు, ఇతను శిక్షకు అదనంగా ఒక కొరడా దెబ్బవేయిస్తాడు. అతన్ని నీవు ఇలా ఎందుకు చేశావని అడగటం జరుగుతుంది. అతను, జనం మీ అవిధేయత నుండి దూరంగా ఉండాలని అని విన్నవించుకుంటాడు. అప్పుడు, అయితే నీవు వారి విషయంలో నాకన్నా విజ్ఞత కలవాడివా? అని సెలవీయడం జరుగుతుంది. ఆదేశమవుతుంది, ఇతన్ని తీసుకువెళ్ళి నరకంపాలు చెయ్యండి అని" (తఫ్సీర్ కబీర్, సం. 6, పు. 225). హెచ్చుతగ్గులు దయవలన లేదా ఔచిత్యాన్ని బట్టి జరిగినప్పటి విషయం ఇది. కాని ఒకవేళ ఆదేశాలలో మార్పులు చేర్పులు అపరాధుల స్థాయినిబట్టి జరిగినట్లయితే అది అతిహీనమయిన అపరాధం. సహీహైన్ (బుఖారీ, ముస్లిమ్ గ్రంథాలు)లోని హజ్రత్ ఆయిషా ఉల్లేఖనం ప్రకారం దైవసందేశహరులు (స) ఒక ప్రసంగంలో ఇలా నుడివారు, "జనులారా, మీకు పూర్వపు సముదాయాలు సమసిపోయాయి, కారణం ఏమిటంటే, వారిలో ఎవరయినా గౌరవనీయుడు దొంగతనం చేస్తే వారు అతన్ని వదలి పెట్టేవారు, మరెవరయినా బలహీనుడు దొంగతనం చేస్తే అతనికి హద్ద్ (శిక్ష) విధించేవారు." మరో ఉల్లేఖనంలో ప్రవక్తశ్రీ (స) ఇలా సెలవిచ్చారు, "ఒక హద్ద్ అమలుపరచడం భూవాసులకు నలభయి రోజుల వర్షం కన్నా ఎంతో ప్రయోజనకరమయినది." (నసాయి, ఇబ్నుమాజ).

కొందరు వ్యాఖ్యాతలు, ఈ ఆయత్ రీత్యా అపరాధం రుజువయిన తరువాత అపరాధిని వదలిపెట్టరాదు, శిక్షలోనూ ఎలాంటి తగ్గుదల చేయరాదు, పూర్తిగా వంద కొరడా దెబ్బలు కొట్టాలి అని అభిప్రాయపడ్డారు. మరికొందరు, అపరాధికి ఏ విధమయిన బాధే కలగనట్లు దెబ్బ మెల్లిగా కొట్టరాదు అనే భావం వస్తుందని అభిప్రాయపడ్డారు. ఆయత్‌లోని పదాలలో రెండు భావాలకూ అవకాశముంది, ఇంకా యదార్థానికి రెండూ ఉద్దేశించబడినవని అనిపిస్తోంది. పైగా వ్యభిచారికి దైవం నిర్ణయించిన శిక్షనే విధించాలి, దీన్ని మరో శిక్షగా మార్చరాదు అనే ఉద్దేశమూ ఉంది.

اَلزَّانِیۡ لَا یَنۡکِحُ اِلَّا زَانِیَۃً اَوۡ مُشۡرِکَۃً ۫ وَّالزَّانِیَۃُ لَا یَنۡکِحُہَاۤ اِلَّا زَانٍ

اَوۡ مُشۡرِکٌ ۚ وَ حُرِّمَ ذٰلِکَ عَلَی الۡمُؤۡمِنِیۡنَ ﴿۳﴾

3 వ్యభిచారి నికాహ్ చేసుకుంటే వ్యభిచారిణితో లేదా బహుదైవారాధకురాలితో తప్ప చేసుకోరాదు. అలాగే వ్యభిచారిణితో నికాహ్ చేసుకోవాలంటే వ్యభిచారి లేదా బహుదైవారాధకుడు తప్ప చేసుకోరాదు. విశ్వసించిన వారికి ఇది హరామ్ (నిషిద్ధం) చెయ్యబడింది.[5]

కొరడా దెబ్బలకు బదులుగా మరేదయినా శిక్షను, కరుణ, కటాక్షాల వల్ల విధించడమయితే ఇది పాతకం. ఇంకా కొరడా దెబ్బల శిక్ష కిరాతకమయింది అన్న భావంతోనయితే అది దైవధిక్కారం, ఈ భావన విశ్వాసంతోపాటు ఒక్క క్షణ కాలంపాటు కూడా ఒకే ఆంతర్యంలో మనజాలదు. దైవాన్ని దైవంగా నమ్ముతూ, ఆయన్ని (దైవం మన్నించుగాక) కిరాతకమయిన వాడుగా భావించడం, కేవలం నీచాతినీచమయిన కపటులకే సాధ్యం.

4. అంటే శిక్ష ప్రకటితంగా, బహిరంగంగా, సాధారణ ప్రజల సమక్షంలో అమలు జరపాలి. దానివల్ల ఒకవైపున అపరాధికి అవమానం కలగాలి, మరోవైపున సాధారణ ప్రజలకు గుణపాఠం కాగలగాలి. దీని వల్ల ఇస్లామ్‌లో శిక్షకు సంబంధించిన దృక్పథం ఏమిటో విశదంగా వెలుగులోకి వస్తుంది. మాఇద సూరాలో దొంగతనానికి శిక్షను వెల్లడిస్తూ ఇలా సెలవీయడం జరిగింది, “ఇది వారు సంపాదించుకున్న దాని ప్రతిఫలం, దైవం విధించిన బుద్ధి గరిపే శిక్ష” (ఆయత్ : 38). ఇక్కడ, వ్యభిచారిని బహిరంగంగా, జనుల సమక్షంలో శిక్షించాలని నిర్దేశించడం జరుగుతోంది. దీన్నిబట్టి ఇస్లామీయ శాసనం ప్రకారం శిక్షకు మూడు ఉద్దేశాలున్నాయి. ఒకటి, అపరాధికి అతను చేసిన అత్యాచారానికి ప్రతీకారం తీసుకోవడం, ఇంకా మరో వ్యక్తి పట్ల లేదా మరో సమాజం పట్ల అతను చేసిన చెడుకు ప్రతిఫలాన్ని చవిచూపించడం. రెండు, అతన్ని ఆ అపరాధం తిరిగి చెయ్యకుండా నిరోధించడం. మూడు, అతనికి శిక్షను ఒక గుణపాఠం గరిపేదిగా చేయడం, తద్వారా సమాజంలో దుష్టభావాలుగల ఇతరుల మస్తిష్కాల ఆపరేషన్ జరిగి, వారు ఇలాంటి ఏ అపరాధానికీ ఒడిగట్టే సాహసం చేయకుండా ఉండాలన్నది. ఇదీకాక బహిరంగ శిక్ష విధించడం వల్ల మరో ప్రయోజనం, ఇటువంటి సందర్భంలో అధికారులు శిక్షను అమలు జరపడంలో అసంబద్ధంగా రాయితీనివ్వడానికో, కాఠిన్యం ప్రదర్శించడానికో సాహసించడం సాధ్యమవదు.

5. అంటే తౌబా చేయని (పశ్చాత్తాపంతో దైవం వైపునకు మరలని) వ్యభిచారికి తగినదయితే వ్యభిచారిణే కాగలదు లేదా బహుదైవారాధకురాలు. ఒక సదాచారవతి, విశ్వాసురాలికి అతను

తగిన వాడు కాదు, విశ్వసించినవారు, తమ కూతుళ్ళను తెలిసీ ఇటువంటి అత్యాచారులకు ఇవ్వడం నిషిద్ధం (హరామ్). అలాగే తౌబా చేయని వ్యభిచారిణికి తగినవాడయితే ఆమెలాంటి వ్యభిచారియో లేదా బహుదైవారాధకుడో. అంతేగాని, ఒక సదాచారవర్తనుడయిన విశ్వాసికి వారు తగినవారు కారు. ఏ స్త్రీల చెడు నడతను గురించి తమకు తెలుసో అలాంటి వారితో తెలిసీ నికాహ్ చేసుకోవడం విశ్వాసులయిన వారికి నిషిద్ధం (హరామ్). ఈ ఆదేశం కేవలం, తమ దుష్ట వైఖరిని విడిచిపెట్టని మొండి స్త్రీ పురుషులకే వర్తిస్తుంది. ఎవరయితే తౌబా చేసుకుని (పశ్చాత్తాపంతో దైవం వైపునకు మరలి) తమను సంస్కరించుకుంటారో వారికి ఇది వర్తించదు, ఎందుకంటే తౌబా చేసి తమను సంస్కరించుకున్న తరువాత 'వ్యభిచారులు' అన్న గుణవాచకం వారితోపాటు మిగులదు.

వ్యభిచారితో నికాహ్ నిషిద్ధం అంటే భావం ఇమామ్ అహ్మద్ బిన్ హన్బల్ ప్రకారం నికాహ్ చేసినా అది నెలకొనదు, చెల్లదు అన్నది. కాని నిజానికి దీని ఉద్దేశం కేవలం వారించడమే, కాని ఎవరయినా నిషేధాజ్ఞల్ని ఉల్లంఘించి నికాహ్ చేసుకుంటే అది చట్టపరంగా నికాహ్గా చెల్లదన్నది, నికాహ్ చేసుకున్న వారిరువురూ వ్యభిచారులుగానే పరిగణించబడతారన్నది సరయినది కాదు. దైవప్రవక్త (స) సూత్రప్రాయంగా ఈ నియమాన్ని సెలవిచ్చారు, "హరామ్, హలాల్ని హరామ్ చెయ్యదు" అని (తబ్రానీ, దార్‌కుత్నీ). అంటే ఒక చట్టవిరుద్ధమయిన చేష్ట, మరో చట్టబద్ధమయిన చేష్టను, చట్టవిరుద్ధంగా మార్చదు. అందువల్ల వ్యభిచరించిన ఒక వ్యక్తి చట్టబద్ధంగా నికాహ్ చేసుకున్నా అది వ్యభిచారంగానే పరిగణించబడటానికి ఏ కారణమూలేదు. ఇంకా నికాహ్ ఒప్పందంలోని రెండవ వ్యక్తి, దుశ్చేష్టకు పాల్పడనిదే దుశ్చేష్ట చేసినట్లు పరిగణించడం జరగదు. సూత్రప్రాయంగా ఒక్క తిరుగుబాటు తప్ప మరే చట్టవిరుద్ధమయిన చేష్ట అయినా, దాన్ని చేసిన వారిని చట్ట బహిష్కృతులు(Out Law)గా మార్చదు - అలాంటి వారి ఏ చర్యనయినా సరే చట్టబద్ధం కానిదిగా పరిగణించడానికి. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని ఆయత్ని పరిశీలిస్తే ఆయత్ ఉద్దేశ్యం స్పష్టంగా బోధపడుతుంది. ఎవరి దుర్వర్తనం అందరికీ తెలిసే ఉంటుందో వారిని నికాహ్ కోసం ఎన్నుకోవడం పాపం, విశ్వసించిన వారు దీనికి దూరంగా ఉండాలి. దీనివల్ల దుశ్శీలురకు ప్రోత్సాహం లభించినట్లవుతుంది. నిజానికి షరీఅత్ అయితే వారిని సమాజంలోని ఒక ఏహ్యమయిన దుస్సహ వ్యక్తులుగా భావించాలని కోరుతుంది.

ఇదే విధంగా వ్యభిచారం చేసిన ముస్లిమ్ వ్యక్తి నికాహ్, బహుదైవా రాధకురాలయిన స్త్రీతోను, ముస్లిమ్ వ్యభిచారిణి నికాహ్ బహుదైవారాధకుడయిన పురుషునితోనూ జరగడం సరయినదే అన్న భావం ఈ ఆయత్ ద్వారా వెల్లడి అవుతుందనడం కూడా సరికాదు. ఆయత్ ఉద్దేశం ఏమిటంటే వ్యభిచారం చాలా నికృష్టమయిన చేష్ట. ఒక వ్యక్తి ముస్లిమ్గా ఉంటూ దానికి పాల్పడినట్లయితే, ముస్లిమ్ సమాజంలోని పరిశుద్ధులయిన, సంస్కారవంతులయిన జనులతో అతనికి సంబంధం

وَالَّذِيْنَ يَرْمُوْنَ الْمُحْصَنٰتِ ثُمَّ لَمْ يَاْتُوْا بِاَرْبَعَةِ شُهَدَآءَ فَاجْلِدُوْهُمْ ثَمٰنِيْنَ جَلْدَةً وَّلَا تَقْبَلُوْا لَهُمْ شَهَادَةً اَبَدًا ۚ وَاُولٰٓئِكَ هُمُ الْفٰسِقُوْنَ ۙ اِلَّا الَّذِيْنَ تَابُوْا مِنْۢ بَعْدِ ذٰلِكَ وَاَصْلَحُوْا ۚ فَاِنَّ اللّٰهَ غَفُوْرٌ رَّحِيْمٌ

4 – 5 మరెవరయితే శీలవతులయిన స్త్రీలపైన అపనింద మోపుతారో, ఆపైన నలుగురు సాక్షులను తీసుకురాకపోతారో, వారికి ఎనభయి కొరడా దెబ్బలు కొట్టాలి, ఇంకా వారి సాక్ష్యాన్ని ఎప్పటికీ స్వీకరించరాదు; వారు స్వయంగానే పరమ పాపులు. అయితే ఈ చేష్ట తరువాత పశ్చాత్తాపంతో మరలి తౌబా చేసుకుని తమ్ముతాము సంస్కరించుకునే వారి విషయం వేరు; అల్లాహ్ నిశ్చయంగా (ఇటువంటి వారి వ్యవహారంలో) క్షమాశీలి, కరుణామయుడు.[6]

కుదరడానికి యోగ్యత ఉండదు. అతను తనలాంటి వ్యభిచారుల లోకే వెళ్ళాలి లేదా అసలు దైవాదేశాలనే విశ్వసించని బహుదైవారాధకులలో చేరిపోవాలి.

ఆయత్ ఉద్దేశాన్ని సరిగ్గా వ్యక్తపరిచే హదీసు ఒకటుంది. ఈ సందర్భంలో ప్రవక్త మహనీయులు (స) ప్రవచించినట్లు ఉల్లేఖనముంది, అది, ముస్నద్ అహ్మద్‌లోనూ, నసాయిలోనూ అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్ ఉల్లేఖనం: ఉమ్మె మహ్జూల్ పేరుగల ఒక స్త్రీ వేశ్యావృత్తి చేసుకునేది. ఒక ముస్లిమ్ వ్యక్తి ఆమెని పెళ్ళి చేసుకోవాలని కోరుకుని ప్రవక్త (స)ను అనుమతి కోరాడు. ఆయన వారించి ప్రస్తావనలోని ఆయత్‌నే చదివారు. తిర్మిజి, అబూదావూద్ ప్రకారం, మర్సద్ బిన్ అబీ మర్సద్ అనే ఒక ప్రవక్త సహచరునికి అజ్ఞాన కాలంలో మక్కాలోని ఒక దుశ్శీల వనిత 'ఇనాక్'తో అక్రమ సంబంధాలుండేవి. తరువాత ఆయన ఆమెని నికాహ్ చేసుకోవాలని అనుకుని ప్రవక్తశ్రీ(స)ని అనుమతి అర్థించారు. రెండుసార్లు అడిగినా ఆయన (స) మౌనం వహించారు. మూడవసారి అడిగినప్పుడు ఆయన, "మర్సద్, వ్యభిచారి మాత్రమే ఒక వ్యభిచారిణిని లేదా బహుదైవారాధకురాలిని పెళ్ళి చేసుకుంటాడు, అందువల్ల ఆమెని పెళ్ళి చేసుకోకు" అన్నారు. ఇవేకాక చాలా ఉల్లేఖనాలు హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్, హజ్రత్ అమ్మార్ బిన్ యాసిర్ ద్వారా ఉటంకించబడ్డాయి. వాటి ప్రకారం ప్రవక్త మహనీయులు (స) ఇలా సెలవిచ్చారు, "దయ్యూస్' అయిన వ్యక్తి (తార్పుడు భర్త = తన భార్య దుష్చరిత అని తెలిసీ ఆమెకు భర్తగా వ్యవహరిస్తున్నవాడు) స్వర్గంలో ప్రవేశించలేడు." (అహ్మద్, నసాయి, అబూదావూద్, తయాలిసీ). షెయిఖైన్ (అబూబక్ర్, ఉమర్

రజి అల్లాహు అన్హుమా) ఆచరణా విధానం ఏమిటంటే, అవివాహిత స్త్రీ పురుషులు వ్యభిచార నేరానికి పట్టుబడితే వారికి కొరడా దెబ్బల శిక్ష విధించి, తరువాత వారిరువురికీ నికాహ్ జరిపించేవారు. ఇబ్ను ఉమర్ ప్రకారం, ఒక రోజు ఒక వ్యక్తి చాలా ఆందోళనగా మహనీయ అబూబక్ర్ వద్దకు వచ్చాడు, ఏదో మాట్లాడాలని ప్రయత్నించాడు, నోరు పెగలలేదు. హజ్రత్ అబూ బక్ర్ (ర) మహనీయ ఉమర్ (ర)కు పురమాయించారు, ఇతన్ని ప్రక్కకు తీసుకువెళ్ళి సమాచారం ఏమిటో అడుగు అని. హజ్రత్ ఉమర్ (ర) అడగ్గా అతను చెప్పాడు, ఒక వ్యక్తి తన ఇంటికి అతిథిగా వచ్చాడని, అతను తన కూతురుతో దుశ్చేష్టకు పాల్పడ్డాడని. హజ్రత్ ఉమర్ (ర) విని, "నీ పాడుగాను, నీవు నీ కూతురు చెడుగును మరుగు పరచవలసింది కదా" అని విచారం వ్యక్తం చేశారు. కడకు ఆ అమ్మాయి, అబ్బాయి, ఇద్దరి మీదా కేసుపెట్టి ఇద్దరికీ హద్ద్ (శిక్ష) విధించారు. తరువాత వారిరువురికీ నికాహ్ జరిపి మహనీయ అబూ బక్ర్, వారిని ఒక సంవత్సర కాలంపాటు నగర బహిష్కారం విధించారు. ఇలాంటి కొన్ని సంఘటనలు కాజీ అబూ బక్ర్ ఇబ్నుల్ అరబీ తన గ్రంథం 'అహ్కాముల్ ఖుర్ఆన్'లో ఉటంకించారు. (సంపుటి 2, పుట. 86).

6. ఈ ఆదేశానికి ఉద్దేశం ఏమిటంటే, సమాజంలో జనుల మధ్య ప్రణయ గాథల ప్రస్తావనల, అక్రమ సంబంధాల చర్చలకు పూర్తిగా మూతబడాలి. ఎందుకంటే దీనివల్ల అసంఖ్యాకమయిన చెడులు వ్యాపిస్తాయి. వీటిలో ఓ మహా చెడుగు, ఈ విధంగా అసంకల్పితంగానే వ్యభిచారయుత వాతావరణం సర్వసామాన్యమయిపోతూ ఉండటం. ఒక వ్యక్తి, నిజమయినవో, బూటకమయిన గాథలో, రొంపికథలో ఇతరుల సమక్షంలో ఎంతో రుచికరంగా వినిపిస్తూ ఉండగా ఇతరులు వాటిలో ఉప్పూ కారం కలిపి జనంలో వ్యాపింపజేస్తూ ఉంటారు. దానితోపాటు ఇంకా మరి కొందరిని గురించి కూడా తమకు తెలిసిన సమాచారం లేదా అనుమానాలు వెల్లడిస్తూ ఉంటారు. ఇలా కామభావనల ఒక ప్రభంజనం సర్వసామాన్యమయిపోతుంది. అంతేకాక దీని ద్వారా సమాజంలో ఎక్కడెక్కడ తమ అదృష్టాన్ని పండించు కునే అవకాశాలున్నాయో అన్న విషయం కూడా దుష్టబుద్ధిగల స్త్రీ పురుషులకు తెలిసిపోతుంది. షరీఅత్ ఈ చెడును తొలి అడుగులోనే ఆపివెయ్యాలని వాంఛిస్తోంది. ఒక వైపున అది, ఎవరయినా వ్యభిచారానికి ఒడిగడితే, సాక్ష్యాధారాల ద్వారా ఆ నేర నిర్ధారణ జరిగితే, వారికి మరే అపరాధానికీ విధించనటువంటి అంతిమ శిక్షను విధించాలి అని ఆదేశిస్తుంది. మరోవైపున ఎవరయినా మరొకరిపై వ్యభిచార అభియోగం మోపినట్లయితే అతను సాక్ష్యాధారాలతో తన ఆరోపణను నిరూపించాలి లేకపోతే ఎనభయి కొరడా దెబ్బల శిక్షకు సిద్ధమవ్వాలి అని నిర్ణయిస్తుంది. తద్వారా, అతను ముమ్ముందు ఎన్నడూ ఇటువంటి మాట నిరాధారంగా పలికే సాహసం చేయకుండా ఉండాలని వాంఛిస్తుంది. ఒకవేళ నిందమోపేవాడు ఎవరినయినా దుశ్చేష్టకు పాల్పడుతూ ఉండగా తన కళ్ళతో చూసినా అతడు మౌనం వహించాలి, దాన్ని ఇతరుల వరకు చేరవెయ్యరాదు, ఎక్కడి మురికి అక్కడే పడి ఉండనివ్వాలి, ఇతర చోట్లకు

వ్యాపించకుండా జాగ్రత్త పడాలి. అయితే తగిన సాక్ష్యాలు లభించినట్లయితే సమాజంలో పోకిరి చర్చలు జరపడానికి బదులు వ్యవహారాన్ని తగిన అధికారుల వద్దకు చేరవేసి, న్యాయస్థానంలో ముద్దాయి అపరాధాన్ని నిరూపించి శిక్ష పడేలా చేసే వాతావరణం ఏర్పడేలా చేయాలి.

ఈ చట్టాన్ని పూర్తిగా అర్థం చేసుకునేందుకు దీని వివరాలు దృష్టిలో ఉండటం అవసరం. మేము వాటిని క్రమంగా దిగువన పొందుపరుస్తున్నాము.

(1) ఆయత్‌లో وَالَّذِينَ يَرْمُونَ **"వల్లజీన యర్మూన"** అనే పదాలు ప్రయోగించబడ్డాయి. దీనికి "ఎవరయితే నిందారోపణ మోపుతారో" అని భావం. కాని పూర్వోత్తరాలు పరిశీలిస్తే ఇక్కడ ఆరోపణ అంటే అన్ని విధాల ఆరోపణలు కావు, ప్రత్యేకంగా వ్యభిచార ఆరోపణ అని ద్యోతకమవుతోంది. మొదట వ్యభిచారానికి సంబంధించిన ఆదేశం వివరించబడింది. ముమ్మందు 'లిఆన్'కు సంబంధించిన ఆదేశం రాబోతోంది. ఈ రెంటి మధ్య ప్రస్తుత ఆదేశం స్పష్టంగా సంకేతమిస్తోంది, ఆరోపణ అంటే ఇక్కడ ఎటువంటి ఆరోపణ ఉద్దేశించబడిందో. ఇంకా ప్రయోగించిన పదాలు يَرْمُونَ الْمُحْصَنٰتِ (శీలవతులయిన స్త్రీలపైన ఆరోపణలు మోపేవారు) లోనూ సంకేతం ఉంది, ఉద్దేశం శీలానికి విరుద్ధంగా చేసే ఆరోపణ అని. పైగా ఆరోపణలు మోపేవారిని నలుగురు సాక్షులను తేవాలని కోరడం జరిగింది. ఇది ఇస్లామీయ శాసనాంగం మొత్తంలో కేవలం వ్యభిచారానికి సంబంధించిన సాక్ష్యం. ఈ పూర్వాపరాల కారణంగా ముస్లిమ్ సముదాయం అంతా ఈ ఆయత్‌లో కేవలం వ్యభిచార ఆరోపణనే ప్రస్తావించడం జరిగిందని ఏకాభిప్రాయం కలిగి ఉంది. ధర్మవేత్తలు ఈ ఆరోపణకు ప్రత్యేకంగా 'కజ్‌ఫ్' అనే పారిభాషిక పదాన్ని నిర్ణయించారు. అలా ఇతర నిందారోపణలు (ఉదాహరణకు, ఎవరినయినా దొంగ అని, త్రాగుబోతు అని, వడ్డీ తినే వాడని, ధర్మతిరస్కారి అని ఆరోపించడం) దీని పరిధిలోకి రాకుండా జాగ్రత్తపడ్డారు. 'కజ్‌ఫ్' తప్ప ఇతర ఆరోపణలకు శిక్ష స్వయంగా కాజీ (న్యాయమూర్తి) నిర్ణయించగలడు లేదా రాజ్య సలహా మండలి అవసరం రీత్యా వీటికి అవమానం, పరువునష్టం ఇత్యాది వాటికి సంబంధించిన ఏదయినా సాధారణ చట్టం చేయగలదు.

(2) ఆయత్‌లో కేవలం 'శీలవతులయిన స్త్రీలపైన ఆరోపణ చెయ్యడం' అనే పదాలు ప్రయోగించబడినప్పటికీ ఫిక్‌హ్‌వేత్తలు ఏకగ్రీవంగా ఈ ఆదేశం కేవలం స్త్రీలపైన అపనింద మోపడం వరకే పరిమితం కాదు, శీలవంతులయిన పురుషులపైన నిందమోపడానికీ ఇదే ఆదేశం వర్తిస్తుంది అని అభిప్రాయపడ్డారు. అలాగే ఆరోపణ చేసేవారిని గురించి ప్రస్తావిస్తూ اَلَّذِينَ يَرْمُونَ (నింద మోపేవారు) అని పుంలింగ ప్రయోగం జరిగినప్పటికీ

ఇది కేవలం పురుషులకే ప్రత్యేకం కాదు, స్త్రీలు సయితం కజ్ఫ్ అపరాధానికి పాల్పడితే వారూ ఈ ఆదేశం క్రిందికే వస్తారు. నేరం నికృష్టమవడంలో అపనింద మోపేవారయినా, మోపబడిన వారయినా స్త్రీలో పురుషులో అయినంత మాత్రాన పెద్ద వ్యత్యాసం ఏర్పడదు. అందువల్ల చట్టం ప్రకారం ఏ పురుషుడయినా, లేదా ఏ స్త్రీ అయినా సౌశీల్యవంతులయిన స్త్రీ పురుషులపైన వ్యభిచార నింద మోపినట్లయితే వారికి ఈ ఆదేశం వర్తిస్తుంది. (ఇక్కడ ముహ్సిన, ముహ్సిన్ అంటే ఉద్దేశం వివాహిత స్త్రీపురుషులన్నది కాదు, శీలవంతులయిన స్త్రీ పురుషులన్నది మాత్రమే.)

(3) ఈ ఆదేశం అమలు జరగడానికి నిందమోపేవారు శీలవంతులు, లేదా శీలవతులపైనే ఆరోపణ చేయాలి. అలాకాక శీలవంతులు కాని వారిపైన ఆరోపణ మోపిన పక్షంలో ఇది వర్తించదు. శీలవంతులు కాని వారు తమ చెడునడతకు ప్రతీతి పొందిన వారయితే ఇక వారిపైన 'అపనింద' మోపే ప్రశ్న ఏముందనీ? కాని ఆ నింద నిజం కానిపక్షంలోనూ సాక్ష్యాధారాలు లేకుండా ఒకరికి వ్యతిరేకంగా ఆరోపణ చేసినందుకు కాజీ (న్యాయమూర్తి) స్వయంగా ఏదయినా శిక్ష విధించవచ్చు. లేదా ఇలాంటి కేసుల కోసం సలహా మండలి అవసరమనుకుంటే ఏదయినా చట్టం చేయవచ్చు.

(4) ఒక 'కజ్ఫ్' (అపనింద) చర్య శిక్షార్హమవడానికి, ఒకరు, ఒకరి మీద అవచేష్టకు పాల్పడినట్లు సాక్ష్యాధారాలు లేకుండా నిందమోపడమే సరిపోదు, దానికి కొన్ని నిబంధనలు ఉన్నాయి. అవి, కొన్ని నిందమోపేవాని (కాజిఫ్)కి, కొన్ని నిందమోపబడిన వాని (మక్జూఫ్)కి, కొన్ని స్వయాన అపనింద క్రియకి సంబంధించినవి తప్పక ఆ నేరంలో కానరావాలి.

నింద మోపేవానికి సంబంధించిన నిబంధనలు ఇవి : ఒకటి, అతను ప్రాజ్ఞుడయి ఉండాలి. పిల్లవాడు అపనిందకు పాల్పడితే అతనికి ఏదయినా శిక్ష విధించవచ్చుగాని, అతనికి హద్ద్ (దైవం నిర్ణయించిన శిక్ష) విధించే వీలులేదు. రెండు, అతడు మతి స్థిమితం ఉన్న వ్యక్తి అయి ఉండాలి. మతి చలించినవానిపై 'కజ్ఫ్' హద్ద్ విధించే వీలులేదు. అలాగే నిషిద్ధపదార్థపు మత్తు తప్ప ఇతరత్రా మరే విధంగానయినా మత్తుగొన్న స్థితిలో ఉన్న వ్యక్తిని, ఉదాహరణకు, క్లోరోఫామ్ ప్రభావంతో అపనింద మోపే వానిని సయితం అపరాధిగా పరిగణించలేము. మూడు, అతను స్వచ్ఛంద సంకల్పంతో ఈ చర్యకు పాల్పడి ఉండాలి. ఎవరయినా బలవంతం చేస్తే కజ్ఫ్‌కు పాల్పడే వ్యక్తి కూడా అపరాధిగా పరిగణించబడలేదు. నాలుగు, నింద మోపబడిన వానికి (నింద మోపే) వారు తండ్రియో, తాతో కారాదు. వారికి కజ్ఫ్ హద్ద్ విధించడం సాధ్యం కాదు. ఇవికాక హనఫీ ఫిక్‌హ్‌వేత్తల దృష్టిలో ఒక అయిదవ షరతు కూడా ఉంది. నిందమోపే వాడు మాట్లాడేవాడయి ఉండాలి, మూగవాడు సంజ్ఞలతో

నిందారోపణ చేసినట్లయితే కజ్ఫ్ శిక్ష (హద్ద్) అతనికి విధించబడదు. కాని ఇమామ్ షాఫియీ దీనితో విభేదిస్తారు. వారి ప్రకారం, మూగవాని సంకేతం పూర్తిగా స్పష్టమయినదయితే, విశదంగా ఉంటే, దాన్ని చూసి ఏ వ్యక్తి అయినా సరే, అతను చెప్పదలచినదేమిటో అర్థం చేసుకోగలిగితే అతడు అపనిందమోపిన వానికిందే లెక్క. ఒక వ్యక్తిని అవమానంపాలు చేయడానికి అతని సంకేతం నోటిమాటల వివరణ కన్నా ఏ విధంగానూ తక్కువేమీ కాదు. దీనికి భిన్నంగా హనఫీ ధర్మవేత్తల దృష్టిలో కేవలం సంకేతం ద్వారా విశదీకరణ అంతగా బలమయినది కాజాలదు, దాని కారణంగా ఒక మనిషికి 80 కొరడా దెబ్బల శిక్ష విధించవలసిన అవసరంలేదు, వారు ఇతర శిక్ష ఏదయినా విధించవచ్చు అని ప్రతిపాదిస్తారు.

ఆరోపితుడికి సంబంధించిన నిబంధనలు ఇవి: మొదటిది, అతడు మతిస్థిమితమున్నవాడు కావడం, అతడు మతిస్థిమితమున్న స్థితిలో అతనిపై వ్యభిచార నింద మోపబడటం అన్నమాట. మతిస్థిమితంలేనివానిపై (తరువాత అతను బుద్ధికుశలతగల వాడయినా కాకపోయినా) నేరారోపణ చేసేవాడు కజ్ఫ్ హద్ద్‌కు అర్హుడుకాదు. ఎందుకంటే మతిస్థిమితంలేనివాడు తన మాన రక్షణకు అవసరమయిన ఏర్పాటు చేసుకోలేడు. అతనిపై వ్యభిచార నేరం సాక్ష్యాధారాలతో రుజువయిపోయినప్పటికీ అతడు వ్యభిచార శిక్షకు అర్హుడూ కాడు, అతని మానమర్యాదల భంగమూ జరగదు. అందువల్ల అతనిపై నేరారోపణ చేసే వాడు కూడా కజ్ఫ్ శిక్షకు అర్హుడు కారాదు. కాని ఇమామ్ మాలిక్, ఇమామ్ లైస్ బిన్ సఅద్ ప్రకారం మతి స్థిమితం లేని వానిపై అపనిందమోపిన వాడు కజ్ఫ్ శిక్షకు అర్హుడవుతాడు, ఎందుకంటే, ఎట్టి పరిస్థితిలోనూ అతడు ఒక నిరాధారమయిన ఆరోపణ చేస్తున్నాడు.

రెండవది, అతడు ప్రాజ్ఞత గలవాడయి ఉండాలి. అంటే ప్రాజ్ఞత పొందిన స్థితిలో అతనిపైన వ్యభిచార నేరారోపణ జరగాలి. పిల్లవానిపై ఆరోపించడం, లేదా యువకునిపైన, అతడు బాల్యంలో ఈ చేష్టకు పాల్పడ్డాడని ఆరోపించడం కజ్ఫ్ శిక్షకు సరయిన కారణం కాదు. ఎందుకంటే మతి చలించినవానిలానే పిల్లవాడూ తన మాన రక్షణకు బాధ్యుడు కాడు. అతడు వ్యభిచార శిక్షకూ పాత్రుడు కాడు, అతని మాన మర్యాదలూ భంగపడవు. కాని ఇమామ్ మాలిక్ ప్రకారం ప్రాజ్ఞత వయస్సుకు సమీపాన ఉన్న బాలునిపై వ్యభిచార నేరారోపణ జరిగితే ఆరోపకుడు హద్ద్‌కు అర్హుడు కాడు. కాని రతిక్రీడ సాధ్యమయిన వయసుగల అమ్మాయి పైన వ్యభిచార నేరం మోపబడినట్లయితే ఆరోపి శిక్షకు అర్హుడు. ఎందుకంటే దీనివల్ల కేవలం ఆ అమ్మాయి మాత్రమే కాదు, ఆమె కుటుంబగౌరవం కూడా భంగపడుతుంది, అమ్మాయి భవిష్యత్తూ నాశనమవుతుంది.

మూడవది, అతడు ముస్లిమ్ కావడం. అంటే అతడు ఇస్లామ్‌లో ఉండగా వ్యభిచారానికి పాల్పడినట్లు ఆరోపణ మోపబడాలి. తిరస్కారిపై ఆరోపణ, లేదా ముస్లిమ్ వ్యక్తి తిరస్కారావస్థలో ఉండగా ఈ చేష్టకు పాల్పడినట్లు ఆరోపణ హద్దుకు కారణం కాదు.

నాల్గవది, అతడు (ఆరోపితుడు) స్వతంత్రుడయి ఉండాలి. బానిస పురుషుడు లేదా స్త్రీపై ఆరోపణ చేయడం, లేదా స్వతంత్రుడిపై, అతడు బానిసగా ఉన్నప్పుడు ఈ చేష్టకు పాల్పడి నట్లు ఆరోపించడం హద్దుకు కారణం కాదు, ఎందుకంటే బానిస అశక్తత, బలహీనత వల్ల అతను తన మాన రక్షణకు అవసరమయిన సన్నాహాలు చేసుకోలేకపోయే అవకాశముంది. స్వయంగా ఖుర్ఆన్ కూడా బానిస స్థితిని భద్ర, రక్షిత స్థితిగా పరిగణించలేదు. నిసా సూరాలో 'ముహ్సనాత్' (రక్షిత స్త్రీలు, భద్ర స్త్రీలు) అనే పదం స్వతంత్ర స్త్రీలకు సదృశంగా ప్రయోగించబడింది. కాని దావూద్ జాహిరి ఈ వాదనను అంగీకరించరు. వారి ప్రకారం బానిస స్త్రీ పురుషులపై ఆరోపణ మోపినవాడు కూడా హద్దుకు పాత్రుడే.

అయిదవది, అతడు శీలవంతుడయి ఉండాలి. అంటే అతని చరిత్ర వ్యభిచారానికి, వ్యభిచార అనుమానానికి కూడా తావు లేనిదయి పరిశుద్ధమయినదయి ఉండాలి. వ్యభిచారంలేని చరిత్ర అంటే, ఇంతకు ముందు ఎప్పుడయినా అతని మీద వ్యభిచార నేరం రుజువయి ఉండరాదు, వ్యభిచారపు అనుమానం లేనిదంటే అతను తప్పుడు నికాహ్‌తో రహస్యపు నికాహ్‌తో (బానిస స్త్రీ విషయంలో) అనుమానాస్పద స్వామ్యంతో లేదా నికాహ్ అనుమానంతో స్త్రీతో సంయోగం చెంది ఉండరాదు, అతని జీవిత పరిస్థితుల కారణంగా అతనిపైన చెడునడత, మానహీనత ఆరోపణ అతికే అవకాశమూ ఉండరాదు, వ్యభిచారం కన్నా తక్కువ స్థాయి దుర్నీతి చేష్టల ఆరోపణ కూడా అతనిపట్ల లోగడ రుజువయి ఉండరాదు; ఎందుకంటే ఇలాంటి పరిస్థితులన్నింటిలోనూ అతని మానాభిమానాలు భంగపడతాయి, ఇలాంటి భంగపడిన శీలం గలవాని పైన ఆరోపణ చేసే వ్యక్తి 80 కొరడా దెబ్బలకు అర్హుడు కాజాలడు. చివరికి కజ్ఫ్ హద్ద్ అమలుపరిచే ముందు ఆరోపితుడిపైన మరే కేసులోనయినా వ్యభిచార నేరం రుజువయిపోతే అప్పుడు కూడా ఆరోపిని వదలివేయడం జరుగుతుంది, ఎందుకంటే అతడు నేరారోపణ చేసిన వ్యక్తి సౌశీల్యవంతుడు కాదని తేలి పోయింది.

అయితే ఈ అయిదు సందర్భాలలోనూ హద్ద్ శిక్ష విధించక పోవడమంటే, మతిస్థిమితం లేనివాడు, పిల్లవాడు, తిరస్కారి, బానిస లేదా శీలవంతుడు కాని మనిషిపైన సాక్ష్యాధారం లేనిదే వ్యభిచార నేరారోపణ చేసేవాడు 'తాజీర్' పరిపాలనా వ్యవస్థ విధించే ఇతర శిక్షకు కూడా అర్హుడు కాడని అర్థం కాదు.

ఇక స్వయంగా అపవాదు క్రియకు సంబంధించిన నిబంధనలేవో పరిశీలిద్దాము. ఒక ఆరోపణను ఈ రెండు విషయాల్లో ఏదయినా ఒకటి 'కజ్ఫ్' గా చేసివేయగలదు. ఒకటి ఆరోపకుడు, ఆరోపితుని మీద రతిలో పాల్గొన్నట్టు నిందారోపణ చేయగా, ఆ 'రతినింద', సాక్ష్యాధారాలతో ఒకవేళ రుజువయిపోతే అది, ఆరోపితునికి హద్ద్ విధించబడేటటువంటిదయి ఉండాలి. లేదా, రెండు, ఆరోపితుడు అక్రమ సంతానం అని అతను నిందించి ఉండాలి. రెండింటిలో ఏదయినా సరే నింద స్పష్టంగా విశదంగా ఉండాలి. (అప్పుడే అది 'కజ్ఫ్'గా పరిగణించబడుతుంది) ఆరోపకుని సంకల్పం వ్యభిచారం లేదా వంశావళి పట్ల ఎత్తిపొడుపు అనుకునేటటువంటి సంజ్ఞ, సంకేతాలను పట్టించుకోవడం జరగదు. ఉదాహరణకు, ఎవరి నయినా పాపిష్ఠి, దుశ్శీలుడు, దుర్వర్తనుడు, తిరుగుబోతు ఇత్యాది పదాలతో ప్రస్తావించడం లేదా ఎవరయినా స్త్రీని, రంకు, వేశ్య, లంజ అనడం, లేదా ఒక సయ్యిద్‌ని పఠాన్ అనడం, ఇవన్నీ సంకేతాలు మాత్రమే, వీటివల్ల కజ్ఫ్ ఏమాత్రం స్పష్టంగా తప్పనిసరిగా నిర్ణయం కాదు. అలాగే తిట్టుగా ఉపయోగించే పదాలు. ఉదాహరణకు, హరామీ (అక్రమ సంబంధా లున్నవాడు), హరామ్ జాదా (అక్రమ సంతానం) తదితర పదాలను సయితం స్పష్టంగా కజ్ఫ్ (అపనింద) అనడానికి వీల్లేదు. అయితే పరోక్షంగా నింద మోపడాన్ని ఫిక్‌హ్‌వేత్తల మధ్య అది కూడా కజ్ఫ్ క్రిందికి వస్తుందా లేదా అన్న అంశంలో భిన్నాభిప్రాయముంది; ఉదాహరణకు చెప్పేవాడు ఎవరినయినా సంబోధించి అవును, నేను వ్యభిచారిని కానే అనో లేదా, "నా తల్లి వ్యభిచరించి నన్ను కనలేదే" అనో అనడం. ఇమామ్ మాలిక్ ప్రకారం, ఇటువంటి పరోక్ష నింద వల్ల చెప్పేవాడు సంబోధితుణ్ణి వ్యభిచారి అని లేదా అక్రమ సంతానమని అంటున్నట్లు స్పష్టంగా అర్థమయ్యేమాటయితే ఇది కజ్ఫ్ కిందికే వస్తుంది, దీనికి హద్ద్ విధించవలసి ఉంటుంది. కాని ఇమామ్ అబూ హనీఫా, ఆయన సహచరులు, ఇమామ్ షాఫియీ, సుఫ్యాన్ సౌరి, ఇబ్ను షుబ్రుమ, హసన్ బిన్ సాలిహ్-వీరంతా, ఇటువంటి పరోక్షనిందలో అనుమానానికి తావుంది అందువల్ల అనుమానం ఉన్న చోట హద్ద్ విధించరాదు అని అభిప్రాయపడ్డారు. ఇమామ్ అహ్మద్, ఇస్‌హాక్ బిన్ రాహవయ ప్రకారం ఈ పరోక్ష నింద మాటలు వాదులాట సందర్భంలో పలికితే కజ్ఫ్‌గా పరిగణించాలి. అలాకాక నవ్వులాటకు, పరాచికాలుగా అనుకుంటే దాన్ని కజ్ఫ్‌గా పరిగణించరాదు. ఖలీఫాలలో హజ్రత్ ఉమర్ (ర), హజ్రత్ అలి (ర) పరోక్ష నిందకు హద్ద్ విధించారు. హజ్రత్ ఉమర్ (ర) కాలంలో ఇద్దరు వ్యక్తుల మధ్య తిట్లపర్వం నడిచింది. ఒక వ్యక్తి మరో వ్యక్తిని సంబోధించి "నా తండ్రీ వ్యభిచారి కాదు, నా తల్లీ వ్యభిచారిణి కాదు" అన్నాడు. వ్యవహారం హజ్రత్

ఉమర్ (ర) వరకు వెళ్ళింది. ఆయన అక్కడున్న వారిని దీన్ని మీరేమని భావిస్తారు అని అడిగారు, కొందరు, ఇతను తన తల్లిదండ్రుల్ని పొగిడాడు, అతని తల్లి దండ్రులపైన దాడి చెయ్యలేదుగా అని అన్నారు. మరికొందరేమో ఇతని తల్లిదండ్రులని పొగడడానికి ఈ పదాలే దొరికాయా? ప్రత్యేకంగా ఈ పదాలను ప్రయోగిం చడం ద్వారా ఇతని ఉద్దేశం అతని తల్లిదండ్రుల్ని వ్యభిచారులుగా నిందించడమే అని అన్నారు. హజ్రత్ ఉమర్ (ర) రెండవ వర్గంతో ఏకీభవించారు, హద్ద్ శిక్షను అమలు జరిపించారు. (జస్సాస్. సం. 3; పు. 330). ఎవరయినా స్వలింగ సంపర్కానికి ఒడిగట్టారని నిందించడం 'కజ్ఫ్' కిందికి వస్తుందా రాదా అన్న విషయంలోనూ అభిప్రాయ భేదముంది. ఇమామ్ అబూ హనీఫా దీన్ని కజ్ఫ్‌గా పరిగణించలేదు. ఇమామ్ అబూ యూసుఫ్, ఇమామ్ ముహమ్మద్, ఇమామ్ మాలిక్, ఇమామ్ షాఫియీ దీన్ని కజ్ఫ్‌గా పరిగణిస్తారు. హద్ద్ ఆదేశం అమలుపరచబడుతుందంటారు.

(5) కజ్ఫ్ అపరాధం ప్రభుత్వం జోక్యం చేసుకోవలసిన (Cognizable Offence) అపరాధమా కాదా అన్న విషయంలో ఫుకహా (ఫిక్హ్‌వేత్తల) మధ్య భిన్నాభిప్రాయ ముంది. ఇబ్ను అబీ లైలా ప్రకారం, ఇది "హక్కుల్లాహ్" (దైవానికి చెందిన హక్కు) అందువల్ల ఆరోపకునిపైన హద్ద్ అమలు జరుగుతుంది, దానికి ఆరోపితుడు అర్థించినా అర్థించకపోయినా. ఇమామ్ అబూ హనీఫా, ఆయన సహచరులు, ఈ అపరాధం రుజువయి నట్లయితే హద్ద్ అమలు జరపడం ధర్మం, ఈ అర్థంలో అది 'హక్కుల్లాహ్' అనడంలో సందేహంలేదు. కాని అతని మీద కేసు వెయ్యడం అన్నది, ఆరోపితుడు కోరిన దానిపైనే ఆధారపడి ఉంటుంది. ఈ విధంగా ఇది మానవుని హక్కు. ఈ అభిప్రాయమే ఇమామ్ షాఫియీ, ఇమామ్ ఔజాయి వ్యక్తం చేశారు. ఇమామ్ మాలిక్ దృష్టిలో దీనికి వివరాలున్నాయి. అధికారి సమక్షంలో ఎవరయినా 'కజ్ఫ్' నేరానికి పాల్పడితే ఈ నేరం ప్రభుత్వం జోక్యం చేసుకోదగ్గది. లేకపోతే దీనిపైన కేసు పెట్టడం ఆరోపితుని కోరికపైనే ఆధారపడి ఉంటుంది.

(6) కజ్ఫ్ నేరం, రాజీ కుదుర్చుకోగల నేరం (Compoundable Offence) కాదు. ఆరోపితుడు న్యాయస్థానంలో కేసు పెట్టకపోతే అది వేరే విషయం, కాని న్యాయస్థానంలో కేసు నమోదు అయిన తరువాత ఆరోపకుణ్ణి, తన నిందను రుజువు చెయ్యమని నిర్బంధించడం జరుగుతుంది. అతను నిరూపించలేకపోతే అతనికి హద్ద్ విధించబడుతుంది. అతన్ని న్యాయస్థానమూ క్షమించజాలదు, స్వయంగా ఆరోపితుడు కూడా ఏదయినా ధనపరిహారం తీసుకుని వ్యవహారం ముగించనూలేదు; లేదా తౌబా (పశ్చాత్తాపం), క్షమాభిక్షలతో అతను శిక్ష నుండి తప్పించుకోనూ లేదు. ప్రవక్త మహనీయులు (స) చెప్పిన ఒక సూక్తి ముందే ఉటంకించాము "హద్దుల విషయాన్ని

మీలో పరస్పరం క్షమించుకోండి, కాని హద్ద్‌కు సంబంధించిన వ్యవహారం నా వద్దకు వచ్చేస్తే అది తప్పక విధించబడుతుంది.”

(7) హనఫీ ధర్మశాస్త్రవేత్తల ప్రకారం 'కజ్ఫ్' హద్ద్‌ను విధించాలని కోరే హక్కు స్వయంగా ఆరోపితునికి ఉంది. లేదా ఆరోపితుడు లేని పక్షంలో ఆ ఆరోపణ వల్ల ఎవరి వంశ పరంపర భంగపడుతుందో వారికి ఆ హక్కు ఉంటుంది. ఉదాహరణకు తండ్రి, తల్లి, సంతానం, సంతానానికి సంతానం. కాని ఇమామ్ మాలిక్, ఇమామ్ షాఫియీ దృష్టిలో ఈ హక్కు వారసత్వంగా సంక్రమించగలదు. అంటే ఆరోపితుడు మరణిస్తే షరీఅత్ ప్రకారం అతనికి వారసుడయ్యే ప్రతి వ్యక్తి ఈ కేసు పెట్టి హద్ద్‌ను కోరవచ్చు. కాని విచిత్రమయిన విషయం ఏమిటంటే, ఇమామ్ షాఫియీ భార్యాభర్తలకు ఇందులో వినాయింపు ఉందని భావిస్తారు. దీనికి ఆయన వాదన, మృత్యువు వల్ల దాంపత్య అనుబంధం అంతమయిపోతుం దన్నది. రెండవది, భార్య లేదా భర్తపైన ఇద్దరిలో ఎవరిపైన నింద వచ్చినా రెండవ వ్యక్తి వంశం భంగపడదు. నిజానికి ఈ రెండు ఆధారాలు బలహీనమయినవి. హద్ద్‌ను కోరడం వారసత్వపు హక్కుగా పరిగణించిన తరువాత ఈ హక్కు భార్యకు లేదా భర్తకు సంక్రమించదని, కారణం మృత్యువుతో భార్యాభర్తల అనుబంధం అంతమయిపోతుంది అనడం స్వయంగా ఖుర్ఆన్‌కు వ్యతిరేకం. ఎందుకంటే, వారిరువురిలో ఒకరు మరణిస్తే మరొకరిని వారసులుగా ఖుర్ఆన్ నిర్ణయించింది. పోతే, దంపతుల్లో ఏ ఒక్కరిపైన ఆ నింద వచ్చినా రెండవ వారి వంశావళికి ఎలాంటి భంగం వాటిల్లదనడం, భర్త విషయంలో సరయినదే అనుకున్నా భార్య విషయంలో పూర్తిగా తప్పయినది. ఎవరి భార్యపైన ఈ నిందమోపబడుతుందో అతని యావత్తు సంతానం వంశావళి అనుమానాస్పదం అయిపోతుంది. పైగా 'కజ్ఫ్' హద్ద్ కేవలం వంశావళికి భంగపాటు జరగడం వల్ల విధించబడిందనడం కూడా సరయినది కాదు. వంశావళితో పాటు గౌరవప్రపత్తులు భగ్నమవడం కూడా దానికి సంబంధించిన ఒక ముఖ్యమయిన కారణం, ఒక సజ్జన స్త్రీ పురుషులకు తమ భర్త లేదా భార్య చెడు నడత గలదనడంకన్నా అప్రతిష్ఠ, అగౌరవం మరేది కాగలదు. అందువల్ల కజ్ఫ్ హద్ద్‌ను కోరడం వారసత్వపు హక్కు అయినట్లయితే దంపతులకు దీనిపట్ల వినాయింపు నిర్ణయించడంలో సమంజసమయిన కారణమేదీ కానరావడం లేదు.

(8) ఒక వ్యక్తి కజ్ఫ్‌కు పాల్పడ్డాడని రుజువయిన తరువాత అతన్ని 'హద్ద్' శిక్ష నుండి రక్షించగల అంశం కేవలం ఒక్కటే. అతను నలుగురు సాక్షులను తీసుకురావాలి. వారు న్యాయస్థానం లోకి వచ్చి వారు వ్యభిచార ఆరోపిత వ్యక్తిని ఫలానా స్త్రీ లేదా పురుషునితో క్రియా రూపంలో

వ్యభిచరిస్తూ ఉండగా చూసినట్లు సాక్ష్యం పలకాలి. హనఫీ ధర్మవేత్తల ప్రకారం ఈ నలుగురు సాక్షులూ ఒకేసారి న్యాయస్థానంలోకి రావలసి ఉంటుంది, వారు ఒకేసారి సాక్ష్యం ఇవ్వాలి, ఎందుకంటే వారు ఒకరి తరువాత మరొకరు న్యాయస్థానంలోకి వచ్చి సాక్ష్యమిస్తే వారిలోని ప్రతి ఒక్కడూ (కాజిఫ్) ఆరోపకుడయిపోతూ ఉంటాడు, అతనికి మళ్ళీ నలుగురు సాక్షులు కావలసి ఉంటుంది. కాని ఇది చాలా బలహీనమయిన విషయం. సరయిన మాట ఇమామ్ షాఫియీ, ఉస్మాన్ అల్ బత్తీ చెప్పినదే. సాక్షులు ఒకేసారి వచ్చినా ఒకరి తరువాత మరొకరు వచ్చినా పెద్దగా వ్యత్యాసమేదీ ఏర్పడదు. ఇతర కేసుల్లో మాదిరిగా సాక్షులు ఒకరి తరువాత మరొకరు రావడం, సాక్ష్యం పలకడమే ఉత్తమం. హనఫీ పండితుల దృష్టిలో వారు న్యాయశీలురవడం తప్పనిసరి కాదు. ఆరోపకుడు ధార్మికంగా అపరాధశీలురయిన నలుగురు సాక్షులను తీసుకు వచ్చినా అతను హద్ద్ నుండి తప్పించుకుంటాడు, అతనితో పాటు ఆరోపిత వ్యక్తి కూడా వ్యభిచార శిక్ష నుండి సురక్షితంగా బయటపడతాడు. ఎందుకంటే, సాక్షులు న్యాయశీలురు కారు. అయితే తిరస్కారులు, గుడ్డివారు, బానిసలు, లేదా కజ్ఫ్ నేరంలో లోగడ శిక్ష పొందిన వారిని సాక్షులుగా తీసుకువచ్చి ఆరోపకుడు శిక్షను తప్పించుకోలేడు. కాని ఇమామ్ షాఫియీ ప్రకారం ఆరోపకుడు ధార్మికంగా పాపుల్ని సాక్షులుగా ప్రవేశపెడితే, అతనూ అతని సాక్షులూ అందరూ హద్ద్ శిక్షకు అర్హులవుతారు. ఇమామ్ మాలిక్ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంలో హనఫీ షరీఅత్‌వేత్తల పంథాయే సత్యానికి సమీపంగా అగుపిస్తోంది. సాక్షులు న్యాయశీలురు అయినట్లయితే ఆరోపకుడు కజ్ఫ్ నేరం నుండి తప్పించుకుంటాడు, ఆరోపిత వ్యక్తి పైన వ్యభిచార నేరం రుజువయిపోతుంది. కాని సాక్షులు న్యాయశీలురు కాకపోతే అరోపకుని కజ్ఫ్ నేరం, ఆరోపితుడి వ్యభిచారం, సాక్షుల సత్యత, అబద్ధత అన్నీ అనుమానాస్పద మయిపోతాయి, మరి అనుమానం కారణంగా ఎవరినీ హద్ద్‌కు పాత్రులుగా పరిగణించడం జరగదు.

(9) ఏ వ్యక్తి అయితే తనను కజ్ఫ్ అపరాధం నుండి విముక్తి కలిగించే సాక్షుల్ని తేలేకపోయాడో అతనికి ఖుర్ఆన్ మూడు ఆదేశాలను వర్తింపజేస్తుంది: ఒకటి, అతనికి 80 కొరడా దెబ్బలు వెయ్యాలి; రెండు, అతని సాక్ష్యం ఎన్నడూ స్వీకరించరాదు; మూడు, అతను ఫాసిక్ (ధర్మశాస్త్ర ఉల్లంఘనకు పాల్పడిన వాడు)గా పరిగణించబడతాడు. ఆ తరువాత ఖుర్ఆన్ ఇలా అంటుంది, "అయితే, ఎవరయితే ఆ తరువాత తౌబా చేసుకుంటారో, తమ్ము తాము సంస్కరించుకుంటారో వారికి వినాయింపు ఉంది; అల్లాహ్ క్షమాశీలుడు, దయామయుడూను." ఇక్కడ ఒక ప్రశ్న. ఈ వాక్యంలో తౌబా, సంస్కరణ కారణంగా క్షమాపణను ప్రకటించినది ఈ మూడు అంశాలలో దేనికి వర్తిస్తుంది అన్నది. ఫిక్‌హ్‌వేత్తలు

రెండు విషయాల్లో ఏకాభిప్రాయం కలిగి ఉన్నారు. ఒకటి, మొదటి ఆదేశంతో దీనికి సంబంధం లేదు. అంటే తౌబా కారణంగా హద్ద్ శిక్ష రద్దు కాదు; నేరస్తునికి కొరడా దెబ్బల శిక్ష ఎట్టిపరిస్థితుల్లోనూ తప్పక పడుతుంది అన్నది; రెండు, ఈ క్షమాపణ చివరి ఆదేశానికి సంబంధించింది; అంటే తౌబా, సంస్కరణ తరువాత నేరస్థుడు ధర్మోల్లంఘున చేసిన వాని (ఫాసిక్)గా పరిగణించబడదు, దైవం అతన్ని మన్నించివేస్తాడు అన్నది. (అయితే ఈ రెండవ అంశంలో ఒక విభేదం ఉంది. దోషి ఆరోపణ చేయగానే ధర్మోల్లంఘున (ఫిస్క్)కు పాల్పడినట్లా లేదా న్యాయస్థానం తీర్పు జరిగిన తరువాత ధర్మోల్లంఘున చేసినట్లు పరిగణించాలా అన్నది. ఇమామ్ షాఫియీ, లైస్ బిన్ సఅద్ ప్రకారం అతడు ఆరోపణ చెయ్యగానే ధర్మభ్రష్టుడయి పోతాడు. అందువల్ల అప్పటి నుంచే అతన్ని సాక్ష్యానికి అనర్హుడుగా పరిగణిస్తారు. దీనికి భిన్నంగా ఇమామ్ అబూ హనీఫా, ఆయన సహచరులు, ఇంకా ఇమామ్ మాలిక్ ప్రకారం న్యాయస్థానం తీర్పు అమలు జరిగిన తరువాత అతడు ఫాసిక్గా పరిగణించబడాలి. అందువల్ల తీర్పు అమలు జరిగే వరకు అతన్ని సాక్ష్యానికి అర్హుడుగానే పరిగణించాలి. కాని యదార్థానికి అపరాధి చేసిన ఆరోపణకు పర్యవసానమే దైవం దృష్టిలో అతన్ని ఫాసిక్గా నిలబెట్టింది. మానవుల దృష్టిలో ధర్మభ్రష్టునిగా పరిగణించబడటం అనేది న్యాయస్థానంలో అతని అపరాధం రుజువు కావడం అతనికి శిక్ష అమలు జరపడంపైన ఆధారపడి ఉంటుంది). ఇక మిగిలేది మధ్యలోని ఆదేశం. అంటే "ఆరోపకుని సాక్ష్యం ఎన్నటికీ స్వీకరించరాదు" అనేది. ఫిక్హ్‌వేత్తల మధ్య ఇందులో చాలా విభేదాలు పొడసూపాయి. అంటే "తౌబా చేసుకుని పశ్చాత్తాపం చెందిన వారు తప్ప" అనే మాట ఈ ఆదేశానికీ వర్తిస్తుందా లేదా అన్న విషయంలో. ఒక వర్గం ప్రకారం ఇది కేవలం చివరి ఆదేశానికి వర్తిస్తుంది. అంటే ఎవడు తౌబా చేసుకుని పశ్చాత్తాపం చెంది, తన్ను తాను సంస్కరించుకుంటాడో అతను దైవం దృష్టిలోనూ మానవ దృష్టిలోనూ ఫాసిక్ కాడు. కాని ఇది జరిగినా తొలి రెండు ఆదేశాలు యధాతథంగా వర్తిస్తాయి. అంటే అతనికి శిక్ష విధించడమూ జరుగుతుంది, అతన్ని శాశ్వతంగా సాక్ష్యానికి అనర్హుడుగా పరిగణించడమూ జరుగుతుంది. ఈ వర్గంలో కాజీ షురైహ్, సయీద్ బిన్ ముసయ్యబ్, సయీద్ బిన్ జుబైర్, హసన్ బసరి, ఇబ్రాహీమ్ నఖయి, ఇబ్నె సీరీన్, మక్హౌల్, అబ్దుర్రహ్మాన్ బిన్ జైద్, అబూ హనీఫా, అబూ యూసుఫ్, జుఫర్, ముహమ్మద్, సుఫ్యాన్ సౌరి, హసన్ బిన్ సాలిహ్ వంటి మహనీయులున్నారు. రెండవ వర్గం ప్రకారం ఇది తొలి ఆదేశానికయితే వర్తించదు కాని చివరి రెండు ఆదేశాలకూ వర్తిస్తుంది. అంటే తౌబా చేసుకున్న తరువాత కజ్ఫ్ శిక్ష పడిన అపరాధి సాక్ష్యాన్ని స్వీకరించడమూ జరుగుతుంది, అతడు ధర్మోల్లంఘునకు పాల్పడినట్లూ పరిగణించబడదు కూడా. ఈ వర్గంలో అతా, తావూస్,

ముజాహిద్, షఅబి, కాసిమ్ బిన్ ముహమ్మద్, సాలిమ్, జుహరి, ఇక్రిమ, ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్, ఇబ్ను అబీ నుజైహ్, సులైమాన్ బిన్ యసార్, మస్రూక్, జహ్హాక్, మాలిక్ బిన్ అనస్, ఉస్మాన్ అల్ బత్తీ, లైస్ బిన్ సఅద్, షాఫియీ, అహ్మద్ బిన్ హన్బల్, ఇబ్ను జరీర్ తబరీ వంటి మహనీయులున్నారు. వీరు తమ వాదనను సమర్థించే ఇతర నిదర్శనాలతోపాటు హజ్రత్ ఉమర్ (ర) చేసిన ఒక తీర్పును సయితం ఉటంకిస్తారు. ఆ తీర్పు ఆయన ముగీరా బిన్ షు'బా కేసులో చేసింది. దాని ఉల్లేఖనాలు కొన్నింటి ప్రకారం హద్దును అమలు పరచిన తరువాత అబూ బక్ర, ఆయన సహచరులిద్దరితోనూ హజ్రత్ ఉమర్ (ర), "మీరు తౌబా చేసుకున్నట్లయితే (లేదా 'అబద్ధం చెప్పినట్లు అంగీకరించినట్లయితే') నేను భావిలో మీ సాక్ష్యాన్ని స్వీకరిస్తాను లేకపోతే లేదు" అని అన్నారు. ఇద్దరు సహచరులూ అంగీకరించారు. కాని అబూ బక్ర తన మాట మీదనే నిలబడ్డారు. బాహ్యంలో ఇది ఎంతో పెద్ద ఆధారంగా కానవస్తోంది. కాని ముగీరా బిన్ షు'బ కేసు వివరాలు మేము లోగడ చూపాము. వాటిని పరిశీలిస్తే స్పష్టంగా తెలిపోతుంది, ఈ దృష్టాంతాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ విషయంలో వాదించడం సరయినది కాదు. అక్కడ సంయోగక్రియలో ఎవరికీ భేదాభిప్రాయం లేదు, స్వయంగా ముగీరా బిన్ షు'బ కూడా దాన్ని కాదనలేదు. అసలు ప్రశ్న ఆ స్త్రీ ఎవరూ అన్నదే. ముగీరా బిన్ షు'బా, ఆ స్త్రీ తన భార్యే అని చెప్పగా, ఆవిడని వీరు ఉమ్మె జమీల్‌గా భావించారని వాదించారు. దానితోపాటు, హజ్రత్ ముగీరా బిన్ షు'బ సతీమణికి ఉమ్మె జమీల్‌కు చాలా దగ్గరి పోలికలు ఉన్నాయని, సంఘటన సమయంలో ఉన్న వెలుతురులో వారు చూసిన దూరాన్ని బట్టి ఆ స్త్రీ ఉమ్మె జమీల్ అని అనుమానం కలిగే ఆస్కారముందని కూడా నిరూపితమయిపోయింది. కాని పరిస్థితులన్నీ ముగీరా బిన్ షు'బకు అనుకూలంగా ఉన్నాయి. స్వయాన దావా వేసిన వారిలోని ఒక సాక్ష్యం కూడా స్త్రీ స్పష్టంగా కనబడ లేదని అంగీకరించారు. ఈ కారణంగానే హజ్రత్ ఉమర్, ముగీరా బిన్ షు'బకు అనుకూలంగా తీర్పునిచ్చారు. అబూ బక్రను శిక్షించిన తరువాత పై ఉల్లేఖనాల్లో వచ్చిన దాన్ని ప్రస్తావించారు. ఈ పరిస్థితుల్ని గమనించిన మీదట తెలిసేదేమిటంటే, హజ్రత్ ఉమర్ ఉద్దేశం ప్రకారం వారు, తాము అనవసరంగా కుశంకకు లోనయ్యామని అంగీకరించి, భావిలో ఇలాంటి అపార్థాల మూలంగా జనులకు వ్యతిరేకంగా నిందలు మోపమని తౌబా చేయాలన్నది. లేకపోతే వారి సాక్ష్యాన్ని ఎన్నటికీ స్వీకరించడం జరగదని ఆయన అన్నారు. అంతేగాని ఒక వ్యక్తి స్పష్టంగా అబద్ధం చెప్పినట్లు రుజువయినప్పుడు కూడా హజ్రత్ ఉమర్ దృష్టిలో తౌబా చేసుకుంటే సాక్ష్యానికి అర్హుడవుతాడని దీన్నిబట్టి అర్థం తీయడం సరికాదు. వాస్తవానికి ఈ విషయంలో మొదటి వర్గం అభిప్రాయమే చాలా బలమయినది. మనిషి తౌబా చేశాడా

లేదా అన్న విషయం దైవం తప్ప ఎవ్వరూ గ్రహించలేరు. మన సమక్షంలో ఒక వ్యక్తి తౌబా చేసి పశ్చాత్తాపం చెందుతున్నట్లు ప్రకటిస్తే మన వరకు అతనికి రాయితీనిచ్చి అతన్ని ఫాసిక్‌గా పేర్కొనకుండా ఉండగలము. కాని ఒక వ్యక్తి మాట తప్పి నమ్మకం కోల్పోయిన తరువాత కూడా, అతడు కేవలం మన సమక్షంలో తౌబా చేసినంత మాత్రాన ఆ తరువాత కూడా మళ్ళీ అతని మాటను నమ్మడం అన్నది, ఆ స్థాయికి రాయితీనివ్వడం అన్నది సరికాదు. పైగా స్వయానా ఖుర్ఆన్ మాటలను దాని భావప్రకటనను గమనిస్తే తెలిసేదాన్నిబట్టి "తౌబా చేసుకున్న వారు తప్ప" అనే పదాల సంబంధం, "ఇలాంటివారే ఫాసిక్‌లు" అన్న పదాలతో ఉంది. ఎందుకంటే వచనంలో తొలి రెండు విషయాలు ఆదేశ రూపంలో ఉన్నాయి: "వీరికి ఎనభయి కొరడా దెబ్బలు కొట్టండి" "వీరి సాక్ష్యం ఎన్నడూ స్వీకరించకండి." మూడవ మాట సమాచార రూపంలో ఉంది: "వారూ స్వయంగానే ఫాసిక్‌లు." ఈ మూడవ మాటకు వెంటనే "తౌబా చేసుకున్న వారు తప్ప" అని సెలవివ్వడం వల్ల స్వయంగా బోధపడుతోంది, ఈ వినాయింపు, చివరన సమాచార రూపంలో వచ్చిన మాటకు సంబంధించిందే కాని తొలి రెండు ఆదేశాలకు సంబంధించింది కాదు అని. పోతే ఈ వినాయింపు చివరి అంశం వరకు పరిమితం కాదని ఒప్పుకున్నప్పటికీ, ఆ వినాయింపు 'వారి సాక్ష్యాన్ని స్వీకరించకండి' వరకు వెళ్ళి ఎందుకు ఆగిపోవాలి? దాన్ని '80 కొరడా దెబ్బలు కొట్టండి' వరకు ఎందుకు సాగదీయరాదు?

(10) ఒక ప్రశ్న ఉత్పన్నం కావచ్చు. 'తౌబా చేసుకున్న వారు తప్ప' అన్న వినాయింపు మొదటి ఆదేశానికీ వర్తిస్తుందని ఒప్పుకోకపోవడానికి కారణమేముంది? ఇంతకూ ఆరోపణ అనేది ఒక విధమయిన అవమానం మాత్రమేగా. ఆ తరువాత ఒక వ్యక్తి తన తప్పును అంగీకరిస్తే, ఆరోపణకు గురయిన వ్యక్తితో క్షమాపణ అర్థించినట్లయితే, ఇకపైన ఎన్నడూ ఇలాంటి చేష్ట చేయనని తౌబా చేసుకున్నట్లయితే అతన్ని ఎందుకు వదలివేయరాదు, అసలు దైవమే తన ఆదేశం ఇచ్చిన తరువాత– "అల్లాహ్ నిస్సందేహంగా ఎంతో క్షమాశీలుడు దయామయుడు" అని ప్రకటిస్తున్నాడే? దైవం మన్నించివేయగా దాసులు మన్నించకపోవడం అన్నది చాలా విచిత్రమయిన విషయమే! దీనికి సమాధానం: తౌబా అన్నది కేవలం కొన్ని అక్షరాలను ఉచ్చరించడం మాత్రమే కాదు. అది హృదయాంతరాళాల్లో లజ్జా భావం కలగడం, బాధ పడటం, మనస్తాపం చెందడం, సంస్కరణ కొరకు దృఢ సంకల్పం చేసుకోవడం, దైవం వైపునకు మరలడం, మంచిని అలవరచుకునేందుకు ఉద్యుక్తుడవటం అన్నమాట. మరి మనో స్థితిని తెలుసు కోగలవాడు ఒక్క అల్లాహ్ తప్ప మరెవరూ లేరు. అందువల్లనే తౌబా

వల్ల ప్రాపంచిక శిక్షలు మాఫీకావు, కేవలం పారలౌకిక శిక్ష మాత్రమే క్షమించబడుతుంది. అందువల్లనే అల్లాహ్, 'వారు తౌబా చేసుకుంటే వదలివేయండి' అని అనలేదు, దానికి బదులుగా, 'తౌబా చేసుకున్న వారి విషయంలో నేను క్షమించేవాడిని, దయచూపేవాడిని' అని ప్రకటించాడు. తౌబా వల్ల ప్రాపంచిక శిక్షలు కూడా క్షమించివేయబడితే శిక్షనుండి తప్పించుకునేందుకు ఏ అపరాధి తౌబా చేయడనీ?

(11) మరో ప్రశ్న కూడా లేవనెత్తవచ్చు. ఒక వ్యక్తి తన ఆరోపణను నిరూపించడానికి సాక్ష్యం తేలేకపోతే తప్పనిసరిగా అతను అబద్ధమే చెబుతున్నాడని అర్థం కాదుగా, అతని ఆరోపణ నిజమయినప్పటికీ నిరూపణలు సమకూర్చడంలో అతను కృతకృత్యుడు కాకపోవడం సాధ్యంకాదా? అలాంటప్పుడు అతను నిరూపణ తీసుకురాలేకపోయినంత మాత్రాన అతన్ని ధర్మోల్లంఘన చేసిన ఫాసిక్‌గా నిర్ణయించడం, అదీ మానవుల్లోనే కాక దైవం సమక్షంలోనూ నిర్ణయమవడం సమంజసమేనా? దీనికి సమాధానం: ఎవరయినా దుశ్చేష్టకు పాల్పడుతూ ఉండగా ఒక వ్యక్తి తన కళ్ళతో చూసినప్పటికీ దాన్ని ప్రచారం చేస్తే లేదా సాక్ష్యాలు లేకుండా అతని మీద నేరం మోపితే అతను పాపం చేసినట్లే. ఒక వ్యక్తి ఏదో మూలలో మురికి కూడగట్టుకుని కూచుని ఉంటే మరో వ్యక్తి దాన్ని సమాజం మొత్తాన వ్యాపింపజేయ డాన్ని షరీఅత్ సమ్మతించదు. అశుద్ధ కూపం అలా ఉన్నట్టు ఎవరికయినా తెలిస్తే అతనికి రెండే మార్గాలున్నాయి. అది ఎక్కడ పడి ఉందో దాన్ని అక్కడే ఉండనివ్వాలి, లేదా అది ఉన్నట్లు తగిన ఆధారాలు అందజేయాలి. అప్పుడే ఇస్లామీయ రాజ్యంలో అధికారులు దాన్ని పరిశుభ్రపరచగలుగుతారు. ఈ రెండు మార్గాలు తప్ప మరో మూడో మార్గం అతనికి లేదు. అతను పబ్లిక్‌లో దాన్ని ప్రచారం చేయడం మొదలెడితే పరిమిత మురికిని విస్తృత ప్రమాణంలో వ్యాపింపజేసిన అపరాధం అతనిపైన మోపబడుతుంది. అతను సంతృప్తి కరమయిన సాక్ష్యాధారాలు లేకుండా వ్యవహారాన్ని అధికారులకు అందజేసినట్లయితే వారు దాన్ని పరిశుభ్రపరచలేరు. ఫలితంగా ఆ కేసు అలా వీగిపోవడం బురద రొంపి వ్యాప్తికి కారణభూతమవుతుంది, చెడు నడతగల వారిలో దుస్సాహసం సృజిస్తుంది. అందువల్లనే నిరూపణ, సాక్ష్యాధారాలు లేకుండా ఆరోపణ చేసేవాడు ఎట్టి పరిస్థితిలోనూ ధర్మోల్లం ఘనం చేసినవాడు (ఫాసిక్)గానే పరిగణించబడతాడు, అతడు తన స్థానాన నిజమే పలుకుతున్నప్పటికీ.

(12) కజ్ఫ్ (రుజువుకాని వ్యభిచార ఆరోపణ)కు హద్ద్ శిక్ష విషయంలో హనఫీ ఫిక్హ్‌వేత్తల ప్రకారం, వ్యభిచారికి విధించే శిక్ష కన్నా ఆరోపకునికి తేలికయిన దెబ్బలు కొట్టాలి. అంటే కొరడా దెబ్బలయితే ఎనభయ్యే ఉంటాయి కాని వాటిని వ్యభిచార శిక్ష దెబ్బలంత గట్టిగా కొట్టరాదు. ఎందుకంటే, ఏ ఆరోపణ చేసిన తప్పిదానికి అతన్ని శిక్షించడం

జరుగుతోందో అందులో అతను చెబుతున్నది అబద్ధమే కావడం నిశ్చయం కాదు.

(13) ఆరోపణ మాటిమాటికీ చేసే విషయంలో హనఫీ ధర్మశాస్త్రవేత్తలతోపాటు మిగతా 'ఫుకహా'లందరి పంథా ఒక్కటే. ఆరోపకుడు, శిక్ష పొందే ముందయినా, శిక్ష పొందే సమయంలో నయినా, ఒక వ్యక్తిపైన ఎన్నిసార్లు ఆరోపణ చేసినా అతనికి హద్ద్ (శిక్ష) ఒకేసారి విధించ బడుతుంది. హద్ద్ అమలుపరచిన తరువాత కూడా తన పాత ఆరోపణను అతను ఎన్ని సార్లు పునరుక్తం చేసినా అతనికి విధించిన శిక్షే సరిపోతుంది. అయితే హద్ద్ అమలుపరచిన తరువాత అతను ఆ వ్యక్తి మీద కొత్త వ్యభిచార ఆరోపణ మోపితే మళ్ళీ సరికొత్తగా కేసు నమోదు అవుతుంది. ముగీరా బిన్ షు'బ కేసులో శిక్ష పొందిన తరువాత కూడా అబూ బక్ర బహిరంగంగానే చెప్పుకుంటూ తిరిగే వారు, "ముగీరా వ్యభిచారానికి పాల్పడ్డారు అని నేను సాక్ష్యమిస్తున్నా"నని. హజ్రత్ ఉమర్ (ర) ఆయన మీద మళ్లీ కేసుపెట్టాలని అనుకున్నారు. అయితే ఆయన పాత ఆరోపణనే పునరుక్తం చేస్తూ ఉన్నందు వల్ల, హజ్రత్ అలి (ర), ఆయనపైన రెండవ కేసు పెట్టలేమని ఇచ్చిన సలహాను హజ్రత్ ఉమర్ (ర) స్వీకరించారు. ఆ తరువాత ఫిక్హ్‌వేత్తలు ఈ మాటను దాదాపు ఏకగ్రీవంగా అంగీకరిం చారు, శిక్షపొందిన ఆరోపకుణ్ణి కొత్త ఆరోపణకే పట్టుకోవడం జరుగుతుంది కాని, గత ఆరోపణనే తిరిగి మోపినందుకు కాదు.

(14) సామూహిక ఆరోపణ విషయంలో ఫిక్హ్‌వేత్తల మధ్య భేదాభిప్రాయముంది. హనఫీ పండితుల ప్రకారం, ఒక వ్యక్తి చాలా మంది మీద ఒకే పదం ద్వారానయినా, వేర్వేరు పదాల ద్వారానయినా నేరం మోపినా, అతనికి ఒకే దండన విధించబడుతుంది - అతను హద్ద్ శిక్ష అనుభవించి మరేదయినా కొత్త ఆరోపణ చేస్తే తప్ప. ఆయత్‌లోని పదాలు ఇవి: "ఏ వ్యక్తులయితే శీలవతులయిన స్త్రీలపైన ఆరోపణలు మోపుతారో....." దీన్నిబట్టి, ఒక్క వ్యక్తిపైనే కాక ఒక సమూహంపైన ఆరోపణ మోపేవాడు కూడా ఒకే దండనకు అర్హుడవుతాడు. పైగా వ్యభిచారానికి సంబంధించిన ఏ ఆరోపణ అయినా సరే అది కనీసం ఇద్దరు వ్యక్తులకు వర్తిస్తుంది. అయినప్పటికీ ఆదేశం ఒకే దండన విధించాలన్నది; స్త్రీపైన ఆరోపణకు వేరు, పురుషునిపైన ఆరోపణకు వేరు దండనలు విధించాలని షరీఅత్ కర్త (పరమ ప్రభువు) ఆదేశమివ్వలేదు అని వారి అభిప్రాయం. దీనికి భిన్నంగా ఇమామ్ షాఫియీ ప్రకారం, సమూహంపైన ఆరోపణ మోపిన వానికి, అతను ఆరోపణ ఒకే పదం ద్వారా మోపినా వేర్వేరు పదాల ద్వారా మోపినా అతనికి ఒక్కొక్క వ్యక్తికి వేర్వేరు చొప్పున దండన విధించవలసి ఉంటుంది. ఉస్మాన్ అల్ బత్తీ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అయితే ఇబ్ను అబీ లైలా అభిప్రాయం వేరు. దానితో ష'బి, ఔజాయి కూడా ఏకీభవించారు. దాని ప్రకారం సామూహికంగా ఒకే మాట ద్వారా అనేక మందిని

وَالَّذِيْنَ يَرْمُوْنَ اَزْوَاجَهُمْ وَلَمْ يَكُنْ لَّهُمْ شُهَدَآءُ اِلَّآ اَنْفُسُهُمْ

فَشَهَادَةُ اَحَدِهِمْ اَرْبَعُ شَهٰدٰتٍۭ بِاللّٰهِ ۙ اِنَّهٗ لَمِنَ الصّٰدِقِيْنَ ۝٦

وَالْخَامِسَةُ اَنَّ لَعْنَتَ اللّٰهِ عَلَيْهِ اِنْ كَانَ مِنَ الْكٰذِبِيْنَ ۝٧ وَيَدْرَؤُا

عَنْهَا الْعَذَابَ اَنْ تَشْهَدَ اَرْبَعَ شَهٰدٰتٍۭ بِاللّٰهِ ۙ اِنَّهٗ لَمِنَ الْكٰذِبِيْنَ ۝٨ ۙ

وَالْخَامِسَةَ اَنَّ غَضَبَ اللّٰهِ عَلَيْهَآ اِنْ كَانَ مِنَ الصّٰدِقِيْنَ ۝٩ وَلَوْلَا

ع فَضْلُ اللّٰهِ عَلَيْكُمْ وَرَحْمَتُهٗ وَاَنَّ اللّٰهَ تَوَّابٌ حَكِيْمٌ ۝١٠

6 – 10 మరెవరయితే తమ భార్యలపై నిందమోపుతారో, వారివద్ద స్వయంగా తాము తప్ప ఇతర సాక్షులెవరూ లేకపోయిన పక్షంలో (ఇటువంటి) వారిలోని ఒక వ్యక్తి సాక్ష్యం (ఏమిటంటే అతను) నాలుగు సార్లు దైవ ప్రమాణం చేసి తాను (తన నిందలో) సత్యమే పలుకుతున్నానని సాక్ష్యం పలకాలి, అయిదవ తూరి, తాను (తన నిందలో) అబద్ధం పలికినట్లయితే తన మీద అల్లాహ్ అభిశాపం కలుగుగాక అని పలకాలి. అలాగే ఆ స్త్రీ నుంచి శిక్ష తొలగిపోవాలంటే ఆవిడ నాలుగుసార్లు దైవప్రమాణం చేసి ఈ వ్యక్తి (తన నిందలో) అబద్ధం పలుకుతున్నాడని సాక్ష్యం పలకాలి, ఇంకా అయిదవతూరి, అతడు (తన నిందలో) నిజం పలుకుతున్నట్లయితే ఆవిడ (తన) పైన అల్లాహ్ ఆగ్రహం విరుచుకుపడుగాక అని పలకాలి.[7] మీపైన అల్లాహ్ అనుగ్రహం, ఆయన కరుణ లేకపోయినట్లయితే ఇంకా అల్లాహ్ ఎంతో కనికరం చూపేవాడు, వివేచనాపరుడు కాకపోయేమాటయితే (భార్యలపైన నింద వ్యవహారంలో మిమ్మల్ని మరీ ఇబ్బందిలో పడవేసేవాడే). (ع1)

వ్యభిచారులు అని ప్రకటించేవాడు ఒకే దండనకు అర్హుడు. ప్రతి ఒక్కరికి వేర్వేరు మాటలలో ఆరోపించినవాడు ప్రతి ఒక్కరి మీద చేసిన ఆరోపణకు వేర్వేరు దండనకు పాత్రుడు.

7. ఈ ఆయత్‌లు వెనుకటి ఆయత్‌ల తరువాత కొంతకాలానికి అవతరించాయి. కజ్ఫ్ శిక్షకు

సంబంధించిన ఆదేశం అవతరించినప్పుడు ఒక ప్రశ్న ఉత్పన్నమయ్యింది. పరాయి స్త్రీ పురుషుల దుర్వర్తనను చూసి మనిషి సహనం వహించగలడు, సాక్షులు లేకపోతే నోటికి తాళం వేసుకోగలడు, వ్యవహారాన్ని ఉపేక్షించగలడు. కాని అతడు స్వయంగా తన భార్య దుర్వర్తనను చూసినట్లయితే ఏమిచెయ్యడం? సంహరిస్తే శిక్షకు పాత్రుడవుతాడు; సాక్షుల్ని వెదకడానికి వెడితే వారు వచ్చే వరకు అపరాధి ఆగి ఉంటాడా? సహనం వహించడం అంటే అసలు ఎలా సాధ్యం? తలాక్ ఇచ్చి స్త్రీని సాగనంపగలడు. కాని దానివల్ల స్త్రీకీ భౌతికంగానో నైతికంగానో శిక్ష ప్రాప్తం కాదు, ఆమె ప్రియునికీ ప్రాప్తం కాదు. ఒకవేళ ఆమె అక్రమ గర్భం దాల్చినట్లయితే పరుని సంతానం తన మెడకు చుట్టుకుంటుంది. ఈ ప్రశ్న ప్రారంభంలో హజ్రత్ సఅద్ బిన్ ఉబాద ఒక ఊహాజనిత ప్రశ్నగా లేవనెత్తారు. ఇంకా ఇలా అన్నారు, "నేను నా ఇంట, దైవం రక్షించుగాక, ఇలాంటి వ్యవహారం చూసినట్లయితే సాక్షులను వెదుక్కుంటూ తిరగను, కరవాలంతో అప్పుడే వ్యవహారం కడతేర్చివేస్తాను" (బుఖారీ, ముస్లిమ్). కాని కొంతకాలం గడవగానే కొన్ని కేసులు ఇలాంటివి ఆచరణాత్మకంగా ముందుకు వచ్చాయి. వాటిలో భర్తలు తమ కళ్ళతో ఈ వ్యవహారం చూశారు, ప్రవక్త మహనీయుల సన్నిధిన ఫిర్యాదు చేశారు. అబ్దుల్లా బిన్ మస్ఊద్, ఇబ్ను ఉమర్ ఉల్లేఖనాల ప్రకారం అన్సారుల్లో ఒక వ్యక్తి (బహుశా ఉవైమిర్ అజ్లానీ) వచ్చి, "దైవప్రవక్తా, ఒక వ్యక్తి తన భార్యని పరపురుషునితోపాటు చూసి నోటితో ఏమన్నా పలికితే మీరు కజ్ఫ్ శిక్ష విధిస్తారు, అతను హత్య చేస్తే మీరతన్ని హతమార్చుతారు, మౌనం వహిస్తే మానసిక క్షోభను అనుభవిస్తూ ఉండాలి, అలాంటప్పుడు అతను ఏం చేయాలి?" అని విన్నవించుకున్నాడు. దానికి ప్రవక్తశ్రీ (స) ప్రార్థించారు, దేవా! ఈ సమస్యకు పరిష్కారం చూపు అని. (ముస్లిమ్, బుఖారీ, అబూదావూద్, అహ్మద్, నసాయి). ఇబ్ను అబ్బాస్ ఉల్లేఖనం ప్రకారం హిలాల్ బిన్ ఉమయ్య వచ్చి తన భార్య వ్యవహారాన్ని ముందుంచాడు. ఆయన స్వయంగా తన కళ్ళారా ఆమెను పాపకూపంలో చూశాడు. ప్రవక్త మహనీయులు (స) "సాక్ష్యాధారాలు తీసుకు రాలేకపోతే నీకు కజ్ఫ్ శిక్ష పడుతుంది" అని అన్నారు. సహచరగణంలో అంతటా కలకలం బయలుదేరింది. హిలాల్, "మిమ్మల్ని ప్రవక్త చేసి పంపిన దైవం సాక్షిగా నేను చెప్పినదంతా పూర్తిగా నిజమయిన ఉదంతం. అదీ నేను కళ్ళారా చూశాను, చెవులారా విన్నాను. నాకు దృఢవిశ్వాసముంది, నా వ్యవహారంలో పరమ ప్రభువు అల్లాహ్ నా వెన్నును కాపాడే ఆదేశాన్ని అవతరింపజేస్తాడని నమ్ముతున్నాను" అని విన్నవించుకున్నారు. దాని మీదట ఈ ఆయత్ అవతరించింది (బుఖారీ, అహ్మద్, అబూదావూద్). ఇందులో ప్రతిపాదించిన నిర్ణయ విధానం ఇస్లామీయ శాసనాంగం పరిభాషలో 'లిఆన్' అనబడుతుంది.

ఈ ఆదేశం వచ్చిన తరువాత దైవప్రవక్త (స) తీర్పు చేసిన కేసుల సవివరమయిన నివేదికలు హదీసు గ్రంథాల్లో నమోదయి ఉన్నాయి. 'లిఆన్'కు సంబంధించిన సవివరమయిన చట్టానికీ ఆచరణ నియమావళి (Procedure Code)కి ఇవే మూలాధారాలు.

హిలాల్ బిన్ ఉమయ్యకు సంబంధించిన కేసు వివరాలు, నిర్ధారిత హదీసు గ్రంథాలు ఆరింటిలోనూ, ముస్నద్ అహ్మద్, ఇబ్ను జరీర్ వ్యాఖ్యాన గ్రంథంలోనూ, ఇబ్ను అబ్బాస్, అనస్ బిన్ మాలిక్ (ర) ద్వారా ఉటంకించబడ్డాయి. వాటి ప్రకారం, ఈ ఆయత్ అవతరణ తరువాత హిలాల్‌ను ఆయన భార్యను, ఇద్దరినీ ప్రవక్త న్యాయ పీఠం ముందుకు రప్పించడం జరిగింది. ప్రవక్తశ్రీ (స) తొలుత దైవాదేశాన్ని వినిపించారు. తరువాత చెప్పారు, "బాగా అర్థం చేసుకోండి, పరలోకయాతన, ఇహలోక యాతనకన్నా ఎంతో తీవ్రమయింది." హిలాల్ విన్నవించుకున్నారు, "నేను ఈమెపైన పూర్తిగా నిజమయిన నిందనే మోపాను." స్త్రీ చెప్పింది, 'ఇది పూర్తిగా అబద్ధం' అని. ప్రవక్తశ్రీ పురమా యించారు, "వీరిరువురి మధ్య "ములాఅనత్" (లిఆన్ ప్రక్రియ)ను చేయించండి. తదనుగుణంగా తొలుత బిలాల్ నిలబడ్డారు, ఆయన ఖుర్ఆన్ ఆజ్ఞ ప్రకారం ప్రమాణాలు చేయసాగారు. ప్రవక్త మహనీయులు ఈ మధ్యన నిరంతరం చెబుతూనే ఉన్నారు, "అల్లాహ్‌కు తెలుసు మీ ఇరువురిలో ఎవరో ఒకరు ఖచ్చితంగా అబద్ధం పలుకుతున్నారని, అలాంటప్పుడు మీలో ఎవరయినా తౌబా చేస్తారా?" అయిదవ ప్రమాణానికి పూర్వం అక్కడున్నవారు హిలాల్‌కు చెప్పారు, "దైవానికి భయపడు, ప్రపంచ యాతన పరలోక యాతనకన్నా తేలికయినది. ఈ అయిదవ ప్రమాణం నీపై యాతనను విధిబద్ధం చేస్తుంది." కాని హిలాల్ ఇలా అన్నారు, "ఇక్కడ నా వెన్ను కాపాడిన దైవం పరలోకంలోనూ నాకు యాతననివ్వడు" అంటూ ఆయన అయిదవ ప్రమాణము కూడా చేశారు. తరువాత స్త్రీ నిలబడింది. ఆమె కూడా ప్రమాణాలు చేయసాగింది. అయిదవ ప్రమాణానికి ముందు ఆమెను కూడా ఆపి, "దైవానికి భయపడు, పరలోక శిక్ష కన్నా ఇహలోక శిక్షను భరించడం సులభతరం. ఈ చివరి ప్రమాణం నీపైన దైవశిక్షను విధిబద్ధం చేసివేస్తుంది." ఇది విని ఆమె కాస్సేపు ఆగి, జంకుతూ ఉండిపోయింది; నేరం అంగీకరిస్తుందేమోనని అనుకున్నారు జనం. కాని ఇలా చెప్పింది. "నేను నా తెగవారిని చిరకాలానికి పరాభవంపాలు చెయ్యబోను" అంటూ అయిదవ ప్రమాణం కూడా చేసి వేసింది. ఆ తరువాత ప్రవక్త మహనీయులు ఇద్దరి మధ్య చిరస్థాయి వేర్పాటును అమలు జరిపారు, ఇంకా ఇలా తీర్పు చేశారు, ఈమెకు పుట్టే శిశువు (అప్పుడు కడుపులో ఉన్నవాడు) తల్లికి చెందినవాడు, తండ్రి సంతానంగా పిలువబడడు. ఎవరికీ ఈమెపైనా లేదా ఈమె శిశువు పైనా నిందమోపే హక్కులేదు. ఈమెను లేదా ఈమె శిశువును నిందించేవారు కజ్ఫ్ శిక్షకు అర్హులవుతారు. ఈమెకు ఇద్దత్ కాలపు భరణం, నివాస వసతి కల్పించవలసిన బాధ్యత ఇక హిలాల్‌పైన ఉండదు, ఎందుకంటే ఇది విడాకుల వల్లనో లేదా భర్త మరణం వల్లనో జరిగిన వేర్పాటు కాదు. తరువాత ఆయన జనులకు [illegible]రు, ఈమెకు శిశువు పుట్టినప్పుడు అతని పోలిక ఎలా ఉందో గమనించండి. అతను భర్త రూపం గలవాడయితే హిలాల్‌కు చెందినవాడు, అలాకాక మరో రూపం గలవాడయితే ఏ వ్యక్తి విషయంలో నిందమోపబడిందో

అతనికి చెందినవాడు అని అన్నారు. ప్రసవం తరువాత చూస్తే పిల్లవాడు మరో రూపం గలవాడుగా ఉన్నాడు. దీని మీదట ప్రవక్తశ్రీ ఇలా అన్నారు, "ప్రమాణాలు లేకపోతే (లేదా దైవగ్రంథంలో ముందే నిర్ణయం జరిగి ఉండకపోతే) నేను ఈ స్త్రీ పట్ల మహా చెడ్డగా వ్యవహరించేవాణ్ణి."

ఉవైమిర్ అజ్లానీ కేసు నివేదిక, సహల్ బిన్ సఅద్ సాయిదీ, ఇబ్ను ఉమర్ (ర) ద్వారా బుఖారీ, ముస్లిమ్, అబూ దావూద్, నసాయి, ఇబ్నుమాజా, ముస్నద్ అహ్మద్‌లలో దొరుకుతుంది. దాని ప్రకారం, ఉవైమిర్, ఆయన భార్య ఇద్దరూ ప్రవక్త మస్జిద్‌కు రప్పించబడ్డారు. 'ములాఅనత్' (లిఆన్ ప్రమాణం చేయించడం)కు పూర్వం ప్రవక్తశ్రీ వారిని కూడా మూడుసార్లు హెచ్చరించి ఇలా చెప్పారు, "అల్లాహ్‌కు బాగా తెలుసు, మీలో ఒకరు నిక్కచ్చిగా అబద్ధం చెబుతున్నారు. అయితే మీలో ఎవరయినా తౌబా చేసి పశ్చాత్తాపంతో మరలుతారా?" ఇద్దరిలో ఎవ్వరూ తౌబా చేయకపోగా ములాఅనత్ చేయించబడింది. ఆ తరువాత ఉవైమిర్ ఇలా అన్నారు, "దైవప్రవక్తా, ఇక ఈ స్త్రీని నేను ఏలుకుంటే అబద్ధం చెప్పినట్లే." ఇలా చెప్పి ప్రవక్తశ్రీ ఆయనకు ఎటువంటి ఆదేశం ఇవ్వకముందే మూడు తలాక్‌లు ఇచ్చివేశారు, ఇంకా సహల్ బిన్ సఅద్ ప్రకారం ప్రవక్తశ్రీ ఆ తలాక్‌లను అమలు జరిపించారు. వారి మధ్య వేర్పాటునూ స్థిరపరిచారు. ఆపైన ఇలా అన్నారు: ఈ వేర్పాటు పరస్పరం 'లిఆన్' చేసే దంపతుల మధ్యన వర్తిస్తుంది. దానిపైన ఇది ప్రవక్త సంప్రదాయంగా స్థిరపడిపోయింది. లిఆన్ చేసే దంపతులను వేరుచేసి వేయాలి, ఆ తరువాత వారిరువురూ ఎన్నడూ కూడలేరు. కాని ఇబ్ను ఉమర్, ప్రవక్తశ్రీ వారి మధ్యన వేర్పాటు చేయించారని మాత్రమే చెబుతారు. (దాన్ని ప్రవక్త సంప్రదాయంగా ప్రకటించలేదు - అను.) సహల్ బిన్ సఅద్ ఇంకా ఇలా కూడా చెప్పారు, ఆ స్త్రీ గర్భంతో ఉండింది, ఉవైమిర్ ఆ గర్భం తన వల్ల కాదని చెప్పివేశారు. అందువల్ల శిశువు తల్లికి చెందినదిగా చెప్పడం జరిగింది. ఇటువంటి పిల్లవాడు తల్లి ద్వారానే వారసత్వం పొందుతాడని, తల్లి మాత్రమే అతని ద్వారా వారసత్వం పొందుతుంది అన్న సంప్రదాయమూ స్థిరపడింది.

ఈ రెండు కేసులే కాక అనేక ఉల్లేఖనాలు మనకు హదీసు గ్రంథాల్లో దొరుకుతాయి. ఈ కేసులు ఏ వ్యక్తులకు చెందినవో వాటివల్ల విశదమవదు. వాటిలో కొన్ని వివరాలు ఈ రెండు కేసులకు సంబంధించినవే కావచ్చు. కాని కొన్నింటిలో కొన్ని ఇతర కేసుల ప్రస్తావన కూడా ఉంది. వీటివల్ల 'లిఆన్' చట్టానికి సంబంధించిన కొన్ని ముఖ్యమయిన అంశాలు వెలుగులోకి వస్తాయి.

ఇబ్ను ఉమర్ ఒక కేసు వివరాలు తెలుపుతూ ఇలా అన్నారు, దంపతులు లిఆన్ చేసివేసిన తరువాత ప్రవక్త మహనీయులు (స) వారి మధ్యన వేర్పాటు చేసివేశారు. (బుఖారీ, ముస్లిమ్, నసాయి, అహ్మద్, ఇబ్నుజరీర్). ఇబ్ను ఉమర్ ఉల్లేఖనం మరొకటి కూడా ఉంది, ఒక వ్యక్తి, అతని భార్య

మధ్యన లిఆన్ జరిగింది. తరువాత అతను గర్భాన్ని కాదన్నాడు. ప్రవక్త మహనీయులు వారి మధ్య వేర్పాటు చేయించారు. పిల్లవాడు కేవలం తల్లికే చెందినవాడు అని తీర్పు చెప్పారు (సిహాహ్ సిత్త, అహ్మద్). ఇబ్ను ఉమర్ ఉల్లేఖనమే మరొకటి కూడా ఉంది. దాని ప్రకారం ములాఅనత్ తరువాత ప్రవక్తశ్రీ (స) ఇలా సెలవిచ్చారు, "మీ విషయం ఇక అల్లాహ్‌కే అప్పగించబడింది, మీలో ఒకరు తప్పనిసరిగా అబద్ధం పలుకుతున్నారు." తరువాత ఆయన పురుషుని సంబోధించి, "ఇక ఈవిడ నీకు చెందదు, నీకు ఈమెపైన ఎలాంటి హక్కు లేదు, ఏ విధంగానూ చెయ్యి చేసుకోలేవు. మరే విధమయిన ప్రతీకార చర్య తీసుకోరాదు" అన్నారు. పురుషుడు "దైవప్రవక్తా, మరి నా సొమ్మో? (అంటే నేనిచ్చిన మహర్ నాకు ఇప్పించండి)" అని విన్నవించుకున్నాడు. దానికి ప్రవక్త మహనీయులు (స), ఇలా నుడివారు, "ఆ సొమ్ము తిరిగి తీసుకునే హక్కు నీకు లేదు. నీవు ఈమెపైన నిజమయిన ఆరోపణ మోపి ఉన్నట్లయితే, ఆ సొమ్ము నీవు ఆమెను హలాల్ (ధర్మసమ్మతంగా భార్యగా) చేసుకుని ఆమె ద్వారా పొందిన ఆనందానుభూతికి ప్రతిఫలమనుకో. అలాకాక నీవు అబద్ధపు ఆరోపణ చేసినట్లయితే ఆ సొమ్ము నీకు ఇంకా దూరమయి తప్పుకుంది, ఈవిడకన్నా అది నీకు మరీ దూరమయిపోయింది." (బుఖారీ, ముస్లిమ్, అబూ దావూద్)

హజ్రత్ అలీ బిన్ అబీ తాలిబ్, ఇబ్ను మస్ఊద్ (ర) ఉభయులు చెప్పినట్లు దార్‌కుత్నీ ఉటంకించారు: "సంప్రదాయం ప్రకారం, లిఆన్ చేసిన దంపతులు మరెప్పుడూ కలువలేరు. (అంటే వారి నికాహ్ మరోసారి ఎన్నటికీ సంభవం కాదు). దార్‌కుత్నీ ప్రకారమే అబ్దుల్లా బిన్ అబ్బాస్ ఉల్లేఖనం ఒకటుంది, ప్రవక్త మహనీయులు (స) స్వయంగా వారిరువురూ మళ్ళీ ఎన్నడూ కలువలేరని చెప్పారు.

కబీసా బిన్ జుఅయ్‌బ్ ఉల్లేఖనం ప్రకారం, హజ్రత్ ఉమర్ కాలంలో ఒక వ్యక్తి తన భార్యకున్న గర్భం అక్రమమయిందని ఆరోపించాడు. తరువాత ఆ గర్భం తనదేనని అంగీకరించాడు. మళ్ళీ ప్రసవం తరువాత, ఈ పిల్లవాడు తన వాడు కాడని చెప్పాడు. వ్యవహారం మహనీయ ఉమర్(ర) న్యాయస్థానంలోకి వెళ్ళింది. ఆయన అతనికి కజ్ఫ్ శిక్ష విధించారు, ఆ పిల్లవాడు అతనికే చెందుతాడని తీర్పు కూడా ఇచ్చారు. (దార్‌కుత్నీ, బైహకి)

ఇబ్ను అబ్బాస్ ఉల్లేఖనం ప్రకారం, ఒక వ్యక్తి హాజరయి ఇలా విన్నవించుకున్నాడు, "నాకు ఒక భార్య ఉంది, ఆమె అంటే నాకు ప్రాణం. కాని ఆమె స్థితి ఏమిటంటే, ఎవరు చెయ్యి పెట్టినా విదిలిం చుకోదు. (ఇది సంకేతవాచకం, దాని అర్థం వ్యభిచారమూ కావచ్చు, వ్యభిచారం కన్నా కాస్త తక్కువ స్థాయి నైతికబలహీనతా కావచ్చు.) ప్రవక్త (స) తలాక్ ఇచ్చి వెయ్యి అని పురమాయించారు. అతను, కాని నేను ఆమె లేకుండా బతకలేను అని చెప్పాడు. సరే ఆమెని ఏలుకో అని ఆయన సెలవిచ్చారు. (ఆయన(స) ఆ సంకేత వాచకానికి వివరణ కోరలేదు, అతని మాటను వ్యభిచార ఆరోపణగా పరిగణించి లిఆన్ ఆదేశాలూ ఇవ్వలేదు). (నసాయి)

అబూ హురైరా(ర) ఇలా చెబుతున్నారు, ఒక పల్లెవాసి వచ్చి, నా భార్య నల్లని పిల్లవాణ్ణి కన్నది, అతడు నాకు పుట్టాడని నేననుకోవడం లేదు. (అంటే కేవలం శిశువు రంగు వల్ల అతనికి అనుమానం కలిగింది, కాని భార్య మీద వ్యభిచారం నింద వెయ్యడానికి అతని వద్ద మరే ఆధారమూ లేదు). నీ వద్ద ఏమయినా ఒంటెలున్నాయా? అని ప్రవక్త అడగ్గా అతడు ఉన్నాయని చెప్పాడు. వాటి రంగులెలా ఉన్నాయి? అని ఆయన అడిగారు. అతడు ఎరుపు అని చెప్పాడు. ఆయన, వాటిలో ఏదయినా మట్టి రంగుదీ ఉందా? అని అడిగారు. అవును కొన్ని అలాంటివి కూడా ఉన్నాయి అని అతను బదులిచ్చాడు. ఈ రంగు ఎక్కడి నుండి వచ్చిందంటావు? అని ఆయన అడగ్గా అతను, బహుశా ఏదయినా నరం లాక్కెళ్ళిందేమో (అంటే వాటి పూర్వీకుల్లో ఏదయినా ఆ రంగుదీ ఉండి ఉంటుంది, దాని ప్రభావమే వీటిలో వచ్చి ఉంటుంది) అని అన్నాడు. ఆయన సెలవిచ్చారు, "బహుశా ఈ పిల్లవానికీ ఏదయినా నరం లాక్కెళ్ళి ఉంటుంది." తరువాత ప్రవక్త మహనీయులు తన సంతతిని కాదనే అనుమతి అతనికి ఇవ్వలేదు. (బుఖారీ, ముస్లిమ్, అహ్మద్, అబూ దావూద్).

అబూ హురైరా ఉటంకించిన మరో ఉల్లేఖనముంది. దాని ప్రకారం లిఆన్ ఆయత్‌ను వ్యాఖ్యానిస్తూ ప్రవక్త మహనీయులు(స) ఇలా చెప్పారు, "ఏ స్త్రీ అయినా ఒక కుటుంబంలో ఆ కుటుం బానికి చెందని సంతానాన్ని ప్రవేశపెడితే (అంటే హరామ్, అక్రమ గర్భం దాల్చి దాన్ని తన భర్త తలకు రుద్దినట్లయితే) ఆమెకు అల్లాహ్‌తో ఎటువంటి సంబంధం లేదు, అల్లాహ్ ఆమెను స్వర్గంలో ఎన్నటికీ ప్రవేశింపజెయ్యడు. అలాగే ఏ పురుషుడయితే పిల్లవానికి తన పోలికలున్నప్పటికీ, సంతానం తనది కాదని త్రోసిపుచ్చుతాడో, అల్లాహ్ ప్రళయ దినాన అతనికి దర్శన మివ్వడు, అతన్ని పూర్వోత్తర సృష్టి మొత్తం సమక్షంలో పరాభవం పాలు చేస్తాడు. (అబూదావూద్, నసాయి, దారిమి)

'లిఆన్' ఆయత్, ఈ ఉల్లేఖనాలు, దృష్టాంతాలు, షరీఅత్‌లోని సర్వసామాన్యమయిన సూత్రాలు, ఇస్లామ్‌లో 'లిఆన్'కు సంబంధించిన చట్టానికి మూలాధారాలు. వీటి వెలుగులోనే ఫిక్‌హ్‌వేత్తలు (ధర్మశాస్త్రవేత్తలు) లిఆన్‌కు సంబంధించిన పూర్తి సవివరమయిన నియమావళిని రూపొందించారు. ఈ నియమావళిలోని ముఖ్యమయిన అధికరణలు ఇవి:

(1) తన భార్య దుశ్చేష్టకు పాల్పడుతూ ఉండగా చూసిన వ్యక్తి లిఆన్ విధానాన్ని అవలంబించ డానికి బదులు హత్యకు ఒడిగడితే అతని విషయంలో భిన్నాభిప్రాయముంది. ఒక వర్గం ప్రకారం అతనికి మరణశిక్ష విధించాలి, ఎందుకంటే అతనికి స్వయంగానే శిక్ష విధించే అధికారం లేదు. మరో వర్గం, అతనికి మరణ శిక్ష విధించడమూ జరగదు, అతని ఈ చర్య పట్ల అతన్ని పట్టుకోవడమూ జరగదు, అయితే అతని సత్యత రుజువు కావాలి. (అంటే అతను నిజంగానే వ్యభిచార చర్యను చూసిన తరువాతనే ఈ చర్యకు పాల్పడ్డాడు అనే

విషయం నిర్ధారణ కావాలి) అని అంటుంది. ఇమామ్ అహ్మద్, ఇస్హాక్ బిన్ రాహవయ ప్రకారం అటువంటి వ్యక్తి ఇద్దరు సాక్షులను తీసుకురావలసి ఉంటుంది. వారు అతని హత్యకు కారణం ఇదేనని సాక్ష్యమివ్వాలి. మాలికీ ధర్మశాస్త్రవేత్త లయిన, ఇబ్నుల్ కాసిమ్, ఇబ్ను హబీబ్ దాని పైన మరో నిబంధన విధిస్తారు. హతుడయిన వ్యభిచారి వివాహితుడయి ఉండాలి. అలాకాక అవివాహితుడయిన వ్యభిచారిని హత్యచేస్తే హత్యా ప్రతీకారం తీర్చుకోబడుతుంది. కాని అత్యధిక ధర్మవేత్తల అభిప్రాయంలో అతన్ని హత్యా ప్రతీకారం నుండి మన్నించివేయాలంటే, అతను వ్యభిచారానికి నలుగురు సాక్షులు తీసుకురావాలి, లేదా హతుడు మరణానికి పూర్వం, తాను అతని భార్యతో వ్యభిచరించినట్లు అంగీకరించి ఉండాలి, ఇంకా హతుడు వివాహితుడయి ఉండాలి. (నైలుల్ అవుతార్, సం.6 పు.228)

(2) లిఆన్ ఇంటనే కూర్చుని, పరస్పరం చేసుకుంటే నెరవేరదు, దీనికి న్యాయస్థానానికి వెళ్ళడం తప్పనిసరి.

(3) లిఆన్‌ని కోరే హక్కు కేవలం పురుషునికే కాదు, స్త్రీ కూడా న్యాయస్థానంలో దీన్ని కోరగలదు, భర్త తన మీద చెడు నడత నిందమోపినా, సంతానం తనది కాదని తిరస్కరించినా ఆమెకు ఆ హక్కు సంక్రమిస్తుంది.

(4) లిఆన్ ప్రతి దంపతుల మధ్య సాధ్యమా లేదా దీనికి కూడా ఇరువురి మధ్య ఏమయినా నిబంధనలున్నాయా? ఈ విషయంలో ధర్మవేత్తల మధ్య భేదాభిప్రాయముంది. ఇమామ్ షాఫియీ ప్రకారం, ఎవరి ప్రమాణం చట్టబద్ధంగా విశ్వసనీయమో, ఎవరికి తలాక్ ఇచ్చే అధికారముంటుందో వారే లిఆన్‌ని చెయ్యగలరు. అంటే వారి దృష్టిలో ప్రాజ్ఞత గలవారు, బుద్ధికుశలత గలవారు కావడం చాలు, దంపతులు ముస్లిములయినా, ముస్లిమేతరులయినా, బానిసలయినా, స్వేచ్ఛగలవారయినా, వారి సాక్ష్యం నమ్మదగిందే అయినా కాకపోయినా, భర్త ముస్లిమయి భార్య ముస్లిమయినా లేదా జిమ్మీ అయినా సరే. దాదాపు ఇదే అభిప్రాయం ఇమామ్ మాలిక్, ఇమామ్ అహ్మద్ కూడా వ్యక్తం చేశారు. కాని హనఫీ ఫిక్హ్‌వేత్తల ప్రకారం లిఆన్ కేవలం స్వేచ్ఛాయుత ముస్లిమ్ దంపతులకే వర్తిస్తుంది. వారు కజ్ఫ్ నేరంలో శిక్షపొందినవారు కారాదు; స్త్రీ పురుషులిరువురూ ముస్లిమేతరులయినా, బానిసలయినా, కజ్ఫ్ అపరాధంలో మొదట శిక్ష పొంది ఉండినా వారి మధ్య లిఆన్ సంభవం కాదు. పైగా స్త్రీ ఎప్పుడయినా ఇతఃపూర్వం అక్రమంగా, అనుమానాస్పదంగా మరో పురుషునితో కలుషితమయి ఉన్నా లిఆన్ సరయినది కాదు. ఈ నిబంధనలు హనఫీ ఫిక్హ్‌వేత్తలు విధించడానికి కారణం, వారి దృష్టిలో లిఆన్ చట్టంలోనూ కజ్ఫ్ చట్టంలోనూ ఒకే వ్యత్యాసం, అది లేకపోతే రెండూ

ఒకటే; అది, పరపురుషుడు కజ్‌ఫ్‌కు పాల్పడితే అతనికి శిక్షపడుతుంది, భర్త దానికి పాల్పడితే అతను లిఆన్ చేసి తప్పించుకోగలడు. మిగతా విషయాలన్నింటిలో లిఆన్, కజ్‌ఫ్‌లు రెండూ ఒక్కటే. పైగా హనఫీ ధర్మవేత్తల ప్రకారం లిఆన్ ప్రమాణాలు సాక్ష్యం వంటివి గనక, సాక్ష్యానికి అర్హుడు కాని వ్యక్తికి లిఆన్ అనుమతించరు వారు. కాని నిజానికి ఈ విషయంలో హనఫీ శాస్త్రవేత్తల పంథా బలహీనమయింది, ఇమామ్ షాఫియీ చెప్పిందే సరయినది. దీని తొలి కారణం, భార్య పట్ల కజ్‌ఫ (వ్యభిచార ఆరోపణ) వ్యవహా రాన్ని కజ్‌ఫ ఆయత్‌లో ఒక భాగంగా ఖుర్‌ఆన్ చేర్చలేదు, దాన్ని వేరుగా ప్రత్యేకమయిన చట్టంగా పేర్కొన్నది. అందువల్ల దీన్ని కజ్‌ఫ చట్టం కిందికి తెచ్చి కజ్‌ఫ్‌కి నిర్ణయమయిన నిబంధనలన్నీ వర్తింపజెయ్యడానికి వీల్లేదు. లిఆన్ ఆయత్ పదాలు, కజ్‌ఫ ఆయత్ పదాలు భిన్నమయినవి, రెండూ వేర్వేరు ఆదేశాలు. అందువల్ల లిఆన్ చట్టం లిఆన్ ఆయత్ ద్వారానే సేకరిం చాలి, కజ్‌ఫ ఆయత్ ద్వారా కాదు. ఉదాహరణకు కజ్‌ఫ ఆయత్‌లో శిక్షకు అర్హుడయినవాడు, శీలవతులయిన స్త్రీల (ముహ్సనాత్)పైన ఆరోపణ చేసినవాడు. కాని లిఆన్ ఆయత్‌లో శీలవతి అయిన భార్య అన్న నిబంధన ఎక్కడా లేదు. ఒక స్త్రీ ఎప్పుడయినా పాపం చేసి ఉన్నప్పటికీ తరువాత ఆమె తౌబా చేసుకుని ఏ వ్యక్తితోనయినా నికాహ్ చేసుకుంటే, తరువాత ఆమె భర్త ఆమెపైన అధర్మంగా నిందమోపితే, లిఆన్ ఆయత్ ప్రకారం స్త్రీ మీద నింద మోపడానికో లేదా ఆమె సంతానానికి తన రక్త సంబంధం లేదని నిరాకరిం చడానికో భర్తకు పూర్తి స్వేచ్ఛ లభించదు, కేవలం ఆమె జీవితానికి మునుపెన్నడో మచ్చ తగిలిందన్న కారణంగా అలా చేయలేడు. అంతే ముఖ్యమయిన రెండవ కారణం, భార్యపైన నింద, పరస్త్రీ మీద నింద రెంటికీ భూమ్యాకాశాలంత తేడా ఉంది. రెంటి విషయంలో చట్టం నైజం ఒకటే కాజాలదు. పరస్త్రీతో పురుషునికి ఎలాంటి సంబంధం లేదు. భావావేశాలకు సంబంధించిన, గౌరవ మర్యాదలకు సంబంధించిన, సామాజిక విషయాలకు సంబం ధించిన, అధికారాలకు సంబంధించిన, వంశం సంతతికి సంబంధించిన ఎటువంటి పొత్తూ లేదు. ఆమె నడవడిపట్ల ఒక వ్యక్తికి కలిగే ఆసక్తి మహా అయితే సమాజాన్ని చెడు నడత నుండి కాపాడి పరిశుద్ధంగా ఉంచాలన్న ఒక ఉద్రేకం తప్ప మరే కారణమూ కాజాలదు. కాని దీనికి భిన్నంగా తన భార్యతో మనిషికి గల సంబంధానికి ఒక కోణం కాదు, ఎన్నో రీతుల సంబంధం అది; అదీ చాలా గాఢమయిన సంబంధం. అతని వంశం, సంతతి, అతని సొమ్ము, అతని ఇల్లు అన్నింటి పట్ల నిజాయితీకి ఆమె బాధ్యురాలు. అతని జీవితంలో భాగస్వామిని, అతని రహస్యాలను కాపాడవలసిన అమానతుదారిణి, అతని అత్యంత నిగూఢమయిన, సున్నితమయిన భావోద్రేకాలు ఆమెతో ముడివడి ఉంటాయి. ఆమె దుర్వర్తన వల్ల అతని

అభిమానం, గౌరవమర్యాదలు, అతని ప్రయోజనాలు, అతని రాబోయే సంతతి పరిశుద్ధతలపైన అన్నింటికీ తీరని విఘాతం కలుగుతుంది. ఈ రెండు వ్యవహారాలు ఏ విధంగా ఒకటవుతాయి, రెంటికీ చట్టం నైజం ఒకటే కావడం ఎలా సంభవం. ఒక జిమ్మీ ఒక బానిస, ఒక శిక్ష పొందిన మనిషికి అతని భార్య వ్యవహారం, ఒక స్వేచ్ఛాయుత, సాక్ష్యానికి అర్హుడయిన ముస్లిమ్ వ్యక్తి వ్యవహారానికి ఏ విధంగాను ఏ మాత్రం భిన్నం కాదు, ప్రాముఖ్యం రీత్యా, పర్యవసానాల రీత్యా కూడా ఎంత మాత్రం తక్కువ కాదు. అతను తన కళ్ళతో తన భార్య పరునితో పడుకుని ఉండగా చూస్తే, లేదా తన భార్య ఇతరుని వల్ల గర్భం దాల్చిందన్న దృఢ విశ్వాసం అతనికి కలిగితే, అతనికి లిఆన్ హక్కునివ్వకపోవడానికి సమంజసమయిన కారణం ఏది? ఆ హక్కు అతన్నుండి హరించిన తరువాత, మన చట్టంలో అతనికి గల మరో ప్రత్యామ్నాయ మార్గమేది? దివ్యఖుర్ఆన్ అభిమతం స్పష్టంగా తెలుస్తోంది, అది వివాహిత దంపతులకు ఇటువంటి చిక్కు నుండి బయటపడేందుకు ఒక మార్గం చూపాలని కోరుతోంది. భార్య నిజంగానే చెడునడతకు పాల్పడితే లేదా అక్రమ గర్భం ధరించి ఉంటే ఏర్పడే చిక్కు నుండి భర్తను కాపాడాలని, అలాగే భర్త మోపే అబద్ధపు నిందవల్ల, లేదా సంతానపు వంశం గురించి అసంబద్ధంగా నిరాకరించినందువల్ల భార్యకు కలిగే సమస్యల నుండి ఆమెను రక్షించాలని ఖుర్ఆన్ అభిలషిస్తోంది. ఈ అవసరం కేవలం సాక్ష్యానికి అర్హు లయిన, స్వేచ్ఛాయుత ముస్లిములకు మాత్రమే ప్రత్యేకం కాదు, ఖుర్ఆన్ ప్రయోగించిన భాష లోనూ, దీన్ని వీరి వరకే పరిమితం చేసే ఏ సంకేతం కానరావడం లేదు. పోతే, లిఆన్ ప్రమాణాలను ఖుర్ఆన్ సాక్ష్యాలుగా పరిగణిస్తుంది గనక, సాక్ష్యానికి సంబంధించిన నిబంధనలు ఇక్కడ వర్తిస్తాయి అన్న వాదనను బట్టి చూస్తే, న్యాయబద్ధులయిన, సాక్ష్యానికి అర్హులయిన భర్తలు ప్రమాణాలు చెయ్యాలి, మరి స్త్రీ ప్రమాణం చెయ్యటానికి సిద్ధం కాకపోతే స్త్రీకి రాళ్ళతో కొట్టే శిక్ష విధించాలి, ఎందుకంటే ఆమె దుర్వర్తనకు నిరూపణ స్థాపితమయిపోయింది. కాని చాలా విచిత్రమయిన విషయం ఏమిటంటే ఇటువంటి సందర్భంలో హనఫీ ఫిక్హ్‌వేత్తలు రాళ్ళతో కొట్టే శిక్షను విధించరు. దీన్నిబట్టి వారు కూడా లిఆన్ ప్రమాణాలకు సరిగ్గా పూర్తిగా సాక్ష్యాల స్థాయినివ్వరని స్పష్టమవుతోంది. నిజానికి ఖుర్ఆన్ కూడా ఈ ప్రమాణాలకు సాక్ష్యం అనే పదాన్ని పేర్కొన్నప్పటికీ సాక్ష్యంగా పరిగణించదు, అలా అయినట్లయితే స్త్రీని నాలుగుకు బదులు ఎనిమిది ప్రమాణాలు చెయ్యమని ఆదేశించేది.

(5) లిఆన్ అనేది కేవలం సంకేతంగా, ఉపమానం రూపంలో, లేదా అనుమానం, ఆశంకలవల్ల తప్పనిసరిగా వర్తించదు. కేవలం భర్త స్పష్టంగా వ్యభిచార ఆరోపణ మోపిన పక్షంలో లేదా స్పష్టంగా పిల్లవానిని తన పిల్లవానిగా ఆమోదించడానికి అంగీకరించని పక్షంలోనే

వర్తిస్తుంది. ఇమామ్ మాలిక్, లైస్ బిన్ సఅద్ దీని మీద మరో నిబంధన కూడా పెంచు తారు, దాని ప్రకారం భర్త ప్రమాణం చేసేటప్పుడు, తాను తన కళ్ళతో తన భార్య వ్యభిచారానికి పాల్పడినట్లు చూశానని చెప్పాలి. కాని ఈ నిబంధన నిరాధారమయింది. దీనికి మూలం ఖురాన్‌లోనూ లేదు, హదీసులోనూ లేదు.

(6) నింద మోపిన తరువాత భర్త ప్రమాణం చేయడానికి వెనుకాడితే ఇమామ్ అబూ హనీఫా ఆయన సహచరుల ప్రకారం అతన్ని ఖైదు చేసివేయాలి, అతను లిఆన్ చేయడానికి లేదా తన నింద అబద్ధం అని ఒప్పుకోవడానికి అంగీకరించనంత వరకు వదలిపెట్టరాదు. అబద్ధమని అంగీకరిస్తే అతనికి కజ్ఫ్ శిక్ష విధించాలి. దీనికి భిన్నంగా ఇమామ్ మాలిక్, షాఫియీ, హసన్ బిన్ సాలిహ్, లైస్ బిన్ సఅద్ అభిప్రాయంలో లిఆన్‌కు వెనుకాడటం అంటే తాను చెప్పేది అబద్ధం అని ఒప్పుకోవడమే, అందువల్ల కజ్ఫ్ శిక్ష విధించడం తప్పనిసరి.

(7) భర్త ప్రమాణం చేసిన తరువాత స్త్రీ లిఆన్‌కు వెనుకాడినట్లయితే హనఫీ ధర్మశాస్త్రవేత్తల ప్రకారం, ఆమెను ఖైదు చేసి వేయాలి, ఆమె లిఆన్‌కు ఒప్పుకోనంత వరకు లేదా వ్యభిచారాన్ని అంగీకరించనంత వరకు వదలిపెట్టరాదు. మరోవైపు పైన పేర్కొన్న ధర్మవేత్తల ప్రకారం, ఇటువంటి పరిస్థితిలో ఆమెకు రాళ్ళతో కొట్టే శిక్ష విధించాలి. వారి వాదనకు ఆధారం ఖుర్ఆన్ ఆదేశం. ఆ ఆదేశంలో, స్త్రీని శిక్ష నుండి తప్పించేది కేవలం ఆమె కూడా ప్రమా ణాలు చేయడమే. ఇక ఆమె ప్రమాణం చెయ్యలేదు గనక తప్పనిసరిగా ఆమె శిక్షకు అర్హురాలవుతుంది. కాని ఈ వాదన బలహీనమయింది. ఎందుకంటే ఖుర్ఆన్ ఇక్కడ కేవలం శిక్షను ప్రస్తావిస్తుంది. అది ఎలాంటి శిక్షో విశదపరచదు. శిక్ష అంటే వ్యభిచారానికి శిక్షే అన్నట్లయితే, వ్యభిచారానికి శిక్ష విధించాలంటే ఖుర్ఆన్ స్పష్టంగా నలుగురు సాక్షుల నిబంధన పెట్టింది. ఈ నిబంధనను కేవలం ఒక్క వ్యక్తి చేసే నాలుగు ప్రమాణాలు నెరవేర్చ జాలవు. భర్త చేసే ప్రమాణాలు అతన్ని కజ్ఫ్ శిక్ష నుండి తప్పించడానికీ స్త్రీకి లిఆన్ ఆదేశాలు వర్తింపజేయడానికీ సరిపోతాయి. కాని దాని వల్ల స్త్రీపైన వ్యభిచార ఆరోపణ రుజువయ్యేందుకు అవి సరిపోవు. స్త్రీ ప్రమాణాలు చేసేందుకు నిరాకరించడం అనుమానాన్ని- బలమయిన అనుమానాన్ని సృష్టిస్తుంది. కాని అనుమానాల ఆధారంగా 'హద్ద్' శిక్షలు విధింపబడజాలవు. ఈ శిక్ష విధించడాన్ని పురుషుని కజ్ఫ్ శిక్షకు సమానమని ఊహించరాదు. అతని కజ్ఫ్ రుజువయినందువల్లనే అతన్ని లిఆన్ కోసం నిర్బంధించడం జరిగింది. కాని దీనికి భిన్నంగా స్త్రీ మీద వ్యభిచార నేరం రుజువు కాలేదు. దానికి ఆమె స్వయంగానయినా అంగీకరించాలి లేదా నలుగురు ప్రత్యక్ష సాక్షులయినా కావాలి, లేకపోతే అది రుజువు కాదు.

(8) లిఆన్ సమయంలో స్త్రీ గర్భం దాల్చి ఉన్నట్లయితే ఇమామ్ అహ్మద్ దృష్టిలో స్వయంగా లిఆన్ వల్లనే తేలిపోతుంది, పురుషుడు ఈ గర్భానికి బాధ్యుడు కాడని, శిశువు అతనిదిగా పరిగణించబడదని– పురుషుడు ఆ గర్భాన్ని స్వీకరించడానికి నిరాకరించినా నిరాకరించక పోయినా సరే. ఇమామ్ షాఫియీ ప్రకారం పురుషుని వ్యభిచార నిందమోపడం, గర్భాన్ని కాదనడం రెండూ ఒకటికావు. అందువల్ల పురుషుడు గర్భం బాధ్యతలను స్వీకరించడానికి స్పష్టంగా నిరాకరించనంత వరకు, అతను వ్యభిచార నింద మోపినా గర్భం అతనికే చెందు తుంది. ఎందుకంటే స్త్రీ వ్యభిచరించినంత మాత్రాన ఆ గర్భం కూడా వ్యభిచారం వల్ల కలిగినదే కావడం తప్పనిసరి కాదు.

(9) ఇమామ్ మాలిక్, ఇమామ్ షాఫియీ, ఇమామ్ అహ్మద్ గర్భం ఉండగానే పురుషునికి గర్భాన్ని తిరస్కరించే హక్కు నిస్తారు, ఈ కారణంగా లిఆన్ ధర్మసమ్మతమని అంటారు. కాని ఇమామ్ అబూ హనీఫా ప్రకారం, పురుషుడి నిందకు కారణం వ్యభిచారం కాకపోయి నట్లయితే, కేవలం స్త్రీ గర్భం దాల్చిన పరిస్థితులను బట్టి, అతని అభిప్రాయంలో ఆ గర్భం తనది కాదన్న కారణంగా అతను నిందమోపినట్లయితే ఇటువంటి పరిస్థితుల్లో లిఆన్‌ని ప్రసవం జరిగే వరకు వాయిదా వేయాలి, ఎందుకంటే అనేక సందర్భాలలో ఏదయినా వ్యాధివల్ల గర్భం దాల్చిన అనుమానం గలుగుతుంది, నిజానికి అది గర్భమయి ఉండదు.

(10) తండ్రి, కొడుకు తన వంశానికి చెందిన వాడుకాడని తిరస్కరిస్తే లిఆన్ తప్పనిసరి అనే విషయంలో ఏకాభిప్రాయం ఉంది. ఇంకా మరో విషయంలోనూ ఏకాభిప్రాయముంది, ఒకసారి పిల్లవాణ్ణి స్వీకరించిన తరువాత (ఈ స్వీకారం స్పష్టమయిన పదాలలో జరిగినా, లేదా స్వీకారాన్ని సూచించే ఆధారం కాగల చేష్టలు చేసినా, ఉదాహరణకు శిశుజననానికి అభినందనలు స్వీకరించడం, శిశువు పట్ల పితృవాత్సల్యాన్ని చూపడం, అతని పెంపకం పట్ల శ్రద్ధచూపడం) ఇక శిశువు వంశావళిని కాదనే హక్కు తండ్రికి మిగులదు. ఒకవేళ తిరస్కరిస్తే కజ్ఫ్ శిక్షకు అర్హుడవుతాడు. అయితే తండ్రికి, వంశావళి నిరాకరించే హక్కు ఎప్పటి వరకు ఉంటుందన్న విషయంలో భేదాభిప్రాయముంది. ఇమామ్ మాలిక్ దృష్టిలో భార్య గర్భం దాల్చిన కాలంలో భర్త ఇంట ఉన్నట్లయితే గర్భకాలం నుండి ప్రసవ కాలం వరకు అతనికి నిరాకరించే అవకాశముంది. ఆ తరువాత నిరాకరించే హక్కు కోల్పోతాడు. అయితే ఒకవేళ అతను ఆ కాలంలో ఇంట లేకపోతే అతను లేనప్పుడే ప్రసవం జరిగి నట్లయితే, అతనికి తెలిసిన సమయాన కూడా అతడు నిరాకరించగలడు. ఇమామ్ అబూ హనీఫా దృష్టిలో ప్రసవం తరువాత ఒకటి రెండు రోజుల్లో అతను తిరస్కరిస్తే లిఆన్ చేసి ఆ శిశువు బాధ్యత నుండి విముక్తుడవుతాడు. కాని ఒక రెండు ఏళ్ళ తరువాత తిరస్కరిస్తే లిఆన్

చేయగలడు కాని అతను పిల్లవాని బాధ్యత నుండి విముక్తుడు కాలేడు. ఇమామ్ అబూ యూసుఫ్ దృష్టిలో జననం తరువాత, లేదా జననం గురించి సమాచారం తెలిసిన తరువాత నలభయి రోజుల్లోపల తండ్రికి శిశువు వంశావళిని తిరస్కరించే హక్కుంది, ఆ తరువాత ఆ హక్కు కోల్పోతాడు. కాని ఈ నలభయి రోజుల నియమం అర్థరహితం. సరయిన విషయం ఇమామ్ అబూ హనీఫా తెలిపినదే. అంటే పుట్టుక తరువాత లేదా దాని సమాచారం అందిన తరువాత ఒకటీ రెండు రోజుల్లో వంశావళిని నిరాకరించే అవకాశముంటుంది. అయితే సమంజసమయిన అవరోధంగా పరిగణించబడగలిగే అవరోధం ఏదయినా ఏర్పడితే అది వేరే విషయం.

(11) భర్త తలాక్ ఇచ్చిన తరువాత విడాకులు పొందిన భార్యపైన నింద మోపినట్లయితే ఇమామ్ అబూ హనీఫా దృష్టిలో లిఆన్‌కు తావులేదు, అతని మీద కజ్ఫ్ కేసు పెట్టవలసి ఉంటుంది. ఎందుకంటే లిఆన్ భార్యాభర్తలకే వర్తిస్తుంది, విడాకులు పొందిన స్త్రీ అతనికి భార్యకాదు. అయితే 'తలాక్ రజయీ' అయినట్లయితే, అతడు తిరిగి స్వీకరించే కాలం లోపల అతను నిందమోపితే అప్పుడు అది చెల్లుతుంది. కాని ఇమామ్ మాలిక్ ప్రకారం గర్భం లేదా పిల్లవాని వంశావళిని స్వీకరించే లేదా స్వీకరించకపోయే సమస్య మధ్యన లేకపోతేనే ఏదైనా కజ్ఫ్ కేసు వర్తిస్తుంది. అలా కాకపోతే పురుషునికి 'తలాక్ బాయిన్' తరువాత కూడా లిఆన్ చేసే హక్కు ఉంది. ఎందుకంటే ఇలా చేసి అతను స్త్రీని అప్రతిష్టపాలు చేసేం దుకు కాక తన సంతానం కాదని తాను భావించే శిశువు బాధ్యత నుండి తప్పించుకునేందుకు లిఆన్ చేస్తున్నాడు. ఇమామ్ షాఫియీ అభిప్రాయం కూడా దాదాపు ఇదే.

(12) లిఆన్ వల్ల ఏర్పడే చట్టపరమయిన పర్యవసానాలలో కొన్ని ఏకగ్రీవమయినవి, మరికొన్నింటి విషయంలో ఫిక్‌హ్‌వేత్తల మధ్య భేదాభిప్రాయముంది.

ఏకగ్రీవమయిన పర్యవసానాలు ఇవి: స్త్రీ పురుషులిరువురూ శిక్షకు అర్హులు కారు. పురుషుడు పిల్లవాని వంశావళిని నిరాకరిస్తే పిల్లవాడు కేవలం తల్లికే చెందినవాడవుతాడు, తండ్రికి వర్తించడు, తండ్రి నుండి వారసత్వమూ పొందడు. తల్లి అతనికి వారసురాలవుతుంది, అతనూ తల్లినుండి వారసత్వం పొందుతాడు. స్త్రీని వ్యభిచారిణి అని, ఆమె సంతానాన్ని వ్యభిచార సంతానమని పేరుపెట్టే అధికారం ఎవరికీ లేదు; లిఆన్ జరిగే సమయాన అప్పటి పరిస్థితులను బట్టి ఆమె వ్యభిచరించిందన్న విషయంలో ఎలాంటి శంక మిగలని సందర్భం లోనూ ఎవరూ అలా ఆరోపించలేరు. ఎవరయినా లిఆన్ తరువాత ఆమెపైనా లేదా ఆమె సంతానంపైనా

اِنَّ الَّذِيْنَ جَآءُوْ بِالْاِفْكِ عُصْبَةٌ مِّنْكُمْ ۭ لَا تَحْسَبُوْهُ شَرًّا لَّكُمْ ۭ بَلْ هُوَ

خَيْرٌ لَّكُمْ ۭ لِكُلِّ امْرِئٍ مِّنْهُمْ مَّا اكْتَسَبَ مِنَ الْاِثْمِ ۚ وَالَّذِيْ تَوَلّٰى

كِبْرَهٗ مِنْهُمْ لَهٗ عَذَابٌ عَظِيْمٌ ⑪

11–15 ఎవరయితే ఈ అపనింద కల్పించి తెచ్చారో[8] వారు మీలోనే ఉన్న ఒక ముఠా.[9] ఈ సంఘటనను మీ విషయంలో కీడుగా ఎంచకండి, నిజానికి ఇదీ మీ కొరకు మేలయినదే.[10] ఇందులో ఎవరెవరు ఎంతగా పాలుపంచుకున్నారో అతను అంతేపాపం మూటకట్టుకున్నాడు, మరే వ్యక్తి దీని బాధ్యతలో పెద్ద వాటాను తన నెత్తిన వేసుకున్నాడో[11] అతనికయితే అత్యంత ఘోరమయిన యాతన లభిస్తుంది.

పాత నిందను తిరిగి మోపినట్లయితే కజ్‌ఫ్ శిక్షకు పాత్రుడవు తాడు. స్త్రీ మహ్‌ర్ కోల్పోదు. స్త్రీ ఇద్దత్ కాలంలో పురుషుని ద్వారా భరణం, నివేశనా స్థలం పొందే అర్హతను కోల్పోతుంది. స్త్రీ ఆ పురుషునికి (హరామ్) నిషిద్ధమయిపోతుంది.

భేదాభిప్రాయం రెండు విషయాలలో ఉంది. ఒకటి లిఆన్ తరువాత స్త్రీ పురుషుల మధ్య వేర్పాటు జరిగేదెలా? రెండు, లిఆన్ కారణంగా వేరుపడిన తరువాత ఆ ఇరువురు తిరిగి కలసుకోవడం సంభవమా? తొలి సమస్యలో ఇమామ్ షాఫియీ ప్రకారం, పురుషుడు లిఆన్‌ని ముగించగానే అదే సమయంలో వేర్పాటు దానంతట అదే సంభవిస్తుంది. స్త్రీ తన వంతు లిఆన్ ప్రకటించినా ప్రకటించకపోయినా సరే. ఇమామ్ మాలిక్, లైస్ బిన్ సఅద్, జుఫర్ ప్రకారం, స్త్రీ పురుషులిరువురూ లిఆన్‌ని ముగించుకున్న తరువాతనే వేర్పాటు జరుగుతుంది. ఇమామ్ అబూ హనీఫా, అబూ యూసుఫ్, ముహమ్మద్ ప్రకారం లిఆన్ వల్ల వేర్పాటు దానంతట అదే ఏర్పడదు, న్యాయస్థానం వేర్పాటు చేయడం ద్వారానే జరుగుతుంది. భర్త స్వయంగానే తలాక్ ఇచ్చినట్లయితే మంచిది. లేకపోతే న్యాయాధికారి వారి మధ్య వేర్పాటును ప్రకటిస్తాడు. రెండవ సమస్యలో ఇమామ్ మాలిక్, అబూ యూసుఫ్, జుఫర్, సుఫ్యాన్ సౌరి, ఇస్‌హాక్ బిన్ రాహవయ, షాఫియీ, అహ్మద్ బిన్ హమ్బల్, హసన్ బిన్ జియాద్ ప్రకారం లిఆన్ వల్ల వేరుపడిన దంపతులు తిరిగి శాశ్వతంగా పరస్పరం హరామ్ అయిపోతారు. వారు మళ్ళీ పెళ్ళి చేసుకోదలిస్తే ఎట్టి పరిస్థితిలోనూ ఏకం కాలేరు. ఇదే అభిప్రాయం హజ్రత్ ఉమర్, హజ్రత్ అలి, హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌ఊద్ కూడా వ్యక్తం చేశారు. దీనికి

భిన్నంగా సయీద్ బిన్ ముసయ్యిబ్, ఇబ్రాహీమ్ నఖయి, షఅబి, సయీద్ బిన్ జుబైర్, అబూ హనీఫా, ముహమ్మద్ (రహ్మ) ప్రభృతుల అభిప్రాయంలో భర్త తన అబద్ధాన్ని అంగీకరించగా, అతనికి కజ్ఫ్ శిక్ష విధించినట్లయితే తిరిగి వారిరువురి మధ్య మళ్ళీ పెళ్ళి జరగవచ్చు. ఆ ధర్మవేత్తల ప్రకారం వారిద్దరినీ హరామ్ చేసేది లిఆన్. వారు దాని మీద నిలకడగా ఉన్నంతకాలం అది వర్తిస్తుంది, నిషేధం కూడా వర్తిస్తుంది. కాని భర్త తన అబద్ధాన్ని అంగీకరించి శిక్ష పొందినట్లయితే లిఆన్ అంతమయిపోతుంది. నిషేధం కూడా ముగిసిపోతుంది.

8. ఇది హజ్రత్ ఆయిషా (ర) మీద మోపిన నిందకు సంకేతం. దాన్ని اِفْك "ఇఫ్క్" అని పేర్కొనడం స్వయంగానే అల్లాహ్ ఆ నిందను పూర్తిగా త్రోసిపుచ్చాడు, ఖండించాడు అని తెలుపుతోంది. 'ఇఫ్క్' అంటే అర్థం, మాటను మార్చివెయ్యడం, యదార్థానికి వ్యతిరేకంగా ఏమేమిటోగా కల్పించివేయడం, ఇదే భావంలో ఈ పదం పూర్తిగా అబద్ధం, కల్పన అనే అర్థంలో వాడతారు. ఏదయినా ఆరోపణను గురించి ఈ పద ప్రయోగం జరిగితే దాని అర్థం, అది ఆసాంతం అపనింద అని వస్తుంది.

ఇక్కడి నుండి ఈ సూరా అవతరణకు అసలు కారణమయిన సంఘటన పట్ల వ్యాఖ్య ప్రారంభమవుతుంది. ప్రవేశికలో మేము దాని ప్రారంభ భాగం స్వయంగా మహనీయ ఆయిషా ఉల్లేఖనం ద్వారా ఉటంకించాము. తరువాతి గాధను సయితం ఆవిడగారి నోటనే వినండి. ఆవిడగారు ఇలా నుడివారు, "ఆ అపవాదు వదంతులు దాదాపు ఒక నెలనాళ్లు నగరంలో తిరుగాడుతూ ఉన్నాయి. ప్రవక్త మహనీయులు (స) తీవ్రమయిన వ్యధకు లోనయి ఉన్నారు. నేనేమో రోదిస్తూనే ఉన్నాను. నా తల్లిదండ్రులు అత్యంత ఆందోళనకు, దుఃఖానికి, బాధకు గురయి ఉన్నారు. చివరికి ఒక రోజున ప్రవక్తశ్రీ (స) వేంచేశారు. నా దగ్గర కూర్చున్నారు. ఈ మొత్తం కాలంలో ఆయన ఎప్పుడూ నా వద్ద కూర్చోలేదు. హజ్రత్ అబూ బక్ర్, ఉమ్ము రూమాన్ (మహనీయ ఆయిషా తల్లి) అనుకున్నారు, ఈ వేళ ఏదో నిర్ణయాత్మకమయిన విషయం జరుగనుందని, అందువల్ల వారు ఇరువురూ దగ్గరికి వచ్చి కూర్చున్నారు. ప్రవక్తశ్రీ(స) ఇలా అన్నారు, 'ఆయిషా, నాకు నీ విషయంలో ఈ సమాచారాలు అందాయి. నీవు నిర్దోషివి అయినట్లయితే అల్లాహ్ నీ విముక్తిని వ్యక్తపరుస్తాడని ఆశిస్తున్నాను. కాని నీవు ఒకవేళ నిజంగానే ఏదయినా పాపానికి లోనయి ఉన్నట్లయితే అల్లాహ్ వైపునకు మరలి తౌబా చెయ్యి, క్షమాభిక్షకై వేడుకో. దాసుడు తన పాపాన్ని అంగీకరించి తౌబా చేసు కున్నట్లయితే అల్లాహ్ క్షమించివేస్తాడు.' ఈ మాట వినగానే నా కన్నీళ్ళు ఇంకిపోయాయి. నేను మా నాన్న గారికి విన్నవించుకున్నాను, 'మీరు దైవప్రవక్త మాటకు జవాబు చెప్పండి' అని. ఆయనేమో, 'అమ్మా నేనేమని చెప్పాలో నాకే బోధపడటంలేదు తల్లి' అన్నారు. నేను మా అమ్మను అడిగాను, మీరయినా ఏదో చెప్పండి అని. ఆవిడ కూడా అలాగే బదులిచ్చారు, 'నేనూ హైరానా పడిపోతున్నాను. నాకూ అగమ్య గోచరంగా ఉందమ్మా, ఏమని చెప్పను' అన్నారు. దాని మీదట

నేనే అన్నాను, మీ చెవులకు ఒకమాట ఎక్కింది, అది మీ మనస్సుల్లో తిష్టవేసుకుంది, ఇక నేను ఏ పాపమూ ఎరుగనని చెప్పినా - అల్లాహ్ సాక్షి నేను నిర్దోషిని- మీరు మాత్రం నమ్మరు. అలాకాక నేను అనవసరంగా చెయ్యని ఒక విషయాన్ని అంగీకరించినట్లయితే - అల్లాహ్‌కు తెలుసు నేను చెయ్యలేదని - అది మాత్రం మీరు నమ్ముతారు. నేను ఆ స్థితిలో హజ్రత్ యాకూబ్ పేరు గుర్తు చేసుకోవడానికి యత్నించాను గుర్తుకురాలేదు. కడకు నేను ఇలా చెప్పాను, "ఈ స్థితిలో ఈ ఒక్క మాట చెప్పడం తప్ప నాకు గత్యంతరమేముందనీ, హజ్రత్ యూసుఫ్ తండ్రి చెప్పిన మాటనే నేను చెబుతున్నాను. فَصَبْرٌ جَمِيلٌ "ఫ సబ్రున్ జమీల్" (సహనం, ఉత్తమ రీతిలో సహనం) (ఇది సంకేతం. మహనీయ యాకూబ్‌కు ఆయన కుమారుడు బిన్ యమీన్ మీద దొంగతనం నేరం మోపిన విషయం తెలిసినప్పటి సందర్భాన ఆయన పలికిన మాట ఇది. ఆ ఉదంతాన్ని సూచిస్తుంది. యూసుఫ్ సూరా 10వ రుకూ, ఆయత్: 83లో దీని ప్రస్తావన ఉంది). ఇది పలికి నేను నడుం వాల్చాను, మరో ప్రక్కకు తిరిగి పడుకున్నాను. అప్పుడు నేను మనసులోనే అనుకున్నాను, అల్లాహ్‌కు నా నిర్దోషిత్వం తెలుసు. ఆయన తప్పకుండా యదార్థాన్ని విడమర్చి తెలుపుతాడు అని. కాని నా ఊహకు, ఆలోచనకూ అతీతమయిన విషయం, నన్ను గురించి వహీ అవతరించడం, అది ప్రళయం వరకు పారాయణం చెయ్యబడటం అనేది. అల్లాహ్ నా విషయంలో స్వయంగా నా పక్షాన పలకడం అంటే నేను అంత స్థాయికి తగనని భావించే దానిని. అయితే ప్రవక్త మహనీయులు ఏదయినా కలకంటారని మాత్రం నేను అనుకునేదాన్ని, అందులోనే అల్లాహ్ నా నిర్దోషిత్వాన్ని గురించి నా విముక్తిని గురించి ప్రకటిస్తాడని అనుకున్నాను. ఇంతలో వహీ అవతరించేటప్పటి స్థితి ప్రవక్తశ్రీ (స)కు ఆవహించసాగింది. కడకు ఎముకలు కొరికే చలి కాలంలోనూ ఆయన పవిత్రమయిన ముఖారవిందం మీది నుంచి స్వేద బిందువులు ముత్యాల్లా రాలసాగాయి. మేమంతా మౌనం వహించాము. నేనయితే పూర్తిగా నిర్భయంగా ఉన్నాను. కాని నా తల్లిదండ్రుల స్థితి చూస్తే కత్తివాటుకు నెత్తుటి చుక్క లేనట్టుగా పాలిపోయారు వారు. అల్లాహ్ యదార్థాన్ని ఏమని విడదీస్తాడో అని వారు లోలోనే భయపడుతున్నారు. ఆ స్థితి ముగిసిన తరువాత ప్రవక్తశ్రీ అపారమయిన ఆనందంతో కనిపించారు. ఆయన నవ్వుతూ చెప్పిన తొలిమాట - "శుభాకాంక్షలు ఆయిషా, అల్లాహ్ నీ విముక్తిని అవతరింపజేశాడు" అన్నారు. తరువాత ప్రవక్తశ్రీ (స) పది ఆయత్‌లను (11వ ఆయత్ మొదలుకుని 20వ ఆయత్ వరకు) వినిపించారు. నా తల్లి, 'లే, లేచి ప్రవక్త మహనీయులకు కృతజ్ఞతలు తెలుపుకో' అన్నారు. నేను దానికి, 'నేను ఈయన (స)కూ కృతజ్ఞతలు చెప్పను, మీ ఇద్దరికీ చెప్పను, అల్లాహ్‌కే నా కృతజ్ఞతాభివందనాలు అర్పించుకుంటాను, ఆయన నా విముక్తిని అవతరింపజేశాడు. మీరంతా ఈ అపనిందను కనీసం తిరస్కరించనయినా

తిరస్కరించలేదే' అన్నాను. (ఇక్కడ ఒకటి అర్థం చేసుకోవాలి. ఇదంతా ఏదో ఒక్క ఉల్లేఖనానికి అనువాదం మాత్రమే కాదు. ఈ సందర్భంలో హదీసు, సీరత్ గ్రంథాలలో హజ్రత్ ఆయిషా చెప్పినట్లు వచ్చిన ఉల్లేఖనాలన్నింటినీ ప్రోగుచేసి మేము వాటి సంక్షిప్త రూపాన్ని ప్రస్తుతపరిచాము).

ఈ సందర్భంలో మరో సూక్ష్మమయిన అంశాన్నీ అర్థం చేసుకోవాలి. హజ్రత్ ఆయిషా (ర) విముక్తిని ఘోషించే ముందు పూర్తిగా ఒక్క రుకూ (1–10 ఆయత్‌లు)లో వ్యభిచారం, కజ్ఫ్ (అబద్ధపు ఆరోపణ), లిఆన్‌కు సంబంధించిన ఆదేశాలు వివరించబడ్డాయి. తద్వారా పరమ ప్రభువు అల్లాహ్ ఒక యదార్థాన్ని గురించి హెచ్చరించాడు. వ్యభిచార ఆరోపణ చెయ్యడం ఏదో వేళాకోళం, కాలక్షేపం విషయం కాదు, ఏదో ఫలహారంలా రుచి మార్పుకు వినియోగించుకునే వస్తువు కాదు. ఇది చాలా తీవ్ర మయిన, అసహనీయమయిన విషయం. ఆరోపణ చేసేవాడు సత్యవంతుడయితే సాక్షుల్ని తీసుకురావాలి, వ్యభిచారి, వ్యభిచారిణికి అత్యంత భయంకరమయిన శిక్ష విధించబడుతుంది. అబద్ధం పలికినట్లయితే ఆరోపణ చేసేవాడు, వీపు మీద ఎనభయి కొరడా దెబ్బలు వేయడానికి పాత్రుడయిపోతాడు. అలా ముమ్మందు అతను లేదా మరెవరయినా ఇలాంటి దుస్సాహసం చెయ్యడానికి పాల్పడరు. ఈ ఆరోపణ భర్త మోపినట్లయితే అతను న్యాయస్థానంలో లిఆన్ చేసి తన వ్యవహారాన్ని పరిష్కరించుకోవాలి. ఈ మాటను నోటితో పలికి ఏ వ్యక్తి కూడా సుఖంగా కూర్చోలేడు. ఎందుకంటే ఇది ముస్లిమ్ సముదాయానికి సంబంధించిన వ్యవహారం. ఈ సముదాయం ప్రపంచంలో మంచిని స్థాపించేందుకు వెలిసిన సముదాయం. ఇక్కడ వ్యభిచారమూ వేళాకోళం కాజాలదు, దాని ప్రస్తావనలూ కాలక్షేపం, పరిహాసాల విషయం కాజాలవు.

9. ఉల్లేఖనాలలో ఈ వదంతులు వ్యాపింపజేసిన వారి కొందరి పేర్లు మటుకే దొరుకుతాయి. అబ్దుల్లా బిన్ ఉబై, జైద్ బిన్ రిఫాఅ (ఇతను బహుశా రిఫాఅ బిన్ జైద్ యూదు మునాఫిక్ కుమారుడయి ఉంటాడు), మిస్తహ్ బిన్ ఉసాస, హస్సాన్ బిన్ సాబిత్, హమ్న బిన్తు జహష్. వీరిలో తొలి ఇద్దరు మునాఫిక్‌లు, మిగతా ముగ్గురు విశ్వాసులు. వీరు ముగ్గురు పొరపాటున, బలహీనత కారణంగా ఈ ఉపద్రవంలో చిక్కుకున్నారు. వీరుకాక ఇంకా ఎవరెవరయితే ఈ పాపానికి ఎంతో కొంత లోనయి ఉన్నారో వారి ప్రస్తావన హదీసు, ప్రవక్త జీవిత చరిత్ర గ్రంథాలలో కానరాలేదు.

10. అంటే ఆందోళన చెందనవసరంలేదు, మునాఫికులు తాము ఎంతో పెద్ద దాడి జరిపామని అనుకుంటున్నారు. కాని ఇన్షా అల్లాహ్, ఇది వారిపైకే తిరగబడుతుంది, మీకు ప్రయోజనకరంగా పరిణమిస్తుంది అని భావం. మేము ప్రవేశికలో వివరించినట్లు మునాఫికులు ఈ చిచ్చు రేపడానికి కారణం, ముస్లిములను వారికి ఆధిక్యతగల అసలు రంగంలో వారిని పరాజయంపాలు చేయాలన్నది. అంటే నైతిక రంగంలో వారు ఉన్నతులవడం చేతనే ప్రతి రంగంలోనూ తమ ప్రత్యర్థులపైన నెగ్గుకు పోగలుగుతున్నారు అన్నది వారి ఆందోళన. కాని అల్లాహ్ మునాఫికుల ఈ ఎత్తుగడను

సయితం ముస్లిములకు శుభప్రదంగా మార్చి వేశాడు. ఈ సందర్భంలో ఒక వైపున ప్రవక్త మహనీయులు(స), మరో వైపున మహనీయ అబూ బక్ర్ (ర) ఆయన కుటుంబం వారు, ఇంకొక వైపున సామాన్య విశ్వాసులు అవలంబించిన వైఖరి వల్ల ఒక విషయం పట్ట పగలులా నిర్ధారణకు వచ్చేసింది, ఈ వ్యక్తులు అన్ని రకాల చెడులకు ఎలా విశుద్ధంగా తేలారో, ఎలా నిగ్రహం, సంయమనం, నియమ బద్ధతగలవారుగా, న్యాయ ప్రియులు, ఉదార స్వభావులుగా వ్యవహరిస్తారో తేటతెల్ల మయిపోయింది. ప్రవక్త మహనీయులు(స) ఒక్క సంజ్ఞ చేస్తే చాలు ఆయన పరువును దెబ్బతీయాలని యత్నించిన వారి కంఠాలు తెగిపడిపోయేవే. కాని ఆయన ఒక నెల రోజుల పాటు సహనంతో అన్నీ భరించారు. అల్లాహ్ ఆదేశం రాగానే కేవలం ఆ ముగ్గురు ముస్లిములను, కజ్ఫ్ నేరం రుజువయిన వారికి కజ్ఫ్ శిక్ష విధించి అమలుపరిచారు, మునాఫికులను అప్పుడు కూడా ఏమీ అనలేదు. మహనీయ అబూబక్ర్, తన బంధువు ఒకతనిని, అతని ఇంటిల్లిపాదిని పోషించేవారు. అతనూ ఆయన గుండెకోతకు కారణమయినవాడే. అయినప్పటికీ ఆ సత్యపురుషుడు అతనితో బంధుత్వపు సంబంధాలనూ తెంచుకోలేదు, అతనికీ అతని కుటుంబం వారికీ తన సహాయాన్నీ ఆపలేదు. మాతృమూర్తి మణులయిన ప్రవక్త అర్ధాంగులలో ఏ ఒక్కరూ తమ సవితిని అప్రతిష్టపాలు చేయడంలో ఏ మాత్రం పాలుపంచుకో లేదు. అంతేకాదు, వారెవ్వరున్నూ దానిపట్ల తమ సమ్మతినో, ఇష్టాన్నో లేదా కనీసం అంగీకారాన్నో ఏ మాత్రం తెలుపలేదు. చివరికి హజ్రత్ జైనబ్ స్వంత సోదరి హమ్న బిన్తు జహష్, తన సోదరి మేలు కోరి ఆమె సవితిని అప్రతిష్టపాలు చేస్తూ ఉన్నప్పటికీ స్వయంగా జైనబ్ మాత్రం సవితి విషయంలో మంచి మాటే పలికేవారు. హజ్రత్ ఆయిషా (ర) స్వయంగా ఉల్లేఖించిన దాన్ని బట్టి ప్రవక్త సతీమణుల్లో హజ్రత్ జైనబ్‌తోటే అందరికన్నా అధికంగా తనకు పోటీ ఎదురయ్యేది. కాని ఇఫ్క్ సంఘటన విషయంలో ప్రవక్త మహనీయులు (స) ఆవిడని, ఆయిషాని గురించి నీకు తెలిసినదేమిటని అడగ్గా ఆమె, “దైవ ప్రవక్తా, దైవం సాక్షి, నేను ఆమెలో మంచినే తప్ప ఏమీ ఎరుగను” అని అన్నారు. హజ్రత్ ఆయిషా స్వంత సౌజన్య శీలత కూడా తక్కువేమీ కాదు. హజ్రత్ హస్సాన్ బిన్ సాబిత్ ఆమె పరువును మంట గలపడంలో ప్రముఖపాత్ర వహించారు. కాని ఆవిడ ఆయన పట్ల సదా గౌరవప్రదంగా మర్యాదగానే ప్రవర్తించారు. జనులు గుర్తు చేశారు. ఈ వ్యక్తి మిమ్మల్ని అప్రతిష్టపాలు చేసినవాడు కదా అని. దానికి ఆవిడ, ఈ వ్యక్తి ఇస్లామ్ విరోధులయిన కవులకు, దైవప్రవక్త తరఫున, ఇస్లామ్ తరఫున, చెంపలు ఛెళ్ళుమనిపించే సమాధానాలు ఇచ్చేవాడు అని చెప్పి వాళ్ళ నోళ్ళు మూయించేవారు. ఇదీ ఈ సంఘటనతో ప్రత్యక్ష సంబంధమున్న వారి వైఖరి. సామాన్య ముస్లిముల పరిశుద్ధ చిత్రం గురించి అంచనావేయడానికి ఒక్క ఉదాహరణ చాలు. మహనీయ అబూ అయ్యూబ్ అన్సారితో ఆయన భార్య ఆ వదంతులను గురించి ప్రస్తావించగా ఆయన అడిగారు, “అయ్యూబ్

అమ్మా, నువ్వే చెప్పు, ఆ సందర్భంలో నీవు ఆయిషా స్థానంలో ఉన్నట్లయితే ఇలాంటి చేష్ట చేసే దానివా?" ఆవిడ చెప్పింది, "దైవం సాక్షి నేనిటువంటి చర్యకు ఎన్నటికీ పాల్పడేదాన్ని కాను." హ|జత్ అబూ అయ్యూబ్, "అయితే ఆయిషా నీకన్నా ఎన్నో రెట్లు మెరుగయిన ఆవిడ, నేనూ చెబుతున్నాను, నేను సఫ్వాన్ స్థానంలో ఉన్నట్లయితే ఈ విధమయిన ఆలోచన కూడా నాకు వచ్చేది కాదు. సఫ్వాన్ అయితే నాకన్నా ఎంతో ఉత్తమమయిన ముస్లిమ్" అని అన్నారు. ఈ విధంగా మునాఫికులు కోరిన దానికి పూర్తిగా భిన్నమయిన పరిణామాలు వచ్చాయి. ముస్లిముల నైతిక ఆధిక్యత మునుపటి కన్నా మరింత ప్రస్ఫుటమయింది.

ఇందులో ఒక మంచి కోణమూ ఉంది. ఈ సంఘటన ఇస్లామ్ శాసనాలు, ఆదేశాలు, నాగరిక నియమాలలో చాలా ముఖ్యమయిన చేరికకు మూలమయింది. దీని కారణంగా ముస్లిములకు పరమ ప్రభువు అల్లాహ్ తరఫున మార్గ నిర్దేశనలు లభించాయి. వాటిని ఆచరించి ముస్లిమ్ సమాజాన్ని చిరకాలానికి చెడుల పుట్టుక, వాటి వ్యాప్తినుండి పరిరక్షించడం సాధ్యమవుతుంది. ఒకవేళ అవి పుట్టినట్లయితే వాటిని సకాలంలో ఆపడం సాధ్యమవుతుంది.

అదీకాక ఇందులో మరో మంచి కోణం కూడా ఉండింది. ముస్లిములందరికీ ఒక విషయం బాగా అవగతమయిపోయింది. ప్రవక్త మహనీయులు (స) అగోచరజ్ఞానం కలవారు కాదని తేలిపోయింది. అల్లాహ్ తెలిపినది మాత్రమే ఆయనకు తెలుసు. అది మినహాయించి ఆయనకున్న జ్ఞానం ఒక మానవుని జ్ఞానానికి సమానమయినదే. ఒక నెల రోజులు ఆయన హ|జత్ ఆయిషా (రజి) వ్యవహారంలో తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఒక్కోసారి ఇంటి పని మనిషిని అడిగేవారు, మరోసారి పవిత్ర సతీమణుల్ని విచారించేవారు, ఒక్కోసారి హ|జత్ అలీ (ర)ని, మరోసారి మహనీయ ఉసామాని అడిగేవారు. చివరికి హ|జత్ ఆయిషాకి చెప్పినా ఏమని చెప్పారు, నీవు ఈ పాపం చేసినట్లయితే తౌబా చేసుకో, చేయకపోతే అల్లాహ్ నీ నిర్దోషిత్వాన్ని నిరూపిస్తాడన్న నమ్మకముంది అని మాత్రమే చెప్పారు. ఆయన అగోచర జ్ఞానమున్న వారయితే ఈ ఆందోళన, ఈ విచారణ, ఈ తౌబా హితవులు ఎందుకు జరుగుతాయి? కాని దైవవాణి యదార్థాన్ని తెలిపిన తరువాత ఆయనకు ఈ నెల కాలం తెలియని విషయం తెలిసిపోయింది. ఈ విధంగా ముస్లిములకు ప్రత్యక్ష అనుభవం, అనుశీలనల ద్వారా అతిశయ విశ్వాసం, ప్రవర్తనల నుండి రక్షించే ఏర్పాటు చేశాడు అల్లాహ్. ఆ అతిశయానికి గురయినట్లయితే సాధారణంగా జనులు తమ మత గురువుల వ్యవహారంలో మూఢవిశ్వాసాల గుడ్డి ఉద్రేకానికి లోనవుతారు. ఒక నెల్లాళ్ళు వహీ పంపకపోవడంలో అల్లాహ్ దృష్టిలో ఈ ఔచితీ విజ్ఞత ఉండటం కూడా సంభవమే. మొదటి రోజే వహీ వచ్చినట్లయితే ఈ ప్రయోజనాలు ఒనగూడేవి కావు. (మరిన్ని వివరాలకు చూడండి ఖుర్ఆన్ అవగాహనం 5వ సంపుటం అన్ నమ్ల్ సూరా పాద సూచి 83)

لَوْلَآ اِذْ سَمِعْتُمُوْهُ ظَنَّ الْمُؤْمِنُوْنَ وَالْمُؤْمِنٰتُ بِاَنْفُسِهِمْ خَيْرًا ۙ وَّقَالُوْا
هٰذَآ اِفْكٌ مُّبِيْنٌ ﴿١٢﴾ لَوْلَا جَآءُوْ عَلَيْهِ بِاَرْبَعَةِ شُهَدَآءَ ۚ فَاِذْ لَمْ
يَاْتُوْا بِالشُّهَدَآءِ فَاُولٰٓئِكَ عِنْدَ اللّٰهِ هُمُ الْكٰذِبُوْنَ ﴿١٣﴾

మీరు దీన్ని విన్నంతనే, అప్పటికప్పుడే, విశ్వసించిన పురుషులు, విశ్వసించిన స్త్రీలు తమను గురించి తాము ఎందుకు మంచిని ఊహించలేకపోయారు,[12] ఇది పచ్చి అపవాదు[13] అని ఎందుకు చెప్పివెయ్యలేదు? వారు (తమ నిందకు నిరూపణగా) నలుగురు సాక్షులను ఎందుకు తీసుకురాలేదు? ఇప్పుడు వారు సాక్షుల్ని అసలు తీసుకురాలేకపోయిన కారణాన అల్లాహ్ వద్ద వారే అసలు అబద్ధాలాడేవారు.[14]

11. అంటే అబ్దుల్లా బిన్ ఉబై; ఇతనే ఈ ఆరోపణకు మూల రచయిత, ఈ ఉపద్రవానికి అసలు వ్యవస్థాపకుడు. కొన్ని ఉల్లేఖనాల్లో తప్పుగా హజ్రత్ హస్సాన్ బిన్ సాబిత్‌ని ఈ ఆయత్‌కి వర్తించే వ్యక్తిగా చెప్పడం జరిగింది. కాని ఇవి ఉల్లేఖనకర్తల స్వంత అపార్థం. అంతేగాని హజ్రత్ హస్సాన్ బలహీనత, మునాఫికులు వ్యాపింపజేసిన ఉపద్రవంలో పడిపోవడం కన్నా ఏమాత్రం అధికం కాదు. హాఫిజ్ ఇబ్ను కసీర్ నిజం చెప్పారు, ఇది బుఖారీ ఉల్లేఖనం కాకపోతే పేర్కొనదగింది కూడా కాదు. ఈ క్రమంలో అన్నింటి కంటే పెద్ద అబద్ధం, నిజానికి అపనింద, ఏమిటంటే బనీ ఉమయ్య, హజ్రత్ అలీ (ర)ని ఈ ఆయత్‌కి వర్తించే వ్యక్తిగా పేర్కొనడం. బుఖారీ, తబ్రానీ, బైహకీలో హిష్షామ్ బిన్ అబ్దుల్ మలిక్ ఉమవి చెప్పిన ఈ మాట ఉటంకించబడింది. అందులో **الَّذِیْ تَوَلّٰی کِبْرَہٗ (ఎవరయితే దీని బాధ్యతా భారాన్ని అత్యధికంగా తన నెత్తిన వేసుకున్నారో)** అనేది హజ్రత్ అలి బిన్ అబీ తాలిబ్‌కు వర్తిస్తుంది అని ఉంది. వాస్తవానికి ఈ ఉపద్రవంలో హజ్రత్ అలీ ఏమాత్రం పాలు పంచుకోలేదు. అసలు విషయం కేవలం ఒక్కటే, ఆయన ప్రవక్త మహనీయుల్ని ఆందోళన చెందుతూ ఉండగా చూసి, ప్రవక్తశ్రీ సలహా అడిగిన దానికి ఇలా మనవి చేసుకున్నారు, "అల్లాహ్ ఈ విషయంలో మిమ్మల్ని ఎటువంటి నిర్బంధంలో పెట్టలేదు. చాలామంది మహిళలున్నారు. మీరు కోరుకుంటే ఆయిషాకు తలాక్ ఇచ్చివేసి మరో నికాహ్ చేసుకోవచ్చు." దీని భావం, హజ్రత్ అలీ హజ్రత్ ఆయిషాపైన మోపబడిన ఆరోపణను ధ్రువీకరించారన్నది కాదు. ఆయన ఉద్దేశ్యం ప్రవక్త మహనీయుల ఆందోళనను దూరం చేయడం మాత్రమే.

12. మరో అనువాదం ఇలా చేయవచ్చు, 'తమ జనులు లేదా తమ సముదాయం లేదా తమ

సమాజంలోని జనులను గురించి మంచినే ఎందుకు ఊహించలేక పోయారు.' ఆయత్‌లోని పదాలు రెండు అర్థాలకు వర్తించేలా ఉన్నాయి. ఈ అర్థవంతమయిన వాక్య ప్రయోగంలో ఒక సూక్ష్మమయిన అంశం దాగి ఉంది. దాన్ని కూడా బాగా అర్థం చేసుకోవాలి. హజ్రత్ ఆయిషా, సఫ్వాన్ బిన్ ముఅత్తల్‌కు ఎదురయిన వ్యవహార స్వరూపం కేవలం ఇదే: బిడారులో ఒక మహిళ (ఆమె ప్రవక్త సతీమణి అన్న విషయం అలా ఉంచి) యాదృచ్ఛికంగా వెనక ఉండిపోయింది. బిడారులోని మరో పురుషుడు కూడా స్వయంగా యాదృచ్ఛికంగానే వెనకనే ఉండిపోయాడు. ఆమెను చూసి తన ఒంటెపైన కూర్చుండబెట్టి తీసుకు వచ్చాడు. ఇక ఎవరయినా, దైవం రక్షించుగాక, వీరిద్దరు ఒకరినొకరు ఒంటరిగా గమనించి పాపంలో పడిపోయారు అని అంటే అలా అనడం, ఈ పదాల బాహ్యరూపం వెనుక రెండు ఊహలు కూడా ఇమిడి ఉన్నాయి. ఒకటి, ఇలా చెప్పేవారు (స్త్రీ అయినా పురుషుడయినా) స్వయంగా తాను ఆ స్థానాన ఉన్నట్లయితే పాపం చేయకుండా మానుకునే వారు కాదు. ఎందుకంటే వారు ఇప్పటి వరకు ఏ పాపం చేయకుండా ఉన్నారంటే కారణం, ఎదుటి లింగం వ్యక్తి వారికి ఇలా ఒంటరిగా దొరకకపోవడమే, లేకపోతే ఇలాంటి అద్భుతమయిన అవకాశాన్ని జారవిడిచే వారు కాదు. రెండు, తాను నివసించే సమాజం నైతిక స్థితి గురించి వారి అభిప్రాయం ఏమిటంటే ఇలాంటి అవకాశం ఎదురయినప్పుడు పాపం చేయకుండా మానుకునే ఏ స్త్రీ అయినా ఏ పురుషుడయినా ఇక్కడ అసలెవరూ లేరు అన్నది. ఏదో ఒక స్త్రీ పురుషుడికి సంబంధించిన వ్యవహారమయిన పక్షంలో ఇదీ ఆ అభిప్రాయం. ఇక ఆ స్త్రీ పురుషులు ఒకే స్థలానికి చెందిన వారయితే, ఆ స్త్రీ యాదృచ్ఛికంగా బిడారుకు దూరమయిపోయి ఉంటే, పైగా ఆ స్త్రీ ఆ పురుషుడి మిత్రునికో, బంధువుకో, పొరుగువానికో, లేదా తెలిసినవానికో భార్య లేదా సోదరి లేదా కుమార్తె అయినట్లయితే వ్యవహారం ఇంకా ముదిరిపోతుంది. అలాంటప్పుడు దాని అర్థం తీవ్ర రూపం దాల్చుతుంది. ఇదీ ఆ మాటల గూఢార్థం. చెప్పేవాడు స్వయంగా తనను గురించి, తన సమాజాన్ని గురించి ఇంతటి జుగుప్సాకరమయిన భావన కలిగి ఉన్నాడన్నమాట. ఈ భావనకు సౌజన్యం, సంస్కారం, సౌహార్ద్రతతో ఎలాంటి సంబంధం లేదని తెలుస్తూనే ఉంది. సౌమ్యుడు, సౌజన్యశీలుడూ అయిన వ్యక్తి ఎవరయినా ఇలా ఆలోచించడం సాధ్యమా? తన మిత్రుని లేదా పొరుగువాని, లేదా తెలిసినవాని ఇంటి ఆడ మనిషి ఎవరయినా యాదృచ్ఛికంగా ఎక్కడయినా దారితప్పి కనబడితే మొట్టమొదట అతను ఆమె మాన ధనాన్ని దోచుకుని తరువాత ఆమెను ఇంట చేర్చే ఉపాయం ఆలోచిస్తాడని ఎవరనుకుంటారు? కాని ఇక్కడ వ్యవహారమయితే ఈ ఉదాహరణల్లో పేర్కొన్న వాటికన్నా వేల రెట్లు అధికంగా ఘోరమయింది. మహిళ మరెవరో కాదు, దైవసందేశహరుని సతీమణి. ఆమెను ప్రతి విశ్వాసి తన స్వంత తల్లికన్నా అధికంగా ఆదరణీయమయినదిగా భావిస్తాడు. ఆమెను స్వయంగా అల్లాహ్, విశ్వాసుల తల్లిలానే హరామ్ (నిషిద్ధం)గా నిర్ణయించాడు. ఆ పురుషుడు

కూడా మరెవడో కాదు, అతను ఈ బిడారుకు చెందిన మనిషే కాక, అదే సేనకు చెందిన ఒక సిపాయి, అదే నగరానికి చెందిన ఓ పౌరుడు మాత్రమే కాక అతను ఒక ముస్లిమ్. ఆ మహిళ భర్తను దైవ సందేశహరునిగా, తన మార్గదర్శకుడు, బోధకుడు, గురువుగా నమ్ముతాడు, ఆయన ఆదేశమయితే ప్రాణాలను సయితం త్యాగం చేయడానికి బద్ర్ యుద్ధం లాంటి ప్రమాదకరమయిన పోరులో పాల్గొన్నవాడు. పరిస్థితుల ఈ నేపథ్యంలోనయితే ఈ మాటల మానసిక పూర్వ రంగం, దాని జుగుప్సాకర స్వరూపంలో పరాకాష్ఠకు చేరుకుంటుంది. అంతకన్నా మురికి భావన మరొకటి ఊహించడం కూడా సాధ్యపడదు. అందువల్లనే అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు, ముస్లిమ్ సముదాయంలోని ఏ వ్యక్తులయితే ఈ మాట నోటితో పలికారో, లేదా కనీసం దాన్ని శంకించవలసిన అంశంగా పరిగణించారో వారు స్వయంగా తమను గురించి కూడా ఎంతో ఏహ్యాభావనను నిర్మించుకున్నారు, తమ సమాజంలోని జనులను కూడా వారు అత్యంత హేయమయిన, నీచమయిన నైతికతకు, శీలస్వభావాలకు చెందిన వారుగా భావించారు.

13. అంటే ఈ మాట అసలు గమనార్హం కూడా కాదు. దాన్ని వినగానే ప్రతి ముస్లిమ్ దాన్ని అబద్ధమని, అభూతకల్పన అని, దురుద్దేశ్యంతో కూడుకున్నదని కొట్టిపారేయవలసింది. ఎవరయినా ఇక్కడ ఓ ప్రశ్న లేవనెత్తవచ్చు, మాట ఇంత తేలికయిందయితే స్వయంగా ప్రవక్త మహనీయులు (స), మహనీయ అబూబక్ర్ (ర) దీన్ని తొలినాడే ఎందుకు ఖండించ లేదు, వారు దానికి అంత ప్రాముఖ్య మివ్వవలసిన అవసరమేమిటీ? విషయమేమిటంటే సాధారణ జనం కన్నా భర్త, తండ్రులకు సంబంధించినంతవరకు పరిస్థితి వేరయినది. నిజానికి భార్యను భర్తకన్నా అధికంగా ఎవరూ ఎరుగకపోయినా, ఒక సౌజన్యమూర్తి, సద్వర్తన శీల అయిన భార్య ఎడల బుద్ధి కుశలత గల ఏ భర్త కూడా ఇతరులు మోపిన అపనిందల మూలంగా కుశంకలకు గురి కాజాలడన్నదీ నిజమే అయినా తన భార్య మీద ఆరోపణ వచ్చినప్పుడు అతనికి చిక్కు ఎదురవుతుంది, దాన్ని అపనింద అని త్రోసిపుచ్చినా చెప్పేవారి నోరు మూయలేడు. పైగా వారు దాని మీద మరో వరుస పేర్చి మాట్లాడతారు, 'సతీమణి శ్రీవారి బుద్ధినే మింగివేసింది, అంతా తాను చేస్తూనే ఉంది, అయ్యగారేమో తమ సతీమణి మహా పతివ్రత అని భ్రమలో పడి ఉన్నారు.' ఇలాంటి చిక్కు సమస్యే తల్లిదండ్రులకూ ఎదురవుతుంది. పాపం ఆ అభాగ్యులు తమ కుమార్తె శీలం మీద వచ్చిన స్పష్టమయిన అబద్ధపు ఆరోపణను ఖండిస్తూ నోరువిప్పినా కుమార్తె స్థితి చక్కబడదు. చెప్పేవారు దాన్ని అంగీకరించరు, 'తల్లిదండ్రులండి, తమ కుమార్తెను సమర్థించకపోతే తూలనాడతారా?' అంటారు. ఈ కారణంగానే ప్రవక్త మహనీయులు (స), హజ్రత్ అబూబక్ర్, ఉమ్ము రూమాన్ ఆవేదన వల్ల లోలోనే కుమిలిపోతున్నారు. నిజానికి ఎటువంటి అనుమానమూ వారిని పట్టుకోలేదు. దైవసందేశహరులయితే తన ప్రసంగంలోనే స్పష్టంగా చెప్పి వేశారు, నేను నా భార్యలోనూ ఎటువంటి చెడును చూడలేదు, ఈ ఆరోపణ వేయబడిన వ్యక్తిలోనూ చెడు చూడలేదు అని.

وَلَوۡلَا فَضۡلُ اللّٰهِ عَلَيۡكُمۡ وَرَحۡمَتُهٗ فِى الدُّنۡيَا وَالۡاٰخِرَةِ لَمَسَّكُمۡ فِىۡ مَاۤ
اَفَضۡتُمۡ فِيۡهِ عَذَابٌ عَظِيۡمٌ ۚ‌ۖ ﴿۱۴﴾ اِذۡ تَلَقَّوۡنَهٗ بِاَلۡسِنَتِكُمۡ وَتَقُوۡلُوۡنَ بِاَفۡوَاهِكُمۡ
مَّا لَيۡسَ لَكُمۡ بِهٖ عِلۡمٌ وَّتَحۡسَبُوۡنَهٗ هَيِّنًا ‌ۖ وَّهُوَ عِنۡدَ اللّٰهِ عَظِيۡمٌ ﴿۱۵﴾

మీపైన ప్రపంచంలోనూ పరలోకంలోనూ అల్లాహ్ అనుగ్రహం, కరుణ, కటాక్షాలు లేకపోయి ఉన్నట్లయితే మీరు ఏ విషయాలలో నిండా మునిగిపోయారో వాటికి శాస్తిగా మహా విపత్తు మిమ్మల్ని పట్టుకునేదే. (కాస్త గమనించండి, అప్పుడు మీరు ఎటువంటి ఘోరమయిన తప్పిదం చేస్తూ ఉన్నారో) అప్పుడు మీ నోళ్ళు ఒక దాన్నుండి మరొకటి ఆ అబద్ధాన్ని గ్రహిస్తూ పోతున్నాయి, ఇంకా అప్పుడు మీకు ఏ మాత్రం తెలియని విషయాన్ని మీరు మీ నోటితో పలుకుతూ పోతున్నారు. మీరు దాన్ని ఒక సాధారణ విషయంగా భావిస్తూ ఉన్నారు, నిజానికి అల్లాహ్ దృష్టిలో అది ఎంతో పెద్ద విషయం.

14. 'అల్లాహ్ వద్ద' అంటే అల్లాహ్ చట్టంలో, లేదా అల్లాహ్ చట్టం ప్రకారం అని అర్థం. అంతేకాని వాస్తవానికి ఈ ఆరోపణ దాని స్థానాన తప్పుడు ఆరోపణఅని అల్లాహ్‌కు తెలిసిన విషయమే; అది అబద్ధమవడం వారు సాక్ష్యం తీసుకురాలేకపోయారన్న దాని మీద ఆధారపడి లేదు.

ఆ ఆరోపణ తప్పయినది అనడానికి నిదర్శనం, ఆధారం, కేవలం సాక్షులు లేకపోవడమే అని నిర్ధారించలేదు అన్న అపార్థం ఇక్కడ ఎవరికీ కలగరాదు. అలాగే ఆరోపణ చేసేవారు నలుగురు సాక్షులు తీసుకురానందున మీరు కూడా కేవలం ఈ కారణంగా మాత్రమే దీన్ని స్పష్టమయిన అపనింద అని త్రోసిపుచ్చడమని ముస్లిములకు కూడా చెప్పడం జరగలేదు. ఈ అపార్థం కలగ డానికి కారణం, వాస్తవంగా అక్కడ సంభవించిన సంఘటనా స్వరూపం దృష్టిలో లేకపోవడమే. ఆరోపణ చేసేవారు, తామో లేదా తమలోని వారెవరయినా ఒకరో తాము నోటితో పలికే విషయాన్ని కళ్ళతో చూసిన కారణంగా ఈ ఆరోపణ మోపలేదు. ఇంత పెద్ద ఆరోపణ రచించడానికి ఆధారం కేవలం ఇంతే, హజ్రత్ ఆయిషా బిడారులో వెనక ఉండిపోయారు. సఫ్వాన్ తరువాత ఆమెను తన ఒంటెపైన ఎక్కించుకుని బిడారుకు చేర్చారు. బుద్ధిగల ఏ వ్యక్తి అయినా సరే ఆ సందర్భంలో, హజ్రత్ అయిషా ఇలా వెనక ఉండిపోవడం అన్నది ఏదో పథకం ప్రకారం జరిగిందని ఊహించ

وَلَوْلَآ اِذْ سَمِعْتُمُوْهُ قُلْتُمْ مَّا يَكُوْنُ لَنَآ اَنْ نَّتَكَلَّمَ بِهٰذَا ۖ سُبْحٰنَكَ هٰذَا

بُهْتَانٌ عَظِيْمٌ ﴿١٦﴾ يَعِظُكُمُ اللّٰهُ اَنْ تَعُوْدُوْا لِمِثْلِهٖٓ اَبَدًا اِنْ كُنْتُمْ مُّؤْمِنِيْنَ ﴿١٧﴾

وَيُبَيِّنُ اللّٰهُ لَكُمُ الْاٰيٰتِ ۗ وَاللّٰهُ عَلِيْمٌ حَكِيْمٌ ﴿١٨﴾

16 – 18 ఆ మాటను వినగానే మీరు అసలు ఎందుకు చెప్పివెయ్యలేదు, "ఇటువంటి మాట నోటితో పలకడం మనకు శోభించదు, సుబ్‌హానల్లాహ్, ఇదొక మరీ ఘోర మయిన అపవాదు" అని? అల్లాహ్ మీకు హితవు గరుపుతున్నాడు, భావిలో ఎన్నడూ ఇటువంటి చేష్టకు పాల్పడకండి, మీరు విశ్వాసులే అయితే. అల్లాహ్ మీకు అతి స్పష్టంగా బోధిస్తున్నాడు, ఆయన అన్నీ ఎరిగిన జ్ఞాని, అంతా చక్కబరిచే వివేకి. [15]

నయినా లేదు.పథకమే వేసుకునేవారయితే ఈ విధంగా పథకం వేసుకోరు. సేనానాయకుని సతీమణి గమ్మున ఒక వ్యక్తివెంట బిడారులో వెనకాల ఉండిపోవటం ఆ వ్యక్తే పట్టపగలు, సరిగ్గా మిట్టమధ్యాహ్నం వేళ, ఆమెను తన ఒంటె నెక్కించి బట్టబయలుగా సేన బిడారు వేసిన చోటికి తీసుకు చేరడం జరగదు. పరిస్థితుల ఈ స్వరూపమే వారి నిర్దోషిత్వాన్ని చాటిచెబుతోంది. ఇటువంటి పరిస్థితిలోనూ ఆరోపించడం సాధ్యమవడానికి ఆధారం కేవలం ఒకటే కాగలదు. ఆరోపించే వారు తమ కళ్ళతో ఏదయినా చూడటం జరగాలి. అంతేగాని ఏ పరిస్థితుల ఆధారంగానయితే ఆ దుర్మార్గులు ఆరోపణలు చేశారో అవి ఇటువంటి అనుమానానికి కూడా తావివ్వడంలేదు.

15. ఈ ఆయత్‌ల ద్వారా, విశేషంగా పరమ ప్రభువు సెలవిచ్చిన ఈ మాట ద్వారా, 'విశ్వసించిన పురుషులు, విశ్వసించిన స్త్రీలు తమ వారిని గురించి తాము ఎందుకు మంచిని ఊహించలేక పోయారు?' అన్న దాని ద్వారా ఒక సూత్రప్రాయమయిన నియమం అన్వయిస్తుంది. ముస్లిమ్ సమాజంలో సకల వ్యవహారాలు సదభిప్రాయం ఆధారంగా జరగాలి. దురభిప్రాయం ఏర్పడటానికి ఏదయినా నిరూపణ, ఏదయినా తదనుకూలమయిన ఆధారం లేనిదే అలా ఏర్పడరాదు. సూత్ర ప్రాయంగా ప్రతి వ్యక్తీ నిర్దోషియే. అతను అపరాధి అవడానికి లేదా అతడి పట్ల అపరాధానుమానం కలగడానికి ఏదయినా సమంజసమయిన కారణం లేనంతవరకు అతను నిర్దోషిగానే పరిగణించ బడాలి. ప్రతి వ్యక్తీ చెప్పిన మాట నిజమయినదే, అతను నమ్మదగినవాడు కాదని ఏదయినా నిదర్శనం ముందుకు రానంతవరకు అంతే.

إِنَّ الَّذِينَ يُحِبُّونَ أَن تَشِيعَ الْفَاحِشَةُ فِي الَّذِينَ آمَنُوا لَهُمْ عَذَابٌ أَلِيمٌ
فِي الدُّنْيَا وَالْآخِرَةِ ۚ وَاللَّهُ يَعْلَمُ وَأَنتُمْ لَا تَعْلَمُونَ ﴿١٩﴾ وَلَوْلَا فَضْلُ اللَّهِ
النصف ع عَلَيْكُمْ وَرَحْمَتُهُ وَأَنَّ اللَّهَ رَءُوفٌ رَّحِيمٌ ﴿٢٠﴾

19 – 20 ఎవరయితే విశ్వసించే జనుల మధ్యన అశ్లీలం వ్యాపించాలని కోరుకుంటున్నారో వారు ఇహంలోనూ పరంలోనూ వ్యధాభరితమయిన శిక్షకు అర్హులు;[16] అల్లాహ్‌కు తెలుసు మీకు తెలియదు.[17] అల్లాహ్ అనుగ్రహం, ఆయన కరుణాకటాక్షాలు మీపైన లేకపోయినట్లయితే, మరి అల్లాహ్ ఎంతో వాత్సల్యభరితుడు, కరుణా స్వరూపుడు కాకపోయే మాటయితే (ع2) (మీలో వ్యాపింపజేయబడిన ఈ విషయం అత్యంత హేయమయిన పరిణామాలు చూపించి ఉండేది).

16. సందర్భానుసారం, ఆయత్ ప్రత్యక్ష భావం, ఎవరయితే ఇటువంటి ఆరోపణలు సృష్టించి, వాటిని ప్రచారం చేసి ముస్లిమ్ సమాజంలో నీతిబాహ్యతను వ్యాపింపజెయ్యడానికి, ముస్లిమ్ సముదాయంపైన మచ్చ తేవడానికి ప్రయత్నిస్తున్నారో వారు శిక్షార్హులు అన్నది. కాని ఆయత్‌లోని పదాలు అశ్లీలాన్ని వ్యాపింపజేసే సమస్త రూపాలకు వర్తిస్తాయి. వీటి అన్వయింపు ఆచరణాత్మకంగా వ్యభిచార గృహాల స్థాపనకు, నీతిబాహ్యతను పురికొలిపే, దానికి ఉద్రేకాలను రేపే కథలు, కవితలు, పాటలు, చిత్రాలు, నాటకాలు, ప్రదర్శనలు అన్నింటికీ వర్తిస్తుంది. అలాగే స్త్రీ పురుషుల మిశ్రమ నాట్యాలు, మిశ్రమ కాలక్షేపాలు ఏర్పాటు చేసే క్లబ్బులు, హోటళ్ళు, తదితర సంస్థలు కూడా దీని పరిధిలోకి వస్తాయి. ఖుర్ఆన్ స్పష్టంగా చెబుతోంది ఇలాంటి వారంతా అపరాధులని. కేవలం పరలోకంలోనే కాదు ప్రపంచంలోనూ వీరికి శిక్ష లభించాలి. అందువల్ల నీతి బాహ్యమయిన విషయాల ప్రచారం చేసే సమస్త సాధనా మార్గాలను అరికట్టడం ఇస్లామీయ రాజ్యం బాధ్యత. ఇక్కడ ఖుర్ఆన్ ప్రజలకు వ్యతిరేకమయిన నేరాలుగా పరిగణించి, వీటికి పాల్పడేవారు శిక్షార్హులని తీర్పు చేసే వాటినన్నింటినీ ఇస్లామీయ రాజ్య శిక్షాస్మృతిలో శిక్షార్హ మయినవిగా, పోలీసు జోక్యం చేసుకోగలవిగా ప్రకటించాలి.

17. అంటే మీకు తెలియదు, ఇలాంటి ఒక్కొక్క చేష్ట ప్రభావాలు సమాజంలో ఎక్కడెక్కడి వరకు పాతుకుపోతాయో, ఎంత మందిని అవి ప్రభావితం చేస్తాయో, మొత్తానికి వాటివల్ల కలిగే నష్టం ఏ మేరకు సామూహిక జీవితం భరించవలసి ఉంటుందో; దీన్ని అల్లాహ్ మాత్రమే బాగా ఎరుగు. అందువల్ల అల్లాహ్‌పైన నమ్మకముంచి ఆయన ఏ చెడుగులనయితే సూచిస్తున్నాడో వాటిని రూపు

يَاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْا لَا تَتَّبِعُوْا خُطُوٰتِ الشَّيْطٰنِ ۭ وَمَنْ يَّتَّبِعْ خُطُوٰتِ
الشَّيْطٰنِ فَاِنَّهٗ يَاْمُرُ بِالْفَحْشَاۗءِ وَالْمُنْكَرِ ۭ وَلَوْلَا فَضْلُ اللّٰهِ عَلَيْكُمْ
وَرَحْمَتُهٗ مَا زَكٰى مِنْكُمْ مِّنْ اَحَدٍ اَبَدًا ۙ وَّلٰكِنَّ اللّٰهَ يُزَكِّيْ مَنْ يَّشَاۗءُ ۭ
وَاللّٰهُ سَمِيْعٌ عَلِيْمٌ ۝ وَلَا يَاْتَلِ اُولُوا الْفَضْلِ مِنْكُمْ وَالسَّعَةِ اَنْ يُّؤْتُوْٓا
اُولِي الْقُرْبٰى وَالْمَسٰكِيْنَ وَالْمُهٰجِرِيْنَ فِيْ سَبِيْلِ اللّٰهِ ۠ وَلْيَعْفُوْا
وَلْيَصْفَحُوْا ۭ اَلَا تُحِبُّوْنَ اَنْ يَّغْفِرَ اللّٰهُ لَكُمْ ۭ وَاللّٰهُ غَفُوْرٌ رَّحِيْمٌ ۝

21 విశ్వసించిన జనులారా, షైతాన్ అడుగుజాడలలో నడవకండి. వాడిని ఎవరు అనుసరించినా అతనికి వాడు అశ్లీలమయిన దానినీ చెడును మాత్రమే ఆదేశిస్తాడు. అల్లాహ్ అనుగ్రహం, ఆయన కరుణాకటాక్షాలు మీపైన లేకపోయినట్లయితే మీలో ఏ వ్యక్తీ పరిశుద్ధుడు కాజాలడు.[18] కాని అల్లాహ్ తాను తలచిన వారిని తానే పరిశుద్ధపరుస్తాడు, అల్లాహ్ సమస్తం వినేవాడు, సర్వం తెలుసుకునేవాడు.[19]

22 మీలో ఎవరు దైవానుగ్రహం కలిగినవారో, మరెవరు స్థోమతగలవారో వారు తమ బంధువులకు, నిరుపేదలకు, దైవమార్గంలో వలస వచ్చిన ముహాజిర్‌లకు సహాయం అందించబోమని ప్రమాణం చేసుకోరాదు. వారిని క్షమించివేయాలి, మన్నించాలి. అల్లాహ్ మిమ్మల్ని క్షమించాలని మీరు కోరుకోరా? అల్లాహ్ గుణం ఇదే, ఆయన క్షమించేవాడు, కరుణించేవాడూను.[20]

మాపడానికి, అణచివెయ్యడానికి శక్తినంతా వినియోగించి ప్రయత్నించండి. ఈ విషయాలు చిన్న చిన్నవి కావు, వీటిపట్ల ఉదార వైఖరినవలంబించడానికి. నిజానికి ఇవి చాలా పెద్ద విషయాలు, వీటికి పాల్పడేవారికి కఠిన శిక్ష ప్రాప్తం కావాలి.

18. అంటే షైతాన్ మిమ్మల్ని చెడుల మురికిలో ముంచాలని కాచుకు కూర్చున్నాడు. అల్లాహ్ తన అనుగ్రహం వల్ల మంచీ చెడుల విచక్షణను మీకు బోధించకపోతే, మీకు సంస్కరణా బోధనలు,

సద్బుద్ధి, అనుగ్రహించకపోతే మీలో ఏ ఒక్కడున్నూ తన స్వంత బలిమి మీద పరిశుద్ధుడు కాలేడు.

19. పరిశుద్ధత ఎవరికి ప్రసాదించాలి అన్న అల్లాహ్ విధి నిర్ణయం గుడ్డిగా జరగదు, జ్ఞానం ఆధారంగానే జరుగుతుంది. అల్లాహ్‌కు తెలుసు ఎవరిలో మంచిని కోరే కాంక్ష ఉందో, మరెవరు చెడు వైపునకు మొగ్గుచూపుతాడో. ప్రతి వ్యక్తి తన ఏకాంత కుహరాల్లో చేసే మాటలు అల్లాహ్ వింటూ ఉంటాడు. ప్రతి వ్యక్తి తన ఆంతర్యంలో ఆలోచించే ప్రతిదీ అల్లాహ్‌కు తెలియ కుండా ఉండదు. ఈ ప్రత్యక్ష జ్ఞానం ఆధారంగానే అల్లాహ్ నిర్ణయిస్తాడు – ఎవరికి పరిశుద్ధత నొసగాలో ఎవరికి కూడదో.

20. మహనీయ ఆయిషా (ర) ఇలా సెలవిచ్చారు, పైన పేర్కొన్న ఆయత్‌లలో పరమ ప్రభువు అల్లాహ్ నా విముక్తిని అవతరింపజేసినప్పుడు హజ్రత్ అబూ బక్ర్ (ర), తాను మిస్తహ్ బిన్ ఉసాసాకు చేసే సహాయాన్ని విరమించుకుంటానని ప్రమాణం చేసుకున్నారు. ఎందుకంటే ఆయన అటు బంధుత్వపు సంబంధానికీ విలువనివ్వ లేదు, ఇటు హజ్రత్ అబూ బక్ర్ (ర) జీవితమంతా తనకూ తన కుటుంబం వారికి చేస్తున్న మేళ్ళ దృష్ట్యానయినా సిగ్గుపడలేదు. దాని మీదట ఈ ఆయత్ అవతరించింది. దీన్ని వినగానే హజ్రత్ అబూ బక్ర్ వెంటనే అన్నారు, "దైవంతోడు, మా తప్పిదాలు మన్నించబడాలనే మేము తప్పక కోరుకుంటున్నాము మా ప్రభూ." తరువాత ఆయన తిరిగి మిస్తహ్ సహాయాన్ని ప్రారంభించారు. మునుపటికన్నా అధికంగా ఆయన పట్ల మేలు చేయసాగారు. హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ ఉల్లేఖనం ప్రకారం, మహనీయ అబూ బక్ర్ ఒక్కరే కాక ఇంకా కొందరు సహచరులు సయితం అప్పుడు ప్రమాణం చేసుకున్నారు, ఎవరెవరయితే ఈ అపవాదు వ్యాప్తిలో పాలు పంచుకున్నారో వారికి తాము ఎలాంటి సహాయమూ చెయ్యరాదని. అయితే ఈ ఆయత్ అవతరణ తరువాత వారంతా తమ ప్రమాణాన్ని మరల్చుకున్నారు; ఈ విధంగా ఈ ఉపద్రవం కారణంగా వ్యాపించిన వెగటు ఇట్టే మటుమాయమయిపోయింది.

ఇక్కడ ఒక ప్రశ్న. ఒక వ్యక్తి ఏదయినా పనిని గురించి ప్రమాణం చేసుకున్నప్పుడు, ఆ తరువాత అతనికి తెలుస్తుంది అందులో ఎలాంటి శుభం లేదని, దాన్ని అతను మరల్చుకుని, శుభమున్న విషయాన్ని అవలంబించినట్లయితే అతను ప్రమాణభంగం చేసినందుకు ప్రాయశ్చిత్తం చెల్లించాలా వద్దా? ఫిఖ్‌హ్‌వేత్తల ఒక వర్గం, శుభాన్ని అవలంబించడమే దాని ప్రాయశ్చిత్తం అని అంటుంది, అంతే తప్ప మరో ప్రాయశ్చిత్తం అవసరం లేదని అంటుంది. దానికి వీరు ఇదే ఆయత్‌ను ఆధారంగా తీసుకుని వాదిస్తారు. ఇందులో అల్లాహ్, హజ్రత్ అబూ బక్ర్‌ని ప్రమాణం భంగపరచమని ఆదేశిం చాడు, కాని ప్రాయశ్చిత్తం చెల్లించాలని ఆదేశమివ్వలేదు. ఇదే కాక ప్రవక్త మహనీయులు (స) చేసిన ఒక బోధనను కూడా ఆధారంగా చెబుతారు, "ఒక వ్యక్తి ఒక విషయం పట్ల ప్రమాణం చేసు కున్న తరువాత, మరో విషయం ఇంతకన్నా మంచిదని అతనికి తెలిస్తే అతను ఆ మరీ మంచి విషయాన్నే అవలంబించాలి,

اِنَّ الَّذِيۡنَ يَرۡمُوۡنَ الۡمُحۡصَنٰتِ الۡغٰفِلٰتِ الۡمُؤۡمِنٰتِ لُعِنُوۡا فِى الدُّنۡيَا
وَالۡاٰخِرَةِ وَلَهُمۡ عَذَابٌ عَظِيۡمٌ ۙ﴿۲۳﴾ يَّوۡمَ تَشۡهَدُ عَلَيۡهِمۡ اَلۡسِنَتُهُمۡ
وَاَيۡدِيۡهِمۡ وَاَرۡجُلُهُمۡ بِمَا كَانُوۡا يَعۡمَلُوۡنَ ﴿۲۴﴾ يَوۡمَئِذٍ يُّوَفِّيۡهِمُ اللّٰهُ
دِيۡنَهُمُ الۡحَـقَّ وَيَعۡلَمُوۡنَ اَنَّ اللّٰهَ هُوَ الۡحَـقُّ الۡمُبِيۡنُ ﴿۲۵﴾

23 – 25 సౌశీలురు, అమాయకులు,[21] విశ్వాసులు అయిన స్త్రీలపైన అపనిందలు మోపేవారికి ఇహపర లోకాలలో అభిశాపం విధించబడింది, వారికి కఠోర యాతన పడుతుంది. వారు ఆ దినాన్ని మరిచిపోరాదు, ఆ రోజున స్వయంగా వారి నోళ్ళు, స్వయంగా వారి కాళ్ళూ చేతులు వారి చేష్టలకు సాక్ష్యం పలుకుతాయి.[21అ] వారు అర్హులయిన ప్రతిఫలం అల్లాహ్ వారికి ఆ రోజున పూర్తిగా ఇచ్చివేస్తాడు; వారికీ తెలిసిపోతుంది, అల్లాహ్ మాత్రమే సత్యం అనీ, సత్యాన్ని నిజం చేసి చూపెట్టేవాడనీను.

ఆ మంచి విషయాన్ని అవలంబించడమే దాని ప్రాయశ్చిత్తం." మరో వర్గం ప్రకారం, ప్రమాణ భంగానికి సంబంధించిన విషయంలో ఒక ప్రత్యేకమయిన స్పష్టమయిన ఆజ్ఞను అవతరింపజేశాడు అల్లాహ్, (అల్ బకర : 225; అల్ మాఇద: 89). దాన్ని ఈ ఆయత్ ఇటు రద్దు పరచనూలేదు, లేదా స్పష్టంగా అందులో ఏదయినా సవరణనూ ప్రతిపాదించలేదు. అందువల్ల ఆ ఆదేశం దాని స్థానాన అలాగే ఉంది. అల్లాహ్ ఇక్కడ మహనీయ అబూ బక్ర్ (ర) ని ప్రమాణం భంగపరచాలన్న ఆదేశాన్నయితే తప్పక ఇచ్చాడు. కాని నీకు ఎటువంటి ప్రాయశ్చిత్తం విధికాదు అని చెప్పలేదు. పోతే, ప్రవక్త మహనీయుల ఆదేశం, దాని భావం, తప్పుడు లేదా అనుచిత మయిన ప్రమాణం చేయడం వల్ల కలిగే పాపం సముచితమయిన మాటను అవలంబించడం మూలంగా ప్రక్షాళితమవుతుంది అన్నది. ఈ ప్రవచనానికి అర్థం ప్రమాణ ప్రాయశ్చిత్తాన్ని రద్దు పరచడం కాదు. కాగా మరో హదీసు దీన్ని విశదపరుస్తుంది. అందులో ప్రవక్త మహనీయులు (స) ఇలా సెలవిచ్చారు; "ఎవరయినా ఏదయినా ప్రమాణం చేసుకున్న తరువాత, మరో విషయమే ఇంతకన్నా మంచిదని తెలిస్తే, ఆ మంచి విషయాన్నే అవలంబించాలి; చేసుకున్న ప్రమాణానికి ప్రాయశ్చిత్తాన్ని చెల్లించడం అతని విధి." దీనివల్ల, ప్రమాణ భంగానికి ప్రాయశ్చిత్తం చెల్లించాలన్న మాట వేరు, మంచిని చేయక పోయిన పాపానికి ప్రాయశ్చిత్తం చెల్లించడం వేరు. ఒక దాని ప్రాయశ్చిత్తం మంచిని అవలంబించడం; మరోదాని ప్రాయశ్చిత్తమయితే

اَلْخَبِيْثٰتُ لِلْخَبِيْثِيْنَ وَالْخَبِيْثُوْنَ لِلْخَبِيْثٰتِ ۚ وَالطَّيِّبٰتُ لِلطَّيِّبِيْنَ

وَالطَّيِّبُوْنَ لِلطَّيِّبٰتِ ۚ اُولٰٓئِكَ مُبَرَّءُوْنَ مِمَّا يَقُوْلُوْنَ ۗ لَهُمْ مَّغْفِرَةٌ

وَّرِزْقٌ كَرِيْمٌ ﴿۲۶﴾ ع

26 **అశుద్ధస్త్రీలు అశుద్ధ పురుషులకు, అశుద్ధ పురుషులు అశుద్ధ స్త్రీలకు సరి. పరిశుద్ధ స్త్రీలు పరిశుద్ధ పురుషులకు, పరిశుద్ధ పురుషులు పరిశుద్ధ స్త్రీలకు ప్రత్యేకం. వీరి శీలం పరిశుద్ధమయినది, కల్పన చేసి అల్లే వారి మాటలకు అతీతమయినది,[22] వీరికి దైవక్షమాపణ, గౌరవప్రదమయిన ప్రాప్తి ప్రత్యేకమయి ఉన్నాయి. (ع3)**

ఖుర్‌ఆన్ స్వయంగానే నియమించింది. (మరిన్ని వివరాలకు చూడండి, ఖుర్‌ఆన్ అవగాహనం: సం.7, సాద్ సూరా : పాదసూచిక 46)

21. మూలంలోని పదం **غافلات** **"గాఫిలాత్"** అన్నది. దాని భావం సాధారణమయిన ఎలాంటి మోసం, కపటం ఎరుగని సౌజన్యశీల మహిళలు, వారి హృదయాలు పరిశుద్ధమయి ఉంటాయి, వారికి దుర్వర్తన అంటే ఏమిటో, ఎలా జరుగుతుందో కూడా తెలియదు, తమ మీద ఎవరయినా ఆరోపణ చేయగలరన్న మాట ఊహా మాత్రంగా కూడా వారికి స్ఫురించదు. హదీసుల్లో ప్రవక్త మహనీయులు (స) ఇలా చెప్పినట్లు ఉటంకించబడింది: "సౌశీల్యవతులయిన మహిళలపై అపనింద మోపడం 'వినాశకరమయిన' ఏడు మహాపాపాల్లో ఒకటి." తబ్రానీలో హజ్రత్ హుజైఫా ఉల్లేఖనం ప్రకారం ప్రవక్తశ్రీ (స) ఇలా సెలవిచ్చారు, "శీలవతి మహిళపైన అపనింద మోపడం వంద ఏళ్ళ సదాచరణను సర్వనాశనం చేయడానికి సరిపోతుంది."

21(అ) వివరాలకు చూడండి, ఖుర్‌ఆన్ అవగాహనం సం.7, యాసీన్ పాదసూచిక 55: హామీమ్ అస్సజ్దా: పాదసూచిక 25.

22. ఈ ఆయత్‌లో ఒక సూత్రప్రాయమయిన విషయాన్ని బోధపరచడం జరిగింది. అశుద్ధమయిన వారి తోడు అశుద్ధమయిన వారితోనే అతుకుతుంది. పరిశుద్ధమయినవారు పరిశుద్ధమయిన వారితోనే సహజంగా అనుకూలత కలిగి ఉంటారు. దుర్వర్తనుడయిన వ్యక్తి కేవలం ఒకే చెడుగుకు లోనవడు, అతను ఇతర వ్యవహారాల దృష్ట్యా పూర్తిగా సవ్యంగానే ఉంటూ కేవలం ఒకే చెడుగుకు లోనయి ఉండటం అనేది జరగదు. అతని తీరు తెన్నులు, స్వభావాలు, లక్షణాలు ప్రతిదానిలోనూ అనేకమయిన

చెడులుంటాయి. అవి అతనిలోని ఓ పెద్ద చెడుకు ఊతమిస్తాయి, పెంచి పోషిస్తుంటాయి. ఒక వ్యక్తిలో అకస్మాత్తుగా ఒక చెడుగు ఏదో మంత్రగోళంలా వచ్చి బ్రద్దలవడం అనేది ఏ విధంగానూ సంభవం కాదు. దానికి సంబంధించినటువంటి సంకేతమయినా ఏదో చిహ్నమయినా అతని పోకడల్లో, నడవడిలో కానరాకుండా ఉండదు. ఇదొక మానసికమయిన వాస్తవికత, దీన్ని ప్రతి ఒక్కరూ, ఎల్లవేళలా మానవజీవితాలలో దర్శిస్తూనే ఉంటారు. అలాంటప్పుడు మీకు ఈ మాట ఎలా మింగుడు పడుతోంది- ఒక పరిశుద్ధశీలుడయిన మనిషి జీవితాన్ని అంతా మీరు ఎరిగినవారే, అతను ఒక వ్యభిచార నైజంగల స్త్రీతో గడపడమేకాక సంవత్సరాల తరబడి ఎంతో ప్రేమానురాగాలతో సుఖజీవితం సాగించడం ఎలా సంభవమవుతుంది? అలాగే మీరు ఊహించనయినా ఊహించగలరా, ఒక స్త్రీ చెడు నడతగలదయి ఉంటూ ఆమె మాటా-మంతి, నడక-నడత, తీరు-తెన్నులు వీటి ద్వారా ఆమెలోని చెడు లక్షణాలు వ్యక్తమవకుండా ఉండగలవని? లేదా ఒక వ్యక్తి పరిశుద్ధచిత్తుడయినవాడు, ఉన్నత నైతికతను అవలంబించేవాడు, ఇటువంటి లక్షణాలున్న స్త్రీతోపాటు సంతోషంగా మనుగడ సాగించడం మీరు ఊహించగలరా? ఈ మాట ఇక్కడ బోధపరచడానికి కారణం, మున్ముందు ఎవరి పైనయినా ఏదయినా ఆరోపణ వస్తే గుడ్డిగా దాన్ని వినగానే నమ్మేయకూడదు. కాస్త కళ్ళు తెరిచిచూడాలి, ఆరోపణ మోపేది ఎవరిపైన, ఎటువంటి ఆరోపణ మోపబడుతోంది, ఏ విధంగానయినా అది అక్కడ అతుకుతుందా లేదా అని పరిశీలించాలి. మాట అతికేటట్లుగా ఉంటే ఒక హద్దు మేరకు దాన్ని ఎవరయినా ఒప్పుకోవచ్చు, లేదా కనీసం సాధ్యమని, అలాంటి అవకాశముందని అనుకోవచ్చు. కాని ఒక వింతయిన విషయం, దాన్ని ధ్రువీకరించే నిదర్శనాలు ఏ కోశానా కానరానప్పుడు, ఎవడో ఒక తెలివిలేనివాడు, ఒక దుష్టుడు దాన్ని ప్రేల్చాడని నమ్మేయడమేనా?

కొందరు వ్యాఖ్యాతలు ఈ ఆయత్‌కు మరో భావం కూడా తెలిపారు. చెడ్డ మాటలు చెడ్డ మనుషులకు వర్తిస్తాయి. (అంటే వారు వాటికే అర్హులు); మంచి మాటలు మంచి వారికే వర్తిస్తాయి. చెడు మాట్లాడేవారు మంచి వారిని గురించి వెలిబుచ్చే అభిప్రాయాలు వారికి అతికేందుకు సజ్జనులయిన వారు అతీతులు, పరిశుద్ధులు. మరికొందరు దీని భావం, చెడు ఆచరణలు చెడ్డ వారికే నప్పుతాయి, మంచి ఆచరణలు మంచి వారికే శోభిస్తాయి అని చెప్పారు. సజ్జనులయిన వారు, ఇతరులు వర్తింపజేసే దుష్ట ఆచారాలు వర్తించడానికి ఏ విధంగానూ తగరు, వారు పరిశుద్ధులు. మరికొందరు దీనికి భావం, చెడ్డ మాటలు చెడ్డ మనుషులే చేయవలసినవని, మంచి మనుషులు మంచి మాటలే పలుకుతారని, అబద్ధాలు సృష్టించేవారు కల్పిస్తున్న మాటలు, మంచి మనుషులు సుతరామూ పలుకరు, వారు పరిశుద్ధులని చెప్పారు. ఆయత్‌లోని పదాలలో ఈ వ్యాఖ్యానాలన్నింటికీ అవకాశముంది. కాని ఈ పదాలను చదివిన తరువాత మొట్టమొదట తట్టే అర్థం మటుకు మేము ముందు వివరించినదే. సందర్భం, పూర్వాపరాల రీత్యా కూడా ఆ భావంలో ఉన్న భావ సమగ్రత ఇతర భావాలలో లేదు.

يَاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْا لَا تَدْخُلُوْا بُيُوْتًا غَيْرَ بُيُوْتِكُمْ حَتّٰى تَسْتَاْنِسُوْا

وَتُسَلِّمُوْا عَلٰٓى اَهْلِهَا ۭ ذٰلِكُمْ خَيْرٌ لَّكُمْ لَعَلَّكُمْ تَذَكَّرُوْنَ ﴿٢٧﴾ فَاِنْ لَّمْ

تَجِدُوْا فِيْهَآ اَحَدًا فَلَا تَدْخُلُوْهَا حَتّٰى يُؤْذَنَ لَكُمْ ۚ وَاِنْ قِيْلَ

لَكُمُ ارْجِعُوْا فَارْجِعُوْا هُوَ اَزْكٰى لَكُمْ ۭ وَاللّٰهُ بِمَا تَعْمَلُوْنَ عَلِيْمٌ ﴿٢٨﴾

27-29 విశ్వసించిన జనులారా,[23] మీ ఇండ్లల్లోకి తప్ప ఇతర ఇండ్లల్లోకి- ఇంటి వారి ఇష్టం తెలుసుకోనంతవరకు,[24] ఇంటి వారికి సలామ్ తెలుపుకోనంత వరకు - ప్రవేశించకండి, ఈ పద్ధతే మీకు ఉత్తమమయినది. మీరు దీన్ని గుర్తుంచుకుని పాటిస్తారని నమ్మకముంది.[25] ఇంకా అక్కడ ఎవ్వరూ కానరాకపోతే మీకు అనుజ్ఞ ఇవ్వబడనంతవరకు ప్రవేశించకండి,[26] మరి మీకు మరలి వెళ్ళిపొమ్మని చెప్పడం జరిగితే మరలివెళ్ళిపోండి, ఇదే మీకు మరీ పరిశుద్ధ మయిన విధానం;[27] మరి మీరు చేసేదేమో అంతా అల్లాహ్‌కు బాగా తెలిసినదే.

23. సూరా ప్రారంభంలో ఇచ్చిన ఆదేశాలు, సమాజంలో చెడులు దారి చేసుకున్నట్లయితే వాటిని ఎలా అడ్డుకోవాలి అన్న ఉద్దేశంతో ఇవ్వబడ్డాయి. ఇప్పుడేమో, సమాజంలో అసలు చెడుగుల పుట్టుకనే అరికట్టేందుకు ఉద్దేశించిన ఆదేశాలివ్వబడుతున్నాయి; నాగరికతా విధానాలను సంస్కరించి, ఇటువంటి చెడులు పొడసూపే కారణాలకు మూతవేసేందుకు అవసరమయిన ఆదేశాలివ్వబడుతున్నాయి. ఈ ఆదేశాలను అధ్యయనం చేసే ముందు రెండు విషయాలు క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలి:

మొదట, ఇఫ్క్ సంఘటనను సమీక్షించిన వెంటనే ఈ ఆదేశాలు వివరించడం స్పష్టంగా సూచించే విషయం ఏమిటంటే, పరమ ప్రభువు దృష్టిలో ప్రవక్త సతీమణి వంటి ఉన్నత వ్యక్తిత్వం మీద ఒక స్పష్టమయిన అపనింద మోపడం అది సమాజంలో ఇలా ప్రాకిపోవడం నిజానికి ఒక విధమయిన కాంక్షాలోలత్వ వాతావరణం నెలకొన్న దాని పరిణామం. ఈ కాంక్షాలోలత్వ వాతావరణాన్ని మార్చ డానికి దైవం దృష్టిలో మార్గం ఒక్కటే, జనం ఒండొకరి ఇండ్లల్లోకి నిర్మొహమాటంగా రాకపోకలు సాగించడాన్ని అరికట్టడం, పరస్త్రీపురుషులు ఒకరి నొకరు విచ్చల విడిగా చూపులు వేసుకునే, స్వేచ్ఛగా కలుసుకోగలిగే అవకాశాలు ఏర్పడకుండా ఆపివేయడం, స్త్రీ సమీప ఆప్తుల పరిధిలో తప్ప నిషిద్ధం కాని బంధువర్గం, అపరిచయస్థుల సమక్షంలోకి తమ అలంకరణలతో రావడాన్ని నిరోధించడం,

వేశ్యావృత్తిని పూర్తిగా నిషేధించడం, స్త్రీ పురుషుల్ని చాలా కాలం వరకు అవివాహితు లుగా ఉండనివ్వకపోవడం, దాసదాసీ జనుల్ని సయితం అవివాహితులుగా మనడాన్ని నివారించడం. మరో విధంగా చెప్పాలంటే, స్త్రీలు పరదా విధానాన్ని అవలంబించకపోవడం, సమాజంలో అత్యధికంగా జనులు అవివాహితులుగా ఉండిపోవడం, దైవ జ్ఞానం ప్రకారం, సామూహిక వాతా వరణంలో కనిపించని వాంఛాప్రియత్వం నిత్యం జీవ నదిలా పారుతూ ఉండేందుకు మూలకారణ మవుతున్నాయి. ఈ వాంఛాప్రియత్వం మూలంగానే జనుల కళ్ళు, చెవులు, నోళ్ళు, మనస్సులు అన్నీ, నిజమయిన లేదా ఊహాజనితమయిన అపవాదుల వదంతుల (Scandals) వ్యాప్తిలో భాగం పంచు కునేందుకు అనవరతం సిద్ధంగా ఉంటాయి. ఈ చెడును సంస్కరించడానికి అల్లాహ్ ఔచితీ విజ్ఞతలో ఈ ఆదేశాలకన్నా సవ్యమయిన, సరయిన, సముచితమయిన, ప్రభావశీలమయిన మరే ఇతర ఉపాయమే లేదు, అలా ఉన్నట్లయితే ఆయన ఇవికాక ఆ ఆదేశాలనే ఇచ్చేవాడు.

మరో విషయం ఈ సందర్భంలో అర్థం చేసుకోలసి ఉంది. దైవ శాసనాంగం (షరీఅత్) ఒక చెడుగును కేవలం నిషేధించడం లేదా దాన్ని అపరాధంగా పరిగణించి దానికి శిక్ష నిర్ణయించడంతో సరిపుచ్చదు. దానితోపాటు అది, ఒక వ్యక్తిని ఆ చెడుకు లోనయ్యేలా పురికొలిపే, **లేదా దానికి** అవకాశాలు కల్పించే లేదా దాన్ని చేసేందుకు నిర్బంధించే మూల కారణాలను సయితం **అంతమొందిం** చాలని కోరుకుంటుంది. అలాగే షరీఅత్ అపరాధంతోపాటు అపరాధ హేతువయిన వాటిని, **అపరాధ** ప్రేరకాలను, అపరాధ సాధనాలూ మార్గాలను సయితం అరికట్టే ఆంక్షలు విధిస్తుంది. తద్వారా మనిషిని అసలు అపరాధపు సరిహద్దులకు చేరేముందు, చాలా దూరానే ఆపి వేయగలుగు తుంది. జనం అనునిత్యం అపరాధ అవధులలో తారాడుతూ ఉండటాన్ని అలా ప్రతి రోజూ పట్టుబడ టాన్నీ, శిక్షలు అనుభవించడాన్నీ అది ఇష్టపడదు. అది కేవలం ప్రాసిక్యూటర్ (Prosecutor) మాత్రమే కాదు, దానికి మానవుల పట్ల సానుభూతి ఉంది, వారి సంస్కరణాభిలాష ఉంది, వారికి సహాయం చెయ్యాలన్న తపనా ఉంది. అందువల్ల అది సకల బోధనా ప్రధానమయిన, నైతిక మయిన, సామాజికమయిన ఉపాయాలను ఈ ఉద్దేశానికి వినియోగిస్తుంది; అలా జనాన్ని చెడుల నుండి కాపాడేందుకు సహాయపడుతుంది.

24. మూలంలో حَتّٰى تَسْتَاْنِسُوْا **"హత్తా తస్తా'నిసూ"** అన్న పదాలు ప్రయోగించబడ్డాయి. దీనిని సామాన్యంగా జనం حَتّٰى تَسْتَاْذِنُوْا **"హత్తా తస్తా'జినూ"** అని భావించారు. కాని వాస్తవానికి ఈ రెంటిలో చాలా సున్నితమయిన వ్యత్యాసముంది, దాన్ని ఉపేక్షించరాదు. ఒకవేళ حَتّٰى تَسْتَاْذِنُوْا **"హత్తాతస్తా'జినూ"** అని సెలవిచ్చి ఉన్నట్లయితే ఆయత్ అర్థం, "పరుల ఇండ్లలోకి ఇంటి వారి అనుమతి తీసుకోనంత వరకు ప్రవేశించకండి" అని వచ్చేది. ఈ భావప్రకటనా విధానాన్ని వదలి అల్లాహ్ حَتّٰى تَسْتَاْنِسُوْا **"హత్తాతస్తా'నిసూ"** అనే పదాలు ప్రయోగించాడు. దీని మూలం "ఉన్స్" అన్న

పదం. ఈ పదం ఉర్దూలోనూ అరబీ అర్థంలోనే ప్రయోగించబడుతుంది. (అంటే మచ్చిక, ఇష్టం అని అర్థం). ఈ మూల పద తద్భవమయిన 'ఇస్తీనాస్' అనే పదం ప్రయోగించినప్పుడు దాని అర్థం, ఇష్టం తెలుసుకోవడం, లేదా మచ్చిక చేసుకోవడం అని వస్తుంది. కనుక ఆయత్‌కు సరయిన అర్థం "పరుల ఇండ్లల్లోకి వారిని మచ్చిక చేసుకోనంత వరకు, లేదా వారి ఇష్టం తెలుసుకోనంతవరకు ప్రవేశించకండి" అని అవుతుంది. అంటే మీ రాక ఇంటి వారికి అయిష్టం కాదు కదా, మీరు అతని ఇంటిలో ప్రవేశించడం అతనికి ఇష్టమే కదా అన్న విషయం తెలుసుకుని మరీ ప్రవేశించండి అని భావం. అందువల్లనే మేము దీని అనువాదంలో "అనుమతి తీసుకోనంత వరకు" అనడానికి బదులు "ఇష్టం తెలుసుకోనంతవరకు" అన్న పదాలు ప్రయోగించాము. ఈ భావం మూలానికి అతి చేరువయినది.

25. అజ్ఞానకాలంలో అరబ్బులు, హుయ్యీతుమ్ సబాహన్, హుయ్యీతుమ్ మసాఅన్ (గుడ్‌మార్నింగ్, గుడ్ ఈవినింగ్) అని అంటూ నిర్మొహమాటంగా పరుల ఇండ్లల్లోకి జొరబడేవారు. కొన్ని సందర్భాలలో ఇంటివారిని, వారి మహిళల్ని చూడదగని స్థితిలో చూడవలసి వచ్చేది. అల్లాహ్ ఈ పరిస్థితిని సంస్కరించడానికి ఈ నియమం చేశాడు. ప్రతి వ్యక్తికి తాను బస చేసేచోట ఏకాంతం (Privacy)గా గడిపే అధికారముంది. మరే ఇతర వ్యక్తికీ అతని ఏకాంతాన్ని అతని ఇష్టం లేకుండా, అతని అనుమతి లేకుండా భంగపరచడం ధర్మసమ్మతం కాదు. ఈ ఆదేశం అవతరించిన తరువాత ప్రవక్త మహనీయులు (స) సమాజంలో ఏర్పరచిన మర్యాదలు, నియమాలను మేము దిగువన క్రమంగా పొందుపరుస్తున్నాము.

(1) ప్రవక్తశ్రీ ఈ ఏకాంత అధికారాన్ని కేవలం ఇండ్లల్లో ప్రవేశం వరకే పరిమితం చేయలేదు. దాన్ని ఒక సాధారణ హక్కుగా పరిగణించి దాని ప్రకారం ఇతరుల ఇండ్లల్లో తొంగి చూడటం, బయటి నుండి చూపు వేసే ప్రయత్నం చేయడం, ఇతరుల ఉత్తరాలు వారి అనుమతి లేకుండా చదవడం కూడా నిషిద్ధంగా నిర్ణయించారు. హజ్రత్ సౌబాన్ (ప్రవక్త (స) విడుదల చేసిన బానిస) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్తశ్రీ (స), "చూపు ప్రవేశించిన తరువాత ఇక 'తాను' ప్రవేశించే అనుమతి కోరడంలో అర్థమేముంది" అని అన్నారు (అబూదావూద్). హజ్రత్ హుజైల్ బిన్ షుర్జీల్ ప్రకారం, ఒక వ్యక్తి ప్రవక్త మహనీయుని (స) వద్దకు హాజరయి సరిగా తలుపునకు ఎదురుగా నిలబడి అనుమతి కోరసాగాడు. ప్రవక్తశ్రీ (స) అతనికి, "ఎడంగా నిలబడు, అనుమతి కోరే ఆదేశం, దృష్టి పడకూడదనే కదా వచ్చింది" అని చెప్పారు (అబూ దావూద్). స్వయంగా ప్రవక్తశ్రీ (స) విధానం ఏమిటంటే ఒకరి ఇంటికి వెళ్ళినప్పుడు తలుపునకు నేరుగా ఎదురుగా నిలబడేవారు కారు. ఆ కాలంలో ఇళ్ళ తలుపులకు తెరలు కట్టేవారు కాదు. ఆయన తలుపునకు కుడి ప్రక్కనో, ఎడమ ప్రక్కనో నిలబడి అనుమతి కోరేవారు (అబూదావూద్). ప్రవక్త (స) సేవకులు హజ్రత్ అనస్(ర) ప్రకారం, ఒక వ్యక్తి బయటి నుండి ప్రవక్త (స) గదిలోకి తొంగిచూశాడు. అప్పుడు

ప్రవక్తశ్రీ (స) ఒక బాణం చేతిలో తీసుకుని పరిశీలిస్తున్నారు. అప్పుడు ఆయన అతని మీదికి ఉరికిన వైనాన్ని బట్టి అతని కడుపులో పొడిచేస్తారా అనిపిం చింది (అబూదావూద్). హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ ఉల్లేఖనం ప్రకారం ప్రవక్తశ్రీ (స) "ఎవరయితే తన సోదరుని అనుమతి లేకుండా అతని ఉత్తరంపైన దృష్టి సారిస్తాడో అతడు మంటను చూసినట్టే" అని అన్నారు (అబూదావూద్). సహీహైన్‌లో ప్రవక్తశ్రీ (స) ఇలా చెప్పినట్లు ఉంది, "ఎవరయినా నీ ఇంటిలోకి తొంగి చూసినట్లయితే నీవు రాయి విసరి అతని కన్నుపొడిచేసినా అది పాపం కాదు." ఇదే అర్థంగల మరో హదీసుంది, "ఎవరయినా ఇతర ఇండ్లల్లోకి తొంగి చూడగా ఆ ఇంటి వారు అతని కన్ను పొడిచివేస్తే వారిని పట్టుకోవడం జరగదు." ఇమామ్ షాఫియీ ఈ వచనాన్ని దాని శాబ్దిక అర్థంలోనే గ్రహించారు. తొంగి చూసేవాని కన్ను పొడవడాన్ని ధర్మసమ్మతంగా పరిగణించారు. కాని హనఫీ ఫిక్హ్‌వేత్తల ప్రకారం, ఈ ఆదేశం కేవలం దృష్టి సారించిన దానికే వర్తించదు, ఎవరయినా అనుమతి లేకుండా ఇంటిలోకి చొరబడగా, ఇంటివారు ఆపినా ఆగకపోతే అప్పుడు ఇంటివారు ప్రతి ఘటించగా, ఆ సంఘర్షణలో అతని కన్ను లొట్టబోయినా, మరే అవయవమయినా విరిగినా, తెగినా ఆ ఇంటి వారిని పట్టుకోవటం జరగదు అని భావం. (అహ్కాముల్ ఖుర్ఆన్: జస్సాస్, సంపుటి 3, పుట 385)

(2) ధర్మవేత్తలు చూపు ఆదేశాన్ని వినికిడికి కూడా వర్తింప జేశారు. ఉదాహరణకు గుడ్డి వ్యక్తి అనుమతి లేకుండా ఇంటిలో ప్రవేశిస్తే అతని చూపు పడదు, కాని అతని చెవులు ఇంటి వారి మాటలు అనుమతి లేకుండా వింటాయి. ఇది కూడా చూపులానే ఏకాంతం హక్కులో అనధికార జోక్యం వంటిదే.

(3) అనుమతి తీసుకునే ఆదేశం కేవలం పరుల ఇండ్లల్లోకి ప్రవేశించేటప్పుడు మాత్రమే కాదు, స్వయాన తన తల్లి, చెల్లెండ్ర వద్దకు వెళ్ళినపుడు కూడా వర్తిస్తుంది. ఒక వ్యక్తి ప్రవక్త మహనీయుని అడిగాడు, "నేను నా తల్లి వద్దకు వెళ్ళేటప్పుడు కూడా అనుమతి తీసుకోవలసి ఉంటుందా?" అని. ఆయన (స) "అవును" అని బదులిచ్చారు. అతను "నేను తప్ప ఆమె సేవ చేసేవాడెవడూ లేడు, నేను తల్లి వద్దకు వెళ్ళే ప్రతిసారీ అనుమతి తీసుకోవాలా?" అని మళ్ళీ అడిగాడు. దానికి ఆయన (స), "నీ తల్లిని నగ్నంగా చూడటాన్ని నీవు ఇష్టపడతావా?" అని అడిగారు (ఇబ్నుజరీర్–అతాబిన్ యసార్ ముర్సలన్). అబ్దుల్లా బిన్ మస్ఊద్ ఇలా నుడివేవారు, "తమ తల్లి, చెల్లెండ్ర వద్దకు వెళ్ళినా అనుమతి తీసుకుని మరీ వెళ్ళండి" (ఇబ్ను కసీర్). అంతేకాదు తన ఇంటిలో భార్య వద్దకు వెళ్ళేటప్పుడు సయితం కనీసం గొంతు సవరించుకుని (దగ్గి) అయినా వెళ్ళాలని అనేవారు. ఆయన భార్య జైనబ్ ఉల్లేఖనం ప్రకారం, హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్ఊద్ ఇంటిలోకి

ప్రవేశించేటప్పుడు తాను వస్తున్నట్టు తెలిపేందుకు ఏదయినా శబ్దం చేసి మరీ వచ్చేవారు. ఆయన అకస్మాత్తుగా ఇంటిలోకి వచ్చి నిలబడటాన్ని ఇష్టపడేవారు కారు. (ఇబ్ను జరీర్).

(4) అనుమతి పొందే ఆదేశం నుండి మినహాయింపు కేవలం ఒకే సందర్భంలోనే సాధ్యం. ఒకరి యింటిలో ఏదయినా విపత్తు వచ్చిపడినప్పుడు, ఉదాహరణకు నిప్పు అంటు కోవడం, దొంగ జొరబడటం జరిగినప్పుడు అది వర్తిస్తుంది. ఇలాంటి సందర్భాలలో సహాయార్థం ఎటువంటి అనుమతి లేకుండానే ప్రవేశించవచ్చు.

(5) తొల్దొలి రోజుల్లో అనుమతి పొందే నియమం ఏర్పడినప్పుడు జనులకు దీని మర్యాదలు తెలియవు. ఒకసారి ఒక వ్యక్తి ప్రవక్త మహనీయుల వద్దకు వచ్చి తలుపుకెదురుగా నిలబడి నేను లోపలికి చొరబడనా? అని అడిగాడు. ప్రవక్త మహనీయులు (స) తమ సేవకురాలు రౌజాతో, "ఈ వ్యక్తికి అనుమతికోరే విధానం తెలియదు, వెళ్ళి అతనికి చెప్పు, అలా కాదు ఇలా పలకాలని; 'అస్సలాము అలైకుమ్, లోనికి రావచ్చునా?" అని అన్నారు (ఇబ్ను జరీర్, అబూదావూద్). జాబిర్ బిన్ అబ్దుల్లా ఉల్లేఖనం, నేను దివంగతులయిన మా నాన్నగారి అప్పుల విషయంలో ప్రవక్తశ్రీ వద్దకు వెళ్ళాను. తలుపు తట్టాను. ఆయన, ఎవరూ అని అడిగారు. "నేను, నేనండి," అని జవాబు చెప్పాను. దానికి ఆయన రెండు మూడుసార్లు అన్నారు, "నేనండి, నేనండి, అంటే నీవెవరివో ఎలా తెలుస్తుంది?" (అబూదావూద్). కలద బిన్ హన్బల్ అనే వ్యక్తి ఒక పని మీద ప్రవక్తశ్రీ సన్నిధిలో హాజరయి, సలామ్ చేయకుండా ఇట్టే వెళ్ళి కూర్చున్నారు. ఆయన, "బయటికి వెళ్ళి, అస్సలాము అలైకుమ్ అని పలికి లోనికిరా" అని సెలవిచ్చారు (అబూదావూద్). అనుమతి కోరే సరయిన విధానం, మనిషి తన పేరు తెలిపి అనుమతి కోరాలి. హజ్రత్ ఉమర్ (ర)ను గురించిన ఉల్లేఖనం ప్రకారం, ఆయన ప్రవక్తశ్రీ సన్నిధిలో హాజరయినప్పుడు "అస్సలాము అలైకుమ్ దైవప్రవక్తా, ఉమర్‌లోనికి రావచ్చా?" అని అనుమతి కోరేవారు (అబూదావూద్). అనుమతి తీసుకునేందుకు అత్యధికంగా మూడు సార్లు పిలువాలి. దాన్నే పరిమితిగా నియమించారు ప్రవక్తశ్రీ (స). "ఒకవేళ మూడవసారి పిలిచినప్పటికీ సమాధానం రాకపోతే వెనిక్కి మరలండి" అని ఉపదేశించారు (బుఖారి, ముస్లిమ్, అబూ దావూద్). స్వయంగా ప్రవక్తశ్రీ (స) అనుసరించిన విధానం కూడా ఇదే. ఒకసారి ఆయన (స) మహనీయ సఅద్ బిన్ ఉబాద ఇంటికి వెళ్ళారు. అస్సలాము అలైకుం అంటూ రెండుసార్లు అనుమతికోరారు. లోపలి నుంచి సమాధానం రాలేదు. మూడవసారి సమాధానం రాకపోయే సరికి ఆయన వెనుతిరిగారు. హజ్రత్ సఅద్ లోపలి నుంచి పరుగున వచ్చారు. వచ్చి ఇలా విన్నవించుకున్నారు, "దైవప్రవక్తా (స) నేను మీ ధ్వని వింటున్నాను. నా మనస్సు, మీ నోట, నా కొరకు ఎన్ని పర్యాయాలు సలామ్ (శాంతి), రహ్మత్ (కారుణ్యం) కొరకు ప్రార్థన వెలువడితే అంతే మంచిదని కోరుకుంది. అందువల్ల మెల్లిమెల్లిగా మీ సలామ్‌కు జవాబు చెబుతూ ఉన్నాను" (అబూదావూద్, అహ్మద్). ఇలా మూడుసార్లు

لَيْسَ عَلَيْكُمْ جُنَاحٌ اَنْ تَدْخُلُوْا بُيُوْتًا غَيْرَ مَسْكُوْنَةٍ فِيْهَا مَتَاعٌ لَّكُمْ ۭ
وَاللّٰهُ يَعْلَمُ مَا تُبْدُوْنَ وَمَا تَكْتُمُوْنَ ۝ قُلْ لِّلْمُؤْمِنِيْنَ يَغُضُّوْا
مِنْ اَبْصَارِهِمْ وَيَحْفَظُوْا فُرُوْجَهُمْ ۭ ذٰلِكَ اَزْكٰى لَهُمْ ۭ اِنَّ اللّٰهَ خَبِيْرٌۢ
بِمَا يَصْنَعُوْنَ ۝

అయితే ఎవరికీ నివాస స్థలాలు కానటువంటి కట్టడాలలోకి మీరు ప్రవేశించడంలో ఎటువంటి తప్పులేదు - వాటిలో మీకు ప్రయోజనకరమయిన పని ఏదయినా ఉన్నట్లయితే మీపై ఎటువంటి కట్టడిలేదు;[28] మీరు వ్యక్తపరిచేదేదయినా, గుప్తపరిచే దేదయినా అన్నింటిని గురించి అల్లాహ్‌కు బాగా తెలుసు.

30 ప్రవక్తా, విశ్వాసులయిన పురుషులకు చెప్పు, తమ చూపులను కాపాడుకుని మెలగాలని,[29] తమ మర్మాంగాలను పరిరక్షించుకోవాలనీను.[30] ఇదే వారికి ఎంతో పవిత్రమయిన పద్ధతి, వారు చేసేదేమయినా దాన్ని గురించి అల్లాహ్ ఎలాగూ తెలుసుకుంటాడు.

పిలువాలన్నది వెంట వెంటనే జరగరాదు. మధ్యలో కొంత సమయం విడిచి పిలువాలి. అలా ఇంటి వారికి సమాధానమివ్వడంలో ఏదయినా ఆవశ్యకత అడ్డువస్తే దాన్ని ముగించే అవకాశం దొరుకుతుంది.

(6) అనుమతి ఇంటి పెద్దదే విశ్వసనీయమయింది. లేకపోతే ఇంటి యజమాని పక్షాననే అనుమతి ఇస్తున్నట్లు నమ్మడానికి తగిన వ్యక్తి ఇవ్వాలి. ఇంటి నౌకరు, లేదా ఎవరయినా బాధ్యతగల వ్యక్తి చెప్పాలి. ఎవరయినా చిన్నపిల్లవాడు వచ్చేయమని చెబితే దాన్ని నమ్మి ప్రవేశించరాదు.

(7) అనుమతి కోరడంలో అనవసరంగా పట్టుపట్టడం, అనుమతి దొరక్కపోతే తలుపు వద్దనే కదలకుండా నిలబడటం, ధర్మసమ్మతం కాదు. మూడు సార్లు అనుమతి కోరిన తరువాత ఇంటి యజమాని పక్షాన అనుమతి లభించకపోతే, లేదా అతను కలవడానికి సమ్మతించకపోతే వెనుతిరిగి వెళ్ళిపోవాలి.

26. అంటే ఇతరుల ఇల్లు ఖాళీ ఉంటే అందులోనూ ప్రవేశించడం ధర్మసమ్మతం కాదు. అయితే ఇంటి యజమాని, స్వయంగా అనుమతి ఇచ్చి ఉంటే అది వేరే విషయం. ఉదాహరణకు, నేను

ఇంటిలో లేనప్పుడు మీరు నా గదిలో వచ్చి కూర్చోండి అని అతను మీకు చెప్పినా లేదా అతను మరెక్కడో ఉండి, మీరు వచ్చినట్లు సమాచారం అంది, మీరు ఉపవిష్ఠులయి ఉండండి నేనిప్పుడే వచ్చేస్తానని కబురు పంపినా మీరు అతని ఇంటిలో ప్రవేశించవచ్చు. లేకపోతే ఇంటిలో ఎవ్వరూ లేనంత మాత్రాన, లేదా లోనుండి ఎవ్వరూ మాట్లాడని కారణాన, ఎవరయినా సరే అనుమతి లేకుండా ప్రవేశించడం ధర్మసమ్మతం కాజాలదు.

27. అంటే దాన్ని చెడుగా, అమర్యాదగా భావించరాదు. మనిషి ఎవరినయినా కలవదలచకపోతే అతనికి తిరస్కరించే హక్కు ఉంది. లేదా ఏదయినా పనిలో ఉండి కలవడం కుదరకపోతే కలవలేనని కారణం చెప్పి మన్నింపు కోరడం కూడా అతని హక్కే. మూలంలోని "ఇర్జిఊ"(వెనక్కి మరలండి) అన్న ఆదేశానికి, ధర్మవేత్తలు తలుపు వద్దనే మొండికేసి నిలబడే అనుమతిలేదని, మనిషి అక్కడి నుండి తొలిగిపోవాలని అర్థం గ్రహించారు. ఏ వ్యక్తికయినా సరే మరో వ్యక్తిని కలుసుకునేందుకు బలవంతపెట్టే హక్కు ఎంతమాత్రం లేదు, లేదా అతని తలుపు వద్దనే నిలబడి అతన్ని బాధించే ప్రయత్నం చేసే హక్కు కూడా ఎవ్వరికీ లేదు.

28. అంటే ఉద్దేశం హోటళ్ళు, సత్రాలు, అతిథి గృహాలు, దుకాణాలు, వసతి గృహాలు వగైరా. అంటే సర్వసాధారణంగా జనులు ప్రవేశించే అనుమతి ఉన్న ప్రదేశాలని అర్థం.

29. మూలంలోని పదాలు **يَغُضُّوا مِنْ اَبْصَارِهِمْ "యగుజ్జూ మిన్ అబ్సారిహిమ్"**, "గజ్జ్" అంటే అర్థం, దేన్నయినా తగ్గించడం, తక్కువ చెయ్యడం, క్రిందికయ్యేలా చెయ్యడం అని వస్తుంది. ఉర్దూలో **"గజ్జెబసర్"** అనే పదానికి అనువాదం సాధారణతః చూపు క్రిందికి వాల్చడం, వాల్చి పెట్టడం అని చేస్తారు. కాని ఈ ఆదేశం ఉద్దేశం, నిత్యం క్రిందికే చూస్తూ ఉండాలన్నది కాదు. పూర్తిగా చూపునిండా చూడరాదని, అలా చూస్తూ ఉండేందుకు చూపులను స్వేచ్ఛగా వదలిపెట్టరాదని అర్థం. ఈ భావం "చూపును తప్పించడం" అనే పదాల ద్వారా సరిగ్గా వ్యక్తమవుతుంది. అంటే చూడతగని వస్తువుపై నుండి చూపును తప్పించాలని భావం. మనిషి చూపు క్రిందికి వాల్చి పెడతాడా, మరే వైపునకయినా మరల్చుకుంటాడా అన్నది అప్రస్తుతం. **مِنْ اَبْصَارِهِمْ** అన్న పదాలు కొన్ని చూపులను ప్రత్యేకిస్తు న్నాయి. అంటే ఆదేశం అన్ని చూపులకూ వర్తించదు, కొన్ని చూపులను మాత్రమే తప్పించాలని సూచించడం ఉద్దేశం. మరోమాటలో చెప్పాలంటే అల్లాహ్ ఉద్దేశం, ఏ వస్తువునయినా సరే నిండుగా చూడరాదన్నది కాదు, కేవలం ఒక ప్రత్యేక పరిధిలోనే చూపులపై ఆంక్షలు విధించాలని కోరుతున్నాడు. ఇక పూర్వోత్తరా పరిశీలిస్తే తెలిసేదేమిటంటే, పురుషులు స్త్రీలను చూడటం, లేదా ఇతరుల మర్మాం గాలను చూడటం, లేదా అశ్లీలమయిన దృశ్యాలను తదేకంగా చూడటంపైనే ఆంక్షలు విధించబడ్డాయి.

దైవగ్రంథంలోని ఈ ఆదేశానికి ప్రవక్త సంప్రదాయం (సున్నత్) చేసిన విశదీకరణలోని వివరాలను దిగువన ఇస్తున్నాము:

(1) మనిషి తన భార్య లేదా తనకు నిషిద్ధమయిన 'ముహ్రమ్' మహిళలను తప్ప ఇతర స్త్రీలను నిండు చూపుతో చూడటం ధర్మసమ్మతం కాదు. ఒకసారి అకస్మాత్తుగా చూపు పడితే అది క్షమార్హమే. కాని మనిషి తొలిచూపులో ఆకర్షకమయినది కనిపించగానే అక్కడ మళ్ళీ చూపులు ప్రసరింపజెయ్యడం క్షమార్హం కాదు. ఈ విధంగా చూపులాటలాడటాన్ని కంటి దుశ్చేష్ట (వ్యభి చారం)గా అభివర్ణించారు ప్రవక్త మహనీయులు. ఆయన (స) నుడివిన దాన్ననుసరించి మనిషి తన ఇంద్రియాలన్నింటితో వ్యభిచరిస్తాడు. చూడటం కంటి వ్యభిచారం, ప్రణయ సంభాషణ నోటి వ్యభిచారం, కంఠ ధ్వని ద్వారా ఆనందం అనుభవించడం చెవుల వ్యభిచారం, చేత్తో స్పర్శించడం, అధర్మ ఉద్దేశంతో నడవటం చేతులూకాళ్ళ వ్యభిచారం. దుశ్చేష్టకు సంబంధిం చిన ఈ తొలి దశలన్నీ పూర్తిగా నెరవేరిన తరువాత, చివరిగా మర్మాంగాలు దీన్ని పరిపూర్ణం చేసి వేస్తాయి, లేదా పరిపూర్ణం చెయ్యలేకపోతాయి (బుఖారీ, ముస్లిమ్, అబూదావూద్). హజ్రత్ బురైదా (ర) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు (స) హజ్రత్ అలి (ర)కి బోధించారు, "అలీ, తొలిచూపు తరువాత మలి చూపు వెయ్యకు. తొలి చూపు క్షమార్హమయింది, కాని మలి చూపుకాదు" (అహ్మద్, తిర్మిజీ, అబూదావూద్, దారిమీ). హజ్రత్ 'జరీర్ బిన్ అబ్దుల్లా బజలీ' ప్రకారం, ఆయన ప్రవక్త మహనీయుల్ని అడిగారు, అకస్మాత్తుగా చూపు పడితే ఏం చెయ్యానూ అని. వెంటనే చూపు మరల్చుకో, లేదా క్రిందికి వాల్చుకో అని సెలవిచ్చారు (ముస్లిమ్, అహ్మద్, తిర్మిజీ, అబూదావూద్, నసాయి). అబ్దుల్లా బిన్ మస్ఊద్ (ర) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్తశ్రీ (స) ఇలా ఉపదేశించారు, "అల్లాహ్ సెలవిచ్చిన దాని ప్రకారం, 'చూపు ఇబ్లీస్ వదిలే విషబాణాలలో ఒక బాణం. ఎవరయితే నా భయం చేత దాన్ని పరిత్యజిస్తాడో నేను అతనికి దాని ప్రతిఫలంగా విశ్వాసాన్ని ప్రదానం చేస్తాను; దాని విశ్వాసం కమ్మదనాన్ని అతను తన మనస్సులో ఆస్వాదిస్తాడు" (తబరాని). అబూ ఉమామ ఉల్లేఖనం: ప్రవక్త మహనీయులు (స) ఇలా సెలవిచ్చారు, "ఒక ముస్లిమ్ వ్యక్తి చూపు ఏ స్త్రీ సౌందర్యం మీదనయినా పడినప్పుడు అతను చూపును మరల్చుకుంటే అల్లాహ్ అతని ఆరాధనలో ఆనందాన్నీ, కమ్మదనాన్నీ సృజిస్తాడు" (ముస్నద్ అహ్మద్). ఇమామ్ జాఫర్ సాదిక్, తన పితాశ్రీ ఇమామ్ ముహమ్మద్ బాకర్ ద్వారాను, ఆయన జాబిర్ బిన్ అబ్దుల్లా అన్సారి ద్వారాను ఉల్లేఖించిన దాని ప్రకారం, హజ్జతుల్ విదా సందర్భంలో దైవప్రవక్త (స) పినతండ్రి కుమారుడు ఫజల్ బిన్ అబ్బాస్ (ర) (అప్పుడు ఆయన నవయువకుడు) మష్అరె హరావ్ నుండి తిరిగి వస్తున్నప్పుడు ప్రవక్తశ్రీ(స)తో పాటు ఒంటెపైన కూర్చుని ఉన్నారు. దారిలో మహిళలు అటు నుంచి వెళ్ళుతున్నప్పుడు ఫజల్ వారి వైపునకు చూసేవారు. ప్రవక్త మహనీయులు (స) ఆయన ముఖం మీద చెయ్యి వేసి దాన్ని మరో వైపునకు మరల్చారు (అబూ దావూద్). అదే హజ్జతుల్ విదాలో జరిగిన ఓ సంఘటన: బనీ ఖస్అమ్ తెగకు చెందిన ఒక మహిళ దారిలో ప్రవక్త మహనీయుల్ని ఆపి హజ్జ్‌కు సంబంధించిన ఒక ప్రశ్న అడగసాగింది. ఫజల్ బిన్ అబ్బాస్

ఆమెపైనే తన చూపు ఆనించారు. ప్రవక్తశ్రీ (స) ఆయన ముఖాన్ని మరో వైపునకు మరల్చారు (బుఖారీ, అబూ దావూద్, తిర్మిజీ).

(2) ఈ ఆదేశం వల్ల ఎవరికయినా ఒక అపార్థం కలిగే అవకాశముంది. స్త్రీలకు ముఖాన్ని ముసుగుతో కప్పుకోకుండా తిరిగే అనుమతి ఉండటం మూలానే చూపు తప్పించుకు తిరగాలని ఆదేశ మయిందని, ముఖానికి ముసుగు (పరదా) నియమం ఉన్నట్లయితే చూపు తప్పించుకు తిరిగే ప్రసక్తి ఎలా వస్తుందని ఎవరయినా అడగవచ్చు. ఈ వాదన హేతువు రీత్యా కూడా తప్పయినది, వాస్తవికత దృష్ట్యా కూడా సరయినది కాదు. హేతుబద్ధంగా తప్పుకు కారణం ఏమిటంటే, ముఖం ముసుగు సాధారణతః అమల్లో ఉన్నప్పటికీ అకస్మాత్తుగా స్త్రీ పురుషులు ఎదురయ్యే సందర్భాలు అనేకం తటస్థించవచ్చు. ఒక పరదాపాటించే స్త్రీకి కూడా తన ముఖానికి ముసుగు లేకుండా ఉండవలసిన అవసరాలెన్నో కలగవచ్చు. ముస్లిమ్ స్త్రీలలో పరదా పద్ధతి అమలులో ఉన్నప్పటికీ ముస్లిమేతర స్త్రీలయితే పరదాని పాటించేందుకు బద్ధులు కారు. అందువల్ల కేవలం చూపును తప్పించుకు మెలగాలన్న ఒక్క ఆదేశం, స్త్రీలు తప్పనిసరిగా ముఖానికి ముసుగు లేకుండా తిరుగుతారనడానికి ఆధారం కాజాలదు. ఇకపోతే పై వాదన వాస్తవికత దృష్ట్యా చూసినా తప్పే. అహ్జాబ్ సూరాలో "హిజాబ్" (పరదా) ఆదేశాలు అవతరించిన తరువాత ముస్లిమ్ సమాజంలో అమలులోకి వచ్చిన పరదా పద్ధతిలో ముఖానికి ముసుగు కూడా చేరి ఉండేది. ప్రవక్త మహనీయుల(స) కాలంలో అది అమలులో ఉండేదనడానికి అనేక ఉల్లేఖనాల ద్వారా రుజువయిన అంశమే. ఇఫ్క్ సంఘటనకు సంబంధించిన హజ్రత్ ఆయిషా వివరణలో ఆ వివరణ అనేక విశ్వసనీయ, ప్రామాణిక ధ్రువీకరణల ద్వారా ఉటంకించబడి ఉంది– ఆవిడగారు ఇలా సెలవిస్తున్నారు: "అడవి నుండి తిరిగి వచ్చి నేను చూడగానే బిడారు వెడలిపోయిందని గమనించాను. ఇక చేసేదిలేక కూర్చుండి పోయాను. నిద్ర ముంచుకు వచ్చింది. అక్కడే పడి నిద్ర పోయాను. తెల్లవారు ఝామున సఫ్వాన్ బిన్ ముఅత్తల్ అటుగా వెళ్ళినప్పుడు, దూరం నుంచి ఎవరో పడి ఉన్నట్టు బహుశా గమనించి దగ్గరగా వచ్చాడు. అతడు నన్ను చూడగానే గుర్తుపట్టాడు. ఎందుకంటే హిజాబ్ (పరదా) ఆదేశాలు రాకముందు అతను నన్ను చూసి ఉన్నాడు. నన్ను గుర్తుపట్టి అతను 'ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్' చదవగానే అతని ధ్వనికి నేను కళ్ళు తెరిచాను. వెంటనే నేను దుప్పటితో నా ముఖాన్ని కప్పుకున్నాను" (బుఖారీ, ముస్లిమ్, అహ్మద్, ఇబ్ను జరీర్, సీరత్ ఇబ్ను హిష్షామ్). అబూ దావూద్‌లోని కితాబుల్ జిహాద్‌లో ఒక సంఘటన ఉల్లేఖించబడింది. ఒక మహిళ ఉమ్ముఖల్లాద్ కుమారుడు ఒక యుద్ధంలో అమరగతిపొందాడు. ఆవిడ అతని గురించి విచారించడానికి ప్రవక్త మహనీయుల వద్దకు వచ్చింది. ఆ స్థితిలో కూడా ఆమె ముఖాన ముసుగు ఉండింది. కొందరు ప్రవక్త సహచరులు చాలా ఆశ్చర్యం వ్యక్తం చేసి, ఇప్పుడు కూడా నీ ముఖాన ముసుగు ఉందే అని అడిగారు; అంటే వారి

ఉద్దేశం, కుమారుని మృతిని గురించి విన్న తరువాత తల్లికి తన ఒంటిపైన కూడా స్పృహ ఉండదే నీవు మటుకు నింపాదిగా పరదా పాటిస్తూ వచ్చావేమిటీ అన్నదే. బదులుగా ఆమె ఇలా చెప్పింది, "నేను నా కుమారుణ్ణి కోల్పోయాను, నిజమే కాని నా వ్రీడనయితే కోల్పోలేదు కదా." అబూ దావూద్‌లోనే హజ్రత్ ఆయిషా ఉల్లేఖనం ఒకటుంది. ఒక స్త్రీ పరదా చాటుగా చెయ్యి చాపి ప్రవక్త మహనీయుల (స)కు ఒక దరఖాస్తు అందజేసింది. ప్రవక్త (స) అడిగారు, "ఈ చెయ్యి స్త్రీదా, పురుషునిదా?" అని. ఆమె స్త్రీదే అని చెప్పింది. అప్పుడు ఆయన ఇలా సెలవిచ్చారు, "స్త్రీ చెయ్యి అయినట్లయితే కనీసం గోళ్ళకయినా గోరింటాకు పెట్టుకోవలసింది కదా." పోతే హజ్జ్ సందర్భంలోని రెండు సంఘటనలు మేము పైన పేర్కొన్నాము, అవి, ప్రవక్త కాలంలో ముఖానికి పరదా లేదనడానికి ఆధారాలు కాజాలవు. ఎందుకంటే ఇహ్రామ్ కట్టుకున్న స్థితిలో ముసుగు వేసుకోవడం నిషిద్ధం. అయినప్పటికీ ఈ స్థితిలోనూ కొందరు జాగ్రత్త పరులయిన స్త్రీలు పర పురుషుల సమక్షంలో ముఖం తెరచి ఉండడానికి ఇష్టపడరు. హజ్రత్ ఆయిషా (ర) ఉల్లేఖనం ప్రకారం, "హజ్జతుల్ విదా సందర్భంలో మేము ప్రయాణావస్థలో ఇహ్రామ్ కట్టుకుని మక్కా వైపునకు పయనమవుతున్నప్పుడు ప్రయాణీకులు మా వైపుగా వెళ్ళేవారు. అటువంటప్పుడు స్త్రీలు తలపైని పైట చెరుగు ముఖంపైకి లాగి ముసుగుగా వేసుకునేవారు. వారు దాటి వెళ్ళగానే మేము ముసుగు తీసివేసేవారము." (అబూదావూద్, బాబ్ ఫిల్ ముహ్రిమ తగత్తీ వజ్‌హహా).

(3) ఈ "గజ్జె బసర్" ఆదేశానికి వినాయింపుగా కేవలం కొన్ని సందర్భాలున్నాయి. ఆ సందర్భాల లోనే ఏ స్త్రీనయినా చూసేందుకు వాస్తవమయిన ఆవశ్యకత ఏర్పడుతుంది. ఉదాహరణకు, ఒక వ్యక్తి ఓ స్త్రీని పెళ్ళాడదలచినప్పుడు, ఈ ఉద్దేశంతో స్త్రీని చూడటాన్ని అనుమతించడమే కాదు, కనీసం అభిలషణీయమని అనవచ్చు. ముగీరా బిన్ షు'బా ఒక ఉల్లేఖనంలో ఇలా అన్నారు, నేను ఒక కుటుంబంలో నికాహ్‌కు సందేశం పంపాను. దైవప్రవక్త (స), నీవు ఆ అమ్మాయిని చూసుకున్నావా? అని అడిగారు. నేను లేదని అన్నాను. అప్పుడు ఆయన, "ఆమెను చూసుకో, ఆ విధంగానయితే మీ మధ్యన ఇతోధికంగా సామరస్యం కుదిరే అవకాశముంది" అన్నారు (అహ్మద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నుమాజా, దారిమీ). అబూహురైరా ఉల్లేఖనం ప్రకారం ఒక వ్యక్తి ఒక చోట పెళ్ళికి సందేశం పంపాడు. ప్రవక్త మహనీయులు (స) "అమ్మాయిని చూసుకో, అన్సారుల కళ్ళల్లో ఏదో లోపం ఉంటుంది" అని సలహానిచ్చారు (ముస్లిమ్, నసాయి, అహ్మద్). జాబిర్ బిన్ అబ్దుల్లా ప్రకారం దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు, "మీలో ఎవరయినా ఒక స్త్రీని పెళ్ళాడదలిస్తే వీలయినంతమటుకు ఆమెను చూసుకుని తృప్తి చెందడం అవసరం. స్త్రీలో తనను ఆకర్షించే, ఆమెతో పెళ్ళికి పురికొలిపే ఏమయినా మంచితనముందేమో చూడాలి" (అహ్మద్, అబూదావూద్). ముస్నద్ అహ్మద్‌లో అబూ హుమైదా ఉల్లేఖనం ఒకటుంది. ప్రవక్తశ్రీ ఈ ఉద్దేశంతో స్త్రీని చూడటంలో తప్పులేదు అని పలికారు. ఇంకా ఆ అమ్మాయికి తెలియకుండా చూసే అనుమతిని

وَقُلْ لِّلْمُؤْمِنٰتِ يَغْضُضْنَ مِنْ اَبْصَارِهِنَّ وَ يَحْفَظْنَ فُرُوْ
جَهُنَّ وَلَا يُبْدِيْنَ زِيْنَتَهُنَّ اِلَّا مَا ظَهَرَ مِنْهَا وَلْيَضْرِبْنَ
بِخُمُرِهِنَّ عَلٰى جُيُوْبِهِنَّ وَلَا يُبْدِيْنَ زِيْنَتَهُنَّ اِلَّا لِبُعُوْ لَتِهِنَّ

31... ప్రవక్తా, విశ్వసించిన మహిళలకూ చెప్పు, తమ చూపులను తప్పించుకు మెలగాలని,[31] తమ మర్మస్థలాలనూ పరిరక్షించుకోవాలని,[32] ఇంకా[33] తమ సింగారాలను ప్రదర్శించరాదని[34] - ఏదో దానంతట అదే వ్యక్తమయ్యే దాన్ని తప్ప;[35] తమ రొమ్ములపైన తమ పైట కొంగులు కప్పుకోవాలనీను.[36] వారు తమ అలంకరణలను వీరి సమక్షంలో తప్ప ఎక్కడా వ్యక్తపరచరాదు:[37]

కూడా ఇచ్చారు. దీని ఆధారంగానే ధర్మశాస్త్రవేత్తలు, అవసరం మేరకు చూసే ఇతర సందర్భాలు కూడా ధర్మసమ్మతమేనని నియమం సూత్రీకరించారు. ఉదాహరణకు నేర పరిశోధన విషయంలో ఒక అనుమానిత స్త్రీని చూడటం, లేదా న్యాయస్థానంలో సాక్ష్యం ఇచ్చే సందర్భంలో కాజీ (జడ్జి) స్త్రీ సాక్షిని చూడటం, చికిత్స నిమిత్తం వైద్యుడు రోగిని చూడటం ఇత్యాదివి.

(4) 'గజ్జె బసర్' ఆదేశానికి ఒక ఉద్దేశం, మనిషి స్త్రీ లేదా పురుషుడి ఆచ్ఛాదనీయ శరీర భాగాన్నీ చూడరాదన్నది కూడా. ప్రవక్త మహనీయులు (స) ఇలా ప్రవచించారు, "ఏ పురుషుడూ మరో పురుషుడి మర్మావయవాలను చూడరాదు, మరి స్త్రీ కూడా మరో స్త్రీ మర్మాంగాలను చూడరాదు" (అహ్మద్, ముస్లిమ్, అబూ దావూద్, తిర్మిజీ). హజ్రత్ అలీ ఉల్లేఖనం ప్రకారం, "ప్రవక్తశ్రీ నాకు ఇలా బోధించారు, 'బ్రతికి ఉన్న లేదా చనిపోయిన మానవుని తొడల మీద దృష్టి సారించకు" (అబూదావూద్, ఇబ్ను మాజా).

30. మర్మాంగాల పరిరక్షణ అంటే, కేవలం అక్రమమయిన సంభోగం నుండి దూరంగా ఉండటం మాత్రమే కాదు, తమ గోపనీయ శరీరభాగాలను పరులముందు బహిర్గతపరచకుండా కూడా జాగ్రత్తపడాలి. పురుషుని గోపనీయ శరీర భాగాలు ప్రవక్త మహనీయులు (స), నాభి నుండి మోకాలి క్రింది వరకు నిర్ణయించారు. "పురుషుని గోపనీయ భాగం అతని నాభి నుండి మోకాలి వరకు" (దార్‌కుత్ని, బైహకీ). ఆ శరీర భాగాన్నీ భార్య తప్ప మరెవరి సమక్షంలోనూ కావాలని విప్పదీయడం నిషిద్ధం. హజ్రత్ జర్‌హది అస్లమి, సుఫ్ఫా సభ్యుల్లోని మహనీయులు. ఆయన ఉల్లేఖనం ప్రకారం, "ఒకసారి దైవప్రవక్తతో సమావేశంలో కూర్చుని ఉండగా నా తొడ ఆచ్ఛాదన లేకుండా కానవచ్చింది.

అప్పుడు ప్రవక్తశ్రీ (స) ఇలా పురమాయించారు, "తొడ ఆచ్ఛాదనీయం అని నీకు తెలియదా?" (తిర్మిజీ, అబూదావూద్, ముఅత్తా). హజ్రత్ అలీ ఉల్లేఖనంలో ప్రవక్తశ్రీ బోధించారు, "మీ తొడలను ఎన్నడూ తెరవకండి (ఆచ్ఛాదనా రహితంగా కాననివ్వకండి)" (అబూ దావూద్, ఇబ్నుమాజా). కేవలం ఇతరుల సమక్షంలోనే కాదు, ఏకాంతంలోనూ దిగంబరంగా ఉండటం నిషిద్ధం. ప్రవక్త మహనీయులు ఇలా సెలవిచ్చారు, "జాగ్రత్త, ఎప్పుడూ దిగంబరంగా ఉండకండి. మీతో పాటు, ఎప్పుడూ మేలుకొని వారు కూడా ఉంటారు (అంటే శుభాన్ని కరుణను అందజేసే దైవదూతలు). అయితే మీరు మీ కాలకృత్యాల కోసం వెళ్ళినప్పుడు లేదా మీ భార్యల చెంతకుపోయినప్పుడు మాత్రం (మర్మాంగాలు తెరువవచ్చు). అందువల్ల దైవదూతల పట్ల బిడియపడండి, వారిని గౌరవించండి" (తిర్మిజీ). మరో హదీసులో ఇలా ఉంది, "మీ మర్మాంగాలను మీ భార్య లేదా మీ బానిస స్త్రీ ఎదుట (సంయోగసమయంలో) తప్ప మరెక్కడా తెరవరాదు." అడిగేవాడు, "మరి మేము ఒంటరిగా ఉన్నప్పుడో?" అని అడిగాడు. అప్పుడు, "ఎవరి ముందయినా బిడియపడాలంటే దానికి శుభప్రదుడయిన అల్లాహ్ అధికంగా అర్హుడు" అన్నారు దైవప్రవక్త (స) (అబూదావూద్, తిర్మిజీ, ఇబ్నుమాజా).

31. స్త్రీలకు కూడా పురుషుల మాదిరిగానే చూపును తప్పించుకునే ఆదేశాలు వర్తిస్తాయి. అంటే వారున్నూ కావాలని పరపురుషులను చూడరాదు. చూపు పడినట్లయితే దాన్ని మరల్చుకోవాలి. ఇతరుల గోపనీయ అంగాలను చూడరాదు. అయితే పురుషుడు స్త్రీని చూడటంలోనూ స్త్రీ పురుషుణ్ణి చూడటంలోనూ ఆదేశాలు కాస్త భిన్నంగా ఉన్నాయి. ఒక వైపున హదీసులో మనకు ఒక సంఘటన దొరుకుతుంది. హజ్రత్ ఉమ్ము సలమ, హజ్రత్ మైమూనా ప్రవక్త మహనీయుల వద్ద కూర్చుని ఉండగా హజ్రత్ ఇబ్ను ఉమ్ము మక్తూమ్ విచ్చేశారు. ప్రవక్తశ్రీ (స) తన ఇద్దరు సతీమణులనూ వీరి పట్ల పరదాని పాటించండి అని ఆదేశించారు. వారు, "దైవప్రవక్తా, వీరు అంధులు కారా, మమ్మల్ని చూడనూలేరు, గుర్తుపట్టనూ లేరు" అని అన్నారు. దానికి ఆయన, "మీరిద్దరు కూడా గుడ్డివారేనా, మీరూ ఈయన్ని చూడలేరా?" అని సెలవిచ్చారు. హజ్రత్ ఉమ్ము సలమ దీన్ని విశదీకరిస్తూ, "ఇది పరదా ఆదేశాలు వచ్చేసిన తరువాత ఘటన" అన్నారు (అహ్మద్, అబూ దావూద్, తిర్మిజీ). దీన్ని 'ముఅత్తా' లోని ఈ ఉల్లేఖనం బలపరుస్తోంది కూడా. అందులో ఇలా ఉంది. హజ్రత్ ఆయిషా (ర) వద్దకు ఒక గుడ్డి వ్యక్తి రాగా ఆవిడ అతని పట్ల పరదా పాటించారు. అక్కడున్నవారు, మీరు ఇతని ఎడల పరదా పాటిస్తారేమిటీ, ఇతనయితే మిమ్మల్ని చూడలేడు కదా అన్నారు. దానికి విశ్వాసుల మాతృమూర్తి (ర), "నేను ఇతన్ని చూడగలను కదా" అన్నారు. మరో వైపున మనకు హజ్రత్ ఆయిషా తెలిపినదే మరో ఉల్లేఖనం దొరుకుతుంది. దాని ప్రకారం హి. 7వ సంవత్సరంలో అబిసీనీయుల ఒక బృందం మదీనా వచ్చింది. అది ప్రవక్త మస్జిద్ ఎదుట ఒక విన్యాసం చేసింది. ప్రవక్త మహనీయులు స్వయంగా తానే హజ్రత్ ఆయిషాకు ఈ విన్యాసాలు చూపించారు (బుఖారీ, ముస్లిమ్, అహ్మద్). మరో వైపున మనకు ఇంకొక

హదీసు దొరుకుతుంది. దాని ప్రకారం, ఫాతిమా బిన్తు కైస్‌కి ఆమె పతి మూడు తలాకులు ఇచ్చినప్పుడు ఆమె ఇద్దత్ కాలం ఎక్కడ గడపాలన్న ప్రశ్న తలెత్తింది. తొలుత ప్రవక్త మహనీయులు, "ఉమ్మి షురైక్ అన్సారియా ఇంట గడపమ"న్నారు. తరువాత "వారి ఇంటికి నా సహచరులు చాలా అధికంగా వెడుతూ ఉంటారు (ఆవిడ చాలా ధనవంతురాలయిన దాతృగుణం గల మహిళ, జనులు చాలా ఎక్కువగానే ఆవిడ ఇంట అతిథులుగా ఉంటారు, ఆవిడ వారికందరికీ ఆతిథ్యం ఇస్తూ ఉంటారు). అందువల్ల నీవు ఇబ్ను ఉమ్మి మక్తూమ్ ఇంట బస చెయ్యి. ఆయన అంధులు. నీవు ఆయన ఇంట మొగమాటం లేకుండా గడపగలవు" (ముస్లిమ్, అబూదావూద్). ఈ ఉల్లేఖనాలను ఏర్చికూర్చి చూసినట్లయితే అర్థమయ్యేదేమిటంటే, స్త్రీలు పురుషుల్ని చూసే విషయంలో, పురుషులు స్త్రీలను చూసే విషయంలో ఉన్నంత గట్టి పట్టులేదు. అలాగే ఒకే సమావేశంలో ఎదురుబొదురుగా కూర్చొని చూడటం నిషిద్ధం. దారిలో నడుస్తూ లేదా దూరాన్నుండి ఏదయినా ధర్మబద్ధమయిన ఆటలాంటిది చూస్తూ పురుషుల మీద చూపు వాలడం నిషిద్ధం కాదు. ఏదయినా అత్యవసర పరిస్థితి ఏర్పడితే ఒకే ఇంట ఉంటూ చూడటంలోనూ తప్పులేదు. ఇమామ్ గజాలి, ఇబ్ను హజర్ అస్కలానీ కూడా ఉల్లేఖనాల ద్వారా దాదాపు ఇదే అర్థాన్ని గ్రహించారు. షౌకానీ నైలల్ అవ్‌తార్‌లో ఇబ్ను హజర్ చెప్పిన ఈ మాటను ఉటంకించారు. "అనుమతి విషయానికి సమర్థన మరో విషయం ద్వారా కూడా లభిస్తుంది. స్త్రీలు బయటకు వెళ్ళడం విషయంలో ఎల్లప్పుడూ అనుమతినే అమలు జరపడం జరిగింది. మస్జిదుల్లో, బజారుల్లో, ప్రయాణాల్లో, స్త్రీలయితే ముఖానికి ముసుగు వేసుకు వెళ్ళేవారు. పురుషులు వారిని చూడకుండా జరిగేది. కాని స్త్రీలు చూడకుండా ఉండటానికి పురుషులు ముఖానికి ముసుగు వేసుకోవాలని ఆదేశమివ్వటం ఎన్నడూ జరగలేదు. దీన్నిబట్టి ఉభయుల విషయంలో ఆదేశం వేరయినదని తెలుస్తోంది" (6వ సంపుటి 101వ పేజీ). అయినప్పటికీ స్త్రీలు పురుషుల్ని తదేకంగా చూడటం, వారి అందచందాల ద్వారా తమ కళ్ళకు చలువ కలిగించుకోవడం ఏ విధంగానూ ధర్మసమ్మతమయింది కాదు.

32. అంటే అక్రమమయిన లైంగిక సంబంధాలకూ దూరంగా మెలగాలి, తమ గోపనీయ అంగాలు ఇతరుల సమక్షంలో వ్యక్తపరచకుండానూ ఉండాలి. ఈ వ్యవహారంలో స్త్రీలకు కూడా పురుషుల మాదిరి ఆదేశాలే వర్తిస్తాయి. అయితే స్త్రీల గోపనీయ అంగాల పరిధులు పురుషులకన్నా భిన్నమయినవి. ఇంకా స్త్రీల గోపనీయ భాగాలు పురుషుల విషయంలో వేరు, స్త్రీల విషయంలో వేరు.

స్త్రీ చేతులు, ముఖం తప్ప ఆమె శరీరమంతా పురుషులకు గోపనీయభాగంగా పరిగణించబడుతుంది. దీన్ని ఆవిడ తన భర్త వద్ద తప్ప మరెక్కడా తెరువదు. కడకు తన తండ్రి, సోదరుల సమక్షంలోనూ తెరువరాదు. అలాగే స్త్రీ సన్నని, లేదా ఒత్తిగిలి ఉండే దుస్తులు కూడా ధరించరాదు; అంటే వస్త్రాల ద్వారా ఆమె శరీరం కనిపించడమో లేదా దాని నిర్మాణం అగుపడటమో జరగరాదు. హజ్రత్ ఆయిషా

ఉల్లేఖనం ప్రకారం ఆమె సోదరి హజ్రత్ అస్మా బిన్తు అబూ బక్ర్ (ర) దైవప్రవక్త (స) సమక్షంలోకి వచ్చారు. ఆమె పల్చటి బట్టలు తొడిగి ఉన్నారు. ప్రవక్తశ్రీ (స) వెంటనే ముఖం త్రిప్పుకున్నారు. ఇంకా ఇలా అన్నారు, "అస్మా, స్త్రీ ప్రౌఢ అయిన తరువాత, ఆమె ముఖం, చేతులు తప్ప మరే శరీర భాగమూ కానరాకూడదు" (అబూదావూద్). ఇలాంటి సంఘటనే మరొకటి ఇబ్ను జరీర్ హజ్రత్ ఆయిషా ఉల్లేఖించగా ఉటంకించారు, వీరి ఇంటికి సవితి సోదరుదు అబ్దుల్లా బిన్ అత్తుఫైల్ కూతురు వచ్చి ఉండింది. ప్రవక్త మహనీయులు ఇంటికి వచ్చినప్పుడు ఆవిడను చూసి ముఖం తిప్పుకున్నారు. హజ్రత్ ఆయిషా, దైవప్రవక్త ఈమె నా మేనకోడలు అని విన్నవించు కున్నారు. దానికి ఆయన, ఇలా సెలవిచ్చారు: "స్త్రీ పెద్ద మనిషి అయిన తరువాత ఆమె తన ముఖం, అరచేతులు తప్ప మరే భాగాన్నీ వ్యక్తం చేయరాదు అని అంటూ ఆయన స్వయంగా తన మణికట్టు పట్టుకుని చూపారు. అప్పుడు ఆయన అరచెయ్యి, పిడికిలికి మధ్యన కేవలం ఒక పిడికిలి మందం చోటే మిగిలింది." ఈ వ్యవహారంలో ఒక మాదిరి రాయితీ ఉంది. స్త్రీ తన నిషిద్ధ బంధువుల సమక్షంలో (అంటే తండ్రి, సోదరుడు వగైరా) ఇంటి పనులకు అవసరమయ్యే మేరకు తెరవవలసినంత శరీర భాగాన్ని తెరవడంలో తప్పులేదు. ఉదాహరణకు పిండి పిసికేటప్పుడు చేతుల వస్త్రం పైకి లేపుకోవడం, ఇంటి నేల తుడిచేటప్పుడు కాళ్ళ వస్త్రం కాస్త పైకి లేపడం మొదలయిన విషయాలు.

స్త్రీకి స్త్రీ గోపనీయ భాగాల పరిధులు, పురుషునికి పురుషుని గోపనీయ భాగాల పరిధులూ ఒకటే. అంటే నాభిస్థానం మొదలుకుని, మోకాలి వరకు. దీని భావం, స్త్రీల సమక్షంలో స్త్రీలు అర్ధనగ్నంగా ఉండవచ్చని కాదు. అంటే మోకాలినుండి నాభి స్థానం వరకున్న శరీర భాగం ఆచ్ఛాదించి ఉంచటం తప్పనిసరి, విధి. ఇతర భాగాలను స్త్రీలు, స్త్రీల సమక్షంలో ఆచ్ఛాదించడం విధి కాదు. అంతే.

33. ఒక విషయం దృష్టిలో ఉంచుకోవాలి. షరీఅత్ (దైవశాసనాంగం) పురుషులను కోరినంత మేర మాత్రమే స్త్రీలనూ కోరదు. అంటే చూపును తప్పించుకోవడం, మర్మాంగాల పరిరక్షణ, ఇత్యాదివి; పైగా అది మరికొన్ని విషయాలు కూడా స్త్రీల నుండి కోరుతుంది, వాటిని అది పురుషుల నుండి కోరదు. దీన్ని బట్టి ఈ వ్యవహారంలో స్త్రీ పురుషులు సమానం కాదని స్పష్టమవుతుంది.

34. "సింగారాలను" అనేది మేము అరబీ మూలంలోని "జీనత్" అనే పదానికి చేసిన అనువాదం. దీనికి మరో పర్యాయపదం అలంకరణ కూడా కావచ్చు. ఇది మూడు వస్తువులకు వర్తిస్తుంది: అందమయిన దుస్తులు; ఆభరణాలు; తల, ముఖం, కాళ్ళు, చేతులకు చేసుకునే విభిన్న అలంకరణలు. సాధారణంగా స్త్రీలు ప్రపంచంలో ఈ అలంకరణలు చేసుకుంటూనే ఉంటారు. వీటిని నేటి కాలంలో 'మేకప్' అని అంటారు. ఈ సింగారింపును ఎవరెవరికి చూపెట్టకూడదో వివరాలు ముమ్ముందు వస్తున్నాయి.

35. ఈ ఆయత్ భావాన్ని వ్యాఖ్యానాల్లోని విభిన్న వివరణలు బాగా సందేహాస్పదం చేసి వేశాయి. నిజానికి ఈ ఆయత్ చాలా స్పష్టమయినది. మొదటి భాగంలో, لَا يُبْدِيْنَ زِيْنَتَهُنَّ **"వారు తమ అలంకరణలను, సింగారాన్ని వ్యక్తపరచరాదు"** అని సెలవీయబడింది. రెండవ భాగంలో 'ఇల్లా' అని పలికి ఈ ఆదేశంలో మినహాయింపును ప్రకటించడం జరిగింది – "ఈ అలంకరణ, సింగారంలో నుంచి ఏదో దానంతట అదే వ్యక్తమయినది తప్ప". దీన్నిబట్టి స్పష్టమయ్యేదేమిటంటే స్త్రీలు తమం తట తాము దీన్ని వ్యక్తమూ చేయరాదు ప్రదర్శన అంతకన్నా చేయరాదు. అయితే దానంతట అదే ఏమయినా వ్యక్తమయిపోతే (అంటే దుప్పటి గాలికి ఎగరడం వల్ల ఏదయినా అలంకరణ బయటపడటం) లేదా దానంతట అదే వ్యక్తమయ్యేది (కప్పుకునే దుప్పటిని దాయడం అసాధ్యం. దుప్పటి స్త్రీ ఒంటిపైన ఉంటుంది కాబట్టి అందులో ఎలాగూ ఒక ఆకర్షణ ఉంటుంది). ఇటువంటి సందర్భంలో దైవం వద్ద పట్టుకోవడం జరగదు. ఈ ఆయత్‌కు అబ్దుల్లా బిన్ మస్ఊద్, హసన్ బస్రీ, ఇబ్ను సీరీన్, ఇబ్రాహీమ్ నఖయీ ఇదే భావాన్ని వివరించారు. దీనికి భిన్నంగా కొందరు వ్యాఖ్యాతలు వాటిలో వ్యక్తమయ్యేది అన్న దాని భావం, మనిషి సాధారణంగా అలవాటు ప్రకారం వ్యక్తం చేసేవి అని చెప్పారు. పైగా వీటిలో ముఖమూ, చేతులూ, వాటి అలంకరణలు కూడా చేరి ఉన్నాయని భావం చెబుతారు. అంటే వారి దృష్టిలో స్త్రీ తన ముఖానికి, దంతాలకు, కళ్ళకు అందాలు దిద్దుకునేందుకు మిస్సీ, కాటుక, రోజ్, స్నో పౌడరు వంటివి పులుముకుని, చేతులకు కంకణాలు, ఉంగరాలు, గాజులు తొడుక్కుని అలంకారాలతోపాటు ప్రజల ముందు తిరుగాడటం ధర్మ సమ్మతమేనన్నమాట. ఈ భావం ఇబ్ను అబ్బాస్, ఆయన శిష్యగణం చెప్పినట్లు ఉల్లేఖనాలున్నాయి. హనఫీ ధర్మశాస్త్రవేత్తలు, చాలామంది దాన్ని స్వీకరించారు. (అహ్కాముల్ ఖుర్ఆన్, జస్సాస్ సంపుటి 3; పుటలు 388, 389). కాని మేము ఒక విషయం అర్థం చేసుకోలేకపోతున్నాము. మూలంలోని అరబీ పదం مَا ظَهَرَ **(వ్యక్తమయ్యేవి)** అనేది مَا يُظْهِرُ **(వ్యక్తం చేసేది)** ఎలా కాగలదు, ఏ వ్యాకరణ నియమం ప్రకారం కాగలదు అన్నదే. "వ్యక్తం అవడం" లోనూ "వ్యక్తం చేయడం"లోనూ స్పష్టమయిన వ్యత్యాసముంది. ఖుర్ఆన్ అత్యంత స్పష్టంగా "వ్యక్తం చేయడాన్ని" ఆపి "వ్యక్తం కావడాన్ని" అనుమతిస్తోంది. ఈ అనుమతిని "వ్యక్తం చేయడం" వరకు పొడిగించడం ఖుర్ఆన్‌కూ వ్యతిరేకం, ప్రవక్త కాలంలో పరదా ఆదేశాలు వచ్చిన తరువాత స్త్రీలు ముఖం తెరిచి తిరిగేవారు కారు అని తెలిపే ఉల్లేఖనాలకూ వ్యతిరేకం. పరదా ఆదేశంలో ముఖం ముసుగు కూడా చేరి ఉండిందన్నదీ, ఇహ్రామ్ (హజ్ దుస్తులు)లో తప్ప మిగతా పరిస్థితులన్నింటిలోనూ మేలి ముసుగు స్త్రీల దుస్తులలో భాగంగా అలరారేదన్నదీ ఆ ఉల్లేఖనాల సారాంశం. ఇంతకన్నా ఆశ్చర్యకరమయిన విషయం ఏమిటంటే, ఈ అనుమతిని సమర్థిస్తూ, ఒక ఆధారంగా తెలిపే విషయం: ముఖమూ చేతులూ స్త్రీ గోపనీయ అవయవాల్లో చేరిలేవు అన్నది. వాస్తవానికి 'సతర్' (గోపనీయ భాగాలు), 'హిజాబ్' (పరదా)లలో చాలా వ్యత్యాసముంది. సతర్

అన్నది నిషిద్ధ పురుషుల సమక్షంలో వ్యక్తం చేయడం కూడా నిషిద్ధమే. హిజాబ్ (పరదా) అన్నది సతర్ కన్నా అధికమయిన ఓ అంశం. దాన్ని స్త్రీ పరపురుషుల మధ్య చాటుగా నియమించబడ్డది. ఇక్కడ చర్చనీయాంశం సతర్‌కాదు, హిజాబ్ (పరదా వ్యవస్థ) ఆదేశాలు.

36. అజ్ఞానకాలంలో స్త్రీలు తలకు ఒక విధమయిన ఓణి (స్కార్ఫ్) కట్టుకునేవారు. దాని ముడి కొప్పులాగా జడపైన వేసుకునేవారు. ముందుభాగం కొంత తెరిచే ఉండేది. దాని వల్ల కంఠం, రొమ్ము పై భాగం స్పష్టంగా కానవస్తూ ఉండేది. వక్షోజాలపైన చొక్కా తప్ప మరేమీ ఉండేది కాదు. వెనకాల రెండు, మూడు జడలు వ్రేలాడుతూ ఉండేవి. (కష్షాఫ్ వ్యాఖ్యాన గ్రంథం, సంపుటి 2, పుట 90; ఇబ్ను కసీర్ సంపుటి 3, పుటలు 283, 284). ఈ ఆయత్ అవతరణ తరువాత ముస్లిమ్ స్త్రీలలో ఓణి రివాజు పొందింది. దాని ఉద్దేశ్యం, నేటి అమ్మాయిగార్ల లాగా దాన్ని పేని కంఠంలో హారంలా వేసుకోవడం కాదు. దాన్ని కప్పుకుని, తల, నడుము, రొమ్ము అన్నీ బాగా కప్పివేసేవారు. విశ్వసించిన స్త్రీలు ఈ ఖుర్‌ఆన్ ఆదేశం వినగానే దాన్ని అనుసరించిన తీరును హజ్రత్ ఆయిషా (ర) ప్రశంసిస్తూ ఇలా చెప్పారు, “నూర్ సూరా అవతరించినప్పుడు ప్రవక్త (స) ద్వారా దాన్ని విని జనం తమ ఇండ్లకు మరలి, తమ భార్యలకు, కుమార్తెలకు, సోదరీలకు దీని ఆయత్‌లను వినిపించారు. అన్సారుల మహిళలలో “తమ రొమ్ములపైన తమ ఓణీల కొంగులను కప్పుకోవాలి” అన్న పదాలు విని అట్టే కూర్చుండిపోయిన వారొక్కరూ లేరు. ప్రతి స్త్రీ లేచి ఒకరు తమ నడుముకు చుట్టుకున్న పట్టాలాంటి దాన్ని విప్పదీసి, మరొకరు దుప్పటి తీసుకుని దాన్ని తమ ఓణీగా మార్చుకుని కప్పుకున్నారు. మరుసటి రోజు ఫజ్ర్ నమాజ్ వేళ ప్రవక్త మస్జిద్‌కు వచ్చిన మహిళలందరూ ఓణీలు కప్పుకునే ఉన్నారు. ఇదే సందర్భంలో మరో ఉల్లేఖనంలో హజ్రత్ ఆయిషా (ర) మరిన్ని వివరాలు తెలుపుతూ స్త్రీలు తమ వద్దనున్న సన్నని బట్టలు వదలి మందపు బట్టలను ఎన్నుకున్నారు, వాటిని తమ ఓణీలుగా మార్చుకున్నారు.” (ఇబ్ను కసీర్, సంపుటి : 3, పుట 284; అబూ దావూద్ : కితాబుల్లిబాస్).

ఓణీ సన్నని బట్టది కాకూడదన్న విషయం ఈ ఆదేశాల నైజాన్ని, ఉద్దేశాన్ని పరిశీలిస్తే అదే అర్థమయిపోతుంది. అందువల్ల అన్సార్ మహిళలు ఈ ఆదేశం వినగానే దీని ఉద్దేశం ఎటువంటి బట్ట ద్వారా నెరవేరుతుందో అర్థం చేసుకున్నారు. అయినప్పటికీ షరీఅత్ ప్రదాత (స) ఈ విషయాన్ని కూడా జనుల అవగాహనా పటిమకు వదలిపెట్టలేదు. ఆయన స్వయంగానే దీన్ని విశదీకరించారు. దిహ్యా కల్బి ప్రకారం “ప్రవక్త మహనీయుల వద్దకు ఈజిప్ట్‌లో తయారయిన ఒక సన్నని మల్లుబట్ట వచ్చింది. అందులో నుంచి ఆయన ఒక భాగం నాకు ఇచ్చి, అందులో ఒక ముక్కతో నీవు చొక్కా కుట్టించుకో, ఒకటి నీ భార్యకు ఓణీ కోసం ఇవ్వు. అయితే ఆవిడతో, దాని క్రింద మరో బట్ట (లైనింగ్‌గా) పెట్టుకోమని చెప్పు. దానివల్ల శరీర వంపులు దానిగుండా కానరాకుండా ఉంటాయి” (అబూదావూద్ : కితాబుల్ లిబాస్).

اَوْ اٰبَآىِٕهِنَّ اَوْ اٰبَآءِ بُعُوْلَتِهِنَّ اَوْ اَبْنَآىِٕهِنَّ اَوْ اَبْنَآءِ بُعُوْلَتِهِنَّ

اَوْ اِخْوَانِهِنَّ اَوْ بَنِیْٓ اِخْوَانِهِنَّ اَوْ بَنِیْٓ اَخَوٰتِهِنَّ اَوْ نِسَآىِٕهِنَّ

اَوْ مَا مَلَكَتْ اَیْمَانُهُنَّ اَوِ التّٰبِعِیْنَ غَیْرِ اُولِی الْاِرْبَةِ مِنَ الرِّجَالِ

اَوِ الطِّفْلِ الَّذِیْنَ لَمْ یَظْهَرُوْا عَلٰى عَوْرٰتِ النِّسَآءِ ۪ وَ لَا یَضْرِبْنَ

بِاَرْجُلِهِنَّ لِیُعْلَمَ مَا یُخْفِیْنَ مِنْ زِیْنَتِهِنَّ ؕ وَ تُوْبُوْۤا اِلَى اللّٰهِ جَمِیْعًا

اَیُّهَ الْمُؤْمِنُوْنَ لَعَلَّكُمْ تُفْلِحُوْنَ (٣١)

భర్తలు, తండ్రులు, భర్తల తండ్రులు,[38] కొడుకులు, భర్తల కొడుకులు,[39] సోదరులు,[40] సోదరుల కొడుకులు,[41] సోదరీల కొడుకులు,[42] తమ పరిచయస్థులయిన స్త్రీలు,[43] తమ హస్తగతమయిన బానిసలు,[44] చేతిక్రింద పనులు చేసే మరెటువంటి ఉద్దేశ్యంలేని పురుషులు,[45] స్త్రీల గోప్య విషయాలను గురించి ఇంకా ఏమీ ఎరుగనటువంటి బాలురు.[46] ఇంకా వారు తమ కాళ్ళను నేలకేసి కొడుతూ నడవరాదు- తాము మరుగుపరచిన ఆభరణ భూషణలేవో జనులకు తెలిసిపోయేలా.[47]

...31 విశ్వాసులారా, మీరంతా కలిసి అల్లాహ్ సమక్షంలో తౌబా చేయండి,[48] ఇలా మీరు సాఫల్యం పొందగలరన్న నమ్మకముంది.[49]

---

37. అంటే స్త్రీ తన అలంకరణలన్నింటితో స్వేచ్ఛగా తిరగగల పరిధి వీరితో కూడుకున్నదన్నమాట. ఈ పరిధికి ఆవలనుండే వారంతా, వారు చుట్టాలయినా పరాయివారయినా, ఎటువంటి పరిస్థితిలోనూ ఒక స్త్రీ తన అలంకరణలు, ఆభరణాలతో వారి ఎదుటికి రావడం ధర్మసమ్మతం కాదు. "తమ సింగారింపును ప్రదర్శించరాదని, ఏదో దానంతట అదే వ్యక్తమయ్యేది తప్ప" అనే ఆదేశంలోని భావాన్ని ఇక్కడ విడమర్చి తెలుపడం జరిగింది. ఈ పరిమిత పరిధికి ఆవలనున్న వారెవరయినా స్త్రీ వారి సమక్షంలో తన అలంకరణలను కావాలని లేదా నిర్లక్ష్యంతో స్వయంగా వ్యక్తం చేయరాదు. అయితే వారి ప్రయత్నాలు ఎన్ని జరిగినా లేదా సంకల్ప రహితంగా ఏదయినా వ్యక్తమయితే లేదా దేన్నయినా దాయడం సాధ్యం కాకపోతే అది అల్లాహ్ దృష్టిలో క్షమార్హమయింది.

38. మూలంలో آبَاء **(అబా)** అన్న పద ప్రయోగం జరిగింది. దాని భావంలో కేవలం తండ్రి

మాత్రమే కాదు, (తండ్రివైపు) తాత, ముత్తాత, (తల్లివైపు) తాత, ముత్తాతలు సయితం చేరి ఉన్నారు. కాగా ఒక స్త్రీ తన తండ్రి తరఫున, తల్లి తరఫున, భర్త తండ్రి, తల్లి తరఫున వచ్చే పెద్దలందరి సమక్షంలో తన తండ్రి, తన మామ (భర్త తండ్రి) సమక్షంలో వచ్చినట్లే (పరదా నియమం పాటించకుండా) రాగలదు.

39. కుమారులంటే (కొడుకు తరఫు) మనుమలు, మునిమనుమలు, (కూతురు పక్షం) మనుమలు, మునిమనమలు అందరూ చేరి ఉన్నారు. ఈ విషయంలో స్వంత సంతానం సవితి సంతానం అన్న భేదంలేదు. స్త్రీ తన స్వంత సంతానం, సంతానానికి సంతానం సమక్షంలో తన అలంకరణలను వ్యక్తం చేసినట్లే తన సవితి సంతానం, వారి సంతానం ఎదుట కూడా స్వేచ్ఛగా వ్యక్తం చేయవచ్చు.

40. సోదరులు అంటే స్వంత, సవతి, తల్లి పక్షాన సోదరులు అందరూ చేరి ఉన్నారు.

41. సోదరీ సోదరుల కుమారులంటే మూడు విధాల సోదరీ సోదరుల సంతానమన్నమాట. అంటే వారి కొడుకు వైపు మనుమలు, మునిమనుమలు, కుమార్తెల వైపు మనుమలు మునిమనుమలు అందరూ ఇందులోనే చేరివున్నారు.

42. ఇక్కడ బంధువుల పరిధి అంతమవుతోంది. మున్ముందు బంధువేతరుల ప్రస్తావన వస్తోంది. అందువల్ల ముందుకు సాగేముందే మూడు విషయాలు ఇక్కడ అర్థం చేసుకోవడం మంచిది. వాటిని అర్థం చేసుకోకపోతే అనేక చిక్కులు ఎదురవుతాయి:

మొదటి విషయం : కొందరు అలంకరణ వ్యక్తం చేసే స్వేచ్ఛ కేవలం ఇక్కడ పేర్కొన్న బంధుత్వాల వరకే పరిమితమని భావిస్తారు. మిగతా వారందరూ, కడకు స్వంత బాబాయి, మామలను సయితం పరదా పాటించవలసిన బంధువులుగా పరిగణిస్తారు. దానికి వారి వాదన, వారిని ఖుర్ఆన్‌లో పేర్కొనక పోవడమన్నది. కాని ఇది సరయినది కాదు. స్వంత బాబాయి, మామలే కాదు, ప్రవక్త మహనీయులు (స) పాలుపట్టిన సంబంధమున్న బాబాయి, మామల ఎడల కూడా పరదా పాటించే అనుమతి హజ్రత్ ఆయిషా (ర)కు ఇవ్వలేదు. సిహాహ్‌సిత్తా (ఆరు ప్రామాణిక హదీసు గ్రంథాల)లోను, ముస్నద్ అహ్మద్‌లోనూ హజ్రత్ ఆయిషా ఉల్లేఖనం ఒకటుంది. దాని ప్రకారం అబుల్ కుఅయిస్ సోదరులు అఫ్లహా వారి (ఆయిషా) ఇంటికి వచ్చి లోనికి ప్రవేశించే అనుమతి కోరారు. అప్పటికి పరదా ఆదేశాలు వచ్చేశాయి. కాబట్టి హజ్రత్ ఆయిషా (ర) అనుమతినివ్వలేదు. ఆయన, 'నీవు నా కూతురు వరస కావాలి, నీవు నా సోదరుడు అబుల్ కుఅయిస్ భార్య పాలు త్రాగావు' అని చెప్పి పంపారు. కాని హజ్రత్ ఆయిషాకు సంశయం ఉండింది. ఈ బంధుత్వంలో పరదా నియమాన్ని ఎత్తివెయ్యడం ధర్మసమ్మతం అన్నది నమ్మశక్యం కాలేదు. అంతలో ప్రవక్తశ్రీ విచ్చేశారు. ఆయన నీ వద్దకు రావచ్చు అని సెలవిచ్చారు. దీన్నిబట్టి, స్వయంగా ప్రవక్త మహనీయుల ప్రకారం కూడా ఈ ఆయత్‌కు అటువంటి అర్థం వర్తించదు, అంటే కేవలం ఇందులో ప్రస్తావన వచ్చిన బంధువుల ఎడలనే పరదా పాటించనవసరంలేదనీ, మిగతా వారందరి పట్ల పాటించాలి అనీ అర్థం రాదు.

ఆయన దీన్నిబట్టి ఓ నియమాన్ని గ్రహించారు. ఏ ఏ బంధువులతో స్త్రీ నికాహ్ నిషిద్ధమో వారంతా ఈ ఆయత్ ఆదేశం క్రిందికి వస్తారని భావించారు. ఉదాహరణకు, బాబాయి, మామ, అల్లుడు, పాలిచ్చిన బంధుత్వాలు వగైరా. తాబయీన్ (అనుచరుల)లో హసన్ బస్రీ కూడా ఇదే అభిప్రాయం వెలిబుచ్చారు. అల్లామా అబూ బక్ర్ జస్సాస్ కూడా దీన్ని తన కృతి 'అహ్కాముల్ ఖుర్ఆన్'లో సమర్థించారు. (సంపుటి 3, పుట 390)

రెండవ విషయం : ఏ బంధువుల ఎడల శాశ్వత నిషిద్ధమయిన బంధుత్వం లేదో (అంటే, ఒక కన్య లేదా వితంతువు పెళ్ళి ఎవరితో ధర్మసమ్మతమో) స్త్రీలు స్వేచ్ఛగా వారి సమక్షంలో తమ అలంకరణలు వ్యక్తపరచడానికి వారు అటు నిషిద్ధ బంధువుల క్రిందికీ రారు, లేదా స్త్రీలు పరపురుషులతో పరదా పాటించినట్లు పాటించడానికి పూర్తిగా అపరచితులూ కారు. ఈ రెండు అతి వాదాల మధ్యన సరిగ్గా ఎటువంటి వైఖరి నవలంబించాలి అన్న విషయాన్ని షరీఅత్ ఖచ్చితంగా నిర్ణయించలేదు; ఎందుకంటే దీన్ని నిర్ణయించడం సాధ్యపడదు. దీని పరిధులు విభిన్న బంధువుల విషయంలో వారి బంధుత్వం, వయసు, స్త్రీ వయసు, కుటుంబ సంబంధ బాంధవ్యాలు, ఆయా వ్యక్తుల పరిస్థితులు, (ఉదాహరణకు ఒకే ఇంటిలో నివసించడం, లేదా వేర్వేరు ఇండ్లల్లో నివసించడం), వంటి విషయాలను బట్టి తప్పనిసరిగా విభిన్నంగా ఉంటాయి, ఉండాలి కూడా. ఈ వ్యవహారంలో ప్రవక్త మహనీయులు (స) అవలంబించిన వైఖరినిబట్టి మనకు ప్రాప్తమయ్యే మార్గదర్శకత్వం ఇదే - అనేక హదీసుల ద్వారా రుజువయిన దాన్నిబట్టి, హజ్రత్ అస్మా బిన్తు అబీ బక్ర్, ప్రవక్త మహనీయులకు మరదలు. ఆమె ఆయన ఎదుట వచ్చేవారు. చివరి ఘడియ వరకు వారిరువురి మధ్య కనీసం ముఖం, ముంజేతుల వరకయితే ఎటువంటి పరదా లేదు. హజ్జతుల్ విదా, ప్రవక్త మహనీయులు పరమపదించడానికి కేవలం కొన్ని నెలల క్రితం జరిగిన ఘటన. అప్పుడు కూడా ఇదే స్థితి కొనసాగింది (అబూదావూద్, కితాబుల్ హజ్జ్, బాబుల్ ముహ్రిమ్, యుఅద్దిబు గులాము). అలాగే హజ్రత్ ఉమ్మెహానీ అబూ తాలిబ్ కూతురు, అంటే ప్రవక్త మహనీయులకు బాబాయి కూతురు. చివరి ఘడియ వరకు ప్రవక్తశ్రీ ఎదుటికి వచ్చేవారు. కనీసం ముఖం పరదాను ఆమె ఎన్నడూ పాటించలేదు. మక్కా విజయం సందర్భంలో జరిగిన ఒక సంఘటనను ఆవిడ స్వయంగా తెలిపారు. దాన్నిబట్టి ఈ విషయం రూఢీ అవుతుంది. (అబూ దావూద్, కితాబుస్సౌమ్, బాబ్ ఫిన్నియ్యతి ఫిస్సౌమ్ వర్రుఖ్సతుఫీహ్). మరో వైపున హజ్రత్ అబ్బాస్ తన కుమారుడు ఫజ్లనీ, రబీయ బిన్ హారిస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ (ప్రవక్త (స) కు సోదరుడు, స్వంత బాబాయి కుమారుడు) తన కుమారుడు అబ్దుల్ ముత్తలిబ్‌నీ ప్రవక్త మహనీయుల వద్దకు పంపించారు. పంపిస్తూ, 'మీరు ఇక యువకులయిపోయారు, మీకు ఏదయినా ఉపాధి ప్రాప్తం కానిదే మీ పెళ్ళిళ్ళు కాజాలవు, మీరు ప్రవక్త (స) వద్దకు వెళ్ళి ఏదయినా పని కోసం అభ్యర్థించండి' అన్నారు. వీరిరువురు హజ్రత్ జైనబ్ ఇంట ప్రవక్త (స) సన్నిధిలో హాజరయ్యారు. హజ్రత్ జైనబ్ ఫజ్లకు

స్వంత మేనత్తకూతురు. ఇంకా అబ్దుల్ ముత్తలిబ్ బిన్ రబీయాతో కూడా ఆవిడకు అదే బంధుత్వం. కాని ఆవిడ వారిరువురి ఎదుటికి రాలేదు, ప్రవక్తశ్రీ సమక్షంలో వారితో చాటుగా సంభాషించారు (అబూదావూద్, కితాబుల్ ఖరాజ్). ఈ రెండు విధాల సంఘటనలను కలిపి చూసినట్లయితే అర్థమయ్యే విషయం మేము పైన పేర్కొన్నదే.

మూడవ విషయం: బంధుత్వం అనుమానాస్పదమయిపోయినపుడు నిషిద్ధ బంధువు ఎడల కూడా పరదా పాటించడం ఉత్తమం. బుఖారీ, ముస్లిమ్, అబూదావూద్ ప్రకారం, విశ్వాసుల మాతృమూర్తి హజ్రత్ సౌదా సోదరుడు ఒకతను బానిస స్త్రీ సంతానం (అంటే ఆవిడ తండ్రి బానిసకు పుట్టినవాడు). అతన్ని గురించి ఉతబా తన సోదరుడు హజ్రత్ సఅద్ బిన్ అబీ వక్కాస్‌కు 'ఈ అబ్బాయిని నా తనయునిగా భావించి సంరక్షణ ఇవ్వాలి, ఎందుకంటే అతను నిజానికి నాకు పుట్టినవాడు' అని తన చివరి కోరికగా తెలిపాడు. ఈ కేసు ప్రవక్త మహనీయుల వద్దకు వచ్చింది. అప్పుడు ఆయన హజ్రత్ సఅద్ వాదాన్ని త్రోసిపుచ్చుతూ "బిడ్డ ఎవరి పడక మీద పుడుతాడో అతడికే చెందినవాడు, పోతే వ్యభిచారి విషయానికి వస్తే, అతనికి రాళ్ళూ రప్పలు ప్రాప్తమవుతాయి" అని అన్నారు. దానితోపాటు ఆయన (స) హజ్రత్ సౌదాకు, "ఈ అబ్బాయి పట్ల పరదా పాటించు" అని పురమాయించారు. ఎందుకంటే అతడు ఆవిడ సోదరుడన్న విషయం నిశ్చయంగా తేలలేదు.

43. మూలంలో نِسَآئِهِنَّ **'నిసాయిహిన్న'** అన్న పద ప్రయోగముంది. దాని శాబ్దిక అర్థం, "వారి స్త్రీలు" అన్నది. అంటే ఏ స్త్రీలను ఉద్దేశించడం జరిగిందో అది వేరే చర్చ. మొట్టమొదట గమనార్హమయిన అంశం, కేవలం 'స్త్రీలు' (అన్ నిసా) అన్న పదం ప్రయోగించబడలేదు. అలా జరిగి ఉంటే ముస్లిమ్ స్త్రీలు, సమస్త స్త్రీల ముందు, సకల రకాల స్త్రీల ముందు పరదాను వదలి తమ అలంకరణలను వ్యక్తం చెయ్యడం ధర్మసమ్మతం అయిపోయేది. కాని 'వారి స్త్రీలు' అని చెప్పి స్త్రీల స్వేచ్ఛా పరిధిని– ఆ పరిధి ఏదయినప్పటికీ – పరిమితం చెయ్యడం జరిగింది. పోతే ఆ పరిధి ఏదీ, 'వారి స్త్రీలు' అన్నది ఏ స్త్రీలకు వర్తిస్తుందీ అన్న ప్రశ్న వస్తుంది. దీని విషయంలో ఫికహ్‌వేత్తలు, వ్యాఖ్యాతల అభిప్రాయాలు విభిన్నంగా ఉన్నాయి :

ఒక వర్గం అభిప్రాయంలో ఇది కేవలం ముస్లిమ్ స్త్రీలకే ఉద్దేశించబడినది. ముస్లిమేతర స్త్రీలు, వారు జిమ్మీ స్త్రీలయినా, మరే విధమయిన వారయినాసరే, వారి ఎడల ముస్లిమ్ స్త్రీలు, పురుషుల పట్ల పాటించే విధంగానే పరదా పద్ధతిని పాటించాలి. ఇబ్ను అబ్బాస్, ముజాహిద్, ఇబ్ను జురైజ్ అభిప్రాయం ఇదే. వీరు తమ వాదనకు సమర్థనగా ఒక సంఘటనను పేర్కొంటారు. హజ్రత్ ఉమర్ (ర), హజ్రత్ అబూ ఉబైదాకు ఇలా వ్రాశారు, "ముస్లిముల స్త్రీలు కొందరు ముస్లిమేతర స్రీలతోపాటు (ప్రజా) స్నానాల గదులకు వెడుతున్నారని నేను విన్నాను. నిజానికి అల్లాహ్‌ను, అంతిమదినాన్నీ విశ్వసించే స్త్రీ శరీరంపైన దాని ధార్మిక సముదాయానికి చెందినవారి దృష్టి తప్ప

ఇతరుల దృష్టి పడటం ధర్మసమ్మతం కాదు." ఈ ఉత్తరం హజ్రత్ అబూ ఉబైదాకు అందినప్పుడు ఆయన ఎంతో ఆందోళన చెందారు. వ్యాకులతతో లేచి నిలబడి ఇలా పలికారు, "దైవమా, ఏ స్త్రీ అయితే కేవలం మేనిఛాయ తెల్లబడాలని ఈ స్నానాల గదులకు వెడుతుందో ఆమె ముఖం పరలోకంలో నల్లబడిపోవుగాక" (ఇబ్ను జరీర్, బైహకీ, ఇబ్ను కసీర్). మరో వర్గం, దీని ద్వారా సమస్త స్త్రీలను ఉద్దేశించడం జరిగిందని అభిప్రాయ పడింది. ఇమామ్ రాజీ దృష్టిలో సరయిన భావం ఇదే. కాని అర్థం కానిదల్లా, అల్లాహ్ దీనినే ఉద్దేశించినట్లయితే "వారి స్త్రీలు" అనవలసిన అవసరమేముంది? అలాంటప్పుడు కేవలం 'స్త్రీలు' అంటే సరిపోయేది గదా.

మూడవ అభిప్రాయం సమంజసమయినది, ఖుర్ఆన్ పదాలకు అత్యంత సమీపంగా కూడా ఉంది. దాని ప్రకారం, దీని ఉద్దేశం అసలు వారి దగ్గరి స్త్రీలు, కలిసిమెలిసి ఉండే సుపరిచితులయిన స్త్రీలు, వారితో దగ్గరి సంబంధంగల స్త్రీలు, పనిపాట్లల్లో భాగం పంచుకునే స్త్రీలు అన్నది. వారు ముస్లిములయినా ముస్లిమేతరులయినా ఒకటే. ఈ ఆదేశంలోని ఉద్దేశ్యం అపరిచితులు, నీతి నియమాలు, సభ్యతా సంస్కారాలను గురించి తెలియని స్త్రీలను, లేదా బాహ్యంలో అనుమానాస్పదమయిన స్త్రీలను, విశ్వస నీయులు కాని స్త్రీలను ఆ పరిధినుండి వేరుచేసి వెయ్యడం. ఈ అభిప్రాయాన్ని ప్రామాణికమయిన హదీసులు కూడా సమర్థిస్తున్నాయి. వాటిలో ప్రవక్త సతీమణుల వద్దకు జిమ్మీ స్త్రీల రాకపోకలను గురించి తెలుస్తోంది. ఈ వ్యవహారంలో గమనించవలసిన అసలు విషయం మతపరమయిన భేదం కాదు, నైతిక స్థితి. సౌజన్యశీలురు, లజ్జా వ్రతులు, ఉత్తమ శీల సంపదగల వారు, ప్రసిద్ధ విశ్వసనీయ కుటుంబాలకు చెందిన స్త్రీమూర్తులతో ముస్లిమ్ స్త్రీలు బాగా నిర్మొగమాటంగా వ్యవహరించవచ్చు, వారు ముస్లిమేతరులయినా సరే. కాని లజ్జా విహీనులు, మానహీనులు, దుశ్శీలురు, దుష్టస్వభావులయిన స్త్రీలు ముస్లిములయినా సరే, సౌజన్యశీలురయిన స్త్రీలు వారికి దూరంగా మెలగాలి, పరదా నియమాన్ని వారి ఎడల పాటించాలి. ఎందువల్లనంటే నీతి నియమాల రీత్యా వారి సాంగత్యం పరపురుషుల సాంగత్యం కన్నా ఎంతమాత్రం తక్కువ వినాశకరం కాదు. పోతే, మా దృష్టిలో అపరిచితులయిన స్త్రీల అసలు పరిస్థితులు తెలియనప్పుడు వారిని కలుసుకునే పరిమితి, నిషిద్ధం కాని బంధువర్గం సమక్షంలో అనుమతించబడిన మేరకే ఉండాలి. అంటే స్త్రీ కేవలం తన ముఖం చేతులు వారి సమక్షంలో తెరవవచ్చు, మిగతా శరీరమంతా, అలంకరణలన్నీ మరుగుపరచవలసి ఉంటుంది.

44. ఈ ఆదేశాన్ని అర్థం చేసుకోవడంలోనూ, ఫిక్హ్‌వేత్తల మధ్య అభిప్రాయ భేదం పొడసూపింది. ఒక వర్గం దీని ఉద్దేశం, ఒక స్త్రీ అధీనంలో ఉండే బానిస స్త్రీలని మాత్రమే అర్థం చేసుకుంది. వీరి దృష్టిలో దైవాదేశానికి భావం, బానిస స్త్రీ బహుదైవారాధకురాలయినా, గ్రంథవహుల్లోనిదయినా ముస్లిమ్ యజమానురాలు ఆమె సమక్షంలో తన అలంకరణనయితే వ్యక్తం చేయగలదు, కాని బానిస

పురుషుడు, స్త్రీకి అధీనంలో ఉండేవాడే అయినప్పటికీ పరదా వ్యవస్థ విషయంలో మటుకు అతను స్వేచ్ఛాయుత పురుషునితోనే సమానమయినవాడు. ఇది అబ్దుల్లా బిన్ మస్ఊద్, ముజాహిద్, హసన్ బస్రీ, ఇబ్ను సీరీన్, సయీద్ బిన్ ముసయ్యబ్, తావూస్, ఇమామ్ అబూ హనీఫా ప్రభృతుల అభిప్రాయం. దీన్ని సమర్థిస్తూ ఇమామ్ షాఫియీ కూడా పలికినట్లు ఒక సూక్తి ఉంది. ఈ మహనీయు లందరి వాదన ఏమిటంటే, బానిస పురుషునికి అతని యజమానురాలు నిషిద్ధం కాదు. బానిస స్వేచ్ఛను పొందినట్లయితే తన మాజీ యజమానురాలితో పెళ్ళి చేసుకోగలడు. అందువల్ల కేవలం అతని బానిసత్వం కారణంగా ఒక స్త్రీ అతని సమక్షంలో నిషిద్ధ పురుషుల ఎదుట సంచరించేలా స్వేచ్ఛగా సంచరించడం కుదరదు. పోతే 'తమ హస్తగతమయిన బానిసలు' అనే పదాలు బానిస స్త్రీ పురుషులిరువురికీ వర్తించినప్పుడు దాన్ని బానిస స్త్రీలకే ప్రత్యేకించడం దేనికీ అన్న ప్రశ్నకు వారు ఇలా సమాధానం ఇస్తారు: పదాలు సామాన్యమయినప్పటికీ సందర్భం వాటి భావాన్ని బానిస స్త్రీలకు ప్రత్యేకిస్తుంది. మొదట 'వారి స్త్రీలు' అనడం జరిగింది. ఆ తరువాతనే 'తమ హస్తగత మయిన బానిసలు' అనడం జరిగింది. 'వారి స్త్రీలు' అన్న పదాలు విన్నప్పుడు సాధారణంగా ఎవరయినా ఒక స్త్రీని కలుసుకునే బంధుగణంలో స్త్రీలని భావిస్తాడు. దీన్నిబట్టి బహుశా ఇందులో బానిస స్త్రీలు చేరి లేరేమో అన్న అనుమానం కలగవచ్చు. అందువల్ల 'తమ హస్తగతమయిన బానిసలు' అని చెప్పి విషయాన్ని స్పష్టపరచడం జరిగింది. స్వేచ్ఛాయుత స్త్రీల మాదిరిగానే బానిస స్త్రీల సమక్షంలోనూ అలంకరణలు వ్యక్తం చేయవచ్చు అని విడమర్చడం జరిగింది. ఇది వారి వాదన.

రెండవ వర్గం చెప్పేదేమిటంటే, ఈ అనుమతిలో బానిస స్త్రీ పురుషులిరువురూ చేరి ఉన్నారు. ఇది హజ్రత్ ఆయిషా, ఉమ్ము సలమ మరి కొందరు అహ్లుల్ బైత్ (ప్రవక్త ఇంటివారలయిన) ధర్మవేత్తల అభిమతం. ఇమామ్ షాఫియీ చెప్పినట్లు ప్రసిద్ధమయిన అభిప్రాయం కూడా అదే. వీరందరి వాదన కేవలం "హస్తగతమయిన బానిసలు" అన్న పదాల సర్వసాధారణతపై ఆధారభూతమయిందే కాదు, వారు సున్నత్ ద్వారా కూడా తమ వాదనకు సమర్థనగా నిరూపణలు చూపెడతారు. ఉదాహరణకు ఒక సంఘటన: ప్రవక్త మహనీయులు (స), ఒక బానిస అబ్దుల్లాహ్ బిన్ ముస్అదతల్ ఫజారీని తీసుకుని హజ్రత్ ఫాతిమా ఇంటికి వెళ్ళారు. అప్పుడు ఆవిడ కప్పుకున్న దుప్పటి తలకు కప్పుకుంటే కాళ్ళ దగ్గర సరిపోయేదికాదు, కాళ్ళను కప్పుకుంటే తల వద్ద సరిపోయేది కాదు. ప్రవక్త మహనీయులు (స) ఆవిడగారి తత్తరపాటు చూసి, "ఫరవాలేదు, ఇక్కడ కేవలం నీ తండ్రి, నీ బానిస మాత్రమే ఉన్నారు" (అబూ దావూద్, అహ్మద్, బైహకీ – అనస్ బిన్ మాలిక్); (ఇబ్ను అసాకర్ తన చరిత్ర గ్రంథంలో ఈ బానిసను గురించి వ్రాస్తూ ఇతన్ని ప్రవక్త మహనీయులు (స) హజ్రత్ ఫాతిమాకు ఇచ్చివేశారు. ఆమె అతన్ని పెంచి పోషించి, విడుదల చేశారు. కాని ఈ ఉపకారానికి అతను చేసిన ప్రత్యుపకారం ఏమిటంటే, సిఫ్ఫీన్ యుద్ధం – కాలంలో అతను హజ్రత్ అలీకి అత్యంత హేయమయిన

శత్రువుగా మారాడు, అమీర్ ముఆవియాకు సన్నిహితుడయ్యాడు). ఇంతేకాక వారు ప్రవక్త మహనీయుని ఒక సూక్తిని బట్టి కూడా వాదిస్తారు, "మీలో ఎవరయినా తమ బానిసతో 'ముకాతబత్' చేసుకుంటే, అతను కితాబత్ సొమ్ము చెల్లించే స్తోమత కలిగినవాడయితే ఇలాంటి బానిస పట్ల పరదా పాటించడం తప్పనిసరి" (అబూదావూద్, తిర్మిజి, ఇబ్ను మాజా– ఉమ్ము సలమ).

45. మూలంలోని అరబీ పదాలకు శబ్దానువాదం, "పురుషులలో, ఏ పురుషులయితే అధీనులయి ఉంటారో, ఇచ్ఛ కలిగి ఉండరో వారు." ఈ పదాలను బట్టి తెలిసేదేమిటంటే, నిషిద్ధ పురుషులు తప్ప ఇతర పురుషుల ఎదుట ఒక ముస్లిమ్ స్త్రీ తన అలంకరణలు వ్యక్తం చేయాలంటే అతనిలో రెండు లక్షణాలుండాలి: ఒకటి, అతను విధేయుడయి ఉండాలి, అంటే అధీనుడు, లోబడిన వాడయి ఉండాలి. రెండు, అతను ఇచ్ఛలేనివాడయి ఉండాలి, అంటే తన వయసు, లేదా శారీరక అయోగ్యత, మానసిక బలహీనత, లేదా బీదరికం దారిద్ర్యం, లేదా లొంగుబాటు కారణంగా ఇంటి యజమాని భార్య, కూతురు, చెల్లెలు లేదా తల్లి ఎడల ఏదయినా చెడు ఆలోచనకు తన మనసులో చోటు కల్పించలేని స్థితిలో ఉండాలి. ఈ ఆదేశాన్ని ఆజ్ఞాబద్ధత సంకల్పంతో, ఆజ్ఞోల్లంఘనకు దారులు వెదికే ఉద్దేశంతోకాక చదివినట్లయితే మొదటి చూపులోనే తెలుసుకుంటాడు, నేటి వెయిటర్లు, బట్లర్లు, డ్రైవర్లు, ఇతర యువకులయిన నౌకర్లు ఎంతసేపటికీ దీని క్రిందికిరారు అని. వ్యాఖ్యాతలు, ఫిక్హ్‌వేత్తలు దీనికి చెప్పిన భాష్యం ఒకసారి పరిశీలిస్తే పండితులు, ఈ పదాలకు ఏమని భావం గ్రహించారో తెలిసిపోతుంది:

ఇబ్ను అబ్బాస్: దీని ఉద్దేశం, అతిసాధారణ తెలివిలేనిదద్దమ్మ, అమాయకుడు, స్త్రీల ఎడల ఎలాంటి ఆసక్తిలేనివాడు.

కతాద: మీ చేతి క్రింది మనిషి, పొట్టకూటికోసం మీ పంచనపడి ఉండేవాడు.

ముజాహిద్: బలహీనుడు, కూటికోసం పడిగాపులు కాసేవాడు, స్త్రీలపై మోజులేనివాడు.

ష'బి : ఇంటి యజమానికి లొంగి, చేతి క్రింద ఆధారపడి ఉండేవాడు, స్త్రీలపైన దృష్టిసారించే ధైర్యం చాలనివాడు.

ఇబ్ను జైద్: ఒక కుటుంబంతోపాటు పడి ఉండేవాడు, ఆ యింటి మనిషిగా మారిపోయినవాడు; ఆ యింటనే పెంచబడి పోషించబడేవాడు; ఇంటి మహిళలపై దృష్టిలేనివాడు, దానికి సాహసించ లేనివాడు, తన కూడుకోసం అక్కడే వారి పంచన పడిఉండేవాడు.

తావూస్, జుహ్రీ: తెలివిలేని దద్దమ్మ, స్త్రీల పట్ల ఆసక్తీ ఆకర్షణ లేనివాడు, అలా సాహసమూ చేయలేనివాడు. (ఇబ్ను జరీర్: సంపుటి 18, పుట: 95, 96; ఇబ్ను కసీర్ సంపుటి 3, పుట 285)

ఈ వివరణలన్నింటికన్నా మరింత విశదమయిన వివరణ ప్రవక్త మహనీయుని కాలంలో సంభవించిన సంఘటన. దీన్ని బుఖారీ, ముస్లిమ్, అబూదావూద్, నసాయి, అహ్మద్ తదితర హదీసువేత్తలు హజ్రత్ ఆయిషా, ఉమ్ము సలమా (ర) ద్వారా ఉల్లేఖించారు. పవిత్ర మదీనా నగరంలో ఒక నపుంసకుడు ఉండేవాడు. అతన్ని పవిత్ర ప్రవక్త సతీమణులు, ఇతర స్త్రీలు కూడా "ఎటువంటి ఉద్దేశ్యం లేని పురుషుడు"గా పరిగణించి తమ ఇండ్లల్లోకి రానిచ్చేవారు. ఒక రోజున ప్రవక్త మహనీయులు (స) విశ్వాసుల మాతృమూర్తి హజ్రత్ ఉమ్ము సలమా (ర) ఇంటికి వెళ్ళినప్పుడు ఆయన అతన్ని హజ్రత్ ఉమ్ము సలమ సోదరుడు అబ్దుల్లా బిన్ అబీ ఉమయ్యాతో మాట్లాడుతూ ఉండగా విన్నారు. అతడు, ఆయనకు ఇలా చెబుతున్నాడు, "తాయిఫ్‌ని జయించినట్లయితే గైలాన్ సకఫీ కుమార్తె బాదియాని పొందకుండా ఉండరాదు." ఆ తరువాత అతను బాదియా అందచందాలను గురించి, శరీరం గురించి పొగడటం మొదలెట్టాడు, ఆమె మర్మావయవాల లక్షణాలు సయితం వివరించాడు. ప్రవక్త మహనీయులు (స) ఈ మాటలు విన్నప్పుడు అతనికి "దైవ విరోధీ, నీవు ఆమెలో నీ చూపుల్ని నాటి వేశావా?" అని మందలించారు. ఆ తరువాత ఆయన అతని ఎడల పరదా పాటించాలని ఆదేశించారు, ఇక మీదట ఇండ్లల్లోకి ప్రవేశించకూడదని పురమాయించారు. ఆ తరువాత అతన్ని మదీనా నుండి బహిష్కరించారు. ఇతర నపుంసకుల్ని సయితం ఇండ్లల్లో ప్రవేశించరాదని వారించారు. వాళ్ళను నపుంసకులని భావించి స్త్రీలు వారి పట్ల అజాగ్రత్తగా మసలు కునేవారు. వారేమో ఒక ఇంటి స్త్రీల వివరాలు పరపురుషులకు వివరించేవారు. దీన్నిబట్టి తెలిసేదేమిటంటే 'ఎటువంటి ఉద్దేశ్యం లేనివారు' అని చెప్పడానికి ఒక వ్యక్తి కేవలం శారీరకంగా చెడు పనికి అయోగ్యుడు కావడం ఒకటే సరిపోదు, అతనిలో అణిగి ఉన్న లైంగిక వాంఛలుండి, అతను స్త్రీల ఎడల ఆసక్తిగలవాడయి ఉన్నట్లయితే మటుకు అతడు అనేక ఉపద్రవాలకు మూలం కాగలడు.

46. అంటే ఎవరిలోనయితే ఇంకా లైంగిక భావాలు మేల్కొనలేదో వారు. ఈ నిర్వచనం మహా అయితే 10, 12 ఏళ్ళ బాలురికి వర్తిస్తుంది. ఇంతకన్నా అధిక వయస్సున్న బాలురు ప్రౌఢత్వం పొందకపోయినప్పటికీ వారిలో లైంగిక భావాలు జాగృతమవడం మొదలవుతుంది.

47. దైవప్రవక్త (స) ఈ ఆదేశాన్ని కేవలం ఆభరణాల ఝుంఝునారావం వరకు పరిమితం చేయలేదు. దీనిద్వారా ఒక సూత్రప్రాయమయిన నియమం అనువర్తింపజేశారు. చూపు మాత్రమే కాక ఇతర ఇంద్రియజ్ఞానాలను ప్రేరేపించే విషయాలు కూడా ఉద్దేశించబడ్డాయని, అల్లాహ్, స్త్రీలను అలంకారాల ప్రదర్శన నుండి వారించిన లక్ష్యానికి ఈ విషయాలు కూడా వ్యతిరేకమని అన్వయింపజేశారు. తదనుగుణంగా ఆయన స్త్రీలను సుగంధ పరిమళాలు పూసుకుని బయటికి వెళ్ళరాదని పురమాయించారు. హజ్రత్ అబూ హురైరా(ర) ఉల్లేఖనంలో ప్రవక్తశ్రీ ఇలా సెలవిచ్చారు: "దేవుని దాసీలయిన వారిని దేవుని మస్జిదుల్లోకి రాకుండా వారించకండి, అయితే వారు పరిమళాలు పూసుకుని రాకూడదు"

(అబూదావూద్, అహ్మద్). ఇదే విషయాన్ని తెలిపే మరో హదీసు ప్రకారం, ఒక స్త్రీ మస్జిద్ నుండి వెలుపలికి వెడుతూ ఉండగా హజ్రత్ అబూ హురైరా ఆమెకు సమీపంగా వెళ్ళారు. ఆమె సుగంధం పూసుకుని ఉన్నట్లు ఆయన గమనించారు. ఆయన ఆమెను ఆపి, "మహిమాన్విత దేవుని దాసురాలా, నీవు మస్జిద్ నుండి వస్తున్నావా?" అని అడిగారు. ఆమె అవునని చెప్పింది. ఆయన ఇలా చెప్పారు, "నేను నా ప్రియమయిన అబుల్ కాసిమ్ (ప్రవక్త అనుబంధనామం) (స) ఇలా బోధించగా విన్నాను, 'ఏ స్త్రీ అయితే సుగంధపరిమళాలు పూసుకుని మస్జిద్‌కు వస్తుందో ఆమె ఇంటికి వెళ్ళి (జనాబత్) పరిశుద్ధతకు చేసే గుస్ల్ చెయ్యనంత వరకు ఆమె నమాజ్ స్వీకరించబడదు" (అబూదావూద్, ఇబ్ను మాజా, అహ్మద్, నసాయి). అబూ మూసా అష్అరీ ప్రకారం ప్రవక్త మహనీయులు (స) ఇలా సెలవిచ్చారు, "ఏ స్త్రీ అయితే పరిమళాలు జనం ఆఘ్రాణించాలని సుగంధాన్ని పూసుకుని దారిలో నడుస్తుందో, ఆమె అలాంటిదీ ఇలాంటిదీ అన్నారు, అటువంటి స్త్రీని గురించి ఆయన చాలా కఠినమయిన పదాలు ప్రయోగించారు" (తిర్మిజీ, అబూ దావూద్, నసాయి). ఆయన స్త్రీలకు బోధించిన దాని ప్రకారం, "రంగు గాఢమయిందీ సుగంధం తేలికయిందీ అయిన పరిమళం స్త్రీలు వాడాలి" అని అన్నారు. (అబూదావూద్).

అలాగే, స్త్రీలు ఎలాంటి అవసరం లేకుండా తమ కంఠాన్ని పురుషులకు వినిపించడాన్ని కూడా ఆయన ఇష్టపడలేదు. అవసరం కలిగినప్పుడు మాట్లాడే అనుమతి అయితే స్వయంగా ఖుర్ఆన్‌లోనే ఉంది. ప్రవక్త మహనీయుల సతీమణులు స్వయంగా జనులకు ధార్మిక విషయాలు బోధించేవారు. కాని అవసరం లేనిచోట, ఎటువంటి ధార్మిక, నైతిక ప్రయోజనం లేనిచోట, స్త్రీలు తమ కంఠాన్ని పరపురుషులకు వినిపించడాన్ని అభిలషణీయంగా భావించబడలేదు. కనుక నమాజ్‌లో ఇమామ్ ఏదయినా మరిచిపోతే పురుషులు 'సుబహానల్లాహ్' అనాలని ఆదేశముంది కాని అదే స్త్రీలకయితే ఒక చెయ్యి మీద మరో చెయ్యికొట్టి ఇమామ్‌ని హెచ్చరించాలన్న నిర్దేశన ఉంది. (బుఖారీ, ముస్లిమ్, అహ్మద్, తిర్మిజీ, అబూదావూద్, నసాయి, ఇబ్నుమాజ)

48. అంటే ఈ వ్యవహారంలో ఇంత వరకూ చేస్తూ వచ్చిన తప్పులకు పొరపాట్లకు పశ్చాత్తాపంతో తౌబా చెయ్యండి, ముమ్ముందు కూడా తమ ఆచరణను, దైవం, దైవప్రవక్త ఇచ్చిన నిర్దేశాలకనుగుణంగా సంస్కరించుకోండి అని అర్థం.

49. ఈ సందర్భంలో, ఈ ఆదేశాలు అవతరించిన తరువాత ఖుర్ఆన్ నిజ సారాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రవక్త మహనీయులు (స) ఇస్లామీయ సమాజంలో అమలుపరచిన సంస్కరణల సంక్షిప్త రూపం కూడా ముందుంచడం భావ్యమని భావిస్తున్నాము:

(1) నిషిద్ధ బంధువులు లేనప్పుడు ఇతరుల్ని (వారు బంధువులే అయినప్పటికీ) ఒక స్త్రీని ఒంటరిగా కలవడాన్ని, ఆమెతోపాటు ఒంటరిగా కూచోడాన్ని వారించారు. హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా

ఉల్లేఖనం ప్రకారం ఆయన (స) ఇలా సెలవిచ్చారు: "ఏ స్త్రీల భర్తలు బయటనున్నారో వారి వద్దకు వెళ్ళకండి, ఎందుకంటే మీలో ప్రతి ఒక్కరిలోనూ షైతాన్ రక్తంలా ప్రవహిస్తూ ఉన్నాడు" (తిర్మిజీ). హజ్రత్ జాబిరే ఉటంకించిన మరో హదీసులో ప్రవక్తశ్రీ (స) ఇలా సెలవిచ్చారు, "ఏ వ్యక్తి అల్లాహ్‌ను, అంతిమ దినాన్నీ విశ్వసిస్తాడో అతడు, ఒక స్త్రీతో పాటు ఆమె నిషిద్ధ బంధువు ఉంటే తప్ప ఆమెను ఒంటరిగా కలువకూడదు, ఎందుకంటే అప్పుడు అక్కడుండే మూడవవాడు షైతాన్" (అహ్మద్). దాదాపు ఇదే అర్థంగల మరో ఉల్లేఖనం ఇమామ్ అహ్మద్ ఆమిర్ బిన్ రబీఅ చెప్పగా ఉటంకించారు. ఈ విషయంలో ప్రవక్త మహనీయులు (స) స్వయంగా తీసుకునే జాగ్రత్త ఎలా ఉండేదో గమనించండి. ఒకసారి రాత్రివేళ ఆయన (స) హజ్రత్ సఫియ్యాతోపాటు ఆమె ఇంటి వైపునకు వెడుతున్నారు. దారిలో ఇద్దరు అన్సారీలు కలిశారు. ఆయన వారిని ఆపి, "నాతోపాటు ఉన్న ఈమె నా భార్య సఫియ్యా" అని చెప్పారు. వారు, "సుబహానల్లాహ్, దైవ ప్రవక్తా, మీ విషయంలో కూడా ఎవరయినా అనుమాన పడగలరా?" అని విన్నవించుకున్నారు. దానికి ఆయన ఇలా సెలవిచ్చారు, "షైతాన్ మనిషిలో రక్తంలా ప్రవహిస్తూ ఉంటాడు. నాకో సంశయం కలిగింది. వాడు మీ మనస్సుల్లో ఏదయినా చెడు ఊహను నాటుతాడో ఏమోనని" (అబూ దావూద్, కితాబుస్సౌమ్).

(2) ఒక పురుషుని చెయ్యి ఏ పర స్త్రీ శరీరానికయినా తాకడాన్ని ఆయన (స) ధర్మసమ్మతం చెయ్యలేదు. ఆయన పురుషుల చేత 'బయత్' ప్రతిన చేయించేటప్పుడు వారి చెయ్యిని తన చేతిలో పట్టుకుని చేయించేవారు. కాని మహిళల చేత బయత్ చేయించేటప్పుడు ఈ పద్ధతిని ఆయన ఎన్నడూ అవలంబించలేదు. హజ్రత్ ఆయిషా (ర) ప్రకారం "ప్రవక్త మహనీయుల చెయ్యి ఎన్నడూ ఏ పరస్త్రీ శరీరాన్నీ ముట్టుకో లేదు. ఆయన (స) స్త్రీల చేత కేవలం నోటితోనే ప్రమాణం చేయించేవారు. వారు ప్రమాణం (ప్రతిన) చేసిన తరువాత ఇక పోవచ్చు. మీ 'బయత్' అయిపోయింది అని అనేవారు" (అబూదావూద్, కితాబుల్ ఖరాజ్).

(3) నిషిద్ధ పురుషుడు లేకుండా ఒంటరిగా లేదా పరపురుషునితో స్త్రీ ప్రయాణం చేయడాన్ని ఆయన(స) గట్టిగా వారించారు. బుఖారీ, ముస్లిమ్‌లలో ఇబ్ను అబ్బాస్ ఉల్లేఖనం ప్రకారం ప్రవక్తశ్రీ(స) తన ప్రసంగంలో "ఏ పురుషుడూ ఏ స్త్రీని ఆమెకు నిషిద్ధ బంధువు ఎవరూ ఆమెతోపాటు లేనప్పుడు ఏకాంతంలో కలువరాదు. ఏ స్త్రీ అయినా నిషిద్ధ బంధువుతోడుగా లేనిదే ప్రయాణం చేయరాదు" అని బోధించారు. ఒక వ్యక్తి లేచి నిలబడి, "నా భార్య హజ్‌కు వెడుతున్నది, మరి నా పేరేమో ఫలానా కార్యక్రమానికి వెళ్ళే వారిలో వ్రాయబడి ఉంది" అని అడిగాడు. దానికి ప్రవక్త మహనీయులు, "సరే అలా అయితే నీవు నీ భార్యతో హజ్‌కు వెళ్ళిపో" అని సెలవిచ్చారు. ఈ విషయాన్ని బోధించే అనేక హదీసులు, ఇబ్ను ఉమర్, అబూ

సయీద్ ఖుద్రీ, అబూ హురైరా (ర) ఉటంకించినవి ప్రామాణికమయిన హదీసు గ్రంథాల్లో ఉల్లేఖించబడి ఉన్నాయి. వాటిలో కేవలం ప్రయాణకాలం, లేదా ప్రయాణ దూరాలకు సంబంధించిన విభేదం కాన వస్తుంది. కాని ఒక విశ్వాసురాలయిన స్త్రీ, అల్లాహ్‌ను, అంతిమ దినాన్ని విశ్వసించే స్త్రీ, నిషిద్ధపురుషుడు లేనిదే ప్రయాణం చేయడం నిషిద్ధం అన్న విషయంలో ఏకాభిప్రాయం ఉంది. వాటిలో ఒక హదీసులో 12 మైళ్ళు లేదా దానికన్నా అధిక దూరం విషయంలో ఆంక్షలుంటే, మరొక దానిలో ఒక రోజు, ఇంకొక దానిలో ఒక దివా రాత్రులు, ఇంకొక దానిలో రెండు రోజులు, మరొక దానిలో మూడు రోజుల పరిమితి ఉంది. కాని ఈ విభేదం ఈ హదీసులను విశ్వసనీయం కావని నిర్ధారించదు. లేదా వీటిలో ఒక ఉల్లేఖనాన్ని మరొక దానిపైన ప్రాధాన్యతనిచ్చి దాన్నే చట్టబద్ధమయిన కాల పరిమాణంగా నిర్ణయించే ప్రయత్నం చేసే అవసరమూ లేదు. ఈ విభేదానికి సమంజసమయిన కారణం గోచరిస్తూనే ఉంది. విభిన్న సందర్భాలలో వ్యవహారం ఏ విధమయినదయి ఉంటే ప్రవక్తశ్రీ (స) సమక్షంలో అది ఎలా ముందుకు వస్తే అదే విధంగా ఆయన ఆదేశం ఇచ్చారు. ఉదాహరణకు ఒక స్త్రీ మూడు రోజుల ప్రయాణానికి బయల్దేరుతూ ఉండగా ఆమెను ఆయన మున్రహమ్ (నిషిద్ధ బంధువు) లేకుండా వెళ్ళరాదని చెప్పారు. మరొకామె ఒక రోజు ప్రయాణానికి వెడుతూ ఉండగా ఆయన ఆమెను సయితం ఆపేసి ఉంటారు. ఇందులో ప్రశ్నించే వారి విభిన్న పరిస్థితులు, వారిలో ప్రతి ఒక్కరికీ ఆయన వేర్వేరు సమాధానాలు ముఖ్యమయినవి కావు. అసలు విషయం ఆ నియమం; అది ఇబ్ను అబ్బాస్ ఉటంకించిన ఉల్లేఖనంలో వచ్చింది. అంటే ప్రయాణం, ప్రసిద్ధభావంలో ప్రయాణమనబడేది, అందులో నిషిద్ధపురుషుడు లేనిదే స్త్రీ ప్రయాణం చేయరాదు.

(4) ప్రవక్త మహనీయులు (స) స్త్రీ పురుషుల సమ్మిశ్రమాన్ని వారించడానికి క్రియాత్మకంగానూ ప్రయత్నం చేశారు, వాక్కు మూలంగానూ నిషేధించారు. ఇస్లామీయ జీవితంలో జుముఅ, జమాఅత్‌లకు గల ప్రాముఖ్యం విజ్ఞులయిన వారెవరికి తెలియనిది కాదు. జుముఅనయితే అల్లాహ్ స్వయంగానే విధిగా నిర్ణయించాడు. జమాఅత్ తోటి నమాజ్ ప్రాముఖ్యాన్ని తెలుసుకోవడానికి ఒక్క విషయం చాలు, ఒక వ్యక్తి నిష్కారణంగా మస్జిద్‌కు హాజరవకుండా తన ఇంటనే నమాజ్ చేసుకుంటే దైవప్రవక్త(స) సూక్తిననుసరించి అతని నమాజ్ అసలు స్వీకరించనేబడదు (అబూ దావూద్, ఇబ్ను మాజా, దార్‌కుత్నీ, హాకిమ్ - ఇబ్ను అబ్బాస్ ఉల్లేఖనం). కాని ప్రవక్త మహనీయులు స్త్రీలకు జుముఅ విధిలో వినాయింపునిచ్చారు (అబూదావూద్-ఉమ్మె అతియ్యా ఉల్లేఖనం; దార్‌కుత్‌ని, బైహకీ-జాబిర్ ఉల్లేఖనం; అబూ దావూద్, హాకిమ్- తారిక్ బిన్ షిహాబ్ ఉల్లేఖనం). జమాఅత్ తోటి నమాజ్ చెయ్యడాన్ని స్త్రీలకు తప్పనిసరి కాకపోవడమే కాక, దానికి అనుమతి

ఇస్తూ వారు రాదలిస్తే వారించకండి అనే పదాలను ఉపయోగించారు. దీనితో పాటు, వారికి ఇంట చేసే నమాజ్ మస్జిద్‌లో చేసే నమాజ్ కన్నా ఎంతో ఉత్తమమయినదని కూడా విశదపరిచారు. ఇబ్ను ఉమర్, అబూ హురైరా (ర)లు ఉల్లేఖించిన దాని ప్రకారం "అల్లాహ్ దాసీలను అల్లాహ్ గృహాల ప్రవేశం నుండి వారించకండి" అని ప్రవక్త ప్రబోధించారు (అబూ దావూద్). ఇబ్ను ఉమర్ తెలిపినట్లు ఇతర ఉల్లేఖనాలు ఈ పదాలలోనూ ఇంకా దాదాపు ఇలాంటి పదాలలోనే ఉన్నాయి; "స్త్రీలకు రాత్రివేళ మస్జిద్‌లకు వచ్చే అనుమతి నివ్వండి" (బుఖారీ, ముస్లిమ్, తిర్మిజీ, నసాయి, అబూ దావూద్). మరో ఉల్లేఖనం ఈ పదాలలో ఉంది: "మీ స్త్రీలను మస్జిదుల్లోకి రాకుండా ఆపకండి, అయితే వాళ్ళ ఇండ్లు వారికి ఉత్తమమయినవి" (అహ్మద్, అబూదావూద్). ఉమ్మె హుమైద్ సాయిదియా ఇలా చెప్పారు, "నేను, ప్రవక్తా, నాకు మీ వెనకాల నమాజ్ చెయ్యాలని చాలా ఆశ" అని వేడుకున్నాను. దానికి ఆయన, నీవు నీ గదిలో నమాజ్ చెయ్యడం మీ ఇంటి వరండాలో నమాజ్ చెయ్యడం కన్నా ఉత్తమమయింది; నీవు నీ ఇంటిలో నమాజ్ చేయడం మీ వీధి మస్జిద్‌లో చేసే నమాజ్ కన్నా ఉత్తమమయినది; నీవు నీ వీధి మస్జిద్‌లో నమాజ్ చెయ్యడం మీ ఊరి జామె మస్జిద్‌లో నమాజ్ చెయ్యడం కన్నా ఉత్తమమయింది అని సెలవిచ్చారు" (అహ్మద్, తబ్రాని). దాదాపు ఇలాంటి విషయమే తెలిపే ఉల్లేఖనాలు అబూదావూద్‌లో అబ్దుల్లా బిన్ మస్ఊద్ (ర) ఉటంకించినవి ఉన్నాయి. హజ్రత్ ఉమ్మె సలమ ఉల్లేఖనంలో ప్రవక్త మహనీయులు (స) ప్రయోగించిన పదాలు, "స్త్రీలకు అత్యుత్తమమయిన మస్జిదులు వారి ఇళ్ళల్లోని లోపలి గదులు" (అహ్మద్, తబ్రాని). కాని హజ్రత్ ఆయిషా బనీ ఉమయ్యా పరిపాలనా కాలం నాటి పరిస్థితుల్ని చూసి ఇలా పలికారు, "ప్రవక్త మహనీయులు (స) స్త్రీలు నేడు వ్యవహరిస్తున్న తీరు తెన్నులు చూసినట్లయితే, ఆరాధనాలయాల్లో బనీ ఇస్రాయీల్, స్త్రీల ప్రవేశాన్ని నిషేధించినట్లే ముస్లిమ్ స్త్రీలు మస్జిద్‌లకు రావడాన్ని నిషేధించేవారు" (బుఖారీ, ముస్లిమ్, అబూదావూద్). ప్రవక్త మస్జిద్ (మదీనా)లో దైవప్రవక్త (స) స్త్రీల ప్రవేశానికి వేరు ద్వారం ప్రత్యేకించారు. హజ్రత్ ఉమర్ (ర)తన పాలన కాలంలో ఆ దారి గుండా పురుషుల రాక పోకలను గట్టిగా నిషేధించారు (అబూదావూద్, బాబ్ ఈతిజాలు నిస్సాఅ ఫిల్ మసాజిద్; బాబ్ మాజాఅఫీ ఖురూజిన్నిసాఅ ఇలల్ మసాజిద్). జమాఅత్ తోటి చేసే నమాజుల్లో స్త్రీల పంక్తులు పురుషులకు వెనకాల ఉంచబడేవి; నమాజ్ ముగిసినప్పుడు ప్రవక్తశ్రీ సలామ్ పలికిన తరువాత కాస్సేపు ఆగిపోయేవారు, తద్వారా పురుషులు లేచి బయల్దేరేముందు స్త్రీలు లేచివెళ్ళిపోయే వారు (అహ్మద్, బుఖారీ – ఉమ్మె సలమ). ఆయన సూక్తి ఒకటి, "పురుషుల పంక్తుల్లో అన్నింటికన్నా ఉత్తమమయింది అన్నింటి కన్నా ముందుండేది, అత్యంత హీనమయింది అన్నింటికన్నా వెనుకటి (అంటే స్త్రీల పంక్తికి దగ్గరి) పంక్తి. స్త్రీల అత్యుత్తమ పంక్తి అన్నింటికన్నా

వెనుకటిది, మరి అతిహీనమయిన పంక్తి అన్నింటికన్నా ముందుండే (అంటే పురుషుల పంక్తికి దగ్గరి) పంక్తి (ముస్లిమ్, అబూదావూద్, తిర్మిజీ, నసాయి, అహ్మద్). రెండు పండుగల నమాజుల్లో మహిళలు పాల్గొనేవారు. వారు కూర్చునే స్థలం పురుషులకు వేరుగా ఉండేది. ప్రవక్త మహనీయులు పురుషుల వద్ద ప్రసంగం ముగించి స్త్రీల వైపుగా వెళ్ళి వేరుగా ప్రసంగించేవారు (అబూదావూద్–జాబిర్ బిన్ అబ్దుల్లా ఉల్లేఖనం; బుఖారీ, ముస్లిమ్–ఇబ్ను అబ్బాస్ ఉల్లేఖనం). ఒకసారి ప్రవక్త మస్జిద్‌కు ఆవల స్త్రీలు పురుషులు అంతా గడబిడ అయిపోయారని మహనీయ ముహమ్మద్ గమనించారు. అప్పుడు ఆయన స్త్రీలనుద్దేశించి, "మరలండి, మీరు రోడ్డుకు మధ్యన నడవటం భావ్యం కాదు, ఓరగా నడవండి" అన్నారు. ఈ మాటవినగానే స్త్రీలు ఓరగా గోడలకు అనుకుని నడవసాగారు (అబూదావూద్). ఈ ఆదేశాలను బట్టి స్త్రీ పురుషుల మిశ్రమ సమావేశాలు ఇస్లామ్ నైజానికి పూర్తిగా విరుద్ధమయినవని బోధపడుతోంది. దైవగృహంలో ఆరాధనా సందర్భాలలోనూ స్త్రీ పురుషులను కలవనివ్వని ధర్మం కాలేజీల్లోనూ, కార్యాలయాల్లోనూ, క్లబ్బుల్లోనూ సభలూ సమావేశాల్లోనూ కలవడాన్ని ధర్మబద్ధంగా పరిగణిస్తుందా?

(5) స్త్రీలు మితంగా అలంకరించుకోవడాన్ని ఆయన అనుమతి నివ్వడమేకాక, అనేక సందర్భాలలో స్వయంగా ఆయనే ప్రోత్సహించారు కూడా. అయితే అందులో హద్దులను అతిక్రమించడాన్ని చాలా కఠినంగా వారించారు. అరబ్బు స్త్రీలలో ఆ కాలంలో రివాజులోఉన్న అలంకరణల్లోని దిగువ విషయాలను ఆయన శాపార్హమైనవిగా, జాతుల వినాశ హేతువులుగా పేర్కొన్నారు: ● తమ తల వెంట్రుకల్లో ఇతర వెంట్రుకలను కలిపి వాటిని ఎక్కువ నిడువయినవిగా, దట్టమయినవిగా చూపే ప్రయత్నం చేయడం. ● శరీరంలోని విభిన్న భాగాలలో పచ్చలు పొడవటం, కృత్రిమ మచ్చలు సృష్టించటం. ● కనుబొమ్మల వెంట్రుకలు పీకి ప్రత్యేక రూపంలో మలచడం, ● ముఖం మీద నూనూగు ఉంటే దాన్ని పీకి తీర్చిదిద్దుకోవడం. పల్లను రుద్ది సన్నగా చేసుకోవటం, లేదా పల్ల మధ్యన కృత్రిమంగా సందు ఏర్పరచుకోవటం. ● కుంకుమం లేదా ఇతర కృత్రిమ పూతలతో ముఖానికి కృత్రిమ రంగు పులుముకోవడం. వీటికి సంబంధించిన ఆదేశాలు ఆరు ప్రామాణిక హదీసు గ్రంథా(సిహాహ్ సిత్తా)లలోనూ, ముస్నద్ అహ్మద్‌లోనూ హజ్రత్ ఆయిషా, హజ్రత్ అస్మా బిన్తు అబీ బక్ర్, హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్ఊద్, అబ్దుల్లా బిన్ ఉమర్, అబ్దుల్లా బిన్ అబ్బాస్, అమీర్ ముఆవియా (ర) ద్వారా విశ్వసనీయ ఆధారాలతో ఉల్లేఖించబడి ఉన్నాయి.

అల్లాహ్, అల్లాహ్ సందేశహరుల ఈ స్పష్టమయిన నిర్దేశాలను చూసిన తరువాత ఒక విశ్వాసికి మిగిలినవి రెండే మార్గాలు. ఒకటి, వీటిని అనుసరించాలి, తద్వారా తనను, తన ఇంటినీ, తన సమాజాన్నీ జీవితపు నైతిక ఉపద్రవాల నుండి పరిశుద్ధపరచుకోవాలి. ఆ ఉపద్రవాలను నివారించడానికే అల్లాహ్ ఖుర్ఆన్‌లోనూ, ఆయన సందేశహరుడు తన సంప్రదాయం (సున్నత్)

وَاَنْكِحُوا الْاَيَامٰى مِنْكُمْ وَالصّٰلِحِيْنَ مِنْ عِبَادِكُمْ وَاِمَآئِكُمْ ؕ اِنْ يَّكُوْنُوْا

فُقَرَآءَ يُغْنِهِمُ اللّٰهُ مِنْ فَضْلِهٖ ؕ وَاللّٰهُ وَاسِعٌ عَلِيْمٌ ﴿٣٢﴾ وَلْيَسْتَعْفِفِ

الَّذِيْنَ لَا يَجِدُوْنَ نِكَاحًا حَتّٰى يُغْنِيَهُمُ اللّٰهُ مِنْ فَضْلِهٖ ؕ

32 - 33... మీలో ఎవరయితే ఒంటరివారో[50] వారికి మీ బానిస స్త్రీలు, బానిస పురుషులలో సచ్ఛీలురయిన వారి[51]తో నికాహ్ చేసివేయండి.[52] వారు బీదవారయి ఉన్నా అల్లాహ్ తన అనుగ్రహంతో వారిని కలిమిగలవారుగా చేస్తాడు,[53] అల్లాహ్ ఎంతో విస్తృతి కలవాడు, అంతా తెలిసినవాడు. మరెవరయితే నికాహ్ అవకాశం పొందలేరో వారిని అల్లాహ్ తన అనుగ్రహంతో సంపన్నులుగా చేసేంత వరకు వారు సౌశీల్యతను అవలంబించాలి.[54]

లోనూ ఇంత వివరంగా ఆదేశాలు జారీ చేశారు. రెండు, లేకపోతే ఆ వ్యక్తి తన మానసిక దౌర్బల్యం చేత ఈ ఆదేశాలను లేదా వీటిలో దేన్నయినా ఉల్లంఘించినట్లయితే కనీసం దాన్ని అపరాధంగానే భావిస్తూ ఉల్లంఘించాలి, దాన్ని పాతకమని అంగీకరించాలి, అంతేగాని అనవసరపు వాదనలు చేసి పాపాన్ని పుణ్యంగా మార్చే ప్రయత్నం చేయరాదు. ఈ రెండు మార్గాలను వదలి ఎవరయితే ఖుర్‌ఆన్, సున్నత్‌ల స్పష్టమయిన ఆదేశాలకు వ్యతిరేకంగా పాశ్చాత్య సామాజిక వ్యవస్థలోని తీరు తెన్నులను అవలంబించడమే కాక అవే సరిగ్గా ఇస్లామ్ బోధనలని నిరూపించడానికి ప్రయత్నిస్తారో, మరెవరయితే బాహాటంగా, ఇస్లామ్‌లో అసలు పరదావ్యవస్థే లేదని వాదిస్తూ తిరుగుతారో వారు తాము చేసే పాపంపైన అవిధేయతలపైన అజ్ఞానం, ద్వంద్వనీతి, మొండితనం వంటి వాటిని సయితం అదనంగా చేర్చుకుంటారు. దాన్ని ప్రపంచంలోనూ సౌజన్యశీలుడయిన ఏ వ్యక్తీ గౌరవించలేడు, పరలోకంలోనూ దైవం దానికి మంచిస్థానం ఇస్తాడని ఆశించలేము. కాని ముస్లిములలో నయితే కపటులు, ద్వంద్వనీతిపరుల కన్నా నాలుగు ఆకులు ఎక్కువ చదివిన వారున్నారు. వీరు దైవం, దైవప్రవక్త ఇచ్చిన ఆదేశాలను తప్పుగా, తాము ముస్లిమేతర జాతుల నుండి నేర్చుకున్న పద్ధతులను సరయినవిగా, న్యాయవంతమయినవిగా భావిస్తారు. వీరు నిజానికి ముస్లిములు కారు, ఎందుకంటే ఇంతదూరం వెళ్ళినప్పటికీ వారు ముస్లిములే అయినట్లయితే ఇక ఇస్లామ్, తిరస్కారం, అన్న పదాలకే అర్థం లేదు. వీరు తమ పేర్లు మార్చుకుని, బహిరంగంగా ఇస్లామ్‌కు దూరమయి పోతే మేము వారి నైతిక సాహసాన్ని కొనియాడేవారము. కాని వారేమో ఇటువంటి అభిప్రాయాలతోటే ముస్లిములుగా ప్రకటించుకుంటూ తిరుగుతుంటారు. మానవుల ఇంతకన్నా నీచమయిన రకం

బహుశా ప్రపంచంలో మరేదీ కానరాదేమో. ఈ శీల స్వభావాల మనుషుల చేత, మోసం, దగా, వంచన, ద్రోహం ఏది జరిగినా అది ఆశించినదానికి వ్యతిరేకం కాదు.

50. మూలంలో ايامى **'అయామా'** అన్న పదం ప్రయోగించబడింది. దీనికి సాధారణంగా వితంతు స్త్రీలన్న అర్థం చెబుతారు. కాని వాస్తవానికి, ఇది, జతలేని స్త్రీ పురుషులందరికీ వర్తిస్తుంది. అయామా అన్నది'అయ్యిమ్'కు బహువచనం, ఇది భార్యలేని ప్రతి పురుషునికి, భర్తలేని ప్రతి స్త్రీకీ వాడతారు. అందువల్ల మేము దీన్ని 'ఒంటరివారు' అని అనువదించాము.

51. అంటే మీతోనూ సరయిన విధంగా ప్రవర్తించేవారు, ఇంకా తమ దాంపత్య జీవితాన్నీ సరిగ్గా నిర్వర్తించగల సామర్థ్యమూ వారికి ఉందని మీరు గ్రహించిన వారు అన్నమాట. తమ యజమాని ఎడల సక్రమంగా ప్రవర్తించని బానిస స్త్రీ పురుషులు, పెళ్ళి తరువాత తమ జీవన సహచారి ఎడల సవ్యంగా మసలుకోగలరని వారి నైజం దృష్ట్యా ఆశించడానికీ అవకాశం లేకపోతే వారి పెళ్ళి చేసే బాధ్యత యజమాని మీద వేయడం జరగలేదు. ఎందుకంటే పెళ్ళి జరిగిన పక్షంలో వారి వల్ల మరో వ్యక్తి జీవితం దుర్భరమయ్యే అవకాశముంది. ఇలాంటి ప్రతిబంధకం స్వేచ్ఛాయుత మనుషుల విషయంలో విధించబడలేదు. స్వేచ్ఛాయుత వ్యక్తి పెళ్ళిలో పాల్గొనే వ్యక్తి బాధ్యత వాస్తవంగా ఒక సలహాదారు, ఒక సహాయకుడు, ఒక పరిచయ సాధనం కన్నా అధికం కాదు. అసలు సంబంధం వధూవరుల ఆమోదం మీదనే ఆధారపడి ఉంటుంది. కాని బానిస స్త్రీ పురుషుల పెళ్ళి చేసే బాధ్యత పూర్తిగా వారి యజమానిది. యజమాని తెలిసీ ఒక అమాయక వ్యక్తి పెళ్ళి ఒక దుష్ట స్వభావి, దుష్టనైజం గల వ్యక్తితో చేయించినట్లయితే దాని చెడు ఫలితమంతా యజమాని మీదనే పడుతుంది.

52. ఇక్కడ ఆదేశ వాచకం చూసి పండితుల ఒక వర్గం ఇలా చెయ్యడం 'విధి' అని అభిప్రాయపడ్డారు. నిజానికి వ్యవహారం తీరునిబట్టి చూస్తే ఈ ఆజ్ఞ 'విధి' అయినది కాజాలదని ద్యోతకమవుతోంది. ఒక వ్యక్తి పెళ్ళి చెయ్యడం ఇతరులపైన 'విధి' కాజాలదన్న విషయం తెలుస్తూనే ఉంది. ఎవరి పెళ్ళి ఎవరితో చెయ్యడం విధి అవుతుంది? ఒకవేళ అది విధి అయిన పక్షంలో ఎవరి పెళ్ళి వ్యవహారం దృష్టిలో ఉందో ఆ వ్యక్తి పరిస్థితి ఏమిటీ? ఇతరులు తన పెళ్ళి ఎవరితో చెయ్యాలని నిర్ణయించినా తాను దాన్ని అంగీకరించవలసిందేనా? ఇలా చెయ్యడం అతని విధి అయితే తన పెళ్ళికి అతని ఇష్టాయిష్టాల ప్రమేయం లేదన్నమాట. మరి అతనికి నిరాకరించే హక్కు ఉన్నట్లయితే ఈ పెళ్ళి చేయించే బాధ్యత ఉందన్న వ్యక్తి తన బాధ్యతను ఎలా నిర్వర్తించగలడు? ఈ కోణాలను బాగా అర్థం చేసుకుని వాటిని దృష్టిలో ఉంచుకునే ఫిక్హ్‌వేత్తలు సర్వసామాన్యంగా వెలిబుచ్చిన అభిప్రాయం ప్రకారం దేవుని ఈ ఆదేశం, 'ఈ పనిని 'విధి'గా కాదు, అభిలషణీయం' అని నిర్ణయిస్తుంది. అంటే సాధారణంగా సమాజంలో మనుషులు అవివాహితులుగా ఉండిపోకుండా ముస్లిములు గమనిస్తూ ఉండాలి. కుటుంబంలోని వారు, మిత్రులు, పొరుగువారు, అందరూ ఈ విషయంలో ఆసక్తి కనబరచాలి, ఇంకా, అనాథలయిన వారి విషయంలో ప్రభుత్వం సహాయపడి ఈ పని నెరవేర్చాలి.

وَالَّذِيْنَ يَبْتَغُوْنَ الْكِتٰبَ مِمَّا مَلَكَتْ اَيْمَانُكُمْ فَكَاتِبُوْهُمْ

اِنْ عَلِمْتُمْ فِيْهِمْ خَيْرًا ۖ وَّاٰتُوْهُمْ مِّنْ مَّالِ اللّٰهِ الَّذِيْٓ اٰتٰىكُمْ ؕ

...33...మీకు హస్తగతమయి ఉన్న మీ బానిసలలో ఎవరయితే మిమ్మల్ని 'ముకాతబత్' కొరకు అర్థిస్తారో[55] వారితో ముకాతబత్ చేసుకోండి[56]– వారిలో మీకు మంచి అన్నది ఉన్నట్లు గోచరిస్తే.[57] ఇంకా అల్లాహ్ మీకు అనుగ్రహించిన సొమ్ములో నుంచి వారికీ ఇవ్వండి.[58]

53. పెళ్లి అయిన ప్రతి వ్యక్తిని అల్లాహ్ ధనవంతుడు చేసివేస్తాడని దీని భావం కాదు. దీని అసలు ఉద్దేశ్యం, జనులు ఈ వ్యవహారంలో మరీ లెక్కలు చూడటం భావ్యం కాదు అన్నది. ఇందులో అమ్మాయి కుటుంబీకులకు కూడా ఆదేశముంది. సద్వర్తనుడు, సౌజన్యవంతుడు వారి ఇంట పెళ్ళికి సందేశాన్ని పంపితే కేవలం అతని బీదరికాన్ని చూసి త్రోసిపుచ్చరాదు. అలాగే అబ్బాయి ఇంటి వారికీ ఉపదేశం ఉంది. ఒక యువకునికి కేవలం అతను ఇంకా ఏమీ సంపాదించడం లేదన్న కారణంచేత కూర్చోబెట్టకండి. యువకులకు కూడా హితవు ఉంది. ఇతోధిక సంపాదనా నిరీక్షణలో తమ పెళ్ళి విషయాన్ని అనవసరంగా దాటవేస్తూ ఉండకండి. ఎంతో కొంత ఆదాయముంటే చాలు, దైవంపైన భారం మోపి పెళ్ళి చేసుకోండి. పలుమార్లు, స్వయంగా పెళ్ళి వల్లనే మనిషి పరిస్థితులు చక్కబడతాయి. భార్య సహకారంతో ఖర్చుల్లో అదుపు ప్రాప్తమవుతుంది. బాధ్యతలు నెత్తిన పడితే మనిషి స్వయంగా మునుపటికన్నా అధికంగా పరిశ్రమిస్తాడు, ప్రయత్నాలు చేస్తాడు. భార్య ఆర్థిక వ్యవహారాలలోనూ చేయూత అందివ్వవచ్చు. అన్నింటికన్నా ముఖ్యంగా, భావిలో ఎవరికి ఏది వ్రాసి పెట్టి ఉందో ఎవరికీ తెలియదు. మంచి పరిస్థితులు దుస్థితులుగానూ, దుస్థితి మంచి పరిస్థితులుగానూ మారే అవకాశముంది. అందువల్ల మనిషి అవసరాన్ని మించి లెక్కలు చూడటాన్ని మానివెయ్యాలి.

54. ఈ ఆయత్‌లను అత్యుత్తమంగా వ్యాఖ్యానించినవి ప్రవక్త మహనీయులు (స) ప్రవచించిన హదీసులు. హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్ఊద్ ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా బోధించారు, "యువకుల్లారా! మీలో ఎవరు పెళ్ళి చేసుకోగలుగుతారో అతను పెళ్ళి చేసుకోవాలి. అది దృష్టిని దుర్వర్తననుండి కాపాడుతుంది, మనిషి సౌశీల్యతను నిలబెట్టడానికి పెద్దసాధనం. మరెవరికయితే ఆ స్తోమతలేదో వారు రోజా (ఉపవాస) వ్రతాలు పాటించాలి, ఉపవాసవ్రతం మనిషిలోని సహజ ఉద్రేకాలను అదుపు చేస్తుంది" (బుఖారీ, ముస్లిమ్). ప్రవక్తశ్రీ (స) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబూ హురైరా ఉల్లేఖించారు, "ముగ్గురు వ్యక్తులకు సహాయం చేయడం అల్లాహ్ బాధ్యత. ఒకడు, తాను సౌశీల్యవంతంగా ఉండటానికి నికాహ్ చేసుకునేవాడు; రెండవతను, (తన విడుదల కోసం ఒప్పందం చేసుకుని) ధనం

చెల్లించే సంకల్పం చేసుకున్న బానిస (ముకాతిబ్); మూడవ వ్యక్తి, దైవమార్గంలో నిరంతర కృషి జిహాద్ కోసం బయలుదేరినవాడు" (తిర్మిజీ, నసాయి, ఇబ్నుమాజా, అహ్మద్). మరిన్ని వివరాలకు చూడండి, ఖుర్ఆన్ అవగానం సం.2, అన్ నిసా: 25).

55. 'ముకాతబత్' అన్న పదానికి వ్రాతమూలకంగా ఒప్పందం చేసుకోవడం అని అర్థం. కాని పరిభాషలో బానిస స్త్రీ పురుషులు తమ స్వేచ్ఛ (విడుదల) కోసం తమ యజమానికి కొంత ప్రతిమూల్యం చెల్లించేందుకు అంగీకరించగా యజమాని దాన్ని ఆమోదిస్తే ఉభయుల మధ్య జరిగే వ్రాత మూలకమయిన ఒప్పందం అని అర్థం. ఇస్లామ్‌లో బానిసల విడుదలకు ప్రతిపాదించిన విభిన్న విధానాలలో ఇదొకటి. ఆ ప్రతిమూల్యం ధన రూపంలోనే ఉండనవసరంలేదు. యజమానికి ఏదయినా ప్రత్యేక సేవ అందజేయడం కూడా ప్రతిమూల్యం కావచ్చు, ఉభయులు ఆమోదిస్తే. ఒప్పందం కుదిరిన తరువాత యజమానికి స్వేచ్ఛా ప్రయత్నంలో అవాంతరాలు సృష్టించే హక్కు ఉండదు. అతను బానిసకు ఒప్పందపు సొమ్ము సిద్ధపరిచే అవకాశాన్ని ఇవ్వాలి. నిర్ణీత కాలంలో బానిస తన బాధ్యతలోని ధనమో సేవనో అందజేసినట్లయితే అతన్ని విడుదల చేసివేయాలి. హజ్రత్ ఉమర్ పరిపాలనా కాలంలో జరిగిన ఒక సంఘటన. ఒక బానిస తన యజమానురాలితో ఒప్పందం చేసుకుని నిర్ణీత వ్యవధికి ముందే ఒప్పుకున్న ధనం చెల్లించేందుకు ఆమె వద్దకు వెళ్ళాడు. యజమానురాలు నేను ఒకేసారి తీసుకోను; నెలసరిగా, సాలువారీగా తీసుకుంటాను అని చెప్పి పంపివేసింది. బానిస వచ్చి మహనీయ ఉమర్‌కి నివేదించుకున్నాడు. ఆయన "ఈ డబ్బు బైతుల్‌మాల్ (ప్రభుత్వ ధనాగారం, ట్రెజరీ)లో జమ చేసివెయ్యి, వెళ్ళు ఇక నీవు స్వతంత్రుడివి" అని పురమాయిం చారు. తరువాత యజమానురాలికి, నీ డబ్బు ఇక్కడ భద్రంగా ఉంది. ఇప్పుడు నీవు ఒకేసారి తీసుకోవచ్చు లేదా మేము నీకు సాలువారిగా లేదా నెలసరిగా అందచేస్తూ ఉంటాము, అని చెప్పి పంపారు. (దార్‌కుత్ని – అబూ సయీద్ మక్బరవీ ఉల్లేఖనం).

56. కొందరు ఫిక్‌హ్‌వేత్తల వర్గం ఈ ఆయత్ భావాన్ని గ్రహించిన దాని ప్రకారం, ఒక బానిస స్త్రీ లేదా పురుషుడు ముకాతబత్‌ను అభ్యర్థించినట్లయితే యజమాని దాన్ని స్వీకరించడం విధి. ఈ అభిప్రాయం, అతా, అమ్ర్ బిన్ దీనార్, ఇబ్ను సీరీన్ మస్రూక్, జహ్హాక్, ఇక్రిమ, జాహిరియ, ఇబ్ను జరీర్, తబ్రీలకు చెందినది. ఇమామ్ షాఫియీ కూడా మొదట్లో ఇదే అభిప్రాయం కలిగి ఉండేవారు. రెండవ వర్గం అభిప్రాయంలో ఇది విధి కాదు, అభిలషణీయం, పుణ్యప్రదం. ఈ వర్గంలో షఅబీ, ముకాతిల్ బిన్ హయ్యాన్, హసన్ బస్రీ, అబ్దుర్రహ్మాన్ బిన్ జైద్, సుఫ్యాన్ సౌరి, అబూ హనీఫా, మాలిక్ బిన్ అనస్ వంటి మహనీయులున్నారు. చివరిలో ఇమామ్ షాఫియీ కూడా దీన్ని ఆమోదిం చారు. మొదటి వర్గం అభిప్రాయాన్ని రెండు విషయాలు సమర్థిస్తున్నాయి. ఒకటి, ఆయత్ పదాలు, کَاتِبُوهُمْ **'కాతిబూహుమ్'** (వారితో ముకాతబత్ చేయించుకోండి) అన్నవి. ఈ పదాలు స్పష్టంగా చెబుతున్నాయి, ఇది అల్లాహ్ ఆదేశమని. మరో విషయం విశ్వసనీయ ఉల్లేఖనాల ద్వారా రుజువయిన దొకటుంది. ప్రఖ్యాత హదీసువేత్త, ఫిక్‌హ్‌వేత్త మహనీయ ముహమ్మద్ బిన్ సీరీన్ తండ్రి 'సీరీన్' తన యజమాని హజ్రత్ అనస్‌ని ముకాతబత్ కొరకు అభ్యర్థించగా దాన్ని అంగీకరించడానికి ఆయన

నిరాకరించారు. అప్పుడు సీరీన్ హజ్రత్ ఉమర్ (ర) వద్దకు వెళ్ళారు. ఆయన జరిగినదంతా విని కొరడా చేత పట్టుకుని హజ్రత్ అనస్‌పైన మండిపడ్డారు, "ముకాతబత్ చేసుకోవాలన్నది అల్లాహ్ ఆదేశం" అని పురమాయించారు (బుఖారీ). ఈ సంఘటనను పురస్కరించుకుని ఇది మహనీయ ఉమర్ (ర) వ్యక్తిగత చర్యకాదు, ఇది సహాబా (సహచరుల) సమక్షంలో జరిగింది. గనక దాని పట్ల ఎవ్వరూ విభేదాన్ని వ్యక్తం చేయలేదు, అందువల్ల ఇది ఈ ఆయత్‌కు ప్రామాణికమయిన టీకా అని అంటారు. రెండవ వర్గం చెప్పేదేమిటంటే, అల్లాహ్ కేవలం "వారితో ముకాతబత్ చేసుకోండి" అని మాత్రమే అనలేదు, "మీకు వారిలో మంచి అన్నది ఉన్నట్లు గోచరిస్తే" అనే నిర్బంధాన్నీ పెట్టాడు. ఈ మంచిని గాంచే నిర్బంధం యజమాని అభిప్రాయంపైన ఆధారపడి ఉంది. దీనికి ఒక నిర్ణీత ప్రమాణమంటూ ఏదీ లేదు, దాన్ని ఏ న్యాయస్థానమూ పరిశీలించజాలదు. చట్టపరమయిన ఆదేశాల స్థానం ఇలా ఉండదు. అందువల్ల ఈ ఆదేశాన్ని హితవు, ఉపదేశం అనే భావంలోనే గ్రహించాలి, చట్టపరమయిన ఆదేశంగా కాదు. సీరీన్ దృష్టాంతాన్ని గురించి వారు చెప్పేదేమిటంటే, ఆ కాలంలో ముకాతబత్ కోసం అభ్యర్థించిన బానిస ఎవరో ఒక్కరు మాత్రమే ఉండరు కదా. వేలాది బానిసలు ప్రవక్త కాలంలోనూ సన్మార్గగాములయిన ఖలీఫాల కాలంలోనూ ఉన్నారు. అనేక మంది ముకాతబత్ కొరకు దరఖాస్తు పెట్టుకున్నారు. సీరీన్ సంఘటన తప్ప ఒక యజమానికి న్యాయస్థాన ఆదేశం మేరకు ముకాతబత్ చేసుకునే ఆదేశం ఇచ్చి నిర్బంధించినట్లు మరే దృష్టాంతమూ మనకు కానరాదు. అందువల్ల మహనీయ ఉమర్ తీసుకున్న ఈ చర్యను న్యాయస్థాన ఆదేశంగా కాక మరో అర్థంలో గ్రహించాలి. ఆయన ముస్లిముల మధ్య కేవలం న్యాయమూర్తి మాత్రమేకాదు, సముదాయంలోని వ్యక్తులతో ఆయన సంబంధం తండ్రీ సంతానం వంటిది. అనేక పర్యాయాలు ఆయన అనేక వ్యవహారాలలో జోక్యం చేసుకునేవారు, ఆ వ్యవహారాలలో ఒక తండ్రి మాత్రమే జోక్యం చేసుకోగలడు కాని ఒక న్యాయస్థాన అధికారి జోక్యం చేసుకోలేడు, ఇదీ అలాంటిదే.

57. "మంచి" అంటే మూడు విషయాలు ఉద్దేశించబడ్డాయి.

ఒకటి, బానిసలో ఒప్పందం ప్రకారం సొమ్ము చెల్లించే సామర్థ్యం ఉండాలి. అంటే అతను సంపాదించి, లేదా పరిశ్రమించి తన విడుదలకు పరిహారం చెల్లించగలగాలి. ఒక హదీసులో ప్రవక్త మహనీయులు ఇలా సెలవిచ్చారు, "అతను సంపాదించగలుగుతాడని అనుకుంటే ముకాతబత్ చేసుకోండి; అతన్ని జనుల్లో భిక్షాటన కోసం వదలిపెట్టడం జరుగరాదు" (ఇబ్ను కసీర్ – అబూదావూద్ ఉల్లేఖనం).

రెండు, అతని మాటను నమ్మి ఒప్పందం చేసుకునేందుకు అతనిలో విశ్వసనీయత, నిజాయితీ ఉండాలి. అతను ముకాతబత్ చేసుకుని యజమాని సేవ నుండి విడుదల పొంది ఆ తరువాత సంపాదించినదేదో తిని, త్రాగి కాజెయ్యడం జరగరాదు."

మూడు, అతనిలో చెడు స్వభావాలు ఆలోచనలు, ఇస్లామ్, ముస్లిములకు వ్యతిరేకంగా వైషమ్యం వల్ల దుష్టభావాలు ఉండి అతని స్వేచ్ఛ వల్ల ముస్లిమ్ సముదాయానికి ప్రమాదం కలిగే ఆశంక ఉన్నట్లు యజమానికి అనిపించరాదు. మరో మాటలో చెప్పాలంటే, అతను ముస్లిమ్ సముదాయానికి ఒక ఉత్తమ స్వేచ్ఛాయుత పౌరుడుగా రూపొందాలే తప్ప పక్కలో బల్లెంలా తయారవరాదు. మరో విషయం కూడా ఇక్కడ గుర్తుంచుకోవాలి. వ్యవహారం యుద్ధ ఖైదీలకు సంబంధించినది కూడా ఇక్కడ వస్తుంది. వారి విషయంలో ఈ జాగ్రత్తలు తీసుకోవడం మరీ అవసరం.

58. ఇది సర్వసాధారణ ఆదేశం, దీని సంబోధితులలో యజమానులు, సామాన్య ముస్లిములు, ఇస్లామీయ రాజ్యం కూడా ఉన్నాయి.

ఒప్పందం సొమ్ములో ఎంతో కొంత మాఫీ చేయాలని యజమానులకు ఆదేశం. కాగా సహచర మహనీయులు తమ ముకాతబు (బానిస)లకు ఒప్పందం సొమ్ము చాలా మటుకు మాఫీ చేసేవారు. హజ్రత్ అలీ (ర) అయితే సదా 1/4 భాగం మాఫీ చేసేవారు, దాన్ని ఇతరులకూ బోధించేవారు (ఇబ్నుజరీర్).

సామాన్య ముస్లిములకూ నిర్దేశన ఉంది. ముకాతబ్ (ఒప్పందం చేసుకున్న బానిస)లు తమ ఒప్పందపు రొఖ్ఖం చెల్లించడానికి వారి సహాయాన్ని అర్థిస్తే మనసారా వారికి సహాయం అందజేయాలి. దివ్యఖుర్ఆన్‌లో జకాత్‌కు సంబంధించిన ఖర్చు పద్దులు పేర్కొనబడ్డాయి. వాటిలో ఒకటి "మెడలను బానిసత్వ బంధనాల నుండి విడుదల చేయించడం" (తౌబా : 60) కూడా ఉంది. దైవం దృష్టిలో "మెడను బానిసత్వ బంధనాల నుండి విముక్తి కలిగించడం" (అల్ బలద్ : 13) ఎంతో పుణ్యప్రదమయిన పని. ఒక హదీసులో ఉంది, ఒక పల్లెవాసి వచ్చి ప్రవక్త మహనీయుని, "స్వర్గప్రవేశం కల్పించే ఆచరణను నాకు తెలుపండి" అని విన్నవించుకున్నాడు. ప్రవక్తశ్రీ(స) అతనికి "అతి క్లుప్తమయిన మాటల్లో నీవు ఎంతో పెద్ద మాటను అడిగావు. బానిసని విడుదల చెయ్యి, బానిసలు స్వేచ్ఛ పొందడంలో సహాయపడు, ఎవరికయినా ఏదయినా పశువునిస్తే బాగా పాలు ఇచ్చే పశువునివ్వు, నీ బంధువు నీ ఎడల దౌర్జన్యం చేస్తే అతని ఎడల సద్వర్తన పాటించు, ఇలా చెయ్యలేకపోతే ఆకలి గొన్న వానికి అన్నం పెట్టు, దప్పిగొన్నవానికి నీరు అందజెయ్యి, మంచిని ఉపదేశించు, చెడును వారించు; ఇదీ చెయ్యలేకపోతే నీ నోటిని అదుపులో ఉంచుకో, నోరు విప్పితే మంచి కోసమే విప్పు, లేకపోతే మూసి పెట్టుకో" అని ఉద్బోధించారు (బైహకీ ఫీ షుఅబల్ ఈమాన్-అన్‌బరా'బిన్ ఆజిబ్).

ఇస్లామీయ రాజ్యానికి కూడా ఆదేశముంది. బైతుల్‌మాల్ (ప్రభుత్వ ధనాగారం)లో ప్రోగయ్యే జకాత్ ధనంలో ఒప్పందం చేసుకున్న బానిసల విడుదలకు ఒక భాగాన్ని కేటాయించాలి.

ఈ సందర్భంలో ఒక విషయం ప్రస్తావించవలసి ఉంటుంది. ప్రాచీన కాలంలో బానిసలు మూడు

విధాలుగా ఉండేవారు. ఒకటి యుద్ధ ఖైదీలు. రెండు, స్వేచ్ఛాయుత మనుషుల్ని పట్టి అమ్మగా బానిసలైనవారు. మూడు, తరతరాలుగా బానిసలుగా వచ్చేవారు, వీరి తాతముత్తాతలు ఎప్పుడు బానిసలయ్యారో, పై రెండు విధాల బానిసల్లో వారు ఏ కోవకు చెందినవారయి ఉంటారో ఎవరికీ తెలియదు. ఇస్లామ్ ఆవిర్భావకాలంలో అరేబియాలోనూ, అరబ్బేతర దేశాలలోనూ ప్రపంచ సమాజంలో అంతటా ఈ మూడు రకాల బానిసలు ఉండేవారు. ఆర్థిక, సామాజిక వ్యవస్థ అంతా శ్రామికులు, నౌకరులకన్నా అధికంగా ఈ బానిసలపైనే ఆధారపడి నడిచేది. ఇస్లామ్ దృష్టిలో మొదటి ప్రశ్న మొదటి నుంచి బానిసలుగా వస్తున్న వారిని ఏమి చెయ్యాలి అన్నది. రెండవ ప్రశ్న భావిలో ఈ బానిసత్వపు సమస్యకు పరిష్కారం ఏమిటీ? అన్నది. మొదటి ప్రశ్నకు సమాధానంగా ఒక్కసారిగా పూర్వం నుంచీ వస్తున్న బానిసలందరిపైనుంచి యజమానుల హక్కును రద్దుపరచి స్వేచ్ఛనివ్వలేదు ఇస్లామ్. అలా చేసి ఉంటే మొత్తం సామాజిక, ఆర్థిక వ్యవస్థ స్తబ్ధతకు లోనయిపోయేది. అరేబియాలో అమెరికాకన్నా వినాశకరమయిన అంతర్యుద్ధం మొదలయ్యేది. అప్పటికీ సమస్య పరిష్కారమయ్యేది కాదు; అమెరికాలోనూ అది పరిష్కారం కాలేదు, నల్లజాతీయు (Negroes)ల పరాభవం సమస్య అలాగే మిగిలిపోయింది. తెలివిలేని ఆ సంస్కరణా విధానాన్ని కాదని ఇస్లామ్ "మెడలను విడుదల చేసే" ఒక బలవత్తరమయిన నైతిక ఉద్యమాన్ని ప్రారంభించింది. ఉపదేశం, హితవు గరపటం ద్వారా, ధార్మిక ప్రేరణల ద్వారా, ధార్మిక ఆదేశాలు, దేశ చట్టాల ద్వారా జనులు పరలోక మోక్షం కొరకు ఇష్టపూర్వకంగా బానిసల్ని విడుదల చేయాలని కోరింది. లేదా తమ అపరాధాల మన్నింపునకై ప్రాయశ్చిత్తంగా ధార్మిక ఆదేశాలకనుగుణంగా వారిని విడుదల చేయాలని అభిలషించింది; లేదా ప్రతిమూల్యంగా కొంతసొమ్ము తీసుకుని విడుదల చేయడం జరిగేలా చూసింది. ఈ ఉద్యమం క్రింద స్వయంగా ప్రవక్త మహనీయులు (స) 63 మంది బానిసల్ని విడుదల చేశారు. ఆయన సతీమణుల్లో కేవలం ఒక్క మహనీయ ఆయిషా విడుదల చేయించిన బానిసల సంఖ్య 67. ప్రవక్తశ్రీ (స) బాబాయి హజ్రత్ అబ్బాస్ (ర) తన జీవితంలో 70 మంది బానిసల్ని విడుదల చేశారు. హకీమ్ బిన్ హిజామ్ 100 మందిని, అబ్దుల్లా బిన్ ఉమర్ వెయ్యి మందిని, జుల్‌కిలా'అ హిమ్‌యిరీ 8000 మందిని, అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ ముప్పయి వేల మందిని విడుదల చేశారు. ఇలాంటి ఉదాహరణలే ఇతర సహచరుల జీవితాలలోనూ లభిస్తాయి. వారిలో హజ్రత్ అబూ బక్ర్, హజ్రత్ ఉస్మాన్ పేర్లు చాలా ప్రసిద్ధమయ్యాయి. దైవప్రసన్నత పొందాలన్న ఆసక్తి అభిరుచి సర్వసాధారణంగా అందరినీ ఉత్సాహపరిచేది. దాని మూలంగా జనం అత్యధికంగా స్వయంగా తమ బానిసల్ని విడుదల చేసేవారు, ఇతరుల నుండి బానిసల్ని కొని వారికి స్వేచ్ఛనిచ్చేవారు. ఈ విధంగా మునుపటి బానిసల విషయంలో, సన్మార్గగాములయిన ఖలీఫాల కాలం ముగిసే లోపునే దాదాపు అందరూ విడుదలయిపోయారు.

పోతే, మిగిలింది భావిలో ఉత్పన్నమయ్యే సమస్య. దీనికి ఇస్లామ్, ఒక స్వేచ్ఛాయుత మనిషిని పట్టి

وَلَا تُكْرِهُوْا فَتَيٰتِكُمْ عَلَى الْبِغَآءِ اِنْ اَرَدْنَ تَحَصُّنًا لِّتَبْتَغُوْا عَرَضَ الْحَيٰوةِ
الدُّنْيَا ۗ وَمَنْ يُّكْرِهْهُّنَّ فَاِنَّ اللّٰهَ مِنْۢ بَعْدِ اِكْرَاهِهِنَّ غَفُوْرٌ رَّحِيْمٌ ﴿٣٣﴾

...33 మీ బానిస స్త్రీలను మీ ప్రాపంచిక ప్రయోజనాల కొరకు వేశ్యావృత్తికి బలవంత పెట్టకండి– స్వయంగా వారు శీలవతులయి ఉండగోరినప్పుడు;[59] మరెవరయినా వారిని బలవంతపెడితే, నిశ్చయంగా అల్లాహ్ ఈ బలవంతం తరువాత వారిని క్షమించేవాడు, కరుణించేవాడు.

బానిసగా చేసి అమ్మడాన్నీ కొనడాన్ని ధర్మం రీత్యా హరామ్, చట్టం రీత్యా నిషిద్ధంగా ప్రకటించింది, ఇలా ఆ దారిని మూసివేసింది. అయితే యుద్ధ ఖైదీల విషయంలో ఆయా ప్రభుత్వాలు ఇస్లామీయ ప్రభుత్వ ఖైదీలతో వారిని మార్పిడి చేసుకోవడానికి అంగీకరించని పక్షంలో, వారున్నూ స్వయంగా పరిహారం చెల్లించకపోతే, వారిని బానిసలుగా పెట్టుకునేందుకు అనుమతి (అనుమతి మాత్రమే, ఆదేశం కాదు) నిచ్చింది. ఈ విధమయిన బానిసలు సయితం ఒకవైపున తమ యజమానులతో ఒప్పందం (ముకాతబత్) చేసుకుని విడుదల పొందే అవకాశం ఎలాగూ ఉంది. దానితో పాటు రెండవ వైపున పూర్వపు బానిసలను విడుదల చేసేందుకు ఉద్దేశించిన నిర్దేశాలూ ఉన్నాయి. అదొక సత్కార్యంగా భావించి కేవలం దైవప్రసన్నత కోసం వారిని విడుదల చేయవచ్చు. అపరాధాల ప్రాయశ్చిత్తంగానూ వారిని విడుదల చేయవచ్చు; ఎవరయినా తన బానిసల విషయంలో వీలు వ్రాసి పోవచ్చు, తన జీవితకాలంలో వారు తన బానిసలుగా ఉంటూ తదనంతరం విడుదల అయ్యేలా వ్రాయవచ్చు (దీన్ని ఇస్లామీ ఫిక్హ్ పరిభాషలో తద్బీర్ అని, ఇలాంటి బానిసను ముదబ్బర్ అని అంటారు); ఒక వ్యక్తి తన బానిస స్త్రీతో 'తమత్తు' (సంయోగం) చెంది తద్వారా ఆవిడకు సంతానం కలిగితే, యజమాని చనిపోగానే ఆమె తనంతట తాను స్వేచ్ఛను పొందుతుంది– యజమాని వీలు వ్రాసినా వ్రాయకపోయినా ఫరవాలేదు. ఇదీ బానిసత్వపు సమస్యకు ఇస్లామ్ ప్రతిపాదించే పరిష్కారం. అజ్ఞానులయిన ఆక్షేపకులు దీన్ని అర్థం చేసుకోకుండా అభ్యంతరాలు విసురుతూ ఉంటారు. ఆ అభ్యంతరాలకు సమాధానంగా మన్నింపు కోరుకునే గుణం గలవారు దీనికి ఏదో మన్నింపుల ధోరణిని అవలంబిస్తూ కడకు అసలు ఇస్లామ్ బానిసత్వాన్ని ఏదో ఒక రూపంలో మననిచ్చిందన్న వాస్తవాన్నే కాదంటారు.

59. అంటే బానిస స్త్రీలు స్వయంగా సౌశీల్యవతులుగా ఉండటం ఇష్టపడకపోతే వారిని వేశ్యావృత్తికి బలవంతపెట్టవచ్చని అర్థం కాదు. భావమేమిటంటే బానిస స్వయంగా తన ఇష్టపూర్వకంగా దుర్వర్తనకు పూనుకుంటే తన అపరాధానికి ఆమె స్వయంగా బాధ్యురాలు. చట్టం ఆమె అపరాధానికి ఆమెను పట్టుకుంటుంది, శిక్షిస్తుంది. కాని ఆమె యజమాని బలవంతాన ఈ వృత్తి చేయించినట్లయితే

బాధ్యత యజమానిది. అతన్నే పట్టుకోవటం జరుగుతుంది. బలవంతం అన్న ప్రశ్న ఎవరిచేతనయినా వారి ఇష్టానికి వ్యతిరేకంగా ఏదయినా చేయించినప్పుడే తలెత్తుతుంది. పోతే "ప్రాపంచిక ప్రయోజనాల కొరకు" అన్న మాటను పరిశీలిస్తే ఇది ఆదేశం అమలు చెయ్యడానికి షరతుగా నిర్బంధంగా ప్రయోగించలేదు. అంటే యజమాని ఆమె సంపాదన తినకపోతే బానిసను వేశ్యావృత్తికి బలవంతం చేసిన అపరాధం అతనికి వర్తించదని అర్థంకాదు. అంటే దీని ఉద్దేశం, ఈ అధర్మమయిన బలాత్కారపు పని ద్వారా సంపాదించిన సంపాదన సయితం అధర్మమయినదే అని తెలుపడం.

కాని ఈ ఆదేశంలోని ఉద్దేశ్యం దీని పదాలు, వాటి పూర్వాపరాల ద్వారా మాత్రమే బోధపడదు. దీన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకునేందుకు ఇది అవతరించిన ఆనాటి పరిస్థితులను సయితం దృష్టిలో ఉంచుకోవలసి ఉంటుంది. ఆనాడు అరేబియాలో వేశ్యావృత్తికి సంబంధించిన రెండు విధానాలు అమలులో ఉండేవి. ఒకటి ప్రయివేటు వృత్తిగా, రెండవది సక్రమంగా వేశ్యావాటిక రూపంలో.

"ప్రయివేటు" వృత్తి చేసేవారు అత్యధికంగా స్వేచ్ఛపొందిన బానిస స్త్రీలు, అంటే సంరక్షకులంటూ ఎవరూ లేనివారన్నమాట. లేదా స్వేచ్ఛాయుత స్త్రీలూ ఇందులో ఉండేవారు. వారికి అండదండలుగా ఏ కుటుంబమూ, తెగ ఉండేది కాదు. వీరు ఒక ఇంట కూర్చుండిపోయేవారు. ఎందరో పురుషులతో ఒకేసారి ఒప్పందం చేసుకునేవారు. వారు వీరికి సహాయం, ఖర్చుల నిమిత్తం ధనం అందజేసేవారు, తమ అవసరాన్ని తీర్చుకునేవారు. శిశువు పుట్టినపుడు స్త్రీ ఆ పురుషులలో ఎవరిని సూచించి, ఈ శిశువు అతనికే చెందినదని ప్రకటిస్తుందో ఆ శిశువు అతనికే చెందినట్లు అంగీకరించబడేది. అంటే ఇది సమాజంలో ఒక ఆమోదం పొందిన వ్యవస్థ అన్నమాట. అజ్ఞానకాలంలో దాన్ని ఒక విధమయిన "నికాహ్"గా పరిగణించేవారు. ఇస్లామ్ ఆవిర్భావం తరువాత ప్రసిద్ధమయిన నికాహ్‌నే చట్టబద్ధమయిన నికాహ్‌గా పరిగణించింది. ఇందులో ఒక స్త్రీకి ఒకే భర్త ఉంటాడు. ఇలా తతిమ్మా విధానాలన్నీ వ్యభిచారంగా పరిగణించబడి వాటంతటఅవే అపరాధంగా నిర్ణయమయ్యాయి (అబూదావూద్ - బాబ్ ఫీ వుజూహిన్నికాహ్).

మరో విధానం విచ్చలవిడిగా జరిగే వేశ్యావృత్తి. ఇది అంతా బానిస స్త్రీల ద్వారా కొనసాగేది. ఇందులో రెండు పద్ధతులుండేవి. ఒకటి, జనులు యువతులయిన తమ బానిస స్త్రీలకు ఒక భారీ మొత్తాన్ని విధించి ప్రతి నెల ఇంత మొత్తం సంపాయించిపెట్టమని నిర్బంధించేవారు. ఆ దౌర్భాగ్యురాళ్ళు దుశ్చేష్టకు పాల్పడి ఈ కోరికను నెరవేర్చేవారు. ఈ మార్గం ద్వారా తప్ప మరో విధంగా వారు ఇంతగా సంపాయించలేరు, వారి యజమానులకూ తెలుసు వారు మరే పరిశుద్ధమయిన సంపాదన ద్వారానూ ఈ రొఖ్ఖం సంపాదించిపెట్టడం లేదని, ఇంకా యువ బానిసలపైన సాధారణ కూలీ రేటుకన్నా ఎన్నో రెట్లు మొత్తాలు విధించడంలో మరే విధమయిన కారణమూ ఉండటానికి వీలులేదు. రెండవ పద్ధతి ప్రకారం జనులు తమ అందమయిన యువ బానిస స్త్రీలను వేశ్యాగృహాలలో కూర్చుండబెట్టేవారు. వారి గడపలపైన జెండాలు పెట్టేవారు. వాటిని చూసి 'అవసరం గల' వ్యక్తి తన అవసరాన్ని ఎక్కడ తీర్చుకోగలడో దూరాన్నుంచే తెలిసిపోయేది. ఈ స్త్రీలు 'కలీకియాత్' అనిపించు కునేవారు, వారి ఇళ్ళు

'మవాఖీర్' అనబడేవి. పెద్ద పెద్ద ఆదరణీయ శ్రీమంతులు ఇలాంటి వేశ్యా వాటికలు తెరచిపెట్టారు. స్వయాన అబ్దుల్లా బిన్ ఉబైకు (కపటుల నాయకుడు, ఈయన గారిని, ప్రవక్త మహనీయులు (స) మదీనా రాకకు పూర్వం, మదీనావాసులు తమ రాజుగా పట్టాభిషేకం చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ మహానుభావుడే హజ్రత్ ఆయిషాపైన ఆరోపణ మోపడంలో ముమ్మందున ఉన్నవాడు) మదీనాలో వేశ్యావాటిక ఉండేది. అందులో ఆరుగురు అందమయిన బానిస స్త్రీలు ఉండేవారు. వారి ద్వారా అతను ధనం సంపాదించడమే కాక విభిన్న అరేబియా ప్రాంతాల నుండి వచ్చే గౌరవ అతిథులకు వీరి ద్వారా సుఖభోగాలు కూడా సమకూర్చడం జరిగేది. వీరి అధర్మమయిన సంతానంతో తన సేవకుల్నీ, మందీ మార్బలాన్నీ పెంచుకున్నాడు. ఈ బానిస స్త్రీలలో ఒకామె పేరు 'ముఅజా'. ఆమె ముస్లిమ్‌గా మారిపోయింది, ఆమె తౌబా చేసి వృత్తిని వదలి పెట్టాలని కోరుకుంది. అబ్దుల్లా బిన్ ఉబై ఆమెను హింసించాడు. ఆమె వెళ్ళి హజ్రత్ అబూ బక్ర్‌తో ఫిర్యాదు చేసింది. ఆయన వ్యవహారాన్ని ప్రవక్తశ్రీ వద్దకు తీసుకువెళ్ళారు. దైవప్రవక్త (స), ఆ బానిసను ఆ అత్యాచారి బారి నుండి రక్షించాలని ఆదేశమిచ్చారు (ఇబ్నుజరీర్: సంపుటి 18, పుట55-58, 103, 104; అల్ ఇస్తీఆబ్, ఇబ్ను అబ్దుల్ బర్: సంపుటి 2, పుట 762; ఇబ్ను కసీర్: సంపుటి3, పుటలు-288, 289). అదే కాలంలో దైవ సన్నిధి నుండి ఈ ఆయత్ అవతరించింది. ఈ పూర్వరంగాన్ని దృష్టిలో ఉంచుకున్నట్లయితే అసలు ఉద్దేశం, కేవలం బానిస స్త్రీలను వ్యభిచార నేరానికి బలవంత పెట్టడాన్ని వారించడం మాత్రమే కాదు, ఇస్లామీయ రాజ్య పరిధిలో వేశ్యావృత్తి (Prostitution)ని పూర్తిగా చట్టవిరుద్ధం (Illegal) చేయడం కూడా. ఇంతేకాక, ఈ కార్యకలాపాల్లో బలవంతాన నెట్టబడిన స్త్రీలకు సర్వసామాన్యమయిన క్షమాపణ ప్రకటన కూడా ఉన్నట్టు అతి స్పష్టంగా తెలుస్తోంది.

దైవం తరఫున ఈ ఆదేశం వచ్చేసిన తరువాత ప్రవక్త మహనీయులు (స), ● "ఇస్లామ్‌లో వేశ్యావృత్తికి ఎటువంటి స్థానం లేదు" అని ప్రకటించారు (అబూదావూద్-ఇబ్ను అబ్బాస్ ఉల్లేఖనం, బాబ్ ఫీ ఇద్దిఆన వలదుజ్జినా). ● రెండవ ఆదేశం ఆయన ఇచ్చింది, వ్యభిచారం ద్వారా కలిగిన సంపాదన అధర్మమయింది, అశుద్ధమయింది, పూర్తిగా నిషిద్ధమయింది అన్నది. రాఫి బిన్ ఖదీజ్ ఉల్లేఖనం ప్రకారం ఆయన (స) వ్యభిచారపు ప్రతిఫలాన్ని పైశాచికమయింది, అశుద్ధమయింది, సంపాదనల్లోకెల్లా నికృష్టమయింది, అపవిత్రమయింది, అత్యంత హీనమయిందిగా ప్రకటించారు (అబూదావూద్, తిర్మిజి, నసాయి). అబూ హుజైఫా ప్రకారం ప్రవక్తశ్రీ (స) వేశ్యావృత్తి ద్వారా సంపాదించిన ఆదాయాన్ని హరామ్‌గ [illegible]కటించారు (బుఖారీ, ముస్లిమ్, అహ్మద్). అబూ మస్ఊద్, ఉక్బా బిన్ అమ్ర్ ఉల్లేఖనం ప్రకారం వ్యభిచారపు కూలీని ఇచ్చి పుచ్చుకోవడం ఆయన నిషిద్ధంగా ప్రకటించారు (సిహాహ్ సిత్తా, అహ్మద్). ఆయన ఇచ్చిన ● మూడవ ఆదేశం, బానిస స్త్రీ ద్వారా ధర్మబద్ధంగా ఆమె కాళ్ళూ చేతుల సేవలనే గ్రహించవచ్చు. యజమాని ఆమెపైన ఒక మొత్తాన్ని విధించనూలేదు, దాన్ని వసూలు చెయ్యనూలేదు - ఆమె ఆ ఆదాయాన్ని ఎక్కడి నుండి ఏమి చేసి సంపాదిస్తుందో తెలియనిదయితే

وَلَقَدْ اَنْزَلْنَآ اِلَيْكُمْ اٰيٰتٍ مُّبَيِّنٰتٍ وَّمَثَلًا مِّنَ الَّذِيْنَ خَلَوْا مِنْ

قَبْلِكُمْ وَمَوْعِظَةً لِّلْمُتَّقِيْنَ ﴿٣٤﴾ ع

34 మేము అతి స్పష్టంగా మార్గబోధన చేసే ఆయత్‌లను మీ వద్దకు పంపించాము, మీకు పూర్వం గతించిన జాతుల గుణపాఠం గరిపే దృష్టాంతాలు కూడా మీ ముందు ప్రస్తుతపరిచాము, ఇంకా భయపడగల వారికే యోగ్యమయిన హితోపదేశాలనూ మీకు అందజేశాము.[60] (ع4)

దాన్ని అతను వసూలు చెయ్యలేదు. రాఫె బిన్ ఖదీజ్ ప్రకారం "ప్రవక్త మహనీయులు (స) బానిస స్త్రీ తన ఆదాయం ఎలా సంపాదిస్తుందో తెలియనంతవరకు యజమాని దాన్ని వసూలు చెయ్యటం నిషిద్ధం" అని పలికారు (అబూదావూద్, కితాబుల్ ఇజార). రాఫె బిన్ రిఫాఅ అన్సారి ఉల్లేఖనంలో ఇంకా స్పష్టమయిన ఆదేశముంది, "దైవప్రవక్త (స) మాకు బానిస స్త్రీల సంపాదనను నిషేధించారు, ఆమె తన చేత్తో కష్టార్జితంగా సంపాదించేది తప్ప. ఆయన తన చేత్తో సంజ్ఞచేసి ఇలా అని చూపారు, అంటే రొట్టె చెయ్యడం, నూలు వడకడం, ఉన్ని, దూది పింజడం" (ముస్నద్ అహ్మద్, అబూ దావూద్, కితాబుల్ ఇజార). ఇదే భావంలో ఒక ఉల్లేఖనం అబూదావూద్, ముస్నద్ అహ్మద్‌లో హజ్రత్ అబూ హురైరా ఉల్లేఖించింది ఉంది. అందులో "బానిస స్త్రీల సంపాదన", "వ్యభిచారపు ఆదాయం" వసూలు చెయ్యడాన్ని నిషేధించారు. ఇలా దైవప్రవక్త (స) ఖుర్‌ఆన్‌లోని ఈ ఆయత్ ఉద్దేశానికనుగుణంగా వేశ్యావృత్తికి సంబంధించిన సమస్త రూపాలను ఆనాడు అరేబియాలో అమలులో ఉన్నవాటినన్నింటినీ ధార్మికంగా అధర్మమయినవిగాను, చట్టపరంగా నిషిద్ధమయినవిగాను నిర్ణయించారు. ఇంకా ముందుకు వెళ్ళి, అబ్దుల్లా బిన్ ఉబై బానిస స్త్రీ 'ముఆజా' వ్యవహారంలో ఆయన తీసుకున్న నిర్ణయం వల్ల తెలిసేదేమిటంటే యజమాని ఒక బానిస ద్వారా బలవంతాన ఆ వృత్తి చేయించేమాటయితే ఆ బానిసపైన యజమాని యాజమాన్యం హక్కులు కూడా కోల్పోతాడు. ఇది ఇమామ్ జుహ్రీ ఉల్లేఖనం. దీన్ని ఇబ్ను కసీర్ 'ముస్నద్ అబ్దుర్రజ్జాక్'లో ప్రస్తావించినట్లు ఉటంకించారు.

60. ఈ ఆయత్ కేవలం గత చివరి ఆయత్‌కు సంబంధించింది మాత్రమే కాదు, సూరా ప్రారంభం నుండి ఇంతవరకు కొనసాగిన ప్రసంగక్రమంతో దీనికి సంబంధముంది. "అతి స్పష్టంగా మార్గబోధన చేసే ఆయత్‌లు" అంటే ఉద్దేశం, వ్యభిచారం, కజ్ఫ్, లిఆన్, చట్టాలున్న ఆయత్‌లు; దుర్వర్తనులయిన స్త్రీపురుషులతో పెళ్ళి విషయంలో 'విశ్వసించిన వారు' బహిష్కారం పాటించాలని నిర్దేశించిన ఆయత్‌లు; సుజనులయిన వారిపైన నిరాధారమయిన నిందలు మోపడాన్ని, సమాజంలో అశ్లీలాన్ని వ్యాపింపజెయ్యడాన్ని వారించిన ఆయత్‌లు; పురుషులూ స్త్రీలు గజ్జె బసర్ (చూపును కాపాడుకోవడం)

ٱللَّهُ نُورُ ٱلسَّمَٰوَٰتِ وَٱلْأَرْضِ ۚ مَثَلُ نُورِهِۦ كَمِشْكَوٰةٍ فِيهَا مِصْبَاحٌ ۖ ٱلْمِصْبَاحُ

فِى زُجَاجَةٍ ۖ ٱلزُّجَاجَةُ كَأَنَّهَا كَوْكَبٌ دُرِّىٌّ يُوقَدُ مِن شَجَرَةٍ مُّبَٰرَكَةٍ

زَيْتُونَةٍ لَّا شَرْقِيَّةٍ وَلَا غَرْبِيَّةٍ يَكَادُ زَيْتُهَا يُضِىٓءُ وَلَوْ لَمْ تَمْسَسْهُ نَارٌ ۚ

35-40 అల్లాహ్[61] గగన భువనాల వెలుగు.[62] (విశ్వంలో)ఆయన వెలుగుకు ఉపమానం గూటిలోని దీపం వంటిది, దీపం ఒక గాజు బుగ్గ లోపల ఉంది, గాజు బుగ్గేమో ముత్యంలా మెరుస్తూ ఉన్న తార, మరి ఆ దీపమేమో ఒక శుభప్రదమయిన[63] జైతూన్ చెట్టు చమురుతో వెలిగించబడుతుంది, ఆ చెట్టు, తూర్పుకూ చెందదు, పడమరకూ చెందదు,[64] నిప్పు అంటినా అంటకపోయినా దాని చమురు దానంతట అదే రగుల్కొంటుంది;

పట్లను, మర్మాంగాల రక్షణ విషయంలోనూ తాకీదు చేసిన ఆయత్‌లు; స్త్రీలకు పరదా వ్యవస్థను పాటించే నియమాలున్న ఆయత్‌లు; పెళ్ళికి తగినవారు ఒంటరివారుగా కూర్చోవడం పట్ల అయిష్టతను వెలిబుచ్చిన ఆయత్‌లు; బానిసల స్వేచ్ఛకు ఒప్పందపు మార్గం ప్రతిపాదించిన ఆయత్‌లు; సమాజాన్ని వేశ్యావృత్తి నుండి ప్రక్షాళించే ఆదేశమిచ్చిన ఆయత్‌లు అని అర్థం. ఈ సూచనలిచ్చిన తరువాత ఇలా సెలవియ్యబడుతోంది: దైవానికి భయపడి రుజుమార్గాన్ని అవలంబించేవారికి అవసరమయిన బోధనలు మేము అందజేశాము, మీరు ఒకవేళ ఇక ఈ బోధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే దీని స్పష్టమయిన భావం ఏమిటీ, స్వయంగా ఈ ఖుర్ఆన్‌లోనే మేము మీ ముందుంచిన గుణపాఠం గరిపే జాతుల అంతిమ పరిణామాన్ని మీరు చవిచూడదలిచారన్నమాట – ఒక ఆదేశ పత్రం చివరన ఇంతకన్నా గట్టి హెచ్చరిక చేసే పదాలు బహుశా మరేవీ కాజాలవేమో– కాని జోహార్లు ఈ జాతికి, ఇది విశ్వసించిన జాతి, ఈ ఆదేశాన్ని నిత్యం పారాయణం చేస్తూ ఉండే జాతి, ఇంతటి కఠినమయిన హెచ్చరిక వచ్చినప్పటికీ ఈ ఆదేశ పత్రాన్ని ఉల్లంఘిస్తూ ఉండే జాతి, ఈ జాతి!

61. ఇక్కడి నుండి సంబోధన ద్వంద్వనీతిపరులయిన కపటుల వైపునకు మరలుతోంది. వారు ఇస్లామీయ సమాజంలో ఉపద్రవాలపైన ఉపద్రవాలు లేపుతున్నారు. ఇస్లామ్‌ను, ఇస్లామీయ ఉద్యమాన్ని, ఇస్లామీయ రాజ్యాన్ని, ఇస్లామీయ సముదాయాన్ని కడతేర్చడానికి బయటి శత్రువులు తిరస్కారులు ఏ విధంగా, చురుగ్గా కార్యకలాపాలు కొనసాగిస్తున్నారో వీరు కూడా అలాగే నిమగ్నులయి ఉన్నారు. వీరు తాము విశ్వసించినట్లు ప్రకటించేవారు, ముస్లిములతో కలసి ఉండేవారు, ముస్లిము లతోపాటు, ముఖ్యంగా అన్సారులతోపాటు బంధుత్వాలు, సంబంధాలు కలిగినవారు. అందువల్లనే ముస్లిముల్లో ఉపద్రవాలు సృష్టించే అవకాశాలు మెండుగా వారికి దొరికేవి. కొందరు నిష్కల్మష హృదయులయిన ముస్లిములు

సయితం తమ సాదా సీదాతనం చేత, లేదా బలహీనత కారణంగా వారికి పనిముట్లుగా, అండదండలుగా కూడా మారిపోవడం కద్దు; కాని వాస్తవంగా ఈ కపటుల ప్రపంచ వ్యామోహం వారి కళ్ళకు గంతలు కట్టివేసింది. ఈమాన్ (విశ్వాసం) ప్రకటించినప్పటికీ, ఖుర్‌ఆన్ ద్వారా, మహనీయ ముహమ్మద్ (స) ద్వారా ప్రపంచంలో వ్యాపిస్తున్న కాంతికి వారు బహుదూరంగా ఉంటున్నారు. ఈ సందర్భంలో వారిని సంబోధించకుండా వారిని గురించి సెలవిచ్చిన దానికంతటికీ మూడు లక్ష్యాలున్నాయి. ఒకటి, వారికి బాగా అవగతపరచాలన్నది. అల్లాహ్ కారుణ్యం, ఆయన సంరక్షణాతత్వం ప్రప్రథమంగా కోరేదేమిటంటే, దారి తప్పి తచ్చాడే ప్రతి దాసునికి, అతడు ఎంతటి దుష్టుడయినా నీచుడయినా చివరి ఘడియ వరకు అతనికి బోధపరిచే ప్రయత్నం చెయ్యడం. రెండు, విశ్వాసం కాపట్యం రెంటి వ్యత్యాసం విడమర్చి వివరించడం; బుద్ధి వివేకాలున్న ఏ మనిషికీ ముస్లిమ్ సమాజంలోని విశ్వాసులు, ద్వంద్వనీతిపరు(మునాఫికు)లయిన వ్యక్తులమధ్య భేదం పాటించటం కష్టం కాకుండా ఉండటం; ఈ విశదీకరణ, వివరణల తరువాత కూడా ఎవరయినా కపటుల ఉచ్చులో చిక్కుకుంటే, లేదా వారికి వెన్నుదన్నుగా నిలుస్తే అతడు తన ఈ చర్యకు తానే పూర్తిగా బాధ్యుడయిపోతాడు. మూడు, మునాఫికులను (కపట విశ్వాసులను) అతి స్పష్టంగా హెచ్చరిం చడం, తద్వారా అల్లాహ్ విశ్వాసులకు చేసిన వాగ్దానాలు కేవలం నిష్కల్మష హృదయంతో విశ్వసించి ఆ విశ్వాసపు ఆవశ్యకతల కనుగుణంగా నడచుకునే వారికే చెల్లుతాయన్న విషయం తెలుపడం. ఈ వాగ్దానాలు, కేవలం ముస్లిముల జనాభా లెక్కలలో చేరి ఉండే వారందరికీ వర్తించవు. కనుక మునాఫికులు (కపటులు), ఫాసికులు (దైవాజ్ఞల్ని ఉల్లంఘించేవారు) ఈ వాగ్దానాలలో ఏదయినా భాగం పొందగలమని ఆశలు పెట్టుకోరాదని తెలుపడం.

62. భూమీ ఆకాశాలు అన్న పదం దివ్యఖుర్‌ఆన్‌లో సర్వసాధారణంగా 'విశ్వం' అనే అర్థంలో ప్రయోగించబడుతుంది. అందువల్ల మరో విధంగా ఆయత్ అనువాదం, అల్లాహ్ విశ్వాన్నంతటికీ వెలుగు అని కూడా కావచ్చు.

వెలుగు లేదా కాంతి అంటే భావం వస్తువులు దేని మూలంగా వ్యక్తమవుతాయో ఆ పదార్థం అన్నది. అంటే అది స్వయంగానూ వ్యక్తమవుతుంది ఇతర పదార్థాలనూ వ్యక్తపరుస్తుంది. మానవుని మస్తిష్కంలో కాంతి, వెలుగు అన్న వాటి అసలు భావం ఇదే. ఏమీ కానరాని స్థితిని మానవుడు చీకటి, అంధకారం, తిమిరం అని పేరుపెట్టాడు. దీనికి భిన్నంగా అంతా కనిపించగానే ప్రతిదీ వ్యక్తమవగానే మనిషి వెలుతురు వచ్చేసిందని అంటాడు. పరమ ప్రభువు అల్లాహ్‌కు 'కాంతి' అనే పదం ఈ ప్రాథమిక భావంలోనే ప్రయోగించడం జరిగింది. దైవం మన్నించుగాక ఆయన ఏదో కాంతి కిరణం అనే భావంలో కాదు. కాంతికిరణం ఒక్క సెకెనుకు ఒక లక్షా 86 వేల మైళ్ళ వేగంతో ప్రయాణిస్తుంది, మన కంటి తెరపై పడి మెదడులోని దృష్టికేంద్రాన్ని ప్రభావితం చేస్తుంది. వెలుగుకు ఉన్న ఈ ప్రత్యేక స్థితి వేరు. ఏ అర్థాన్ని వ్యక్తపరచడానికి మానవ మస్తిష్కం వెలుగు అనే పదాన్ని రూపొందించిందో

దాని వాస్తవికతలో కాంతికి ఉన్న ఈ ప్రత్యేకత లేదు. నిజానికి భౌతిక ప్రపంచంలో మన అనుభవంలోకి వచ్చే కాంతుల దృష్ట్యా మనం దానికి ఈ పదాన్ని వర్తింపజేస్తాము. పరమప్రభువు అల్లాహ్‌ను పేర్కొనేందుకు మానవ భాషలో ఎన్ని పదాలు ప్రయోగించినా అవి ఆ పదాల మౌలిక భావం, గుణం రీత్యానే ప్రయోగించబడతాయి. వాటి భౌతిక నిదర్శనాలు, ఆధారాల దృష్ట్యా మాత్రం కాదు. ఉదాహరణకు మనం ఆయన చూస్తున్నాడని అంటాము. దీని భావం, మానవులు, జంతువుల వలే కన్ను అనే ఒక అవయవం ద్వారా ఆయన చూస్తున్నాడని కాదు. మనం ఆయన వింటున్నాడని అంటాము. మనలాగే ఆయన చెవులతో వింటాడు అని అర్థం కాదు. ఆయన పట్టుకుంటాడు అని అంటాము. అంటే ఆయన చేతులు అనే పనిముట్టుతో పట్టుకుంటాడని అర్థం కాదు. ఈ పదాలన్నీ ఆయన విషయంలో భావాన్వయరూపంలో ప్రయోగించబడతాయి. ఒక బుద్ధిహీనుడయిన మనిషే, వినికిడి, చూపు, పట్టు అన్నవి మన అనుభవంలోని పరిమితమయిన ప్రత్యేక వినికిడి, చూపు, పట్టు తప్ప మరో రూపంలో సాధ్యం కావని అపోహకు గురవుతాడు. ఇదే విధంగా 'కాంతి', అనే పదానికి భావం, ఒక మెరిసే పదార్థం నుండి వెడలి కంటి తెరపై ప్రతిఫలించే కిరణం రూపం వరకే పరిమితం కాగలదని అనుకొనడం కేవలం ఒక సంకుచిత భావమే అవుతుంది. కాంతి అనే పదం, పరమ ప్రభువుకు దీని పరిమిత అర్థంలో వర్తించదు, దాని మౌలికమయిన అసలు అర్థంలోనే వర్తిస్తుంది. అంటే ఈ విశ్వంలో ఆయన ఒక్కడే అసలు "అభివ్యక్తికి హేతువు", మిగతా ఇక్కడ ఉన్నదంతా చీకటి, అంధకారాలే తప్ప మరేమీ లేదు. వెలుగునిచ్చే ఇతర పదార్థాలు కూడా ఆయన అనుగ్రహించిన కాంతి వల్లనే కాంతిమయమయి, కాంతిప్రదమయి అలరారు తున్నాయి, నిజానికి వాటివద్ద వాటి స్వంత వెలుగు ఏదీలేదు, ఈ మహత్యాన్ని చూపగలగటానికి.

'కాంతి' అనే పదం జ్ఞానానికి కూడా ప్రయోగిస్తారు. దీనికి ప్రతిగా అజ్ఞానాన్ని చీకటిగా అంధకారంగా వర్ణిస్తారు. అల్లాహ్ ఈ భావంలోనూ విశ్వానికి కాంతియే. ఇక్కడ యదార్థాల జ్ఞానం, రుజుమార్గజ్ఞానం ప్రాప్తం కావాలంటే ఆయన ద్వారానే సాధ్యం. ఆయన అనుగ్రహం లేనిదే అజ్ఞానపు తిమిరం, ఫలితంగా అపమార్గం, మార్గవిహీనతలు తప్ప మరేమీ సాధ్యపడదు.

63. మూలంలో 'ముబారక్' అనే పద ప్రయోగం జరిగింది. ఈ పదానికి అత్యధిక ప్రయోజనాలు, అనేక లాభాలు కలిగినదని అర్థం.

64. అంటే బహిరంగ మైదానంలోనో ఎత్తయిన ప్రదేశంలోనో ఉండేది, అక్కడ ఉదయం, సాయంత్రం దాని మీద ఎండకాస్తూ ఉంటుంది. అది దేని చాటునా ఉండదు. కేవలం ప్రొద్దునో లేదా సాయంత్రమో మాత్రమే ఎండపడే చోటున ఉండదు. ఇటువంటి జైతూన్ చెట్టు నూనె చాలా పల్చనయినదిగా ఉంటుంది, బాగా మేలయిన వెల్తురునిస్తుంది. కేవలం తూర్పు దిశనో లేదా కేవలం పడమటి దిశనో ఎండకాసే చెట్లు చిక్కనయిన నూనెనిస్తాయి, దీపంలో వాటి వల్ల వెలుతురు మందంగా ఉంటుంది.

نُورٌ عَلٰی نُورٍ ؕ یَهْدِی اللّٰهُ لِنُورِهٖ مَنْ یَّشَآءُ ؕ وَیَضْرِبُ اللّٰهُ الْاَمْثَالَ لِلنَّاسِ ؕ وَاللّٰهُ بِكُلِّ شَیْءٍ عَلِیْمٌ ۟ۙ

(ఇలా) వెలుగుపైన వెలుగు (పెరిగే సకల సాధనాలూ సమకూరి ఉంటాయి).[65] అల్లాహ్, తన కాంతి వైపునకు తాను కోరినవారికే మార్గనిర్దేశన చేస్తాడు,[66] ఆయన జనులకు ఉపమానాలతో మాటను బోధపరుస్తాడు, ఆయన ప్రతి విషయాన్నీ బాగా ఎరిగినవాడు.[67]

65. ఈ ఉపమానంలో దీపాన్ని పరమ ప్రభువు అల్లాహ్ ఉనికితో, గూటిని విశ్వంతో పోల్చడం జరిగింది. గాజుబుడ్డి అన్నది, సత్య స్వరూపి ప్రభువు తన్నుతాను సృష్టి దృష్టికి గోప్యంగా దాచి పెట్టిన తెర వంటిది. నిజానికి ఈ తెర ఒక చాటు తెరగా గుప్తపరిచేది కాదు, తీవ్రంగా వ్యక్తపరిచే తెర. సృష్టి దృష్టి ఆయన్ని చూడలేక పోతోందంటే కారణం మధ్యలో చీకటి అవాంతరంగా ఉండటం వల్ల కాదు, అసలు కారణం మధ్యలోని తెర పారదర్శకమయినది, పారదర్శక తెరను దాటి వచ్చే కాంతి ఎంతో తీవ్రమయింది, విశాలమయింది, ఆవృతమయింది, దాన్ని పరిమిత శక్తిగల చూపులు గ్రహించలేక పోతున్నాయి. ఈ బలహీనమయిన చూపులు కేవలం పరిమితమయిన వెలుగులను మాత్రమే గ్రహించగలుగుతాయి. ఈ పరిమితమయిన వెలుగులలో హెచ్చుతగ్గులవుతూ ఉంటాయి, ఒక్కసారి క్షీణిస్తూ ఉంటాయి మరోసారి పుదుతూ ఉంటాయి. వీటికి సదృశంగా చీకటి కూడా ఉంటుంది, వాటికి వ్యతిరేకమయిన చీకటికి ఎదురుగా వచ్చి అవి వ్యక్తమవుతూ ఉంటాయి. కాని పరంజ్యోతికి వ్యతిరేకంగా, సదృశంగా ఏదీ లేదు, అది ఎన్నడూ క్షీణించదు, అది సదా ఒకే ప్రాభవంతో అన్ని దిశలా ఆవృతమయి ఉంటుంది, దాన్ని గ్రహించడం ఈ దృక్కులకు అలివికాని విషయం.

పోతే "ఆ దీపమేమో ఒక శుభప్రదమయిన జైతూన్ చెట్టు చమురుతో వెలిగించబడుతుంది, ఆ చెట్టు తూర్పుకూ చెందదు, పడమరకూ చెందదు" అన్న విషయం మాటకు వస్తే అది కేవలం దీపపు కాంతిలోని పరిణతిని, తీవ్రతను ఊహాత్మకంగా ఎరుకపరిచేందుకు మాత్రమే ప్రస్తావించ బడింది. ప్రాచీన కాలంలో అత్యధిక వెల్తురు కావాలంటే అది జైతూన్ నూనె దీపాల ద్వారా ప్రాప్త మయ్యేది. వీటిలోనూ ఎత్తయిన, బహిర్ ప్రదేశంలోని చెట్టు నుంచి గ్రహించిన నూనెతో వెలిగే దీపమే మరీ ఎక్కువ వెలుగునిచ్చేది. ఉపమానంలో ఈ విషయాన్ని ప్రస్తావించడం, దీపంతో పోల్చిన అల్లాహ్ ఉనికి, మరే పదార్థం ద్వారానయినా శక్తి (Energy)ని పొందుతూ ఉందని చెప్పడానికి కాదు, ఉపమానంలోనిది సాధారణ దీపం కాదు, అత్యంత కాంతిమంతమయిన దీపంగా మీరు దేన్ని ఊహించగలుగుతారో అదీ అన్నమాట. ఏ విధంగానయితే ఇటువంటి దీపం ఇంటి మొత్తాన్ని

జ్యోతిర్మయం చేస్తుందో అదే విధంగా అల్లాహ్ ఉనికి కూడా మొత్తం విశ్వాన్ని కాంతి పుంజంగా చేసిందని అర్థం.

“నిప్పు అంటినా అంటకపోయినా దాని చమురు దానంతట అదే రగుల్కొంటుంది” అన్న దాని ద్వారాను దీపపు కాంతిలో నిగూఢమయి ఉన్న తీవ్రతను ఊహింపజెయ్యడమే ఉద్దేశం. ఉపమానంలో ఒక అత్యంత తేజోవంతమయిన కాంతినిచ్చే జ్యోతి ఊహించుకోండి, అందులో ఎంతో సూక్ష్మమయిన, ఎంతో ఉత్తేజభరితమయిన నూనె ప్రయోగించబడుతుంది. ఈ మూడు అంశాలు, అంటే జైతూన్, అది ప్రాక్ పశ్చిమేతరం కావడం, దాని చమురు నిప్పు లేకుండానే దానంతట అదే రాజుకోవడం అనేవి ఉపమానంలో స్థిరస్థాయి అంశాలు కావు, అవి మొదటి అంశం దీపానికి సంబంధించిన నిమ్న గుణవాచకాలు. ఉపమానంలోని స్థిరస్థాయిగల అంశాలు మూడు, దీపం, గూడు, పారదర్శకమయిన బుడ్డి.

ఆయత్‌లోని “ఆయన వెలుగుకు ఉపమానం ......” అన్న మాట కూడా గమనార్హమయింది. “అల్లాహ్ గగన భువనాల వెలుగు” అన్న పదాల వల్ల ఎవరికయినా ఏదయినా అపార్థం కలిగితే పై పదాల వల్ల అది దూరమయిపోతుంది. దీనివల్ల తెలిసేదేమిటంటే అల్లాహ్‌ను “వెలుగు” అనడం అంటే భావం, దైవం మన్నించు గాక, ఆయన వాస్తవికత కేవలం 'వెలుగు' అవడం మాత్రమేకాదు. వాస్తవంగానయితే ఆయనది పరిపూర్ణమయిన, పరిణతి చెందిన ఉనికి, ఆయన జ్ఞానధనుడు, అధికార శక్తి సంపన్నుడు, ఔచితీ విజ్ఞతా కౌశలుడు, తదితర సద్గుణ సంపన్నుడు అవడంతోపాటు జ్యోతిర్మయుడు కూడా. ఆయన్నే స్వయంగా 'జ్యోతి' లేదా 'వెలుగు' అని అనడం ఆయన జ్యోతిర్మయ తలో పరిపూర్ణతవల్ల జరిగింది. ఉదాహరణకు ఒకరి దాతృ గుణాన్ని కొనియాడటానికి స్వయంగా అతన్నే 'దానము' అని పేరిడటం; ఒకరి అంద చందాలను తెలుపడానికి అతన్నే 'సుందరం' అని పిలువడం వంటిదన్నమాట.

66. అంటే దేవుని ఈ పరంజ్యోతి నిఖిల జగతిని ప్రకాశమానం చేస్తూనే ఉన్నప్పటికీ దీన్ని గ్రహించే భాగ్యం అందరికీ ప్రాప్తం కాదు. దాన్ని అవగతపరచుకునే సద్బుద్ధి, దాని అనుగ్రహం వల్ల ప్రయోజనం పొందే మహాభాగ్యం, అల్లాహ్ తాను కోరిన వారికే ప్రసాదిస్తాడు. వాస్తవానికి గుడ్డివానికి పగలూ రేయీ సమానమే అయినట్లు అంతర్దృష్టి లేని మనిషికి విద్యుచ్ఛక్తి, సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాల వల్ల కలిగే కాంతి అయితే కాంతియే. కాని అల్లాహ్ కాంతి అతనికి కానరాదు. ఈ కోణంలో ఆ దౌర్భాగ్యునికి విశ్వంలో ఎల్లెడలా అంధకారమే అంధకారం అలుముకుని ఉంటుంది. కళ్ల కబోది తన ఎదుట ఉన్న వస్తువునూ చూడలేడు. అతను దాన్ని కొట్టుకుని ఎదురుదెబ్బ తిన్నప్పుడు మాత్రమే అతనికి తెలుస్తుంది అక్కడ అది ఉందని. అలాగే అంతర్దృష్టిలేని అంధుడు, అతని ప్రక్కనే అల్లాహ్ కాంతితో మిరుమిట్లు గొలుపుతూ ఉన్న యదార్థాలను సయితం కానలేక పోతాడు. అతడు వాటిని ఎదుర్కొని తన శాస్తికి గురయినప్పుడు మాత్రమే అతనికి వాటిని గురించి ఎరుక కలుగుతుంది.

فِيْ بُيُوْتٍ اَذِنَ اللّٰهُ اَنْ تُرْفَعَ وَ يُذْكَرَ فِيْهَا اسْمُهٗ ۙ يُسَبِّحُ لَهٗ فِيْهَا
بِالْغُدُوِّ وَالْاٰصَالِ ۙ﴿۳۶﴾ رِجَالٌ ۙ لَّا تُلْهِيْهِمْ تِجَارَةٌ وَّلَا بَيْعٌ عَنْ
ذِكْرِ اللّٰهِ وَ اِقَامِ الصَّلٰوةِ وَاِيْتَآءِ الزَّكٰوةِ ۙ يَخَافُوْنَ يَوْمًا تَتَقَلَّبُ
فِيْهِ الْقُلُوْبُ وَالْاَبْصَارُ ﴿۳۷﴾

(ఆయన వెలుగు వైపునకు మార్గనిర్దేశన పొందే) వారు ఉండే నిలయాలను ఉన్నత పరచాలనీ, వాటిలో తన నామ సంస్మరణ జరపాలనీ అల్లాహ్ అనుజ్ఞ ఇచ్చి ఉన్నాడు.[68] వాటిలో ఇలాంటి వారు రేయింబవళ్ళు ఆయన పరిశుద్ధతను కీర్తిస్తూ ఉంటారు, వ్యాపారం, క్రయవిక్రయాలు, వారికి అల్లాహ్ సంస్మరణ పట్ల, నమాజ్ స్థాపన, జకాత్ చెల్లింపుల పట్ల మరపు కలగనివ్వవు. వారు ఆ గడ్డు దినం పట్ల భయపడుతూ ఉంటారు, ఆనాడు, గుండెలు ఉబికి పైకి వచ్చేసే, కనుగుడ్లు బండబారిపోయే స్థితి తారసపడుతుంది.

67. దీనికి రెండు అర్థాలున్నాయి. ఒకటి, అయనకు తెలుసు ఏ యదార్థాన్ని ఎటువంటి ఉపమానం ద్వారా ఉత్తమ రీతిలో బోధపరచవచ్చు అన్న విషయం. రెండు ఆయనకు తెలుసు ఈ వరప్రసాదానికి అర్హులయిన వారెవరో ఎవరుకారో. ఎవరయితే సత్యజ్యోతిని అసలు కోరుకోవడమే లేదో, ఆపాద మస్తకం ప్రాపంచిక ప్రయోజనాలలో లీనమయిపోయాడో, భౌతిక రుచుల, లాభాల అన్వేషణలోనే నిమగ్నుడయి పోయాడో అతనికి బలవంతాన సత్యజ్యోతిని చూపే అవసరమేమీ అల్లాహ్‌కు లేదు. ఈ వరప్రసాదాన్ని కోరుతున్నాడని, చిత్తశుద్ధితో కోరుతున్నాడని ఎవరిని గురించి అల్లాహ్‌కు బాగా తెలుసో వారే దీనికి అర్హులయినవారు.

68. కొందరు వ్యాఖ్యాతలు ఈ 'నిలయాలు' అంటే ఉద్దేశం మస్జిదులని భావించారు, వాటిని ఉన్నత పరచడమంటే వాటిని నిర్మించడం, వాటిని గౌరవించడం, ఆదరించడం అని భావిం చారు. మరి కొందరు వ్యాఖ్యాతలయితే ఈ నిలయాలంటే విశ్వాసుల గృహాలని అనుకున్నారు. వాటిని ఉన్నత పరచడమంటే వాటిని నైతికంగా ఉన్నతం చేయడం అని భావించారు. "వాటిలో తన నామ సంస్మరణకు అల్లాహ్ అనుజ్ఞనిచ్చాడు" అన్న పదాలు స్థూలంగా చూస్తే మస్జిద్ అన్న వ్యాఖ్యానానికి బాగా అతుకుతాయి. కాని పరిశీలనగా గమనిస్తే మొదటి వ్యాఖ్యానాన్ని సమర్థించినట్లే రెండవ వ్యాఖ్యానాన్నీ అవి అంతే

لِيَجْزِيَهُمُ اللّٰهُ اَحْسَنَ مَا عَمِلُوْا وَيَزِيْدَهُمْ مِّنْ فَضْلِهٖ ؕ وَاللّٰهُ
يَرْزُقُ مَنْ يَّشَآءُ بِغَيْرِ حِسَابٍ ﴿۳۸﴾ وَالَّذِيْنَ كَفَرُوْۤا اَعْمَالُهُمْ
كَسَرَابٍۭ بِقِيْعَةٍ يَّحْسَبُهُ الظَّمْاٰنُ مَآءً ؕ حَتّٰۤى اِذَا جَآءَهٗ لَمْ يَجِدْهُ شَيْـًٔا
وَّوَجَدَ اللّٰهَ عِنْدَهٗ فَوَفّٰىهُ حِسَابَهٗ ؕ وَاللّٰهُ سَرِيْعُ الْحِسَابِ ﴿۳۹﴾

(వారు ఇదంతా చేయడానికి కారణం) ఏమిటంటే అల్లాహ్ వారి అత్యుత్తమ ఆచరణల ప్రతిఫలం వారికి అందజేయాలన్నది ఇంకా ఇతోధికంగా తన అనుగ్రహంతో వారిని సత్కరించాలన్నది మాత్రమే. అల్లాహ్ తాను తలచిన వారికి లెక్క లేకుండా ప్రసాదిస్తాడు.[69] (దీనికి భిన్నంగా) ఎవరయితే తిరస్కరించారో[70] వారి ఆచరణల ఉపమానం, నీరు కానరాని ఎడారిలో ఎండమావి వంటిది, దప్పిగొన్నవాడు దానిని నీరుగా భ్రమపడ్డాడు, తీరా అక్కడికి చేరగానే ఏమీ కానడు; పైగా అక్కడ అతడు అల్లాహ్‌ను కనుగొంటాడు, ఆయన అతని లెక్కను ఆసాంతం పూర్తిగా తీర్చివేస్తాడు, లెక్కచూడటంలో అల్లాహ్‌కు ఎంతో సేపు పట్టదు.[71]

సమర్థిస్తాయి. ఎందుకంటే, పౌరోహిత్యగ్రస్తమతాల వలె ఆరాధనను కేవలం ఆరాధనాలయాల వరకే పరిమితం చేయదు అల్లాహ్ షరీఅత్. అక్కడయితే పురోహితుడో, పూజారియో వారి వర్గానికి చెందిన ఒక వ్యక్తి ఆచార్యునిగా ముందు లేనిదే ఆరాధనా పురస్కారాలు నెరవేర్చబడలేవు. కాని ఇక్కడ మస్జిద్‌లానే ఇళ్ళు కూడా ఆరాధనాలయాలే. ప్రతి వ్యక్తి తనకు తానే పురోహితుడు. ఈ సూరా మొత్తంలో గృహస్థ జీవితాన్ని ఉన్నతం, ఉత్తమంగా తీర్చిదిద్దే నిర్దేశాలున్నం దువల్ల రెండవ వ్యాఖ్యానమే మాకు, సందర్భానుసారం, బాగా అతికినట్లు అగుపడుతోంది. అయితే మొదటి వ్యాఖ్యానాన్ని కాదనడానికి కూడా మరే సమంజసమయిన ఆధారం లేదన్నది కూడా వాస్తవమే. అందువల్ల విశ్వాసుల ఇండ్లు, వారి మస్జిదులు రెండున్నూ ఇక్కడ ఉద్దేశించబడ్డాయని భావిస్తే తప్పేముంది?

69. అల్లాహ్ పరంజ్యోతిని గ్రహించగలిగేందుకు, దాని అనుగ్రహాల ద్వారా ప్రయోజనం పొందేం దుకు అవసరమయిన లక్షణాలను ఇక్కడ విశదీకరించడం జరిగింది. అల్లాహ్ పంపిణీ చేసేది గుడ్డివాని పంపకం కాదు–ఇట్టే ఎవరికిబడితే వారికి సిరిసంపదలతో తులతూగేలా చెయ్యడానికి, ఎవరినిబడితే వారిని ఛీత్కరించడానికి. ఆయన ఎవరికి ఇచ్చినా ఏదో చూసే ఇస్తాడు; సత్యవరప్రసా దాన్ని ఇచ్చేటప్పుడు

ఆయన చూసేది, మనిషి ఆంతర్యంలో దైవప్రేమ, దైవం పట్ల ఆసక్తి, దైవభీతి, ఆయన బహుమానాల ఇచ్ఛ, ఆయన ఆగ్రహాల నుండి రక్షించుకునే తపన ఉన్నాయని, అతను ప్రపంచ వ్యామోహంలో మునిగిపోలేదని, ఎన్ని తీరికలేని పనులున్నా దైవ సంస్మరణ అతని హృదయంలో పాదుకుని ఉంటుంది. అతను పతన స్థితిలో పడి ఉండాలని కోరుకోడు. తన స్వామి ఏ ఔన్నత్యాల వైపునకు తనకు దారిచూపుతాడో వాటిని క్రియాశీలకంగా పొందాలని ప్రయత్నిస్తాడు; అతను ఈ మూన్నాళ్ళ జీవితంలోని ప్రయోజనాలను ఆశించడు. అతని దృష్టి పరలోకపు శాశ్వత జీవితంపైన లగ్నమయి ఉంటుంది. ఇవన్నీ చూసియే మనిషికి అల్లాహ్ జ్యోతిని పొందే సద్బుద్ధిని ప్రసాదించాలని నిర్ణయించడం జరుగుతుంది. ఇంకా దైవం ఇవ్వదలిస్తే ఎంతో ప్రసాదిస్తాడు. మనిషి చెరుగు సంకుచితమయితే వేరే విషయం కాని, ఆయన దాతృత్వానికి ఎటువంటి హద్దూ, అంతూ లేదు.

70. అంటే దైవం తరఫున ఆయన సందేశహరులు అందజేసిన ఉపదేశాలను ఇంకా ఆ సమయాన, దైవప్రవక్త మహనీయ ముహమ్మద్(స) అందజేస్తున్న సత్య బోధనల్నీ హృదయ పూర్వకంగా స్వీకరించడానికి నిరాకరించినవారు అన్నమాట. పైన వచ్చిన ఆయత్‌లు స్వయంగానే తెలుపు తున్నాయి, అల్లాహ్ జ్యోతిని పొందేవారంటే, సదాచారులయిన విశ్వాసులని. అందువల్ల ఇప్పుడు వారికి ప్రతిగా ఆ జ్యోతిని పొందేందుకు ఏకైక మార్గమయిన దైవసందేశహరుణ్ణి నమ్మడానికి, అతన్ని అనుసరించడానికి నిరాకరించేవారి పరిస్థితిని వివరించడం జరుగుతోంది- వారు మనఃపూర్వకంగా తిరస్కరించి కేవలం నోటితో అంగీకరించేవారయినా లేదా మనస్సు, నోరు రెంటితో తిరస్కరించేవారయినా.

71. ఈ ఉపమానంలో, కొందరి పరిస్థితి వివరించడం జరుగుతోంది. వారు తిరస్కారం, కాపట్యం ఉన్నప్పటికీ బాహ్యంలో కొన్ని సత్కార్యాలు సయితం చేస్తూ, మొత్తానికి పరలోకాన్నీ అంగీకరించే వారయి ఉంటారు. ఇంకా సత్యపరమయిన విశ్వాసం, విశ్వాసుల గుణగణాలు, దైవప్రవక్త విధేయత, అనుసరణలు లేకుండానే వారి ఈ సదాచరణ ఒక్కటే పరలోకంలో వారికి ప్రయోజనకరమవుతుందని వృధాభిప్రాయం కలిగీ ఉంటారు. ఉపమానం ధోరణిలో ఇలా తెలుపడం జరుగుతోంది : మీరు ఏ ప్రదర్శనా పూర్వకమయిన, బాహ్య సదాచరణల ద్వారా పరలోకంలో లాభమొందాలని ఆశిస్తున్నారో వాటి వాస్తవికత ఎండమావులకన్నా అధికం కాదు. ఎడారిలో దూరాన్నుంచి మెరిసే ఇసుకను చూసి దప్పికగొన్నవాడు ఏ విధంగా నీటి చెరువు అలరారుతోందని భ్రమపడి అటు వైపుగా దప్పిక తీర్చుకోవచ్చన్న ఆశతో తలెత్తి పరిగెడుతాడో. అదే విధంగా మీరున్నూ ఈ ఆచరణల బూటకపు ఆశతో మృత్యువు గమ్యం వైపునకు ప్రయాణిస్తూ ఉన్నారు. కాని ఎండమావుల వైపునకు పరిగెత్తేవారు తమకు చెరువు కనిపించిన చోటికి వెళ్ళినప్పుడు ఏ విధంగా ఏమీ పొందరో అదే విధంగా మీరు మృత్యువు గమ్యంలోకి ప్రవేశించినపుడు మీకు ప్రయోజనం చేకూర్చే ఏ విషయమూ అక్కడ లేదని కనుగొంటారు. దానికి బదులుగా మీ తిరస్కారానికి, కాపట్యానికి, ప్రదర్శనా పూర్వకంగా మీరు చేసే సత్కార్యాలతోపాటు మీ

اَوْ كَظُلُمٰتٍ فِىْ بَحْرٍ لُّـجِّىٍّ يَّغْشٰهُ مَوْجٌ مِّنْ فَوْقِهٖ مَوْجٌ مِّنْ فَوْقِهٖ
سَحَابٌ ؕ ظُلُمٰتٌۢ بَعْضُهَا فَوْقَ بَعْضٍ ؕ اِذَاۤ اَخْرَجَ يَدَهٗ لَمْ يَكَدْ يَرٰٮهَا ؕ
وَمَنْ لَّمْ يَجْعَلِ اللّٰهُ لَهٗ نُوْرًا فَمَا لَهٗ مِنْ نُّوْرٍ ۝٤٠ ع٥

లేదా దాని ఉపమానం, లోతయిన సముద్రంలో చీకటి వంటిది, పైన ఓ కెరటం అలుముకోగా, దానిపైన మరో కెరటం, ఆపైన మేఘం, చీకటిపైన చీకటి దట్టుకుంది, మనిషి తన చెయ్యి తీసి చూడాలన్నా చూడలేడు.[72] అల్లాహ్ ఎవరికయితే వెలుగును ప్రసాదించడో వానికి మరెటువంటి వెలుగూ ప్రాప్తం కాదు.[73] (ع5)

దుష్కార్యాలను ఎదుర్కొంటారు. అక్కడ లెక్కచూడటానికి, పూర్తి ప్రతిఫలం అందజెయ్యడానికి అల్లాహ్ ఉండటాన్ని గమనిస్తారు.

72. ఈ ఉపమానంలో సమస్త తిరస్కారులు, కపటుల స్థితిని వివరించడం జరిగింది. వారిలో ప్రదర్శనాపూర్వకమయిన సత్కార్యాలు చేసే వారు కూడా చేరి ఉన్నారు. వీరందరిని గురించి తెలుపడం జరుగుతోంది, వారు తమ జీవితం మొత్తాన్ని ఖచ్చితంగా పరిపూర్ణ అజ్ఞానంలో గడుపుతున్నారు. వారు ప్రాపంచిక పరిభాష రీత్యా సకల శాస్త్రపారంగతులు, సమస్త విద్యా నిష్ణాతులే అయినా, సర్వజ్ఞానసంపన్నులు, పాండిత్యంలో గుగ్గురువులే అయినాసరే. వారి ఉపమానం, పూర్తిగా చీకటి అలుముకున్న చోట, ఒక్క కాంతికిరణమూ చొరబడనొల్లని చోట చిక్కుకుపోయినటువంటి వ్యక్తి లాంటిది. ఆటంబాంబు, హైడ్రోజన్ బాంబు, శబ్దవేగంకన్నా వేగంగా పయనించే అంతరిక్ష నౌకలు, చంద్రమండలం చేరగల వాహనాలు నిర్మించడాన్నే జ్ఞానమని వారు అనుకుంటున్నారు. వారి దృష్టిలో ఆర్థిక శాస్త్రాలు, న్యాయశాస్త్రాలు, తత్వశాస్త్రాలలో ప్రావీణ్యమే జ్ఞానం, కాని వాస్తవ జ్ఞానం అన్నది వేరే వస్తువు. వీరికి దాని గాలి కూడా సోకలేదు. ఈ విషయం రీత్యా వీరు పరమ మూర్ఖులు; నిరక్షర కుక్షి అయిన ఒక పల్లెవాసి సత్యజ్ఞానం గ్రహించిన వాడయితే అతను ఈ "జ్ఞానుల"ను మించిన జ్ఞాని.

73. ఇక్కడికి చేరిన తరువాత అసలు ఉద్దేశ్యాన్ని వెల్లడించడం జరిగింది. అల్లాహ్ గగన భువనాల వెలుగు అన్న విషయ ప్రస్తావనతో ప్రారంభించిన ఉద్దేశ్యం ఇదే. విశ్వంలో అల్లాహ్ కాంతి తప్ప మరే కాంతి అసలు లేనే లేనప్పుడు, సకల వాస్తవాల వ్యక్తీకరణ ఆ కాంతి మూలంగానే అవుతున్నప్పుడు అల్లాహ్ కాంతిని పొందని వ్యక్తి పూర్తి చీకటిలో మునిగిపోకపోతే మరేమవుతుంది. మరెక్కడయినా వెలుగన్నది లేనే లేదు కదా, తద్వారా ఒక్క కిరణమయినా పొందడానికి.

اَلَمْ تَرَ اَنَّ اللّٰهَ يُسَبِّحُ لَهٗ مَنْ فِى السَّمٰوٰتِ وَالْاَرْضِ وَالطَّيْرُ صٰٓفّٰتٍ ؕ
كُلٌّ قَدْ عَلِمَ صَلَاتَهٗ وَتَسْبِيْحَهٗ ؕ وَاللّٰهُ عَلِيْمٌۢ بِمَا يَفْعَلُوْنَ ﴿۴۱﴾ وَلِلّٰهِ
مُلْكُ السَّمٰوٰتِ وَالْاَرْضِ ۚ وَاِلَى اللّٰهِ الْمَصِيْرُ ﴿۴۲﴾ اَلَمْ تَرَ اَنَّ اللّٰهَ يُزْجِىْ
سَحَابًا ثُمَّ يُؤَلِّفُ بَيْنَهٗ ثُمَّ يَجْعَلُهٗ رُكَامًا فَتَرَى الْوَدْقَ يَخْرُجُ مِنْ
خِلٰلِهٖ ۚ وَيُنَزِّلُ مِنَ السَّمَآءِ مِنْ جِبَالٍ فِيْهَا مِنْۢ بَرَدٍ فَيُصِيْبُ بِهٖ
مَنْ يَّشَآءُ وَيَصْرِفُهٗ عَنْ مَّنْ يَّشَآءُ ؕ يَكَادُ سَنَا بَرْقِهٖ يَذْهَبُ بِالْاَبْصَارِ ﴿۴۳﴾ ؕ
يُقَلِّبُ اللّٰهُ الَّيْلَ وَالنَّهَارَ ؕ اِنَّ فِىْ ذٰلِكَ لَعِبْرَةً لِّاُولِى الْاَبْصَارِ ﴿۴۴﴾

41 - 42 నీవు[74] గమనించడం లేదా, సమస్తం అల్లాహ్ పరిశుద్ధతను కొనియాడుతున్నాయని- ఆకాశాలలోనూ భూమిలోనూ ఉన్నవన్నీ, రెక్కలు చాచి ఎగురుతున్న పక్షులున్నూ? ప్రతిదీ తన నమాజ్, దైవసంకీర్తనా విధానం బాగా ఎరుగు, ఇవన్నీ చేసేదేమిటో అల్లాహ్ తెలుసుకుంటూనే ఉంటాడు. గగన భువనాల సామ్రాజ్యం అల్లాహ్‌కే చెందుతుంది, సర్వం ఆయన వైపునకే మరలవలసి ఉంది.

43 - 44 నీవు గమనించడం లేదా, అల్లాహ్ మేఘాన్ని నింపాదిగా నడిపిస్తాడు, తిరిగి దాని తునకల్ని ఒండొకదానితో కలుపుతాడు, ఆపైన దాన్ని ప్రోగుచేసి దట్టమయిన మబ్బుగా రూపొందిస్తాడు, అప్పుడు నీవూ చూస్తావు, దాని సందుల్లో నుంచి వాన జల్లులు పడటం మొదలవుతుంది. మరాయన ఆకాశం నుండి, అందున ఎత్తుగా ఉన్న[75] పర్వతాల మూలంగా వడగండ్లు కురిపిస్తాడు, తాను తలచిన వారికి వాటివల్ల నష్టం కలుగజేస్తాడు, మరి తాను కోరిన వారిని వాటి నుండి కాపాడతాడు. ఆయన ఉరుముల మెరుములు చూపులను బెదరగొడతాయి. రేయింబవళ్ళ భ్రమణం ఆయనే కల్పిస్తున్నాడు. ఇందులో ఒక గుణపాఠముంది కళ్ళున్న వారికి.

وَاللّٰهُ خَلَقَ كُلَّ دَآبَّةٍ مِّنْ مَّآءٍ ۚ فَمِنْهُمْ مَّنْ يَّمْشِىْ عَلٰى بَطْنِهٖ ۚ

وَمِنْهُمْ مَّنْ يَّمْشِىْ عَلٰى رِجْلَيْنِ ۚ وَمِنْهُمْ مَّنْ يَّمْشِىْ عَلٰٓى اَرْبَعٍ ؕ يَخْلُقُ

اللّٰهُ مَا يَشَآءُ ؕ اِنَّ اللّٰهَ عَلٰى كُلِّ شَىْءٍ قَدِيْرٌ ﴿۴۵﴾ لَقَدْ اَنْزَلْنَآ اٰيٰتٍ مُّبَيِّنٰتٍ ؕ

وَاللّٰهُ يَهْدِىْ مَنْ يَّشَآءُ اِلٰى صِرَاطٍ مُّسْتَقِيْمٍ ﴿۴۶﴾

45 అల్లాహ్ ప్రతి ప్రాణిని ఒక విధమయిన నీటితో సృజించాడు, ఒకటి కడుపుతో ప్రాకుతూ ఉంటే మరొకటి రెండు కాళ్ళతో నడుస్తోంది, ఇంకొకటి నాలుగు కాళ్ళతో. తాను కోరినదేదయినా ఆయన సృష్టిస్తూ ఉంటాడు, ఆయన ప్రతి విషయానికీ సమర్థుడు.

46 మేమయితే అతి స్పష్టంగా యదార్థాన్ని విడమర్చి తెలిపే ఆయత్‌లను అవతరింపజేసిపెట్టాము, ఆపైన రుజుమార్గం వైపునకు అల్లాహ్ తాను కోరిన వారికి స్వయంగానే మార్గబోధనం అందజేస్తాడు.

74. అల్లాహ్ నిఖిల జగతికి వెలుగు అన్న ప్రస్తావన పైన వచ్చేసింది. ఇంకా ఈ కాంతిని గ్రహించగలిగే సద్బుద్ధి కేవలం సదాచారులయిన విశ్వాసులకే ప్రాప్తమవుతుందని కూడా చెప్పడం జరిగింది. ఇంకా మిగిలిన జనావళి ఈ పరిపూర్ణ కాంతి క్షేత్రంలోనే ఉన్నప్పటికీ గ్రుడ్డివారిలా చీకటిలో తచ్చాడుతూనే ఉంటారని కూడా తెలుపడం జరిగింది. ఇప్పుడు ఆ కాంతి వైపునకు మార్గం చూపే అసంఖ్యాకమయిన సూచనలలో కొన్నింటిని మాత్రమే నమూనాగా ముందుంచడం జరుగుతోంది. మనో నేత్రాలను తెరచి ఎవరయినా వాటిని చూసినట్లయితే అనునిత్యం అన్ని వైపులా అల్లాహ్‌ను క్రియాశీలంగా కానగలుగుతాడు. కాని ఎవరి మనసు గ్రుడ్డిదో వారు తమ చర్మచక్షువులు చించుకుని చూసినా వారికి బయోలొజీ, జువొలొజి ఇంకా తదితర శాస్త్రాలయితే బాగా వ్యవహరిస్తూ ఉన్నట్లు గోచరిస్తాయి కాని అల్లాహ్ ఎక్కడా పని చేస్తూ ఉన్నట్లు కానరాదు.

75. అంటే శీతల స్థితి వల్ల గడ్డకట్టుకుపోయిన మేఘాలు కావచ్చు. వాటిని ఉపమానపూర్వకంగా ఆకాశపు కొండలుగా అభివర్ణించడం జరిగింది. అవి నేలపైని కొండలు కూడా కావచ్చు. అవి ఆకాశంలో ఎత్తుగా ఉన్నట్లు అగుపిస్తాయి. వాటి శిఖరాల పైన గడ్డకట్టిన మంచు కారణంగా గాలులు మరీ చల్లబారిపోయి మేఘాలు గడ్డకట్టిపోతాయి. వడగళ్ళ రూపంలో అవి వర్షిస్తాయి.

وَيَقُولُونَ اٰمَنَّا بِاللّٰهِ وَبِالرَّسُولِ وَاَطَعْنَا ثُمَّ يَتَوَلّٰى فَرِيقٌ مِّنْهُمْ
مِّنْۢ بَعْدِ ذٰلِكَ ؕ وَمَاۤ اُولٰٓئِكَ بِالْمُؤْمِنِينَ ﴿٤٧﴾ وَاِذَا دُعُوۡۤا اِلَى اللّٰهِ وَرَسُولِهٖ
لِيَحْكُمَ بَيْنَهُمْ اِذَا فَرِيقٌ مِّنْهُمْ مُّعْرِضُونَ ﴿٤٨﴾ وَاِنْ يَّكُنْ لَّهُمُ الْحَقُّ
يَاْتُوۡۤا اِلَيْهِ مُذْعِنِينَ ﴿٤٩﴾ اَفِيْ قُلُوبِهِمْ مَّرَضٌ اَمِ ارْتَابُوۡۤا اَمْ يَخَافُونَ
اَنْ يَّحِيفَ اللّٰهُ عَلَيْهِمْ وَرَسُولُهٗ ؕ بَلْ اُولٰٓئِكَ هُمُ الظّٰلِمُونَ ﴿٥٠﴾

47 - 52 మేము దైవాన్నీ, దైవసందేశహరుణ్ణీ విశ్వసించామని, మేము విధేయతను స్వీకరించామని ఈ జనం అంటున్నారు, కాని ఆ తరువాత వీరిలోని ఒక వర్గం (విధేయతకు) వైముఖ్యం చూపుతుంది. ఇలాంటివారు ఎన్నటికీ విశ్వాసులు కాజాలరు.[76] వీరి మధ్యనున్న వ్యాజ్యాలకు తీర్పు చెయ్యాలని[77] వీరిని అల్లాహ్ వైపునకు, దైవసందేశహరుని వైపునకు పిలిచినప్పుడు వీరిలో ఒక ప్రత్యర్థివర్గం దాటవేస్తుంది.[78] అయితే సత్యం తమకు అనుకూలంగా ఉన్నట్లయితే ఎంతో విధేయతా తత్పరులయి ప్రవక్త సన్నిధిలో హాజరవుతారు.[79] వీరి హృదయాలను (ద్వంద్వనీతి) రోగం పట్టుకున్నదా? లేదా వీరు ఏదయినా సంశయంలో పడిపొయ్యారా? లేదా వీరికేదయినా భయం కలుగుతోందా - అల్లాహ్, మరాయన సందేశహరుడు వీరికి అన్యాయం చేస్తాడని? వాస్తవం ఏమిటంటే అసలు అన్యాయవర్తనులు స్వయంగా వీరే.[80] (ع 6)

76. అంటే విధేయత పాటించకపోవడం వల్ల వారు చేసే విశ్వాస వాదన దానంతట అదే రద్దయి పోతుంది. వారి ఈ చేష్ట వల్ల, వారు తాము విశ్వసించినట్లు, విధేయతను అంగీకరించినట్లు చేసే ప్రకటన అబద్ధపు ప్రకటన అన్న విషయం బట్టబయలయిపోతుంది.

77. ఈ పదాలు అతి స్పష్టంగా తెలుపుతున్నాయి. ప్రవక్త చేసే నిర్ణయం, అల్లాహ్ నిర్ణయమేనని, ప్రవక్త ఆదేశం అల్లాహ్ ఆదేశమేనని. ప్రవక్త వైపునకు పిలుపునివ్వడమంటే కేవలం ప్రవక్త వైపునకే పిలువడం కాదు, అల్లాహ్, ప్రవక్త ఉభయుల వైపునకు పిలువడమే అవుతుంది. ఈ ఆయత్, పై ఆయత్‌ల ద్వారా ఒక విషయం సందేహరహితంగా విశదమయిపోతుంది, అల్లాహ్ ప్రవక్తల విధేయత

లేకుండా విశ్వాసపు ప్రకటన అర్థరహితమని, దైవం, దైవప్రవక్తల విధేయత అంటే భావం, ముస్లిములు వ్యక్తిగత స్థాయిలోను, జాతి స్థాయిలోనూ అల్లాహ్, అల్లాహ్ సందేశహరుడు వారికి అందజేసిన చట్టం ముందు శిరసావహించాలన్నదే తప్ప మరేమీ కాదని తేటతెల్లమయిపోతుంది. వారు ఈ వైఖరి నవలంబించకపోతే వారు చేసే ఈమాన్ ప్రకటన కపటపూర్వకమయిన ప్రకటన. (పోల్చి చూడండి, నిసా సూరా:59 -61; పాద సూచికలు 89-92)

78. ఈ వ్యవహారం కేవలం దైవప్రవక్త (స) జీవితం వరకే పరిమితం కాదు. ఆయన తరువాత ఇస్లామీయ రాజ్యంలో న్యాయ నిర్ణయ పదవిలో ఉన్నవారెవరయినా దైవగ్రంథం, ప్రవక్త సంప్రదాయాల కనుగుణంగానే తీర్పు చేయాలి. అటువంటి వారి న్యాయపీఠం పంపే సమను వాస్తవానికి అల్లాహ్, ఆయన ప్రవక్త న్యాయపీఠం పంపే సమను అన్నమాట. దానికి వైముఖ్యం చూపే వ్యక్తి నిజానికి దానికి కాదు, అల్లాహ్‌కు, అల్లాహ్ సందేశహరునికీ విముఖుడయ్యాడన్నమాట. ఈ విషయాన్ని ఇలా విశదీకరించింది స్వయంగా ప్రవక్త మహనీయుల (స) వారే. హజ్రత్ హసన్ బసరి (రహ్మ) ఉల్లేఖించిన ఒక హదీసులో ఇలా ఉంది. ఎవరయితే ముస్లిముల న్యాయస్థాన అధికారులలో ఒక అధికారి వద్దకు పిలువనంపబడతాడో, అతడు న్యాయస్థానంలో హాజరు కాకపోతే, దౌర్జన్యుడుగా పరిగణించబడతాడు, అతనికి ఎలాంటి హక్కూ సంక్రమించదు. (అహ్కాముల్ ఖుర్ఆన్ - జస్సాస్, సంపుటి 3; పుట 405). మరో విధంగా చెప్పాలంటే ఇలాంటి వ్యక్తి శిక్షకు కూడా పాత్రుడవుతాడు. ఇంకా అతన్ని మిథ్యావాదిగా పరిగణించి అతనికి వ్యతిరేకంగా ఏకపక్ష నిర్ణయం చేయడానికి కూడా అవకాశం ఉంది.

79. ఈ ఆయత్ ఒక యదార్థాన్ని అతి స్పష్టంగా విడమర్చి తెలుపుతోంది. ఏ వ్యక్తి అయితే షరీఅత్‌లో తనకు ప్రయోజనకరమనిపించిన విషయాలనయితే సంతోషంగా ముందుకు వచ్చి చేజేతులా అందుకుంటాడో, ఇంకా దేవుని షరీఅత్‌లో అతని ఆశయాలకు, కాంక్షలకు వ్యతిరేకమయిన వాటిని తృణీకరిస్తాడో, ఆ చట్టాలకు బదులుగా ప్రపంచంలోని ఇతర చట్టాలకు ప్రాధాన్యతనిస్తాడో అతడు విశ్వాసి కాదు, ద్వంద్వనీతిపరుడు, కపటి, అతను చేసే ఈమాన్ ప్రకటన బూటకమయింది. అతడు దైవం, దైవప్రవక్తను విశ్వసించలేదు, తన కాంక్షలు, ఆశయాలను నమ్ముకున్నాడు. ఈ వైఖరితో పాటు అతను షరీఅత్‌లోని ఏదయినా ఒక అంశాన్ని అంగీకరించినా దానికి దేవుని దృష్టిలో ఎలాంటి విలువా లేదు.

80. అంటే ఈ వైఖరికి మూడే కారణాలు సాధ్యం. ఒకటి, మనిషి అసలు విశ్వసించకనేపోవడం, ద్వంద్వనీతి విధానంతో కేవలం మోసపుచ్చడానికి, ముస్లిమ్ సమాజంలో ప్రవేశం ద్వారా అధర్మమయిన ప్రయోజనం పొందడానికి ముస్లిమయిపోవడం. రెండు, విశ్వసించినప్పటికీ, దైవసందేశహరుడు నిజంగా దైవ సందేశహరుడేనా కాదా అన్న సందేహం ఇంకా అతన్ని వెంటాడుతూనే ఉండటం. ఖుర్ఆన్

إِنَّمَا كَانَ قَوْلَ الْمُؤْمِنِينَ إِذَا دُعُوٓا إِلَى اللَّهِ وَرَسُولِهِ لِيَحْكُمَ بَيْنَهُمْ أَن
يَقُولُوا سَمِعْنَا وَأَطَعْنَا ۚ وَأُولَٰئِكَ هُمُ الْمُفْلِحُونَ ﴿٥١﴾ وَمَن يُطِعِ اللَّهَ
وَرَسُولَهُ وَيَخْشَ اللَّهَ وَيَتَّقْهِ فَأُولَٰئِكَ هُمُ الْفَائِزُونَ ﴿٥٢﴾

విశ్వసించినవారి బాధ్యత ఏమిటంటే వారి మధ్య తీర్పు చేయడానికి అల్లాహ్ వైపునకు, దైవసందేశహరుని వైపునకు వారిని పిలిచినప్పుడు, వారు, మేము విన్నాము, దాన్ని అనుసరించాము అని పలకడం మాత్రమే. ఇలాంటి వారే నిజానికి సఫలత పొందేవారు. ఇంకా, దైవం దైవసందేశహరుల ఆజ్ఞాపాలనం చేసేవారు, అల్లాహ్‌కు భయపడేవారు, ఆయన అవిధేయత నుండి తప్పించుకునేవారు - వీరే సఫలీకృతులయ్యేవారు.

దైవగ్రంథమా కాదా, పరలోకం నిజంగానే సంభవించనున్నదా లేదా అది కేవలం ఒక కాల్పనిక గాథనా ఇంకా దైవం కూడా యదార్థానికి ఉన్నాడా లేడా అది కూడా ఒక ఊహ మాత్రమేనా, ఏదో ఒక ఔచిత్యం కారణంగా కల్పించుకోవడం జరిగిందా అన్న ఆశంకలు అతనిలో మెదలుతూ ఉండటం. మూడు, అతడు దైవాన్ని దైవంగాను, ప్రవక్తను ప్రవక్తగానూ నమ్ముతూ కూడా వారు అన్యాయం చేస్తారని సంశయించేవాడు, దైవగ్రంథం ఫలానా ఆదేశమిచ్చి తమను విపత్తులో పడవేసిందని, దైవప్రవక్త సెలవిచ్చిన ఫలానా బోధన లేదా ఫలానా విధానం తమకు అత్యంత నష్టదాయకం అని భావించడం అన్నమాట. ఈ మూడు కారణాల్లో ఏ కారణమయినాసరే ఇలాంటి వారు దుర్మార్గులవడంలో ఎలాంటి సందేహం లేదు. ఇటువంటి అభిప్రాయాలతో ఎవరయినా ముస్లిముల్లో చేరిపోయినట్లయితే, విశ్వాసిగా ప్రకటించుకుంటే, ముస్లిమ్ సమాజంలోని సభ్యునిగా విభిన్న అధర్మమయిన ప్రయోజనాలు ఈ సమాజం నుండి గ్రహిస్తూ ఉన్నట్లయితే అతడు మహామహుడయిన వంచకుడు, ద్రోహి, కుతంత్రశీలుడని భావం. అతడు తనకు తాను కూడా అన్యాయం చేసుకుంటాడు- ప్రొద్దస్తమానం అబద్ధాలు పలకడం వంటి లక్షణాల వల్ల తన ఆంతర్యాన్ని కడు హేయమయిన లక్షణాలు మూర్తీభవించిన అస్తిత్వంగా రూపొందించు కుంటాడు. అతడు బాహ్యంలో సాక్ష్యపు కలిమా (వచనం) పలకడాన్ని నమ్మి అతన్ని తమ సముదాయంలోని ఒక అంశంగా చేర్చుకోవడంతోపాటు అతనితో రకరకాల సామాజిక, నాగరిక, రాజకీయ, నైతిక సంబంధాలను ఏర్పరచుకునేటటువంటి ముస్లిములకు కూడా అన్యాయం చేస్తాడు.

وَاَقْسَمُوْا بِاللّٰهِ جَهْدَ اَيْمَانِهِمْ لَئِنْ اَمَرْتَهُمْ لَيَخْرُجُنَّ ؕ قُلْ لَّا
تُقْسِمُوْا ۚ طَاعَةٌ مَّعْرُوْفَةٌ ؕ اِنَّ اللّٰهَ خَبِيْرٌۢ بِمَا تَعْمَلُوْنَ ﴿٥٣﴾ قُلْ
اَطِيْعُوا اللّٰهَ وَاَطِيْعُوا الرَّسُوْلَ ۚ فَاِنْ تَوَلَّوْا فَاِنَّمَا عَلَيْهِ مَا حُمِّلَ
وَعَلَيْكُمْ مَّا حُمِّلْتُمْ ؕ وَاِنْ تُطِيْعُوْهُ تَهْتَدُوْا ؕ وَمَا عَلَى الرَّسُوْلِ اِلَّا
الْبَلٰغُ الْمُبِيْنُ ﴿٥٤﴾

53 – 54 వీరు (కపటులు) అల్లాహ్ పేరు మీదుగా గట్టి గట్టి ప్రమాణాలు చేసి మరీ చెబుతారు, "మీరు ఆజ్ఞాపిస్తే చాలు మేము ఇండ్ల నుండి బయలుదేరుతాము". వీరికి చెప్పు, "ప్రమాణాలు చెయ్యకండి, మీ విధేయత ఎలాంటిదో బాగా తెలుసు,[81] మీ చేష్టలను గురించి అల్లాహ్‌కు తెలియనిది కాదు."[82] చెప్పు, "అల్లాహ్‌కు విధేయులయి మెలగండి, ప్రవక్త ఆజ్ఞాపాలకులయి జీవించండి. కాని ఒకవేళ మీరు విముఖులయి నట్లయితే బాగా అర్థం చేసుకోండి, దైవసందేశహరుని మీద ఏ విధి బాధ్యతాభారం మోపబడిందో దానికి బాధ్యుడు ఆయనే, మరి ఏ బాధ్యతాభారం మీ మీద మోపబడిందో దానికి బాధ్యులు మీరు. ఆయన పట్ల విధేయత పాటిస్తే మీరే స్వయంగా సన్మార్గం పొందుతారు. లేకపోతే ప్రవక్త బాధ్యత, దైవాదేశాన్ని అతి స్పష్టంగా అందజెయ్యడమే తప్ప మరేమీ కాదు."

81. మరో భావం ఏమిటంటే, విశ్వాసులయిన వారి నుండి కోరే విధేయత ప్రసిద్ధమయినది, అందరికీ తెలిసినటువంటి విధేయత, అది అన్ని విధాల శంకలకు సందేహాలకు అతీతమయింది. నమ్మించడానికి ప్రమాణాలు చేసినా నమ్మశక్యం కానటువంటి విధేయత కాదు. వాస్తవంగా ఆజ్ఞాపాలనం చేసే వారి వైఖరి గోప్యంగా ఉండదు. ఏ వ్యక్తి అయినా సరే వారి వైఖరిని చూసి ఇట్టే గ్రహించగలడు – వీరు విధేయతాశీలురయిన వారని. ఇటువంటి వారి విషయంలో ఏ విధమయిన సందేహం శంకలు కలిగే అవకాశమే ఉండదు, వాటిని దూరం చేయడానికి ప్రమాణాలు చేసే అవసరమూ ఏర్పడదు.

82. ఈ వంచనా శిల్పాలు ప్రజల సమక్షంలోనయితే చెలామణి అవతాయేమో గాని ప్రజల స్రష్ట

وَعَدَ اللّٰهُ الَّذِيْنَ اٰمَنُوْا مِنْكُمْ وَعَمِلُوا الصّٰلِحٰتِ لَيَسْتَخْلِفَنَّهُمْ
فِي الْاَرْضِ كَمَا اسْتَخْلَفَ الَّذِيْنَ مِنْ قَبْلِهِمْ ۠ وَلَيُمَكِّنَنَّ لَهُمْ دِيْنَهُمُ
الَّذِي ارْتَضٰى لَهُمْ وَلَيُبَدِّلَنَّهُمْ مِّنْۢ بَعْدِ خَوْفِهِمْ اَمْنًا ۭ يَعْبُدُوْنَنِيْ
لَا يُشْرِكُوْنَ بِيْ شَيْــــًٔا ۭ وَمَنْ كَفَرَ بَعْدَ ذٰلِكَ فَاُولٰۗىِٕكَ هُمُ الْفٰسِقُوْنَ ۝

55 – 57 అల్లాహ్ వాగ్దానం చేశాడు, మీలో విశ్వసించి, సదాచరణను పాటించిన వారికి – వారికి పూర్వం గతించిన జనుల్ని చేసినట్లే, వారినీ భువిలో ఖలీఫాగా నియమిస్తాడనీ; తాను వారి కొరకు ఇష్టపడిన వారి ధర్మాన్ని పటిష్ఠ మయిన ప్రాతిపదికలపైన సుస్థిరంగా స్థాపిస్తాడనీ; ఇంకా (ప్రస్తుతం) వారి భయపూర్వకమయిన పరిస్థితిని శాంతియుతంగా మార్చివేస్తాడనీ – అయితే ఒక్కటి, వారు నన్నే ఆరాధించాలి, నాతోపాటు మరెవరినీ సహవర్తులుగా ఎంచరాదు.[83] మరి ఆ తరువాత ఎవరయితే తిరస్కారానికి[84] పాల్పడతారో వారే పరమపాపులు.

అయిన దైవం సమక్షంలో ఎలా చెల్లుతాయి. ఆయనయితే బహిర్గతమయ్యే, గోప్యంగా ఉండే అన్ని పరిస్థితుల్నీ ఇంకా హృదయాలలో దాగి ఉండే సంకల్పాలు, అభిప్రాయాలు అన్నీ ఎరిగినవాడు.

83. మేము ఈ ప్రసంగ క్రమం ప్రారంభంలో సూచించినట్లు ఇలా సెలవిచ్చిన దాని ఉద్దేశం మునాఫికుల (ద్వంద్వనీతిపరుల)ను హెచ్చరించడం. అల్లాహ్ ముస్లిములకు చేసిన "ఖిలాఫత్" ప్రసాదించే వాగ్దానానికి సంబోధితులు కేవలం జనాభా లెక్కల్లో ముస్లిములుగా నమోదయిన ముస్లిములు కారు, విశ్వాసంలో సత్యనిరతులయినవారు, నీతి నియమాల్లో, ఆచరణల్లో రుజువర్తనులయినవారు, అల్లాహ్‌కు ప్రియప్రదమయిన ధర్మాన్ని అవలంబించేవారు, సకల విధాల బహుదైవోపాసనకు దూరమయి పరిశుద్ధులయి స్వచ్ఛమయిన ఏకేశ్వరోపాసన, దైవదాస్యానికి దైవారాధనకు కట్టుబడి ఉండే ముస్లిములు. ఈ లక్షణాలు లేని వారు, కేవలం నోటితో ఈమాన్ (విశ్వాసం) ప్రకటించేవారు ఈ వాగ్దానానికి పాత్రులూ కారు, ఈ వాగ్దానం వారికి చెయ్యబడనూ లేదు, అందువల్ల వారు ఇందులో భాగీదారులవుతామని ఆశించనూ రాదు.

కొందరు "ఖిలాఫత్" అంటే, ప్రభుత్వం, రాజ్యం, పరిపాలన, ఆధిక్యత, సర్వస్వాధీనత అన్న భావం గ్రహించారు. ఆ తరువాత ఈ ఆయత్ ద్వారా ఒక పరిణామాన్ని సాగదీశారు. దాని ప్రకారం,

ప్రపంచంలో ఎవరికి ఇది (ప్రభుత్వం, అధికారం) ప్రాప్తమయి ఉందో అతను విశ్వాసి అనీ, రుజువర్తనుడు అనీ, అల్లాహ్‌కు ప్రియపాత్రమయిన ధర్మాన్ని అనుసరించేవాడు అనీ, దైవదాస్యాన్ని పాటించేవాడు అనీ, బహుదైవారాధనను పరిత్యజించినవాడు అనీ నిర్ణయించారు. పైగా ఘోరమయిన దౌర్జన్యం ఏమిటంటే, తమ ఈ తప్పుడు పరిణామ భావాన్ని సరిగ్గా అతికించడానికి, విశ్వాసం, రుజువర్తనం, సత్యధర్మం, దైవారాధన, బహుదైవ వాదం- ప్రతి దాని భావాన్ని మార్చి తమ ఈ సిద్ధాంతాని కనుగుణమయినదిగా చేసివేస్తారు. ఇలా చేయడం ఖుర్ఆన్ భావాన్ని వక్రీకరించడమే అవుతుంది, ఇది యూదులూ క్రైస్తవుల ప్రక్షిప్తాలను మించిపోయింది. ఈ వక్రీకరణ, ఖుర్ఆన్‌లోని ఒక ఆయత్‌కు తొడిగిన అర్థాలు, పూర్తి ఖుర్ఆన్ బోధనల్ని రూపుమాపేటటువంటివి, ఇస్లామ్ బోధించే ఏ విషయాన్నీ దాని స్థానాన నిలుపవు. 'ఖిలాఫత్' అంటే ఇదే నిర్వచనమయితే, ప్రపంచంలో ఎప్పుడు ఆధిక్యత, అధికారం పొందినవారయినా, లేదా నేడు పొంది ఉన్నవారయినా, వారు ఈ నిర్వచనానికి సరిపోయినవారే - వారు దైవాన్నీ, వహీని, దైవదౌత్యాన్ని, పరలోకాన్నీ, ప్రతిదాన్నీ తిరస్కరించేవారయినా ఖుర్ఆన్, మహా పాపాలుగా ప్రకటించినటువంటి పాపకార్యాలు, అపరాధ ప్రధానమయిన సమస్త దౌష్ట్యాల్లో వడ్డీ, వ్యభిచారం, మద్యం, జూదం వంటి వాటిలో - పూర్తిగా మునిగి ఉన్న వారయినా సరే. తదనుగుణంగా వీరంతా సద్వర్తనులయిన విశ్వాసులు, అందువల్లనే ఖిలాఫత్ వంటి ఉన్నత స్థాయి వీరికి బహూకరించబడింది; అలాంటప్పుడు ఈమాన్ అంటే అర్థం, ప్రకృతి సిద్ధాంతాలను నమ్మడం, సద్వర్తన అంటే భావం ఆ సిద్ధాంతాలను అమలుపరచడం తప్ప మరేమి కాగలదూ? అల్లాహ్‌కు ఇష్టమయిన ధర్మం అంటే అర్థం, భౌతిక శాస్త్రాలలో ప్రావీణ్యం, పరిపక్వత సాధించి పరిశ్రమల్లో, కళల్లో, వాణిజ్యంలో, రాజకీయాల్లో బాగా ప్రగతి సాధించడం తప్ప మరేమవుతుంది? అల్లాహ్ దాస్యం అంటే భావం, వ్యక్తిగత సామూహిక కృషి ప్రయత్నాలలో సఫలతను చేకూర్చేందుకు సహజంగా అవసరమయిన దానికి ప్రయోజనకరమయిన నియమాలూ నిబంధనలను పాటించడం తప్ప మరేమి కాగలదు? ఇక షిర్క్ (బహుదైవారాధన) అంటే అర్థం ఏమిటి - ఆ ప్రయోజనకరమయిన నియమనిబంధనలతోపాటు హానికరమయిన విధానాలను ఏ వ్యక్తి అయినా లేదా ఏ జాతి అయినా అవలంబించడం తప్ప మరేం కాగలదు? కాని ఎవరయినా నిష్పక్షపాత హృదయంతో, ఎటువంటి ప్రత్యేకమయిన అద్దాలు లేకుండా దివ్యఖుర్ఆన్‌ని అధ్యయనం చేసిన వ్యక్తి ఖుర్ఆన్‌లో విశ్వాసం, సదాచరణ, సత్యధర్మం, దైవారాధన, దేవుని ఏకత్వం, బహు దైవవాదన ఇత్యాది వాటికి అర్థం ఇదే అంటే నమ్ముతాడా? ఈ అర్థం గ్రహించే వ్యక్తి ఖుర్ఆన్‌ని అర్థం చేసుకుంటూ పూర్తిగా ఎప్పుడూ చదవనివాడే కాగలడు; అతను అటునుంచి ఒక ఆయత్, ఇటు నుంచి మరో ఆయత్ తీసుకుని వాటిని తన సిద్ధాంతాలకనుగుణంగా, తన భావనలకను రూపంగా మలచుకున్నవాడే కాగలడు. లేదా ఇలా చేసే వ్యక్తి, ఖుర్ఆన్‌ని చదువుతూ ఆయత్‌లన్నీ తన స్వంత ఊహల రీత్యా ఆసాంతం అర్థరహితమని,

తప్పయినవని నిర్ణయిస్తూ పోయే వ్యక్తి మాత్రమే కాగలడు. వాటిలో పరమప్రభువు అల్లాహ్‌ను ఏకైక ప్రభువని, ఆరాధ్యుడని, ఆయన అవతరింపజేసిన వహీని మానవ మార్గదర్శకత్వానికి ఒకే ఒక్క మార్గమని, ఆయన ప్రభవింపజేసిన ప్రతి ప్రవక్త ఖచ్చితంగా అనుసరణీయుడయిన నాయకుడని నమ్మాలని సందేశం ఇవ్వటం జరిగిన బోధనల్ని, ఇంకా ప్రస్తుత ప్రపంచ జీవితం అంతమయిన తరువాత రాబోయే జీవితాన్ని కేవలం నమ్మాలని కోరడమేకాక, ఆ జీవితంలో జవాబు చెప్పుకోవలసి ఉందన్న భావనను తిరస్కరించి, లేదా ఆ భావనే లేకుండా, కేవలం ఇహలోక సాఫల్యాలను మాత్రమే తమ ధ్యేయాలుగా భావించి పని చేసేవారు సఫలతకు దూరమవుతారని అత్యంత స్పష్టంగా చెప్పివెయ్యడం జరిగిన బోధనల్నీ, ఈ బోధనలనన్నింటినీ అర్థరహితమని భావించి ఖుర్ఆన్‌ని చదవనివాడే కాగలడు. ఖుర్ఆన్‌లో ఈ విషయాలను ఎంతో విరివిగా, విభిన్న విధాలుగా, అతి స్పష్టమయిన విశదమయిన పదాలలో మాటిమాటికీ పునరుక్తం చెయ్యడం జరిగింది. ఈ గ్రంథాన్ని నిజాయితీగా చదివిన ఏ వ్యక్తి అయినా ఎప్పుడయినా ఇటువంటి అపార్థాలకు లోనవగలడని నమ్మడం కష్టం. ఈ అభినవ వ్యాఖ్యాతలు "ఖిలాఫత్"కు సంబంధించిన ప్రస్తుత ఆయత్‌లో ప్రయోగించిన 'ఇస్తిఖ్‌లాఫ్' – (ఖలీఫాగా నియమించడం) ను గురించి లోనయిన అపార్థాలు నమ్మశక్యంగా లేవు. నిజానికి "ఖిలాఫత్" అనే పదం, "ఇస్తిఖ్‌లాఫ్" (ఖలీఫాగా నియమించడం) అనే పదాలకు వీరు ఆపాదించిన అర్థం, ఆ అర్థం ఆధారంగా నిలబెట్టిన కట్టడం వీరి స్వంత కల్పనలు. ఖుర్ఆన్‌ని ఎరిగిన ఏ వ్యక్తి కూడా ఈ ఆయత్‌కు ఆ అర్థం ఎన్నడూ చెప్పలేదు.

ఖుర్ఆన్ ఖిలాఫత్ అనే పదాన్నీ ఇస్తిఖ్‌లాఫ్ అనే పదాన్నీ మూడు వివిధ అర్థాలలో ప్రయోగిస్తుంది. ప్రతి చోటా పూర్వోత్తరాలు పరిశీలిస్తే ఎక్కడ ఏ అర్థంలో ప్రయోగించిందో తెలిసిపోతుంది:

దీనికి ఒక భావమేమో, "దైవం ఇచ్చిన అధికారాలను కలిగి ఉండటం," ఈ భావంలో ఆదమ్ సంతానం అంతా భువిలో దైవానికి 'ఖలీఫా' లేదా ప్రతినిధియే.

రెండవ అర్థం, "దేవుని ప్రభుసత్తాను అంగీకరిస్తూ ఆయన షరీఅత్ ఆదేశాల (ప్రకృతి ధర్మాలు కాదు) కనుగుణంగా 'ఖిలాఫత్' (ప్రాతినిధ్య) అధికారాలను వినియోగించుకోవడం." ఈ భావంలో సద్వర్తనుడయిన విశ్వాసి మాత్రమే ఖలీఫాగా పరిగణించబడతాడు. అతడే సరయిన విధంగా ఖిలాఫత్ బాధ్యతలను నిర్వర్తించగలడు. దీనికి భిన్నంగా తిరస్కారి, ధార్మిక విధినిషేధాలను ఉల్లంఘించేవాడు ఖలీఫా కాదు, తిరుగుబాటుదారుడు. అతడు స్వామి సామ్రాజ్యంలో ఆయన ఇచ్చిన అధికారాలను అవిధేయతా మార్గాన వినియోగిస్తాడు.

మూడవ అర్థం ప్రకారం, "ఒక కాలంలోని అధికార సత్తాగల జాతి తరువాత, మరో జాతి దాని స్థానంలోకి రావడం." మొదటి రెండు అర్థాలు ఖిలాఫత్ అంటే "ప్రాతినిధ్యం" "ఉపస్థాయి" అనే

భావంలో నుంచి పుట్టిన అర్థాలు. ఈ మూడవ, చివరి అర్థమేమో "మారుస్థానం", "ప్రతిస్థాయి" అనే భావంలోనుంచి పుట్టిన అర్థం. ఈ పదానికి ఈ రెండు భావాలూ అరబీ భాషలో ప్రసిద్ధమయిన, తెలిసిన అర్థాలు.

ప్రస్తుత ఇస్తిఖ్‌లాఫ్ ఆయత్ వచ్చిన పూర్వాపరాల మధ్య ఇక్కడ ఖిలాఫత్ అనే పదం 'అల్లాహ్ పంపిన షరీఅత్ ఆదేశానుసారం (ప్రకృతి సిద్ధాంతాల ప్రకారం కాదు) ఏర్పడే ప్రభుత్వం అనే భావంలో ప్రయోగించబడిందన్న విషయంలో ఏ వ్యక్తిఅయినా క్షణకాలం కూడా ఏ మాత్రం సందేహించలేడు, ఈ అర్థంలోనే దేవుని ప్రాతినిధ్యపు బాధ్యతను సరిగ్గా నిర్వర్తించగల ప్రభుత్వం ఇక్కడ ఉద్దేశించబడిందని గ్రహించగలడు. అందువల్లనే తిరస్కారుల మాట అటుంచి ఇస్లామ్‌ను అనుసరిస్తున్నట్లు ప్రకటన చేసే కపటులను సయితం ఈ వాగ్దానంలో చేర్చడానికి నిరాకరిం చబడుతోంది. ఈ కారణంగానే దీనికి అర్హులయినవారు, కేవలం ఈమాన్ (విశ్వాసం), సదాచరణ లక్షణాలున్న వారే అని స్పష్టపరచడమూ జరిగింది. అందువల్లనే ఖిలాఫత్ వ్యవస్థ నెలకొన్న దాని ఫలితంగా, దేవుని ప్రేమ పాత్రమయిన ధర్మం, ఇస్లామ్, పటిష్ఠమయిన పునాదులపైన సుస్థాపితం అవుతుందని చెప్పడమూ జరుగుతోంది. ఈ కారణంగానే ఈ బహుమానం ప్రసాదించడానికి షరతుగా, స్వచ్ఛమయిన దైవదాస్యానికి కట్టుబడి ఉండాలని, అందులో బహుదైవభావం ఏ మాత్రం మిశ్రమం కారాదని చెప్పడమూ జరిగింది. ఈ వాగ్దానాన్ని ఇక్కడి నుండి లేవనెత్తి అంతర్జాతీయ కూడలికి తీసుకువెళ్ళడం, అమెరికా మొదలుగా రష్యా వరకు ఎవరి పెద్దరికపు ఢంకా మ్రోగుతూ ఉందో వారి సన్నిధిలో దీన్ని అర్పించుకోవడం అజ్ఞానపు ఉప్పెన తప్ప మరేమీ కాదు. ఈ శక్తులన్నీ "ఖిలాఫత్" ఉన్నత స్థానాన్నే అలంకరించి ఉన్నట్లయితే మరి ఫిర్ఔన్ నమ్రూద్ చేసిన తప్పేమిటో, పరమ ప్రభువు వారిని శాపగ్రస్తులుగా ఎందుకు చేశాడో? (మరిన్ని వివరాలకు చూడండి: ఖుర్ఆన్ అవగాహనం సం. 4, అల్ అన్బియా : పాదసూచిక 99)

ఇక్కడ మరో విషయం కూడా ప్రస్తావించవలసి ఉంది. ఈ వాగ్దానం తరువాతి ముస్లిములకయితే పరోక్షంగానే అందింది. కాని ప్రత్యక్షంగానయితే ప్రవక్త మహనీయుల (స) కాలంలో ఉన్నవారే దీని సంబోధితులు. వాగ్దానం చేసిన కాలంలో నిజంగానే ముస్లిములపైన భయాందోళనల వాతావరణం అలుముకుని ఉండింది. ఇస్లామ్ ధర్మం ఇంకా హిజాజ్ భూభాగంలోనూ పటిష్టంగా పాదుకొనలేదు. దీని తరువాత కొంతకాలానికి భయవిహ్వల వాతావరణం శాంతిపూర్వకంగా మారిపోవడమేకాక, ఇస్లామ్, అరేబియా భూభాగం నుండి బయలుదేరి ఆసియా, ఆఫ్రికా ఖండాల అత్యధిక భాగాలలో వ్యాపించింది. దాని వ్రేళ్ళు అది ప్రారంభమయిన దేశంలోనే కాక భూమండలం లోనే బాగా గట్టిగా పాదుకున్నాయి. పరమ ప్రభువు అల్లాహ్ ఈ వాగ్దానాన్ని హజ్రత్ అబూ బక్ర్ సిద్దీక్, ఉమర్ ఫారూక్, ఉస్మాన్ గని (ర) ల కాలంలోనే నెరవేర్చాడన్నది ఈ విషయానికి చారిత్రక సాక్ష్యం. ఈ సాక్ష్యం తరువాత, ఈ ముగ్గురు మహనీయుల ఖిలాఫత్‌కు స్వయాన ఖుర్ఆన్ ధ్రువీకరించిందన్న విషయాన్నీ,

వీరు రుజువర్తనులయిన మాటకు స్వయంగా అల్లాహ్ సాక్ష్యం ఇస్తున్నాడన్న విషయాన్నీ న్యాయ శీలుడయిన ఏ వ్యక్తీ సందేహించలేడు. ఎవరికయినా ఈ విషయంలో ఏమయినా అనుమానం ఉన్నట్లయితే హజ్రత్ అలి (కర్రమల్లాహు వజ్హహు) ప్రసంగాన్ని చదువుకోవచ్చు. ఇది "నహజుల్ బలాగా" అనే హజ్రత్ అలి కృతిలో ఉటంకించబడింది. హజ్రత్ ఉమర్ (ర) ఈరానీయులను ఎదుర్కొనడానికి స్వయంగా వెళ్ల సంకల్పించినప్పుడు, ఆయన్ని వారిస్తూ హజ్రత్ అలీ ఈ ప్రసంగం చేశారు. ఇందులో ఆయన ఇలా నుడివారు:

"ఈ కార్య వృద్ధివికాసాలు లేదా బలహీనత అన్నవి, జనాధిక్యత లేదా స్వల్పబలం మీద ఆధారపడిలేవు. ఇది అల్లాహ్ ధర్మం, దాన్ని ఆయనే వికసింపజేశాడు, ఇది అల్లాహ్ సైన్యం దీనికి ఆయనే తోడ్పడ్డాడు, సహాయపడ్డాడు. ఇది వృద్ధి చెందుతూ నేడున్న ఈ స్థితికి చేరుకుంది. అల్లాహ్ మనకు స్వయంగా వాగ్దానం చేశాడు:

"అల్లాహ్ వాగ్దానం చేశాడు, మీలో విశ్వసించి, సదాచరణను పాటించినవారికి – వారికి పూర్వం గతించిన జనుల్ని చేసినట్లే, వారినీ భువిలో ఖలీఫాగా నియమిస్తాడనీ; తాను వారికొరకు ఇష్టపడిన వారిధర్మాన్ని పటిష్ఠమయిన ప్రాతిపదికలపైన సుస్థిరంగా స్థాపిస్తాడనీ.

"అల్లాహ్ తన ఈ వాగ్దానాన్ని నెరవేర్చితీరుతాడు; తన సైన్యానికి తప్పకుండా సహాయపడతాడు. ఇస్లామ్‌లో "కయ్యిమ్" (వ్యవస్థాపనాధికారి) స్థానం, ముత్యాల హారంలో దారానికున్నటువంటిది. దారం తెగితే ముత్యాలు చిందువందయిపోతాయి. అలాగే వ్యవస్థ అంతా ఛిన్నాభిన్నమయి పోతుంది. విడిపోయి చెదిరిపోయిన తరువాత మళ్ళీ ఏకత్రమవడం కష్టమయిపోతుంది. అరబ్బుల సంఖ్యాబలం స్వల్పమయిందనడంలో సందేహం లేదు. ఇస్లామ్ వారిని అత్యధికులుగా చేస్తే సంఘటన వారిని బలోపేతం చేసివేసింది. మీరు ఇక్కడ "ధృవమయి" స్థిరంగా కూర్చోండి. అరేబియా వృత్తాన్ని మీ చుట్టూ భ్రమింపజేస్తూ ఉండండి. ఇక్కడి నుండే స్థిరంగా ఉంటూ రణ తాపాన్ని ఉద్రేకపరుస్తూ ఉండండి. మీరు ఇక్కడి నుండి ఒక్కసారి కదలారంటే అరేబియా వ్యవస్థ అంతా అవ్యవస్థగా రూపొందడం మొదలవుతుంది. కడకు మీరు ఎదుటి శత్రువుల కన్నా వెనుకనుండే శత్రువుల ప్రమాదాలను గురించి ఎక్కువగా చింతిల్లవలసి వస్తుంది. అటు ఈరానీలు మీపైనే దృష్టి కేంద్రీకరిస్తారు, ఇదే అరేబియాకు మూల వేరని, దీన్ని తెగనరికితే తెప్ప దాటించడం సులువయిపోతుందని వారికి తెలుసు. అందువల్ల వారు తమ శక్తినంతా మిమ్మల్ని అంత మొదించడానికే వినియోగిస్తారు. పోతే, అరబ్బేతర సైన్యాలు చాలా అధికబలంతో పెల్లుబికివచ్చా యన్న మీరు వెలిబుచ్చిన మీ సందేహానికి సమాధానం ఏమిటంటే, ఇంతకు ముందు కూడా మేము వారితో పోరాడుతూ వచ్చాము, అది మన అధిక బలగం ఆధారంగా కాదు, అల్లాహ్ సహాయం, ఆయన తోడ్పాటు వల్లనే మనం నేటి వరకు విజేతలమయి నిలిచాము."

وَ اَقِيْمُوا الصَّلٰوةَ وَ اٰتُوا الزَّكٰوةَ وَ اَطِيْعُوا الرَّسُوْلَ لَعَلَّكُمْ تُرْحَمُوْنَ ۝۵۶
لَا تَحْسَبَنَّ الَّذِيْنَ كَفَرُوْا مُعْجِزِيْنَ فِي الْاَرْضِ ۚ وَ مَاْوٰىهُمُ النَّارُ ؕ
وَ لَبِئْسَ الْمَصِيْرُ ۝۵۷ يٰۤاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْا لِيَسْتَاْذِنْكُمُ الَّذِيْنَ مَلَكَتْ ع ۱۳
اَيْمَانُكُمْ وَ الَّذِيْنَ لَمْ يَبْلُغُوا الْحُلُمَ مِنْكُمْ ثَلٰثَ مَرّٰتٍ ؕ مِنْ قَبْلِ صَلٰوةِ
الْفَجْرِ وَ حِيْنَ تَضَعُوْنَ ثِيَابَكُمْ مِّنَ الظَّهِيْرَةِ وَ مِنْۢ بَعْدِ صَلٰوةِ الْعِشَآءِ ۫
ثَلٰثُ عَوْرٰتٍ لَّكُمْ ؕ لَيْسَ عَلَيْكُمْ وَ لَا عَلَيْهِمْ جُنَاحٌۢ بَعْدَهُنَّ ؕ طَوّٰفُوْنَ
عَلَيْكُمْ بَعْضُكُمْ عَلٰى بَعْضٍ ؕ كَذٰلِكَ يُبَيِّنُ اللّٰهُ لَكُمُ الْاٰيٰتِ ؕ
وَ اللّٰهُ عَلِيْمٌ حَكِيْمٌ ۝۵۸

నమాజ్‌ను స్థాపించండి, జకాత్ నివ్వండి, ప్రవక్త పట్ల విధేయత పాటించండి; మిమ్మల్ని కరుణించే అవకాశముంది. ఎవరయితే తిరస్కారానికి ఒడిగడుతున్నారో వారు భువిలో అల్లాహ్‌ను వివశుణ్ణిచేసి వేస్తారని వారిని గురించి అపోహలో పడి ఉండకండి.వారి నివాసం నరకం, అది మాచెడ్డ నివాసం. (ع7)

58 - 59 విశ్వసించిన జనులారా,[85] మీ హస్తగతమయిన దాసదాసీలు,[86] ప్రాజ్ఞతా సరిహద్దులకు చేరని మీ పిల్లలు,[87] మూడు వేళల్లో తప్పనిసరిగా అనుమతి పొంది మరీ మీ వద్దకు రావాలి: ఫజ్ర్ నమాజ్‌కు ముందు, మధ్యాహ్నాం మీరు మీ దుస్తులు తీసి పెట్టే సమయాన, ఇషా నమాజ్ తరువాత. ఈ మూడు, మీరు చాటున గడిపే సమయాలు.[88] వీటి తరువాత వారు అనుమతి లేకుండా ప్రవేశించినా మీకూ పాపం కాదు, వారికీ పాపం కాదు,[89] మీరు ఒకరి వద్దకు మరొకరు మాటిమాటికీ వస్తూ పోతూనే ఉండవలసి ఉంటుంది కదా.[90] ఈ విధంగా అల్లాహ్ తన ఉపదేశాలను మీ కొరకు విశదీకరిస్తూ ఉంటాడు, ఆయన జ్ఞానీ, వివేకీను.

కన్నులున్నవాడు సునాయాసంగా చూడవచ్చు, మహనీయ అమీర్ హజ్రత్ అలి (ర) ఈ "ఇస్తిఖ్లాఫ్" ఆయత్‌ను ఎవరికి అన్వయింపజేస్తున్నారో.

84. ఇక్కడ "తిరస్కారం" అంటే వరప్రసాదాల తిరస్కారం కూడా కావచ్చు, సత్యతిరస్కారమూ కావచ్చు. మొదటి అర్థం రీత్యా ఖిలాఫత్ వరప్రసాదం పొందిన తరువాత సత్యమార్గానికి దూర మయ్యే వారికి అది వర్తిస్తుంది. రెండవ అర్థాన్ని బట్టి ఇది మునాఫికులకు వర్తిస్తుంది; వారు అల్లాహ్ వాగ్దానం విన్నప్పటికీ తమ కాపట్య వైఖరిని వదలకపోవడం వల్ల.

85. ఇక్కడి నుండి తిరిగి సామాజిక ఆదేశాల పరంపర ప్రారంభమవుతుంది. నూర్ సూరాలోని ఈ భాగం, పై ప్రసంగం అవతరించిన తరువాత కొన్నాళ్ళకు అవతరించి ఉన్నా అసంభవమేమీ కాదు.

86. సమస్త వ్యాఖ్యాతలు, ఫిక్‌హ్‌వేత్తలు అందరి దృష్టిలో ఇది దాసదాసీ జనులు అంటే స్త్రీపురుష బానిసలు ఉభయులకూ వర్తిస్తుంది. ఎందుకంటే, ఇక్కడ ప్రయోగించిన పదం సామాన్యమైంది. కాని ఇబ్ను ఉమర్, ముజాహిద్ ఈ ఆయత్ మూలంలో ప్రయోగించిన పదం "మమ్లూక్" అంటే ఉద్దేశ్యం కేవలం బానిస పురుషులు అనే అంటారు, వారు బానిస స్త్రీలకు దీని నుండి మినాయింపు నిస్తారు. నిజానికి మున్ముందు వస్తున్న ఆదేశాన్ని గమనిస్తే ఈ ప్రత్యేకతకు ఎటువంటి కారణమూ కానరాదు. ఒంటరిగా ఉండే వేళల్లో స్వయంగా వారి పిల్లలు అకస్మాత్తుగా లోనికి ప్రవేశించడం ఏ విధంగా అనుచితమో అదే విధంగా సేవకురాలు రావడం కూడా అనుచితమే.

ఈ ఆయత్ ఆదేశం బానిసలు యుక్తవయస్కులయినా కాక పోయినా ఉభయులకూ వర్తిస్తుందన్న విషయంలో మటుకు ఏకాభిప్రాయముంది.

87. మరో అనువాదం, 'ప్రాజ్ఞతాప్రాయుల వంటి కలలు కనే వయసుకు చేరని వారు' అని కూడా చేయవచ్చు. దీనిని బట్టే ఫిక్‌హ్‌వేత్తలు "స్వప్న స్ఖలనాన్ని" ప్రాజ్ఞతకు ప్రారంభంగా పరిగణించారు. దీనిపట్ల అందరికీ ఏకాభిప్రాయముంది. కాని మేము అవలంబించిన మూలానువాదం ప్రాధాన్యత నివ్వదగింది. ఎందుకంటే ఈ ఆదేశం అబ్బాయిలూ అమ్మాయిలూ ఉభయులకూ వర్తిస్తుంది. స్వప్న స్ఖలనాన్ని ప్రాజ్ఞతకు చిహ్నమని పరిగణించడం వల్ల ఆదేశం కేవలం అబ్బాయిలకే ప్రత్యేకమయి పోతుంది. ఎందుకంటే అమ్మాయిల వ్యవహారంలో బహిష్టు ప్రారంభమవడం ప్రాజ్ఞతకు సంకేతం, స్వప్నస్ఖలనం కాదు. అందువల్ల మా దృష్టిలో ఆదేశానికి ఉద్దేశం ఏమిటంటే, ఇంటిపిల్లలలో లైంగిక స్పృహకలిగే వయసు వరకు వారు ఈ నియమాన్ని పాటించాలి. ఆ వయసుకు చేరిన తరువాత వారికి మరో ఆదేశం వర్తిస్తుంది; అది ముందు వస్తోంది.

88. మూలంలో **عَوْرٰت 'ఔరాత్'** అనే పదప్రయోగం జరిగింది. ఈ మూడు వేళలు మీకు 'ఔరాత్' అని సెలవీయడం జరిగింది. ఉర్దూలోనయితే 'ఔరత్' అనే పదం స్త్రీలకు వాడతారు. కాని అరబీలో

وَإِذَا بَلَغَ الْأَطْفَالُ مِنْكُمُ الْحُلُمَ فَلْيَسْتَأْذِنُوا كَمَا اسْتَأْذَنَ الَّذِينَ مِنْ قَبْلِهِمْ ۚ كَذَٰلِكَ يُبَيِّنُ اللَّهُ لَكُمْ آيَاتِهِ ۗ وَاللَّهُ عَلِيمٌ حَكِيمٌ ۝

మరి మీ సంతానం ప్రాజ్ఞతా పరిధులకు చేరుకున్నప్పుడు[91] వారు తమ పెద్దలు ఏ విధంగా అనుజ్ఞ తీసుకుని ప్రవేశిస్తూ ఉంటారో అదే విధంగా అనుమతితో ప్రవేశిస్తూ ఉండాలి. ఈ విధంగా అల్లాహ్ తన వచనాలను మీకు తేటతెల్లం చేస్తూ ఉంటాడు, ఆయన జ్ఞాన సంపన్నుడు, వివేచనాపరుడు.

దాని అర్థం అభ్యంతరం, ప్రమాదం ఉన్న స్థలం; తెరచుకుంటే మనిషికి సిగ్గుచేటు కాగల లేదా బయటపడటం మనిషికి అయిష్టం కాగల శరీర భాగానికి కూడా ఈ పదాన్ని ప్రయోగిస్తారు. సురక్షితం కాని వస్తువు అనే అర్థంలో కూడా ఈ పదాన్ని ప్రయోగిస్తారు. ఈ అర్థాలన్నీ పరస్పరం సమానమయిన ఔచిత్యం కలిగి ఉన్నాయి. ఆయత్ అర్థంలో ఎంతో కొంత వరకు ఇవన్నీ చేరి ఉన్నాయి. భావమేమిటంటే, ఈ సమయాల్లో మీరు ఒంటరిగా లేదా తమ భార్యలతో ఉంటారు, అప్పుడు మీరుండే స్థితిలో ఇంటి పిల్లలయినా సేవకులయినా అకస్మాత్తుగా మీ వద్దకు వచ్చేయడం సముచితం కాదు, అందువల్ల ఈ మూడు సమయాల్లో మీరు ఏకాంతంగా ఉండే చోటికి రాదలిస్తే ముందు అనుమతి తీసుకోవాలని వారికి బోధించి, నిర్దేశించి పెట్టండి.

89. అంటే ఈ మూడు సమయాలు తప్పించి ఇతర సమయాల్లో ప్రాజ్ఞులు కాని పిల్లలు, ఇంటి సేవకులు అనునిత్యం స్త్రీ పురుషుల వద్దకు వారి గదుల్లోకి లేదా వారి ఏకాంత స్థలాల్లోకి అనుమతి లేకుండా రావచ్చు. ఈ సందర్భంలో ఒకవేళ మీరు ఏదయినా అనుచితమయిన స్థితిలో ఉండగా వారు అనుమతి లేకుండా వచ్చేస్తే వారిని మందలించే, ఆగ్రహించే హక్కు మీకు లేదు. ఎందుకంటే అది మీ తెలివి తక్కువతనం, పనిపాటల సమయాల్లో మీరు అలాంటి అనుచితమయిన స్థితిలో ఉండటం సరయినది కాదు. ఇంతకు ప్రస్తావిత ఏకాంతపు మూడు సమయాల్లో వారు మీ శిక్షణ పొంది కూడా అనుమతి లేకుండా వస్తే వారిదే తప్పు, లేకపోతే, మీరు మీ పిల్లలకు, నౌకర్లకు ఈ సంస్కారం నేర్పకపోవడం మీదే తప్పు.

90. ప్రస్తావించిన మూడు వేళలు తప్ప ఇతర వేళలన్నింటిలోను పిల్లలూ, నౌకర్లు అనుమతి లేకుండానే వచ్చిపోయే సాధారణ అనుమతికి ఇదీ కారణం. దీని ద్వారా ఫిక్హ్ సూత్రావళిలోని ఈ సూత్రం వెలుగులోకి వస్తోంది. షరీఅత్ ఆదేశాలు ఔచితీ విజ్ఞతల ఆధారంగా రూపొందుతాయి, ప్రతి ఆదేశం వెనక ఏదో ఒక సముచిత కారణం తప్పనిసరిగా ఉంటుంది, దాన్ని వివరించినా వివరించకపోయినా సరే.

91. అంటే ప్రాజ్ఞులవ్వాలని అర్థం. పైన పాదసూచి 87లో తెలిపినట్లు అబ్బాయిల విషయంలో స్వప్న స్ఖలనం, అమ్మాయిల విషయంలో బహిష్టు ప్రారంభమవడం ప్రాజ్ఞతకు సంకేతాలు. కాని ఏ కారణం వల్లనయినా చాలా కాలం వరకు ఎవరయినా అమ్మాయిలూ అబ్బాయిలూ ఈ శారీరక పరివర్తనలకు లోనవకపోతే అటువంటి వారి విషయంలో ధర్మశాస్త్రవేత్తల మధ్య భేదాభిప్రాయముంది. ఇమామ్ షాఫియీ, ఇమామ్ అబూ యూసుఫ్, ఇమామ్ ముహమ్మద్, ఇమామ్ అహ్మద్ దృష్టిలో ఇటువంటి పరిస్థితిలో 15 ఏళ్ళ ప్రాయమున్న అబ్బాయి, అమ్మాయిల్ని ప్రాజ్ఞులుగా భావించవలసి ఉంటుంది. ఇమామ్ ఆజం అబూ హనీఫా కూడా దీన్ని బలపరచినట్లు ఒక ఉల్లేఖనముంది. కాని ఇమామ్ ఆజం ప్రసిద్ధ అభిప్రాయం ప్రకారం ఇటువంటి పరిస్థితిలో 17 ఏళ్ళ అమ్మాయి, 18 ఏళ్ళ అబ్బాయిల్ని ప్రాజ్ఞులుగా పరిగణించాలి. ఈ రెండు అభిప్రాయాలూ ఎటువంటి మూలాధారంగా ఏర్పడినవి కావు. ధర్మశాస్త్ర అవగాహనతో అనువర్తన కృషి ఆధారంగా ఏర్పడినవి. అందువల్ల ప్రపంచమెల్లెడలా, ఎల్లప్పుడూ 15 లేదా 18 సంవత్సరాల వయసునే స్ఖలనం కాని అబ్బాయిలకు, బహిష్టురాని అమ్మాయిలకు ప్రాజ్ఞత వయోపరిమితిగా పరిగణించనవసరం లేదు. ప్రపంచంలోని విభిన్న దేశాలలో, విభిన్న కాలాలలో శారీరకపోషణ పరిస్థితులు భిన్నంగా ఉంటాయి. మౌలికంగా, సర్వసాధారణంగా ఒక దేశంలో అబ్బాయిలూ అమ్మాయిలకు ఏ వయసులో స్ఖలనం లేదా బహిష్టు ప్రారంభమవుతాయో వాటి సగటు వ్యత్యాసాన్ని గుర్తించి, ఏ అబ్బాయిలు అమ్మాయిలకయినా అసాధారణ కారణాల వల్ల ఈ సంకేతాలు వాటి సాధారణ వయోపరిమితులలో వ్యక్తం కాకపోతే వారికి అత్యధిక వయోపరిమితి పైన ఆ సగటు వ్యత్యాసాన్ని కూడాలి, దాన్నే అటువంటి వారి ప్రాజ్ఞతా వయసుగా పరిగణించాలి. ఉదాహరణకు ఒక దేశంలో సాధారణంగా ఒక అబ్బాయికి కనీసం 12 సంవత్సరాల వయసులోను, అత్యధికంగా 15 సంవత్సరాల వయసులోను స్వప్న స్ఖలనం జరిగితే వాటి సగటు వ్యత్యాసం ఒకటిన్నర సంవత్సరం. ఇటువంటి పరిస్థితిలో అసాధారణ మయిన అబ్బాయిలకు పదహారున్నర సంవత్సరాల వయసును ప్రాజ్ఞతా వయసుగా నిర్ణయించవచ్చు. ఇదే నియమం ప్రకారం, విభిన్న దేశాల న్యాయశాస్త్ర నిపుణులు తమ పరిస్థితుల రీత్యా ఒక పరిమితిని నిర్ణయించుకోవచ్చు.

15 సంవత్సరాల వయో పరిమితికి ఆధారంగా ఒక హదీసు ఉటంకిస్తారు. అది ఇబ్ను ఉమర్ ఉల్లేఖనం: "నేను 14 ఏళ్ళ ప్రాయంలో ఉహుద్ యుద్ధం సందర్భంలో ప్రవక్త మహనీయుల (స) సన్నిధిలోకి వెళ్ళాను. ఆయన నాకు యుద్ధంలో పాల్గొనే అనుమతినివ్వలేదు. తరువాత కందకం పోరాటం సమయంలో 15 సంవత్సరాల ప్రాయంలో నేను మళ్ళీ వెళ్ళాను. అప్పుడు ఆయన నన్ను అనుమతించారు" (సిహాహ్ సిత్తా, ముస్నద్ అహ్మద్). కాని ఈ ఉల్లేఖనం రెండు కారణాలుగా ఈ విషయంలో ఆధారంగా నిలువజాలదు. ఒకటి, ఉహుద్ యుద్ధం హి.శ.3, షవ్వాల్ నెలలో జరిగింది. కందకం పోరాటం ముహమ్మద్ బిన్ ఇస్హాక్ ప్రకారం హి.శ.5, షవ్వాల్‌లోను, ఇబ్ను సఅద్ ప్రకారం, హి. శ.5, జిల్ కఅదలో సంభవించింది. రెండు యుద్ధాల మధ్య రెండు సంవత్సరాలు లేదా అంతకన్నా

وَالْقَوَاعِدُ مِنَ النِّسَآءِ الّٰتِیْ لَا یَرْجُوْنَ نِكَاحًا فَلَیْسَ عَلَیْهِنَّ جُنَاحٌ
اَنْ یَّضَعْنَ ثِیَابَهُنَّ غَیْرَ مُتَبَرِّجٰتٍۭ بِزِیْنَةٍ ؕ وَاَنْ یَّسْتَعْفِفْنَ خَیْرٌ لَّهُنَّ ؕ
وَاللّٰهُ سَمِیْعٌ عَلِیْمٌ ۝۶۰

60 మరే స్త్రీలయితే యవ్వన దశను దాటి కూర్చుండిపోయారో,[92] నికాహ్ చేసుకునే ప్రత్యాశులు కారో, వారు తమ దుప్పట్లు తీసివేసినా[93] అది వారికి అపరాధం కాదు, ఇంతకు అలంకరణలను ప్రదర్శించేటటువంటి వారు కారాదు.[94] అయినా వారు కూడా వ్రీడా విధానాన్ని అవలంబిస్తేనే వారికి మంచిది; అల్లాహ్ అన్నీ వింటాడు, అంతా తెలుసుకుంటాడు.

ఎక్కువ కాలం తేడా ఉంది. ఒకవేళ ఉహుద్ యుద్ధ కాలంలో ఇబ్నె ఉమర్ 14 సంవత్సరాల వయసు వారయితే కందకం పోరాటంలో ఆయన కేవలం 15 సంవత్సరాల వయసు గలవారెలా అవుతారు? ఆయన 13 ఏళ్ళు 11 నెలల కాలానికి 14 సంవత్సరాలని, 15 ఏళ్ళు 11 నెలల కాలానికి 15 ఏళ్ళని అన్నారో ఏమో. రెండవ కారణం, యుద్ధంకోసం ప్రౌఢ వయసు అవసరమవడం వేరు, సామాజిక వ్యవహారాలలో చట్టపరంగా ప్రాజ్ఞులవడం వేరు. రెంటిలో తప్పనిసరి సంబంధమేదీ లేదు, ఒకదాన్ని మరొకదానికి ఆధారంగా చూపడానికి వీలులేదు. అందువల్ల స్ఖలనం కాని అబ్బాయికి 15 సంవత్సరాల వయసును ప్రాజ్ఞతా వయసుగా నిర్ణయించడం కేవలం, ఒక అంచనా, అనువర్తనా ప్రధానమయిన ఆదేశం మాత్రమే కాని "మన్సూస్" (ఖుర్ఆన్ హదీసుల స్థిరమయిన ఆధారాల రీత్యా మూలాధారాల ప్రధానంగా ఏర్పడిన) ఆదేశం కాదు.

92. మూలంలో ప్రయోగించిన పదాలకు అర్థం, "కూర్చుండి పోయిన స్త్రీలు" లేదా "కూర్చుని ఉన్న స్త్రీలు" అన్నది ఉద్దేశ్యం. (బహిష్టు ఆగిపోవడం - Menopause) అంటే స్త్రీ సంతానో త్పత్తికి తగని వయసుకు చేరిపోవడం అన్నమాట. స్వయంగా ఆమెలోనూ వాంఛలు అంతరించిపోవడం, ఆమెను చూసి పురుషుల్లోనూ ఎటువంటి లైంగిక వాంఛ కలిగే అవకాశం లేకపోవడం అన్నమాట. ఇదే అర్థాన్ని తరువాతి వాక్యం సూచిస్తోంది.

93. మూలంలోని పదాలకు అర్థం, "తమ దుస్తుల్ని తీసివేసినా" అన్నది. కాని దీని ఉద్దేశం దుస్తులన్నీ తీసివేసి దిగంబరులవడం అని మాత్రం కాజాలదన్నది సుస్పష్టం. అందువల్ల ధర్మశాస్త్ర వేత్తలందరు, వ్యాఖ్యాతలందరు ఏకాభిప్రాయంతో, అలంకరణను మరుగుపరిచేందుకు వాడే దుప్పట్లు అని అంగీకరించారు. ఈ అలంకరణను మరుగుపరిచే ఆదేశం "అహ్జాబ్" సూరాలో ఇవ్వబడింది.

لَيْسَ عَلَى الْاَعْمٰى حَرَجٌ وَّلَا عَلَى الْاَعْرَجِ حَرَجٌ وَّلَا عَلَى الْمَرِيْضِ
حَرَجٌ وَّلَا عَلٰۤى اَنْفُسِكُمْ اَنْ تَاْكُلُوْا مِنْۢ بُيُوْتِكُمْ اَوْ بُيُوْتِ اٰبَآئِكُمْ
اَوْ بُيُوْتِ اُمَّهٰتِكُمْ اَوْ بُيُوْتِ اِخْوَانِكُمْ اَوْ بُيُوْتِ اَخَوٰتِكُمْ اَوْ بُيُوْتِ
اَعْمَامِكُمْ اَوْ بُيُوْتِ عَمّٰتِكُمْ اَوْ بُيُوْتِ اَخْوَالِكُمْ اَوْ بُيُوْتِ خٰلٰتِكُمْ
اَوْ مَا مَلَكْتُمْ مَّفَاتِحَهٗۤ اَوْ صَدِيْقِكُمْ ؕ لَيْسَ عَلَيْكُمْ جُنَاحٌ اَنْ
تَاْكُلُوْا جَمِيْعًا اَوْ اَشْتَاتًا ؕ فَاِذَا دَخَلْتُمْ بُيُوْتًا فَسَلِّمُوْا عَلٰۤى
اَنْفُسِكُمْ تَحِيَّةً مِّنْ عِنْدِ اللّٰهِ مُبٰرَكَةً طَيِّبَةً ؕ كَذٰلِكَ
يُبَيِّنُ اللّٰهُ لَكُمُ الْاٰيٰتِ لَعَلَّكُمْ تَعْقِلُوْنَ ﴿٦١﴾ ع ۸

61 ఒక గుడ్డివాడయినా, కుంటివాడయినా, రోగి అయినా (ఎవరి ఇండ్లల్లోనయినా తినవచ్చు) ఇది తప్పు కాదు. అలాగే మీరూ మీ ఇండ్లల్లోనయినా; మీ తండ్రీ తాతల ఇండ్లల్లోనయినా; మీ తల్లి, అమ్మమ్మ ఇండ్లల్లోనయినా; మీ సోదరుల ఇండ్లల్లోనయినా, మీ సోదరీల ఇండ్లల్లోనయినా, మీ బాబాయిల ఇండ్లల్లో నయినా, మీ మేనత్తల ఇండ్లల్లో నయినా, మీ మేనమామల ఇండ్లల్లోనయినా, మీ పిన్నీల ఇండ్లల్లోనయినా, మీకు తాళం చెవులు అప్పగించబడిన ఇండ్లల్లోనయినా, మీ సన్నిహిత మిత్రుల ఇండ్లల్లోనయినా తినవచ్చు;[95] మీరు కలిసి తిన్నా లేదా వేర్వేరుగా తిన్నా మీకు అందులోనూ తప్పులేదు.[96] అయితే ఇండ్లల్లో ప్రవేశించేటప్పుడు మాత్రం తమ వారికి సలామ్ పలికి మరీ ప్రవేశించండి, ఇది శుభాశీస్సు, అల్లాహ్ నిర్ణయించింది, ఎంతో శుభప్రదమయింది, మరెంతో పరిశుద్ధమయింది. ఈ విధంగా అల్లాహ్ మీకు వచనాలను వివరిస్తూ ఉంటాడు, మీరు బుద్ధి వివేకాలతో వ్యవహరిస్తారన్న నమ్మకముంది. (ع8)

94. మూలంలోని పదాలకు అర్థం అలంకరణను "తబర్రుజ్" చేసే వారు కారాదు అన్నది. "తబర్రుజ్" అంటే వ్యక్తం చేయడం, ప్రదర్శించడం అని అర్థం. 'బారిజ్' అని పైన కప్పు లేని పడవను లేదా ఓడను అంటారు. ఇదే అర్థంలో స్త్రీకి ఈ పదం ప్రయోగిస్తే భావం, ఆమె పురుషుల సమక్షంలో తన అందాన్ని, అలంకరణను ప్రదర్శించే స్త్రీ అన్నమాట. కనుక ఆయత్ భావం ఏమిటంటే, దుప్పటి తీసివేసే ఈ అనుమతి, ఏ స్త్రీలలో సింగారించుకుని తిరిగే ఆసక్తి మిగులలేదో, ఎవరి లైంగిక వాంఛలు అణగారిపోయాయో అటువంటి వృద్ధ స్త్రీలకు ఇవ్వబడుతోంది. కాని ఒకవేళ అక్కడ ఏదయినా నిప్పు కణిక ఇంకా మిగిలి ఉంటే, అది అలంకరణా ప్రదర్శనగా రూపొందుతూ ఉంటే, ఈ అనుమతి ద్వారా ప్రయోజనం పొందే అవకాశం వారికి లేదు.

95. ఈ ఆయత్ని అర్థం చేసుకునేందుకు మూడు విషయాలు అర్థం చేసుకోవడం అవసరం. ● ఒకటి ఈ ఆయత్లో రెండు భాగాలున్నాయి. మొదటి భాగం వ్యాధిగ్రస్తులు, కుంటివారు, గ్రుడ్డివారు ఇంకా ఇలాంటి ఇతర అంగ వైకల్యం గలవారిని గురించినది. రెండవది సాధారణ జనులకు సంబంధించినది. ● రెండు, ఖుర్ఆన్ బోధించిన నైతిక బోధనల వల్ల అరబ్బుల ఆలోచనా విధానంలో వచ్చిన మహత్తరమయిన విప్లవం కారణంగా హరామ్, హలాల్, (నిషిద్ధం, ధర్మసమ్మతం) ధర్మబద్ధం, ధర్మ విరుద్ధమయిన విషయాలలో వారి స్పృహ అత్యంత సున్నితమయిపోయింది. ఇబ్నె అబ్బాస్ ప్రకారం, అల్లాహ్ వారిని "ఒండొకరి సొమ్ము ధర్మ విరుద్ధమయిన రీతుల్లో తినకండి"అని ఆదేశించినప్పుడు జనులు ఒండొకరి ఇండ్లల్లో భోజనం చేసే విషయంలోనూ జాగ్రత్త వహించసాగారు. కడకు పూర్తి చట్టబద్ధమయిన నిబంధనల కనుగుణంగా ఇంటి యజమాని, ఆహ్వానించిన పెద్ద మనిషి అనుమతించనంతవరకు తమ బంధువు లేదా మిత్రుని ఇంట భోజనం చెయ్యడం కూడా ధర్మబద్ధం కాదని భావించేవారు. ● మూడు, ఇక్కడ తమ ఇండ్లల్లో భోంచెయ్యడాన్ని గురించి వచ్చిన ప్రస్తావన అనుమతినివ్వడానికి కాదు, తమ బంధువుల ఇళ్ళల్లో, మిత్రుల ఇళ్ళల్లో భోంచెయ్యడం కూడా తమ ఇండ్లల్లో తినడం లాంటిదే అనే విషయాన్ని ప్రబుద్ధం చెయ్యడానికి. లేకపోతే, తమ ఇండ్లల్లో భోజనం చేయడానికి ఒకరి అనుమతి లభించే ప్రసక్తే లేదన్నది సుస్పష్టమయిన విషయం. ఈ మూడు విషయాలు అర్థం చేసుకున్న తరువాత ఆయత్ అర్థం విశదమయిపోతుంది. అంగ వికలురయిన వారి విషయానికి వస్తే వారు తమ ఆకలిని తీర్చుకునేందుకు ప్రతి ఇంట, ప్రతి చోట భోజనం చేయగలరు. వారి అశక్తత స్వయంగా సమాజం మొత్తం పైనా వారి హక్కును నిర్ధారిస్తుంది. అందువల్ల వారికి భోజనం ఎక్కడ లభించినా అది వారికి ధర్మబద్ధమే. సాధారణ మనుషుల విషయానికి వస్తే వారికి తమ ఇళ్ళయినా, ఇక్కడ ప్రస్తావించిన వారి ఇళ్ళయినా సమానమే. ఇక్కడ ప్రస్తావించిన వారి ఇళ్ళల్లో, ఇంటి పెద్ద అనుమతి లభిస్తేగాని తినాలి లేకపోతే ద్రోహమయి పోతుంది అనేటటువంటి నియమాలు

إِنَّمَا الْمُؤْمِنُوْنَ الَّذِيْنَ اٰمَنُوْا بِاللّٰهِ وَرَسُوْلِهٖ وَإِذَا كَانُوْا مَعَهٗ
عَلٰٓى اَمْرٍ جَامِعٍ لَّمْ يَذْهَبُوْا حَتّٰى يَسْتَاْذِنُوْهُ ؕ اِنَّ الَّذِيْنَ يَسْتَاْذِنُوْنَكَ
اُولٰٓئِكَ الَّذِيْنَ يُؤْمِنُوْنَ بِاللّٰهِ وَرَسُوْلِهٖ ۚ فَاِذَا اسْتَاْذَنُوْكَ لِبَعْضِ
شَاْنِهِمْ فَاْذَنْ لِّمَنْ شِئْتَ مِنْهُمْ وَاسْتَغْفِرْ لَهُمُ اللّٰهَ ؕ اِنَّ اللّٰهَ
غَفُوْرٌ رَّحِيْمٌ ﴿٦٢﴾

62 **విశ్వసించిన వారంటే[97] అసలు వీరే, అల్లాహ్‌ను, ఆయన సందేశహరుణ్ణి మనః పూర్వకంగా విశ్వసించేవారు, ఏదయినా సామూహిక కార్యనిర్వహణలో దైవ సందేశ హరునితోపాటు నిమగ్నులయి ఉన్నప్పుడు ఆయన అనుమతి లేనిదే ఎటూ వెళ్ళని వారు.[98] ఎవరయితే నిన్ను అనుమతి కొరకు అర్థిస్తారో వారే అల్లాహ్‌ను, ప్రవక్తనూ విశ్వసించేవారు, కనుక వారు తమకు ఏదయినా పనిబడి అనుమతి కోరినప్పుడు[99] నీవు సముచితమని తలచిన వారిని అనుమతించు;[100] ఇలాంటి వారి కొరకు అల్లాహ్ సన్నిధిలో క్షమాభిక్షను వేడుకుంటూ ఉండు,[101] అల్లాహ్ నిశ్చయంగా క్షమాశీలి, దయాగుణి.**

అవసరమేలేదు. మనిషి వీరిలో ఎవరి ఇంటికి వెళ్ళినా అక్కడ ఇంటి యజమాని లేకపోతే అతని భార్యా పిల్లలు ఏదయినా తినుబండారం పెడితే నిర్మొహమాటంగా భోంచేయవచ్చు.

ఇక్కడ ప్రస్తావించిన బంధువుల పేర్లల్లో సంతానం ప్రస్తావన లేదు, మనిషికి తన సంతానం ఇల్లు కూడా తన ఇల్లే గనక.

మిత్రులంటే ఒక విషయం గుర్తుంచుకోవాలి. ఇక్కడ సన్నిహిత మిత్రులని, మొగమాటంలేని ఆప్తమిత్రు లని అర్థం. వారు లేనప్పుడు మిత్రులు వారి ఇంట ఏమి కాజేసినా వారికి అయిష్టం కాకపోవడం అలా ఉంచి పైగా సంతోషం కలుగుతుంది. అటువంటి మిత్రులే ఇక్కడ ఉద్దేశించబడ్డారు.

96. ప్రాచీన కాలపు అరేబియావాసులలో కొన్ని తెగల సంప్రదాయం ప్రకారం ప్రతి ఒక్కరు వేర్వేరుగా భోజనం పెట్టుకుని తినేవారు. వారంతా కలసి ఒకేచోట తినడాన్ని సభ్యత కాదనుకునే వారు. నేటికీ హైందవ సమాజంలో వేర్వేరుగా తినడానికే సంస్కారవంతమయిన విధానంగా భావిస్తారు. దీనికి భిన్నంగా కొన్ని తెగలు ఒంటరిగా తినడాన్ని సభ్యత కాదనుకునేవారు. కడకు

لَا تَجْعَلُوْا دُعَآءَ الرَّسُوْلِ بَيْنَكُمْ كَدُعَآءِ بَعْضِكُمْ بَعْضًا ؕ قَدْ يَعْلَمُ اللّٰهُ

الَّذِيْنَ يَتَسَلَّلُوْنَ مِنْكُمْ لِوَاذًا ۚ فَلْيَحْذَرِ الَّذِيْنَ يُخَالِفُوْنَ عَنْ

اَمْرِهٖۤ اَنْ تُصِيْبَهُمْ فِتْنَةٌ اَوْ يُصِيْبَهُمْ عَذَابٌ اَلِيْمٌ ﴿٦٣﴾ اَلَاۤ

اِنَّ لِلّٰهِ مَا فِى السَّمٰوٰتِ وَالْاَرْضِ ؕ قَدْ يَعْلَمُ مَاۤ اَنْتُمْ عَلَيْهِ ؕ

ع ٩ ١٥ وَيَوْمَ يُرْجَعُوْنَ اِلَيْهِ فَيُنَبِّئُهُمْ بِمَا عَمِلُوْا ؕ وَاللّٰهُ بِكُلِّ شَىْءٍ عَلِيْمٌ ﴿٦٤﴾

63 - 64 ముస్లిములారా, మీ మధ్యన దైవ సందేశహరుని పిలుపును, మీలో ఒండొకరి మధ్య పిలుపులా తలంచకండి.[102] అల్లాహ్‌కు బాగా తెలుసు, మీలో ఎవరెవరు ఒకరి నొకరు ఆసరాగా చేసుకుని నెమ్మదిగా జారుకుంటూ ఉంటారో.[103] దైవసందేశహరుని ఆదేశాన్ని ఉల్లంఘించేవారు భయపడాలి, వారు ఏదయినా పరీక్షా ఉపద్రవంలో చిక్కుకుంటారేమోనని,[104] లేదా వారికి ఏదయినా వ్యధాభరిత మయిన విపత్తు అకస్మాత్తుగా మూడుతుందేమోనని. బాగా తెలుసుకోండి, ఆకాశాలలోనూ భూమిలోనూ ఉన్నదంతా అల్లాహ్‌కు చెందినదే. మీరు ఏ వైఖరి నవలంబించినా అల్లాహ్‌కు అది బాగా తెలుసు. ఏ రోజయితే జనం ఆయన వైపునకు మరలుతారో ఆనాడు ఆయన వారికి తేటతెల్లం చేస్తాడు, వారు ఏమేమి చేసి వచ్చారో. ఆయనకు ప్రతి విషయమూ తెలిసినదే. (ع9)

తోడుగా తినడానికి ఎవరూ లేకపోతే పస్తులుండిపోయే వారు. ఈ ఆయత్ ఇటువంటి ప్రతిబంధనాలన్నింటినీ తెంచడానికే ఉద్దేశించబడింది.

97. ముస్లిమ్ సముదాయంలో క్రమశిక్షణను మునుపటి కన్నా అధికంగా కట్టుదిట్టం చేయడానికి ఉద్దేశించిన చివరి నిర్దేశాలు ఇవి.

98. ఈ ఆదేశమే ప్రవక్త మహనీయుల తరువాత ఆయన స్థానంలో వచ్చిన వారికీ, ఇస్లామీయ వ్యవస్థ నాయకులకూ వర్తిస్తుంది. ఏదయినా సామూహిక ధ్యేయం కొరకు ముస్లిములను సమావేశ పరచినప్పుడు, అది యుద్ధ పరిస్థితి అయినా, శాంతియుత పరిస్థితి అయినా, ఎట్టి పరిస్థితిలోనూ

నాయకుని అనుమతి లేకుండా తిరిగి వెళ్ళిపోవడం లేదా చెదిరిపోవడం వారికి ధర్మసమ్మతం కాదు.

99. ఇందులో మందలింపు ఉంది. ఏదయినా వాస్తవ అవసరం లేకుండా అనుమతిని కోరడం అసలే అధర్మం. అనుమతి కోరడం ధర్మబద్ధమయ్యే స్థితి ఒక్కటే, వెలికిపోవడానికి ఏదయినా వాస్తవ ఆవశ్యకత ఏర్పడాలి.

100. అవసరం ఏదో తెలిపిన తరువాత కూడ అనుమతి నివ్వడమో ఇవ్వకపోవడమో ప్రవక్త, ప్రవక్త తరువాత సంస్థాగత నాయకుని ఇష్టంపైన ఆధారపడి ఉంది. ఆ వ్యక్తి వ్యక్తిగత అవసరం కన్నా సామూహిక ఆవశ్యకత అధికంగా ప్రముఖమయిందని అతను తలిస్తే అనుమతినివ్వకపోయే పూర్తి హక్కు అతనికే ఉంది. ఇలా జరిగిన పక్షంలో ఒక విశ్వాసి అతనికి వ్యతిరేకంగా ఎటువంటి షికాయత్ చేయడానికి ఆస్కారం లేదు.

101. ఇక్కడ మరో మందలింపు ఉంది. అనుమతి కోరడంలో ఏ మాత్రం సాకులు వెదికే ఆస్కార మున్నా లేదా సామూహిక అవసరంపైన వ్యక్తిగత ఆవశ్యకతకు ప్రాధాన్యం ఇచ్చే భావన ఉన్నా అది ఒక అపరాధం, పాపం. అందువల్ల దైవప్రవక్త, ఆయన స్థానంలో పని చేసే నాయకుడు కేవలం అనుమతినివ్వడం మాత్రమే కాక దానితోపాటు దైవం నిన్ను మన్నించుగాక అని కూడా చెప్పాలి.

102. మూలంలో వాడిన పదం دُعَاءً **"దుఆ"** అన్నది. దీని అర్థం పిలువడం, వేడుకోవడం, కేక వేయడం అని కూడా వస్తుంది. ఇంకా دُعَاءَ الرَّسُوْلِ **"దుఆ అర్రసూల్"** అంటే అర్థం, దైవ సందేశహరుని పిలుపు, లేదా ఆయన వేడుకోలు చేయడం లేదా ప్రవక్తను పిలువడం అని కూడా కాగలదు. ఈ విభిన్న అర్థాల రీత్యా ఆయత్‌కు మూడు అర్థాలు వర్తిస్తాయి. మూడూ సరయినవే, సమంజసమయినవే.

ఒకటి, "దైవసందేశహరుడు పిలవడాన్ని సాధారణ మనుషుల పిలుపు వంటిదని భావించకండి" అంటే ప్రవక్త పిలుపునకు అసాధారణ ప్రాముఖ్యముంది. ఇతరులు పిలిచినప్పుడు మీరు సమాధానమివ్వకపోతే అది మీ ఇష్టం. కాని ప్రవక్త పిలిచినప్పుడు మీరు వెళ్ళకపోయినా, లేదా హృదయంలో ఏ మాత్రం అయిష్టతానుభూతి కలిగినా అది ఈమాన్, విశ్వాసానికి ప్రమాదకరం.

రెండు, "దైవసందేశహరుని దుఆ (దైవసన్నిధిలో వేడుకోలు)ను సాధారణ మనుషుల దుఆగా భావించకండి." ఆయన మీ పట్ల సంతుష్టుడయి మీ కొరకు ప్రార్థన చేస్తే (ఆశీర్వదిస్తే) అంతకన్నా సౌభాగ్యమేదీలేదు. ఆయన ఆగ్రహించి శపిస్తే మీకు అంతకన్నా దౌర్భాగ్యం లేదు.

మూడు, "దైవప్రవక్తను పిలవడం సాధారణ మనుషులను పిలవడం వంటిది కారాదు." అంటే మీరు సాధారణ మనుషులను వారి పేరుపెట్టి ఎలుగెత్తి ఎలా పిలుస్తారో అదే విధంగా దైవ సందేశహరుని

పిలువకండి. ఈ వ్యవహారంలో ఆయన పట్ల అత్యంత మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి, ఏమాత్రం అమర్యాద జరిగినా దైవం సమక్షంలో ఆయన పట్టునుండి తప్పించుకోలేరు.

ఈ మూడు భావాలు అర్థాన్ని బట్టి సరయినవే అయినప్పటికీ, ఖుర్ఆన్ పదాలు మూటికీ వర్తించేవే అయినప్పటికీ తరువాతి విషయాన్ని బట్టి మొదటి అర్థమే సరిగ్గా అతుకుతుంది.

103. ఇది మునాఫికుల (కపటుల) మరో చిహ్నం. ఇస్లామ్ సామూహిక సేవకు పిలుపునిచ్చినప్పుడు వారు రావడానికి వచ్చేస్తారు. ఎందుకంటే ఏదో ఓ కారణం వల్ల వారు ముస్లిములతో కలిసి ఉండాలని కోరుకుంటారు. కాని నిజానికి ఇలా హాజరవడం వారికి ఎంతమాత్రం ఇష్టముండదు. ఏ విధంగానయినా సరే మెల్లిగా గోప్యంగా పారిపోతారు.

104. మూలంలోని పదం "ఫిత్నా" (ఉపద్రవ పరీక్ష) కు అర్థం ఇక్కడ దుర్మార్గుల ఆధిక్యత, వారి పాలన అని ఇమామ్ జాఫర్ సాదిక్ (ర) అభిప్రాయపడ్డారు. అంటే ముస్లిములు దైవప్రవక్త (స) ఆదేశాలను పాటించకపోతే, వాటిని ఉల్లంఘిస్తే, వారిపైన దుర్మార్గులు, దుష్టులు పాలకులుగా మోపబడతారు. ఫిత్నా అంటే ఇదీ రూపం కావచ్చు, ఇంకా ఇతర విధాలయిన రూపాలు కూడా సాధ్యమే. ఉదాహరణకు పరస్పరం ముఠాలుగా, వర్గాలుగా చీలిపోవడం, అంతర్గత సంఘర్షణలు బయలుదేరడం, నైతిక పతనం ప్రారంభమవడం, సామూహిక వ్యవస్థ చెదిరిపోవడం, అంతర్గత విచ్ఛిన్నత రాజుకోవడం, రాజకీయ, భౌతిక శక్తులు క్షీణించడం, ఇతరులకు దాసోహమవడం మొదలయినవి.